# 1. యం. దేవదాసు అయ్యగారి పరిచయము

1. దేవదాసు అయ్యగారు ఆజానుబాహుడు, ఎత్తైన మనిషి. విశాలమైన నేత్రములు, వెడల్పైన నొసలు, అందమైన పెదవులు, చక్కటి పొడుగాటి ముక్కు, మధ్యపాపిటి తీసిన బిరుసు తలవెంట్రుకలతో సంపూర్ణ మానవునిగా కనబడేవారు. ఆయన నేత్రములు, మన కన్నులు చూడలేనంత మహిమగలవిగా ఉండేవి. ఆ కండ్లు ఎదుటివారియొక్క హృదయములోనికి మనస్సులోనికి, ఆత్మలోనికి దూరునటులనుండేవి. ఆయన నేత్రములలోని దైవాత్మ శక్తి అటువంటిది. శరీర రీతిని ఆయనను చూచినపుడు ఈయన ఆదాము కాలమునాటి మనుష్యుడా! అని అనిపించును. అనగా ఆయన అంత పుటకగల మనిషి. ఆయన స్వరము మాధుర్యము. చక్కగా పాడగల శక్తి ఆయనకున్నది. ఆయన ఎల్లపుడు తెల్లని వస్త్రములు ధరించువారు, పంచె కట్టుకొనువారు. కమీజు చొక్కా తొడుగుకొనువారు. చేతిరుమాళ్లు ఎక్కువగా వాడువారు. ఆరాధన సమయములో కోటు ధరించువారు. కండువా వేసికొనేవారు. ఈయన రాజమండ్రిలో నున్నపుడు ప్రకృతి అవసరాలకు (శంకానివర్తికి) ఎక్కడ, ఎప్పుడు వెళ్లేవారో ఎవరు తెలిసికొనలేక పోయారు. ఈయనకు శుభ్రము ఎక్కువ. ఎవరును అంత శుద్ధిగా ఉండలేరు. ఆయన వస్త్రములు ఆదివారము ధగధగ మెరసినట్లుండేవి. ఆయన కప్పుకొనే దుప్పటి కాళ్ళదగ్గరిది తల దగ్గరకు రాకుండా, తలదగ్గరిది కాళ్లదగ్గరకు రాకుండా గుర్తింపుముడి వేసికొనేవారు. డబ్బులు ముట్టుకొనుట వీరికి అలవాటులేదు. చందావేయునపుడు కాగితములో చుట్టి చందావేయువారు. డబ్బులు ముట్టుకొనినవారిని, లోషన్‌తో చేతులు కడుగుకొనిన పిదప ఆయన గదిలోనికి రానిచ్చేవారు, అప్పుడు మాత్రమే ఆయన వస్తువులు ముట్టుకొననిచ్చేవారు. ఆయన దగ్గరుండేవారు ఆయనవలె శుభ్రముగా ఉండవలెను, లేకుంటే ఊరుకోరు. వీరు అన్ని భాషలు గ్రహించగల 'కీ' (Key) ఎరిగినవారు. తెలుగునందును, ఆంగ్లమునందును పండితులు. దేవుని లక్షణములన్నీ

సంపాదించుకొన్నవారు. ఆయన జీవితమే దేవుని మర్మము. M అనగా Mystery (మర్మము), D అనగా Divine (దేవునియొక్క మర్మము). గనుక ఇవి పరిచయ పలుకులేగాని ఆయన జీవితమును పూర్తిగా వివరించునవి కావు.

దేవదాసు అయ్యగారు ప్రసంగించినపుడెల్లా, "ప్రభువు నా ప్రక్కన కుర్చీలో కూర్చున్నారు. ఆయనను మీరు చూడగలరా? ఆయన నాకు బోధ చెప్పుచున్నారు. ఆ బోధ మీరు వినగలరా? ఆయన ఏమి చెప్పుచున్నారో అవి నేను విని మీకు బోధించుచున్నాను. నా స్వంత మాటలు నేనేమి మీకు చెప్పుటలేదు," అని చెప్పేవారు. మహాసభలలో బోధించేటపుడు వెయ్యి మాటలలో ఒకమాట ఏదైనా ఆయన స్వంతమాట చెబితే ఇది నా స్వంత మాట అని చెప్పేవారు. అందుచేత ఆయన బోధకు ఎంతో విలువ. అయ్యగారు– 'బైబిలు గ్రంథములో చాలా **అక్షరములు** తప్పులున్నవి, **అనువాదము**లోకూడా తప్పులున్నవి. **అచ్చు** తప్పులున్నవి. కనుక బైబిళ్ళు పరలోకములో అచ్చుపడి వస్తాయి అని చెప్పిరి. అది ఎప్పుడు జరుగునో ఎలాగు జరుగునో తెలియదు. ***అనుభవములో లేని బోధలు చేయవద్దన్నారు అయ్యగారు.*** బైబిలులోని కథలు ఉన్నవి ఉన్నట్టుగా చెప్పవచ్చును. సొంత భావములు పనికిరావు అన్నారు. దేవుడు పిలిస్తేనేగాని సేవలోనికి రావద్దు అన్నారు. ఆయన ఎల్లప్పుడు రాజఠీవిలోనే ఉండేవారు. ఎంతమంది ఆయన దగ్గర ఉంటే అంతమందికి దైవసేవ నిమిత్తమై పని చెప్పగల శక్తి ఆయనకున్నది. ***బోధించునపుడు బోర్డుమీద, పటములమీద వ్రాసి బోధించుట ఆయనకు అలవాటు, ఆ పద్ధతి ఆయనకు చాలా ఇష్టము.*** "దేవుని బోధ ఏవిధముగానైనను మనిషియొక్క మనస్సులోనికి ఎక్కించాలనేదే" వీరి ప్రధాన ఉద్దేశమైయున్నది. ఆయన చెప్పిన విషయములు ఎవరికైనా మరుపురావు. **ఆలాగు గుర్తుండే విధానములో చెప్పేవారు.** ఆయన బోధ మనసులో, హృదయములో అచ్చుపడినట్లే యుండును. ఆయన

నిజమైన అనుభవజ్ఞుడైన వ్యక్తి. బైబిలులోని నిగ్గు అంతయు తెలిసికొన్నవాడు. త్రియేక దేవుని సంపూర్ణముగా నిండించుకొన్న వ్యక్తియై యున్నారు.

## 2. దైవజనుని బాల్యము - విద్యాభ్యాసము

దేవుని ప్రియదాసుడును, బైబిలు మిషనును ప్రత్యక్షపరచుకొనుటకు దేవుడు ఏర్పరచుకొన్న ప్రవక్తయు సార్వత్రిక క్రైస్తవ సంఘమునకు దేవుడు దయచేసిన వరమునగు శ్రీ. యం. దేవదాసు అయ్యగారు తూర్పు గోదావరి జిల్లా జేగురుపాడు గ్రామంలో జన్మించిరి. వీరి తండ్రి పేరు యోనా, తల్లి పేరు సత్యవతి. చిన్న నాటనే వీరి తల్లిదండ్రులు చనిపోయిరి. ముందు వారి తల్లి, తరువాత వారి తండ్రి పరమపదించిరి. ఆయనకు 6 సం॥ల వయస్సు వచ్చునప్పటికి తల్లిదండ్రులిరువురును చనిపోయిరు. ఆయన తండ్రి సువార్తికుడు. తల్లి భక్తిపరురాలగు ప్రార్థనాపరురాలు. వీరు ఎప్పుడూ సంచార సువార్తసేవలో తీరికలేకుండా ఉండేవారు. ఆమె ఎపుడు లేచి మోకరించేవారో, అపుడే వీరుకూడ లేచి ఆమె ప్రక్కనే మోకరించేవారు. అంత చిన్న వయసునుండి తల్లితోకలసి మోకరించే అలవాటు వీరు కలిగియుండిరి. యోనా, సత్యవతమ్మగార్ల వృద్ధాప్యంలో ఆయన వారికి జన్మించి ఉండవచ్చును. తల్లిదండ్రుల మరణాంతరము వీరి చిన్నాన్నే వీరిని పెంచి పెద్దచేసే బాధ్యత తీసికొన్నారు. కొంతకాలమునకు అనగా ఈ బాధ్యత తీసికొన్న ఒక సం॥నకే వారు కూడా చనిపోయిరి. అయితే ఆయన చనిపోకముందే దైవజనుని మిషనెరీల చేతికి అప్పగించిరి. ఆ కార్యక్రమము ఈలాగు జరిగినది:

ఆ దినాలలో లూథరన్ మిషనెరీలు వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో లూథరన్ మిషనులో పనిచేయుచున్న చిన్నపెద్ద పనివారు అందరితోకలిసి 'ప్రాంతీయ సమావేశాలు' పెట్టుకొనేవారు. ఆ సమయములో వారి చిన్నాన్న అయ్యగార్ని తీసికెళ్లి, 'ఈ అబ్బాయియొక్క తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారు', గనుక ఈ అబ్బాయిని మీ బోర్డింగులో చేర్చుకొనండి అని అడిగినారు. ఆ సభలోని కొందరు పెద్దలు, మీ అబ్బాయికి పరలోక ప్రార్థన వస్తుందా? అని

అడిగినారు. సాధారణముగా ఆ వయస్సులోని పిల్లలకు పరలోక ప్రార్థన రాదు. *6 సంllల వయస్సుగల పిల్లవానికి పరలోక ప్రార్థన వస్తుందా!* అయితే అయ్యగారి చిన్నాన్న మా అబ్బాయికి వచ్చునని చెప్పిరి. ఆ తరువాత మీ అబ్బాయికి విశ్వాస ప్రమాణము వచ్చునా! అని అడిగినపుడు ఆయన వచ్చునని చెప్పిరి. అయితే మీ అబ్బాయికి ప్రార్థన చేయుట వచ్చా! అని మరొకరు అడిగితే, వచ్చునండి అని ఆయన అన్నారు. ఆ సభలో కేటకిస్టులు, పాదుర్లు, టీచర్సు, మిషను పెద్దలందరూ అనగా దొరలు, దొరసానులందరూ కూర్చొని ఉన్నారు. అపుడొక పెద్ద టేబుల్ వేసి అయ్యగార్ని దానిపై నిలువబెట్టి ప్రార్థన చేయుమనినప్పుడు అయ్యగారు– 'యేసు ప్రభువా! ఈ వయస్సులో మీరు ఏలాగున్నారో, నన్నుకూడ ఆలాగే చేయండి' ఆమేన్ అని చేసారు. అప్పుడు ఆ సభలోని వారందరూ ఆశ్చర్యపోయి, వెంటనే అయ్యగారికి వారి బోర్డింగులో సీటిచ్చారు. ఆ సమయములో అయ్యగారు అతి సాధారణమైన దుస్తుల్లోనే ఉన్నారు. అందులో అయ్యగారిని చేర్చిన కొద్ది రోజులకు వారి చిన్నాన్నకూడ చనిపోయారు.

## బాల్యకాల అనుభవము :

అయ్యగారి బాల్య కాలములో 12 సంllల వయస్సు కలిగిన ఒక అబ్బాయి వచ్చి, దేవదాస్, దేవదాస్, దేవదాస్ అని పిలిచాడట; అపుడు అయ్యగారు బజారు కెళ్లినందున, వారి అక్క బయటికివచ్చి, ఆ సంగతి వచ్చిన అబ్బాయితో చెప్పగా వెళ్లిపోయాడు. అయ్యగారు బజారునుండి రాగా ఆమె ఈ విషయం అయ్యగారితో చెప్పినది. ఎవరు వచ్చారో అయ్యగారికి బాగా తెలుసు. రెండోరోజు కూడా యధావిధిగా ఆ అబ్బాయి మరలా వచ్చి దేవదాస్, దేవదాస్ అని పిలిస్తే, లేడని చెపితే ఆ అబ్బాయి, 'లేరా? నేను అడిగినానని చెప్పు' అని చెప్పి వెళ్ళిరట. అయ్యగారు యధావిధిగా మూడవ రోజుకూడ బజారుకు వెళ్లిపోయారు. అపుడా అబ్బాయివచ్చి, దేవదాస్, దేవదాస్, దేవదాస్ అని పిలువగా, అపుడామెవచ్చి బాబూ! నీపేరేమిటి అని అడుగగా

నాపేరు 'వాక్యము' అని ఆ అబ్బాయి గట్టిగా చెప్పి వెళ్లిపోయాడట. ఎవరీ అబ్బాయి అని ఆమె అటు ఇటూ చూచేసరికి ఆ అబ్బాయి మరి కనబడనేలేదు. అప్పటి అనుభవము గురించి అయ్యగారు ఇలా చెప్పారు. 12సం॥ల వయస్సులోనే యేసు ప్రభువు దేవాలయములో బోధించారు. నేనుకూడా ఆ వయస్సులోనున్న ప్రభువుతో సహవాసం కల్గి ఉన్నానని చెప్పిరి.

## విద్యాభ్యాసము, మిషనెరీల సంరక్షణ:-

సంవత్సరానికొకమారు బోర్డింగులో సెలవులిచ్చేవారు. మరి ఈయన ఎక్కడికి వెళ్లగలరు? ఈయనకు ఎవరూ లేరుకదా! ఆ సమయములో వీరి దగ్గరి బంధువు, వేమవరం వాసియైన శ్రీ గోడి పరదేశిగారు వచ్చి అయ్యగారిని తమ ఊరు తీసికొని వెళ్లేవారని దైవజనులే స్వయముగా వివరించిరి. అనాకోడేరు అనే గ్రామములో గోడి పరదేశిగారు ఆ కాలములో కేటకిస్ట్‌గా పనిచేస్తుండేవారు. వారు అక్కడికి అయ్యగారిని తీసికెళ్లి సెలవుదినములు అయిన తర్వాత మరలా బోర్డింగ్‌లో చేర్చేవారు. ఆయన బ్రతికినంతకాలము ఆలాగే చేసారు. అయితే కొంత కాలానికి ఆయనకూడ చనిపోయారు. అప్పటికి అయ్యగారుకూడ పెద్దవారయ్యారు. 8వ తరగతి పాసవగానే అయ్యగారికి ఆ స్కూలులోనే టీచరు ఉద్యోగము ఇచ్చారు. ఆ సమయములో అయ్యగారికి వరుసకు అక్కయైన ఒకామె అయ్యగారి దగ్గరుండి ఆయనకు వండిపెడితూ, సహాయపడుతూ ఉండేవారు. విజయవాడనుండి ఆ కాలములో Lecturers వచ్చేవారు. వారికి అయ్యగారు ఇంగ్లీషులోని తప్పులు దిద్దేవారు. ఆ కాలములోనే అయ్యగారు చిన్న పిల్లలు ఇంగ్లీషు గ్రామరు చక్కగా నేర్చుకొనుటకు ఒక వ్యాకరణ పుస్తకమును సులభశైలిలో రచించిరి. ఈ పుస్తకము ఆ దినములలో బహుళ ప్రజాదరణ పొందినది. 8వ తరగతికే వారు అంత గొప్ప పాండిత్యం సంపాదించారు. గనుకనే అయ్యగారికి S t, Pauls చర్చి దగ్గరి స్కూల్లో టీచరుగా ఉద్యోగము ఇచ్చారు. సాయంకాలము అయ్యేసరికి, పిల్లలు ఇంటికి, టీచర్లు బజారుకి వెళ్తుండేవారు.

ఈ కాలములోనే అయ్యగారి అక్క, అయ్యగారికి వండిపెడుతుండేది. ఆమె కొంచెం జబ్బు మనిషి. ఆమె అయ్యగారిని 'ఓరే అయ్యా! దేవదాసా! డబ్బులియ్యరా! అంటే, నీవు చుట్ట త్రాగటం మానేస్తే' ఇస్తాను అని అయ్యగారు అనేవారట!

# 3. మిషను స్కూలు టీచరు మరియు వార్డెన్

## స్కూలు టీచరు:-

అయ్యగారు లూథర్‌గిరిలో ఉన్నపుడు, సెయింట్ పాల్స్ చర్చికి పిల్లలను తీసికొని వెళ్లుచుండగా ఒకసారి విపరీతమైన కారు మేఘాలు అలుముకొని ఆకాశాన్ని కప్పివేసినాయి. అపుడు అయ్యగారు ప్రార్థించగా అవి ఒక్కసారిగా తొలగిపోయినవి. అపుడు పిల్లలు, అయ్యగారుకూడా తడవకుండా గుడికి వెళ్లినారు.

ఇందులో అయ్యగారితో వెళ్లిన ఒక విద్యార్థి వారి వృద్ధాప్యములో, అన్నమ్మ అనే స్టాఫ్ నర్స్‌గారి వద్దకు patient గా వచ్చి, ఈ సంగతులు చెప్పారు. రాజమండ్రిలో షాడే స్కూలు ముందు స్థలమంతా ఆ కాలములో ఇసుక ఎడారిగా ఉండేది. అపుడు పిల్లలందర్ని అనగా ఆడపిల్లలందరూ ఒకవైపు, మగ పిల్లలందరూ మరొకవైపు ఉంచి, ఆ స్థలమంతా తిప్పి పాటలు పాడించి, ప్రార్థనలు చేయించి, తిరిగి తీసుకు వచ్చేవారని పి. యం. జాకోబు అయ్యగారు చెప్పారు. అయ్యగారు అన్ని పండుగలకు అలా పాటలు పాడిస్తూ, పిల్లల్ని అందులోకి తీసికెళ్లి మరలా ఊరేగింపుగా తిరిగి తీసుకు వచ్చేవారట.

పి.యం. జాకోబు గారు అయ్యగారిని చూచుటకు ఎపుడు వెళ్లినా అయ్యగారు పడకకుర్చీపై పండుకొని బైబిలు అలా గుండెలపై పెట్టుకొని ఉండేవారట. బైబిలు ధ్యానము అంటే అయ్యగారికంత ప్రీతి. ఏలూరులో జీవమ్మ అనే కుంటామె ఉండేది. ఒకసారి ఆమె అయ్యగారి దగ్గరకు వస్తే,

అయ్యగారు అమ్మా! నా గురించి ప్రభువు ఏమి చెప్పుదురో అడిగి చెప్పమ్మా! అని అడుగగా, అపుడు ఆమె 'అయ్యా! తెరువబడిన వాక్యం మీ గుండెలమీద ఉంది' అని ప్రభువు నాతో చెప్పారని అనినది. అయ్యగారు శానిటోరియం వెళ్ళుటకు 20 సం॥ల ముందే ప్రభువు అయ్యగారిని బైబిలు మిషను బైలుపర్చమన్నారుగాని ఆ కాలములో అయ్యగారు అందుకు సాహసించలేదు.

## వార్డెన్‌గా అనుభవము:-

ప్రభువు దేవదాసు అయ్యగారిని లూథరన్ మిషన్ విడిచి రమ్మనగా ఎంత కష్టమైననూ విడిచిపెట్టి బైటికి వచ్చిరి. వార్డెన్‌గా పనిచేస్తుండగా, పిల్లలు కొన్నిసార్లు రేషన్ ఎక్కువగా తీసికొనేవారు. అప్పుడు మిషనెరీలు ఇచ్చిన నెలసరి ఖర్చులు సరిపోయేవికాదు. ఆ నష్టమునకు అయ్యగారు తన స్వంత డబ్బు ఇచ్చేవారుగాని మిషనుకు ఎంతమాత్రము నష్టము కలుగనియ్యలేదు.

## టీచరు అనుభవము:-

అయ్యగారు, పిల్లలకు బోధ చేస్తున్నప్పుడు అయ్యగారిని ఎదిరించెను. అప్పుడు ఒక తెలగ ఆయన వచ్చి, వారు చెప్పినట్టు మనము చెప్పగలమా! పొమ్ము! అంటే పోయెను. తర్వాత అతను పిల్లవానిని బడిలో చేర్చుటకు వచ్చెను. చివరికి నమస్కారం చేస్తూ వచ్చెను. ఒకసారి అయ్యగారు కోటి లింగాల దగ్గర బోధ చేస్తుండగా ఒక బ్రాహ్మణ కుల విధవరాలు అయ్యగారి బోధ చెడగొట్టుటకు గబ,గబ మాటలాడెను. **ప్రస్తుతము మతము సిగ్గు, తర్వాత మనకే మొగ్గు** అని చివరకు ఏలాగైన మీ మతమే వ్యాపిస్తుందని చెప్పి పోయెను.

ఒకసారి అయ్యగారు ప్రభువును చాలా చనువుతో 'నాకున్న శ్రమలు, సరేలేగాని నీ రూపము చూపించు ప్రభువా!' అని అడిగెను (కుర్రవాడు అడిగినట్టే అడిగెను) అయితే ప్రభువు 'వస్తావుగా అప్పుడు చూతువుగానిలే' అని జవాబిచ్చిరి. అయితే ప్రభువా! సంఘము రూపము చూపించు అనెను. అపుడు

Bible Mission HQ Guntur

ప్రభువు చూపించిరి. అది వినిరి గాని చెప్పుట కష్టము. అందదు గనుక ఏ రూపము ఇచ్చెనో ఎన్నగలనా! అని దేవదాసు అయ్యగారు షారోను మైదానము అనే కీర్తనలో కట్టిరి. సంఘరూపము వర్ణించలేము. అది ప్రభువు రూపము మరియు మన రూపమునైయున్నది. ఆ కళ ఎటువంటిది. ఒక అమ్మాయికి ఇంకా ఒక సం॥నకు పెండ్లి అని అనుకొనిరి. అయ్యగారు ఆమెను చూడ వెళ్లి ప్రార్థన చేసిరి. ఒక సం॥ము తరువాత పెండ్లి రోజున ఆ అమ్మాయికి కళ వచ్చెను. అయ్యగారు ఆ అమ్మాయికి స్వంత ఖర్చులతో పెండ్లి చేసిరి. ఆ పేద అమ్మాయిని అందరు ఎరుగుదురు గాని పిల్లలందరు ఆ అమ్మాయిని ఆ వేళ చూచి ఏమిటి నీకు క్రొత్త కళ వచ్చినదనిరి. అదే పెండ్లి కళ, అదే సంఘ కళ.

4వ తరగతి టీచరుగా అయ్యగారు ఉన్నప్పుడు పిల్లలు అయ్యగారి దగ్గరకు వచ్చి, 'సైతాను ఇంత బలముగలవాడైతే, మీరు సైతాను శక్తిలేనివాడు అంటున్నారు ఏమిటి?' అని అడిగిరి. దానికి అయ్యగారు జవాబుచెప్పక ఉన్నట్లుండి అయ్యగారు క్రింద చతికలబడ్డారు. అప్పుడు అయ్యగారు ఇంతకు ముందు నేను బలముగా ఉన్నాను. ఇప్పుడు బలములేని వాడనై క్రింద పడినాను. అందుచేత నేను అశక్తుడునా? శక్తుడనా? అని ప్రశ్నించగా పిల్లలందరు ఏమియు జవాబియ్యలేదు. అప్పుడు అయ్యగారన్నారు. సైతాను ఒకప్పుడు బలముకలవాడై పరిశుద్ధ దేవదూతల వరుసలో ఉన్నాడు. ఇప్పుడు క్రిందపడినాడు శక్తుడా? గనుక అశక్తుడా?' అని అడుగగా, అశక్తుడేనని చెప్పిరట. పడిలేచినవాడు బలముగలవాడు. వాడు పడిలేవలేదు గనుక బలహీనుడు. మీరు ఫెయిలైనందుకును, ప్రార్థన నెరవేరనప్పుడును భయపడవద్దు. సంతోషించండి. అప్పుడు సైతానుకు అవమానము, సిగ్గు కలుగును. 'మనో విచారము' అను పాటలో 33వ చరణం పెద్దయ్యగార్కి విచారమున్న అది విచారముకాదు. 1918వ సం॥ము సామర్లకోటలో ఈ చరణములోనున్న సంగతిమీద ప్రసంగము చేసారు. ఎంతోమంది వచ్చిరి. ఒక మిషనెరీ అన్నారు. మీరెంత సేపయినా ప్రసంగించండి. (మీకు టైము లిమిట్ అనగా సమయ పరిమితి లేదు అన్నారు.) ప్రభువు

అయ్యగారితో మాట్లాడని రోజు లేదు. సైతానుతోను, పరిశుద్ధులతోను మాట్లాడని రోజులేదు. ఏ భాషతో మాటలాడుతున్నారు? అది తెలుగులోగాని మరొకరీతిగా మనకు తెలిసిన భాషతోకాదు. గానీ మనో భాషతో మాట్లాడుచున్నారు. దైవజనుని శరీరానికి బలములేక మనస్సుతో ప్రార్థించుచున్నారు. మాట్లాడుచున్నారు, పని చేయుచున్నారు.

## దైవజనుని ధీరత్వము, జ్ఞాపకశక్తి:-

బాల్యమునుండి పరిశుద్ధ జీవితము కలిగిన భక్తుడు. చిన్నవయస్సులోనే ప్రభువు 'దేవదాసూ!' అని పిలువగా అందుకొని శ్రమలు, అవమానములు, ఇబ్బందులు, శత్రుత్వమున్ననూ చివరివరకు ప్రభువును వెంబడించిన ధీరుడు. రాజమండ్రి లూథర్‌గిరిలో వార్డనుగా ఉన్నప్పుడు బోర్డింగు పిల్లలందరిని రాత్రి పరుండబెట్టి, 10 గంటల తరువాత ఒక్కరే సూదికొండకు వెళ్లి ప్రభువుతో మాట్లాడి, తెల్లవారుఝాము 4గం॥లకు తిరిగి వచ్చేవారు. కొన్ని సంవత్సరములిట్టి సహవాసములో గడిపిరి.

విశాఖపట్నంలో బైబిలు మిషను సేవ జరిగించిన మాదే సుందరరావు గారు ఒకసారి సువార్తపనిమీద కలకత్తా వెళ్లి, బైబిలు మిషను కరపత్రములు పంచిరి. అయ్యగారి పూర్వ విద్యార్థి ఒకరు ఉద్యోగం సంపాదించుకొని అక్కడే స్థిరపడిరి. వారు సుందరరావుగారి ద్వారా పత్రిక తీసికొని అయ్యగారు ఇంకా ఉన్నారా? ఉంటే ఎలా ఉన్నారు? అని వాకబుచేసి, అయ్యగారి అడ్రసు తెలిసికొని అయ్యగారిని చూడటానికి వచ్చారు. అపుడు ఆయన, అయ్యగారు తనను గుర్తు పడతారో లేదో అని తన్ను పరిచయం చేసికోబోతుండగా అయ్యగారు ఆయన్ని చూచి, 'తేలు కుట్టిన అబ్బాయి బాగున్నాడో లేదో' అని అన్నారు. ఆ తేలు కుట్టిన అబ్బాయి ఎవరోకాదు. అయ్యగారు ఉన్నారో లేదో! అని తెలుసుకొని పలకరించటానికి వచ్చిన ఆయనే. ఆయన విద్యార్థిగా ఉన్న కాలంలో తేలు కుట్టి బాధపడుచుండగా అయ్యగారి ప్రార్థనవల్ల స్వస్థపడినారు. అయ్యగారు తన్ను మరచిపోయి ఉంటారనుకొన్న ఆ పెద్ద మనిషిని, అయ్యగారు ఈ చిన్ని

సందర్భమును జ్ఞాపకముచేసి పలకరించేసరికి ఆయన ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.

## బైబిలు తరగతి (వేదాంత) అధ్యాపకుడు:-

లూథర్‌గిరిలో అయ్యగారు సేవకులకు వాక్యం చెప్పుట ప్రారంభించారు అనగా బైబిలు తరగతులు నిర్వహించేవారు. అయ్యగారు బంగళా పై గదిలో బల్ల వేసికొని, అక్కడ బైబిలు చదువుకొంటూ బోధిస్తూ ఉండేవారట. ఆ బంగళా ఎదురుగా ఉన్న పెద్ద ఈతచెట్టుమీద ఒక దయ్యము తలవిరబోసుకొని, అయ్యగారివైపు చూస్తు ఉండేదట. ఎందుకనగా ఏదో ఒక విధముగా పాడుచెయ్యాలని. అయితే ఆయనకు దయ్యాలంటే ఏమి భయం?

ప్రతినెలలోను అక్కడ మిషనెరీల సదస్సు జరిగేది. ఒకసారి హాస్టల్లో కలరావస్తే, పిల్లలందర్నీ ఇళ్లకు పంపేసారు. అపుడు మిగిలిన పిల్లలు కొందరు అయ్యగారి దగ్గరకు రాగా, దయ్యాన్ని చూస్తారా! అని వారిని అడిగి, ఆ ఈత చెట్టుమీది దయ్యాన్ని చూపించారట. అది ఆ ట్రైనింగ్ బంగ్లా దగ్గరున్న బావిమీదనుండి ఆ గట్టుమీదనుండి ఈ గట్టుమీదికి, ఈ గట్టుమీదనుండి ఆ గట్టు మీదికి, తలమీద కుంపటి పెట్టుకొని గంతులేస్తున్నదట! వారు భయపడకుండా అపుడు అయ్యగారు వారి కొరకు ప్రార్థన చేశారట.

## లూథర్‌గిరి అనుభవము:-

1922వ సం॥లో ఇప్పటికి (1959) 37 సం॥ల క్రిందట లూథర్‌గిరిలో డాబామీద కాన్ఫరెన్స్‌కు టీచర్లు పాదుర్లు, దొరలు, దొరసానులు 350మంది వచ్చిరి. వారికి వంటఏర్పాటు చేయుట ఒకపని. అందరికి వరండామీద భోజనము వడ్డించుపని మరియొకపని, కాన్ఫరెన్స్‌లో ఉండుట ఒకపని. పైగా ఆ మీటింగులలో మాట్లాడే వంతొకటి. ఈ పనులన్నీ పై అధికారులు

అయ్యగారికే అప్పగించిరి. సిద్ధపడుట ఎట్లు? అయ్యగారి ప్రసంగాంశము ఏదనగా, 'అప్పటికి గతించిన పది ఏండ్లలో క్రీస్తుమతము ఇండియాలో ఏలాగు వృద్ధిపొందినదో వివరించవలెను. అయ్యగారు పెద్ద చార్టు ఒకటి తయారుచేసి, వారు 15 నిమిషములలో ముగించమన్నారు గనుక 10 సం॥ల క్రిందట ఇంతమంది, ఇప్పుడింతమంది క్రైస్తవులయ్యారు అని పొడి మాటలు చెప్పి ఆమెన్ అని ముగించినారు. ఈ సంగతి విన్నవారు– 'వల్లపడదు, ఇంత పెద్దచార్టువేసి, ఇంత కొంచెం చెప్తారా! ఇంకా వివరించండి అన్నారు. అప్పుడు అయ్యగారు వీలు చేసికొని ఒక గంటసేపు వివరించి చెప్పిరి. బంగళాలోనున్న క్రైస్తవులు– 'మీరు చెప్పి చెప్పి, అలసిపోయారు అన్నారు. అని అందరు మెచ్చుకొంటే, ఒకాయన దగ్గరకు వచ్చి– 'వారిని వారిని గూర్చి చెప్పుకోవడం, ప్రార్థించడము మనకేమి ఉపయోగము. ఆ కాశ్మీర్ దేవాలయమును గురించి మనమెందుకు ప్రార్థించాలి? మన పట్టణంచుట్టూ ఉన్న వారిని గురించి ప్రార్థించాలిగాని అని అన్నాడు.

## దర్శనానుభవము:-

వీరిది అంతులేని దర్శన జీవితము. అయ్యగారు రాజమండ్రి నుండి కోరుకొండకు పంతుళ్ళ మీటింగునకు వెళ్ళుటకు పిలుపు వచ్చెను. రాజమండ్రికి కోరుకొండకు 15 మైళ్ల దూరమున్నది. అయ్యగారు ఒంటెద్దు బండిలో వెళ్ళుచుండగా, ప్రభువు తనను కలసికొని 15 మైళ్ల పొడుగునా కనబడుతూ మాట్లాడుచూనేయుండెను. ఆ ఊరిలో అయ్యగారు దిగగానే, ప్రభువు వెళ్ళిపోయిరి. మాట్లాడే టైముకు అయ్యగారు మాట్లాడుచుండగా, ప్రభువు వచ్చి ముగింపువరకు నుండి వెళ్ళిపోయిరట. మరలా మధ్యాహ్నము కూటము ఆరంభించగానే వచ్చి 5గం॥లవరకు మాట్లాడుతూ ఉంటే, అప్పటివరకుండి వెళ్ళిపోయిరి. తెల్లవారు జామున మరలా కూటమునకు కూర్చుండగా అయ్యగారికి సమీపమున ప్రభువుకూడా కూర్చుండి అయ్యగారు ప్రసంగము ముగించిన పిదప వెళ్ళిపోయిరి. అలాగే ప్రభువుకు మనము

సమర్పణ అయిన పిదప ప్రతి నిత్యము ప్రభువు మనతో ఉండి, ***బహిరంగ దర్శనము అనుగ్రహించుచుండును. ఇది గొప్ప భాగ్యము.*** అది మనమందరము సంపాదించుకొందుము గాక! ఆమేన్.

## ప్రభువుతో సహవాస అనుభవము:-

వీరు నిత్యము యేసుక్రీస్తు ప్రభువు సన్నిధి కలిగియున్నారు. నిత్యము ప్రభువుతో మాట్లాడుచుండువారు. ***మనుష్యులతో మాట్లాడుచున్నను క్రీస్తుప్రభువుతో మాట్లాడుచూనే యుండువారు.*** ప్రభువుతో నిత్య సహవాసము కలిగినవారు. సన్నిధిలో నుండుట అనగా ప్రభువును చూచుట, ప్రభువుతో మాట్లాడుట, ప్రభువు చెప్పిన సంగతులు వ్రాయగలిగిన అనుభవముగలవారు. ***ప్రభువు చెప్పిన విషయములు వ్రాసికొని పనులు చేయవలెను అని బోధించిరి.*** ప్రభువును అడుగకుండ ఆయన ఏ పనియు చేయలేదు. లూధర్‌గిరిలో పాదుర్ల కూటములో ప్రసంగించుటకు వెళ్లుచుండగా, ఆయనతోపాటు ప్రభువుకూడ ప్రసంగవేదికమీదికి వచ్చినారు. ఆ వేదికమీద ఒక్క కుర్చీమాత్రము వేసినారు. ఆ కుర్చీ ప్రసంగము చేయుటకు ఏర్పాటైన అయ్యగారు కూర్చుండుటకేగదా! గనుక ప్రభువు అక్కడే ఉన్నారు. అయ్యగారు– 'ప్రభువా! మీరు కుర్చీలో కూర్చొనండి' అన్నారు. ప్రభువు– 'ఆ కుర్చీ నీ కొరకే వేసినారు. నీవు కూర్చో' అన్నారు. అయ్యగారు– 'ప్రభువా! నీవు కూర్చుండుము' అన్నారు. ఈలాగు మాట్లాడుకొని ఆ ఒక్క కుర్చీలోనే ప్రభువు, అయ్యగారు ఇద్దరు కూర్చుండిరి. ఇట్టి సహవాస భాగ్యము ఏ వాక్య సేవకుని దగ్గర వినలేము, చూడలేము, భక్తులనిపించుకొన్నవారి దగ్గరకూడ చూడలేము.

# 4. లూథరన్‌మిషను సేవకుడు

అయ్యగారికి పాదిరిపని ఇవ్వాలని లూథరన్ వారు పిలువగా నావల్ల కాదు. నాకు అక్కరలేదు అన్నారు. ఆ తరువాత త్రిత్వ దేవుడు వచ్చి, బరంపురం సన్నిధి కూటములలో వారికి పాదిరి పనికి ఆర్డినేషన్ ఇచ్చిరి. ఇది 40సం॥ల క్రిందటి సంగతి. 'రాజమండ్రి సంఘముమీద పాదిరిగా ఉండుటకు నీవు ఒప్పుకొనలేదు గనుక అన్ని సంఘములపై పాదిరిగా ఉండడానికి ఆర్డినేషన్ ఇచ్చానని' ప్రభువు అన్నారు. ఒక్క సంఘమును పాలించలేనప్పుడు అనేక సంఘములను పాలించగలనా? **తండ్రి ఎట్లు అట్లు అనుకొన్నాడో!** రాజమండ్రి సంఘమంతా చిన్న, పెద్దలు నా పేరు చెప్పి, నన్ను కోరితే నేను నిరాకరించినందున సిగ్గుపడిరి. ప్రభువా! నీ మాట నెరవేర్చుకొన్నావు గనుక నీకు స్తోత్రములు.

ఇప్పుడు ఎక్కడైనా పాదిరిగారు లేనప్పుడు అయ్యగారు బాప్తిస్మము, ప్రభు భోజనము ఇవ్వవచ్చును. మనిషి నన్ను అభిషేకించలేదు గాని దేవుడే నన్ను అభిషేకించెను' అని దైవజనులు చెప్పిరి. అయ్యగారు ఆత్మ ద్వారా అందరికి లేక అనేక మందికి కనబడుచున్నారు. అక్కడ వరండామీద కూర్చొనియున్న వారిలో 52మందికి వారివారి ఊళ్లలో కనబడుచున్నారు. గనుక ***నేను నిన్ననేక సంఘాలకు పాదిరిగా అభిషేకించు చున్నాననేది దీనిద్వారా నెరవేరుచున్నది.*** అయ్యగారికి ఈ సంగతి మొదట విన్నప్పుడు గుండె గుబేలుమన్నది. "చెప్పులు, గొడుగు, క్రొత్త బట్టలు, చేతి సంచి లేకుండా, స్నానము చేయకుండా అపరిశుద్ధముగా నేనున్ననూ, తండ్రి అన్ని స్థలములకు పంపుచున్నారు. ఇందులో నా స్వశక్తి కొంచెమైనను లేదు. నా కట్టె మంచముమీదే ఉన్నదిగాని సర్వదేశాలకు ఆత్మ వెళ్ళి, సంచారము చేయుచు వస్తున్నది. ఒక్క నిమిషములో 7 స్థలాలకు ఆత్మ వెళ్లి వస్తున్నది" అని దైవజనులు చెప్పిరి.

## అయ్యగారి బైబిలు:-

నా బైబిలు అట్టమీద ఏమి వ్రాస్తావు ప్రభువా! అని అయ్యగారు ప్రభువును అడుగగా, ప్రభువు నీకు తెలుసునుగదా అదే వ్రాయమన్నారు. మరలా అయ్యగారు నీవే చెప్పుము అని ప్రభువునడుగగా 'నా మాటలు, ఈ పుస్తకము అంతా అనగా ఆదికాండము మొదలు, ప్రకటన గ్రంథము చివరివరకు నా మాటలే ఉన్నవి గనుక ***"కాబట్టి ఈ నా మాటలు విని, దాని ప్రకారము చేయువాడు గొప్పవాడు"*** అని వ్రాయుమనిరి. (మత్తయి 7:24).

ఒక పంతులమ్మగారిని అయ్యగారు ఎరుగుదురు. ఆమె ఎప్పుడు జబ్బుతోను, బలహీనముతోను ఉండును. అయినను ఆమె విసుగుకొనదు. బైబిలు చదువుచూనే ఉండును. ఆమె తల్లి విసిగి ఎన్నో మాటలనేది. అయినను పంతులమ్మగారు క్రమము తప్పక బైబిలు చదివెడిది.రాతి పునాది ఏ క్రైస్తవునికి ఉంటుందో, అట్టివారికే దేవుని స్థిర లక్షణము వలన కదలిక యుండదు.

## బాప్తిస్మములు ఇప్పించుట:-

1904వ సం॥లో తాడేపల్లి గూడెం తాలూకాలోని కాశిపాడు అనే గ్రామములో లూథరన్ మిషనువారు అక్కడ తమ సంఘము స్థాపించేటప్పుడు, అయ్యగారు రాజమండ్రినుండి వెళ్లి అక్కడ సేవచేసి, బాప్తిస్మమునకు 50 మందిని తయారుచేసినారు. ఆ ఆదివారమునకు జూబిలేట్ అని పేరు. అనగా ఆనందకరమైన ఆదివారము. అప్పుడు అయ్యగారితో ఇద్దరు మిషనెరీలు, కొందరు కేటకిస్టులు, ఉపాధ్యాయులు ఉన్నారు. బాప్తిస్మము ఇచ్చేటప్పుడు గ్రామము కళగాయున్నది. గాని అంతకుముందు శూద్రుల మధ్య జరిగిన గొడవలవలన కొందరు దెబ్బలుతిన్నారు. వారిట్టి విచార స్థితిలో భయకంపితులై యున్నారు. గనుక వారిని ఓదార్చుట కొరకు,

అక్కడకు అయ్యగారిని పిలుచుటకు ఒక కారణమైనది. ఒక సం॥లో ఆ గ్రామములోని పెద్దలు చనిపోయిరి. గనుక క్రీస్తు మతములోనికి వెళ్ళితే చనిపోతారు అనే ప్రచారం వచ్చినది.

## సంచార సువార్తికుడు:-

అయ్యగారు పిల్లలకు బోధించటం ముగించినపిదప అన్ని ప్రాంతాలు తిరిగి బోధ చేసేవారు. కొన్ని తీర్ధములకు వెళ్లి తీర్ధయాత్రికులకు అయ్యగారు చెట్లపైని కుర్రవాళ్ళను పెట్టించి, బూర ప్రసంగాలు చేయిస్తూ ఉండేవారు.. అవి ప్రత్యేకమైన బూరలు. మ్యాజిక్ లాంతర్లు చూపించి, వాటిద్వారా సువార్తను చిన్ని చిన్ని కథల రూపములలో వివరించేవారు. చివరగా రక్షణ పత్రికలు పంచిపెట్టేవారు.

## దర్శనానుభవము:-

ఒకప్పుడు అయ్యగారు సముద్రపు ఒడ్డుకు వెళ్లి చూస్తున్నారు. ఆ రోజు 30 నావలు నిండా చేపలు తీసికొని వచ్చి రాశిపోసే రోజు. జాలరులు ఒక మైలు వరకు వలవేసి ఉంటారు. అందువల్ల కొన్ని చేపలు పడినవి. అయ్యగారు వారితోకూడా వెళ్లారట. అట్లే ప్రభువుయొక్క సిలువ శ్రమకూడా అయ్యగారు మనోదృష్టితో చూచి వచ్చి చెప్పేవారు. అంతగా అయ్యగారు ప్రభువుతోపాటు, ఆయన శ్రమల వెంబడి వెళ్ళివచ్చి, శ్రమల ధ్యానములో బోధించేవారు.

## కోరుకొండ తీర్థము:-

ఒకసారి కోరుకొండ తీర్థమునకు అయ్యగారు వెళ్ళినప్పుడు, అక్కడ ప్రజలను దేవుడు తన పనిమీద ప్రోగుచేసినట్టు పైకి కనబడకున్నను, ప్రభువు తన పనిని జరిగించినారు. పంచక్ష = అనగా వెనుకకు వెళ్ళు; కోరుకొండ తీర్థములో అయ్యగారు బోధించేటప్పుడు చిల్లరమూక అల్లరిచేయగా, దానిని

వెళ్ళగొట్టుటకు వాడిన పదము. **లోకము ఒక పని కల్పించుకొంటే, దేవుడక్కడ తన పని జరిగించును.** కానా పెండ్లిలో, తన మహిమ చూపించినట్లే, జరిగించును.

# 5. దగ్గుల ఆసుపత్రి పరిచర్య

## శానిటోరియం అనుభవములు:- (1926 మే - 1938 ఏప్రిల్ 1).

అయ్యగారు శానిటోరియం వచ్చేసరికి అయ్యగారికి వృద్ధాప్యం వచ్చినది. అక్కడ క్రింది పెంకుటింట్లో అయ్యగారుండేవారు. శానిటోరియంలో పరిస్థితి చాలా ఘోరంగా ఉండేది. రోగులు రక్తం కక్కుకొని చనిపోయేవారు. అయ్యగారు వారికి వాక్యంచెప్పి, మరణపుటంచులలో ఉన్నవారిని ధైర్యపరచి, ప్రార్థనచేసి బాగుపరచేవారు. రెవ. యస్. సమూయేలు అయ్యగారి మాటలనుబట్టి రోగులు, వారికి వైద్యంచేసే డాక్టర్లు, నర్సమ్మలకంటే, దేవదాసు అయ్యగారు ఎపుడు వస్తారా! అని ఆయనకోసం అలా ఎదురు చూస్తుండేవారట!

## అయ్యగారి పిలుపు:-

అయ్యగారు శానిటోరియంలో ఉన్నారు. అక్కడకు 4 కి.మీ. దూరములో దోసకాయలపల్లి ఉన్నది. అక్కడ రత్నమ్మ అనే ఆమె ఉంది. ఒక రోజు ఉదయాన్నే అయ్యగారు 'రత్నమ్మా! అని ఆమెను పిలిచారట. అది ఆమె చెవిలో పడినది. ఆ సమయానికి ఆమె వాకిలి ఊడుస్తూఉంది. వెంటనే ఆ చీపురు అక్కడ పడేసి, అయ్యగారు నన్ను ఎందుకు పిలిచారో, అని వెళ్లినదట. ఆమె వస్తున్నట్టు ఆయనకు తెల్సు గనుక అయ్యగారు గుమ్మంలోనే నిలబడి, ఆమెను పలకరించగా అయ్యా పిలిచారేమిటి? అని అడుగగా నీకు వినబడిందమ్మా! అని అన్నారట! అపుడు అయ్యగారు కోటికేశరంలో కొండమీద కూటము పెట్టాలనుకుంటున్నాను. ప్రార్థన చేయమన్నారు. ప్రార్థన చేయుమని చెప్పుటకు పిలిచానమ్మా! అని అన్నారట.

## ఆత్మ కుమ్మరింపు:-

అయ్యగారు శానటోరియంలో ఉన్నప్పుడు కంబాల పేట మధ్యలో ఉన్న కంచామర్తి బిల్డింగ్‌లో కొందరిని పిలిచి ఆత్మ కూటములు పెట్టినారు. ఒకసారి హెచ్. రత్నమ్మగారు, యస్. కాంతమ్మగారిని అక్కడకు తీసికొని వెళ్లినారు. ఆ సాయంత్రం అయ్యగారితో మాట్లాడుటకు, అయ్యగారి గదిలోనికి కాంతమ్మగారు వెళ్లినారు. గోడమీద చేయివేసి ఆమె అయ్యగారితో మాట్లాడుచుండగా అయ్యగారు – కాంతమ్మా! నీవు గడుసు పిల్లవి అన్నారు. నన్ను దీవిస్తారు అనుకొంటే అలా అన్నారేమిటి అయ్యగారు అని ఆమె అన్నది. 'నీవు గోడమీద చేయివేసినావు, తేలుకుట్టును' అని అన్నారు. అప్పుడు సుందరరావు గారు 'నేను మండ్రకప్ప కరచినా, విషం ఎక్కకుండా తీసివేస్తానని చెప్పి, గదిలోనుండి రెండడుగులు బైటకి వేసినారు. ఇంతలో ఆమెను తేలు కుట్టినది. విషమెక్కి బాధపడుచుండగా ఒక సుందరరావుగారు నేను మంత్రం పెట్టితే పోతాది అని, ఇంకో సుందరరావు గారు, నేను ప్రార్ధన చేస్తే పోతాది అని అంటుండగా 'నాకు ప్రార్ధన చేయండి, మంత్రంవద్దు అని ఆమె అన్నారు. ప్రార్ధన చేసిన 5 దినముల వరకు బాధ తగ్గలేదు. ***ఈ బాధలోనే ఆమెకు ఆత్మ కుమ్మరింపు వచ్చినది.*** ఈ 5 దినములు డ్యూటికి సెలవు పెట్టకుండానే అయ్యగారివద్ద ఉన్నారు. ఇంతలో హెల్త్ ఆఫీసర్ విజిటింగుకు వచ్చి ఇన్‌చార్జి నర్సు వెళ్ళిపోయినారా! అని అడిగి వెళ్లిపోయినారు. కాని రిమార్కు ఏమి రాయలేదు.

ఒకసారి హెచ్. రత్నమ్మగారు, యస్. కాంతమ్మగారు కలసి తాడేపల్లి గూడెం బైబిలుమిషను గుడికి వెళ్ళినారు. గుడి అయిన తరువాత ఇద్దరు కలసి వస్తుండగా హెచ్. రత్నమ్మగారిని బండి ఎక్కవద్దని ఆత్మ హెచ్చరించుచున్నది. వీరు అసలు బండి ఎక్కరు కాని కాంతమ్మగారు నడవలేరు. అందువల్ల బండి ఎక్కినారు. ఇంకా ఇల్లు కొద్ది దూరం ఉండగానే బండి బోల్తా కొట్టి, వీరిద్దరు పల్టీవేసినారు. దెబ్బలు బాగా తగిలినవి.

వెంటనే రాజమండ్రి అయ్యగారి దగ్గరకు వెళ్లి తలుపు తట్టినారు. అయ్యగారికి మరనాత చెప్పుచుండగా రత్నమ్మా! నిన్ను బండి ఎవరు ఎక్కమన్నారు? దెబ్బలు బాగా తగిలినవా! అన్నారు. అయ్యా! కాంతమ్మ కొరకు బండి ఎక్కినాను అన్నది. భలే పని చేసావు. నీవు చావవలసినది గాని దేవుడు కాపాడారు అన్నారు.

ఒక సారి కాంతమ్మగారు అయ్యగారిని చూడటానికి వెళ్లినారు. అయ్యగారికి వేరుశనగపప్పు అంటే చాలా ఇష్టం. అప్పుడు అయ్యగారు కాంతమ్మగారు ***'వేరు' శనగపప్పు*** తెచ్చినారు అన్నారు. అయ్యగారు ఆలాగు అనిన మరుసటి సం॥లో 'బైబిలు మిషను'లోనుండి ఇండియా బైబిలు మిషను వేరై పోయినది.

## తుఫానులో ఓర్పు:-

నేను (అయ్యగారు) శానటోరియంలో నుండగా, ఒక కంట్రాక్టరు గారితో ఏమి చెప్పినానంటే పాకలు కట్టి 4 సం॥లు అయినది. ఇక మీదట అవి పనిచేయవు. తీసివేసి, మంచి ఇండ్లు కట్టండి అని చెప్పి కేసవరము సర్కీటుకు వెళ్లిపోయినాను. అక్కడికి 18మైళ్లు ఉండును. అక్కడకు వెళ్లి ఉజ్జీవ కూటములు పెట్టితిని. మరునాడు ప్రభువు ఒక మాట నాకు చెప్పినారు. 'శానిటోరియం పరిస్థితులు బాగోలేదు. గనుక నీవు వెంటనే వెళ్లవలసింది' అని చెప్పినారు. కూటస్థులకు ఈ సంగతి చెప్పితిని. అందుకు వారు అయ్యా! ఒక కూటమే జరిపినారు. ఇంతలోనే వెళ్లిపోతారా? అనిరి. వారు నమ్మినా, నమ్మకపోయినా ప్రభువు మాట చెప్పినారు గనుక బైలుదేరి శానిటోరియం వచ్చివేసితిని. 4 గంటలప్పుడు మిర్తిపాడు గ్రామముమీదుగా వచ్చుచుండగా 4 మైళ్ల దూరమున ఒక గొప్ప మేఘము కనిపించగా మేమందరము సర్దుకొన్నాము. ఇంతలో అది వచ్చివేసింది. అయ్యగారి పాకా మీదికిని వచ్చివేసినది. అయ్యగారు గొంగళి కప్పుకొని వంట గదికి చేరిరి.

అయ్యగారు అచ్చుటికి చేరినారని తెలుసుకొనిన 10 సం॥లు వయసు గల ఇద్దరు ఆడ పిల్లలు అయ్యగారి వద్ద అపాయము రాదని చేరిరి. బాబూ, నాయనా! అంటూ అందరూ కేకలు వేస్తున్నారు. ప్రార్థించమన్ననూ వారికి ప్రార్థన రాలేదు. పాకలన్ని పడిపోయినవి. 400రూ॥లు ఖరీదైన మందు బుడ్లు ముక్కలైపోయినవి. ఇంటిమీద రేకుపడి ఒక మనిషి కాలికి గాయము తగిలినది. ఒక రోగి రెండు ఫర్లాంగులు రోడ్డుమీదికి దొర్లిపోయెను. ఎంత నష్టము? 1) చుట్టూ నష్టము, 2) పాకలు నష్టము, 3) కాలు తెగిన నష్టము 4) రోగి రెండు ఫర్లాంగులు దొర్లిపోయిన నష్టము. అయ్యగారు గొంగలి కప్పుకున్నారు. కప్పుకున్నను బాధలో నున్నారు. ఎందుచేత? మేఘము దూరముగా నున్నప్పుడు సమీప గ్రామములోనికి అయ్యగారు వెళ్లి ఉంటే అయ్యగారికి జబ్బు చేయకపోవును. ప్రభువు నన్ను శానిటోరియంకు వెళ్లమంటే వేరొక ఊరికి ఎట్లు పోదునని దగ్గరనున్న ఊరైనా పోలేదు. ఆ తర్వాత అయ్యగారు వారము రోజులు జబ్బుచేత బాధపడిరి. ఇందులో దైవజనుని విధేయత ప్రస్ఫుటముగా కనిపించుచున్నది.

## 6. బైబిలు మిషను ప్రత్యక్షత

ఈలాగు అయ్యగారు పనిచేస్తుండగా ప్రభువు బైబిలు మిషనును బైలుపరచి స్థాపించమన్నారు. అపుడు అయ్యగారు 'ప్రభువా! మిషనును స్థాపించుమంటున్నారు? మిషను వృద్ధిచెందుటకు పనివారలు కావాలి, పనివారు కావాలంటే వారికి జీతాలివ్వాలి. నేను జీతము ఇవ్వగలనా! మిషనెరీల దగ్గరైతే డబ్బుంది గనుక వారికి చెప్పుము ప్రభువా! అంటే, ప్రభువు వీరు కనిపెట్టరు గనుక నేను వారితో మాట్లాడను అని అయ్యగారితో చెప్పారట. ఈలాగున 'వద్దు' అనే మాటతో అయ్యగారుండగా, ప్రభువు మిట్ట మధ్యాహ్నాము 3 గంటలకు 'బైబిలు మిషను' అని బైలుపరిచిరి. రెండవరోజు 30 మంది లూథరన్ మిషను పాదుర్లు ధవళేశ్వరము నుండి

వచ్చారు. వారికి అయ్యగారు 10 రోజులు ఆత్మ కుమ్మరింపు కూటాలు పెట్టేసరికి, వారందరికీ ఆత్మ వచ్చినది. వారు దానికి తట్టుకోలేక కేకలు వేస్తుంటే, ఆ శానిటోరియంలో ఉన్న మిగతావారు వెళ్లి, ఈ సంగతి దొరలకు చెప్పేశారు. దేవదాసు అయ్యగారు వారందరిని ప్రార్థనలో పెట్టగా, 'ఏమిటి, రాత్రంతా అల్లరి చేస్తున్నారు' అని పెద్ద న్యూడార్ఫర్ గారు అయ్యగారిని పిలిపించి అడిగారు. అపుడు అయ్యగారు– అయ్యా! వాళ్లే ఆత్మనుగూర్చి చెప్పమన్నారు గనుక చెప్పాను. మన మిషను సిద్ధాంతములో లేకున్నా, బైబిల్లో ఉన్నది గనుక నేర్చుకుందాం అన్నారు. నేను కూటము పెట్టాను, వీరు ఆత్మను పొందుకున్నారు అన్నారు. అపుడు అందరూ కలసి అయ్యగారిని వెలివేయాలనే నిర్ణయమునకు వచ్చి, సంస్కారమునకు రావద్దు అని చెప్పిద్దామని తీర్మానము చేసారు. అందుకా సంఘ కాపరిని అడిగితే, ఆయన నేను రావద్దని చెప్పనన్నారట. ఆఖరికి దొరగారిని చెప్పమంటే ఆయనకూడ నేను చెప్పలేను అన్నారట. ఎవరూ ముందుకు రాలేదు. ఆలాగు రాత్రి 11 గం॥లు అయ్యింది. ఆలాగు వాళ్లకు అలవి కాలేదని వదిలేసారు. ఆదివారం రానే వచ్చినది. ఆరాధనలో విజయరత్నంగారొక ప్రక్క, ఏలీయాగారొక ప్రక్క అయ్యగారి దగ్గర ఉన్నారు. ఇక ఆఖరికి ఆ సంఘ పాదిరిగారే అయ్యగారికి 'మీరు బల్ల దగ్గరకు రాకూడదు' అని చీటి వ్రాసి పంపారు. దొరగారు జీతం ఇస్తున్నాడు గనుక ఆయన మాట వినకపోతే 'రిజైన్' అంటారు అని చెప్పి, ఆ పాదిరిగారు భయపడిరి. అపుడు అయ్యగారు 'ప్రభువా! మనుష్యులు నన్ను బల్ల దగ్గరకు రావద్దు అంటున్నారు. నీవే వచ్చి ఇవ్వుము' అని ప్రార్థించేసరికి బల్ల దిగి వచ్చేసింది. ప్రభువు అంగీవేసికొని పాదిరిగారివలె అన్ని సిద్ధం చేసికొని, అయ్యగారికి పాదిరిగారు చెప్పినట్లు చెప్పి, సంస్కారం ఇచ్చారు. ఆలాగు ఇస్తుంటే అయ్యగారి కుడివైపు ఒక బావి ఉండగా, ఆ బావిలోనుండి ఒక స్త్రీ తెల్లటి జలమును తోడి పోసుకుంటుందట! అపుడు అది ఏమైనది నాకు తోచలేదు. అది

ఏమిటి ప్రభువా! అనికూడ అడుగలేదు అని అయ్యగారన్నారు. ఆ సమయములో, ఆత్మను పొందిన అందరికీ సంస్కారము ఇచ్చారు గానీ అయ్యగార్కి ఇవ్వలేదు.

## బైబిలుమిషను నిగ్గు:-

రెవ. పి. బెంజిమన్ అయ్యగార్కి లూథరన్ మిషను తరపున వారు ఒక ఉత్తరం వ్రాసిరి. అందులో మేము వెళ్ళి పొమ్మనగా, మీ అయ్యగారు వెళ్లిపోయిరి అని వ్రాసిరి. అందుకు, రెవ. పి. బెంజిమన్‌గారు ఇచ్చిన జవాబు: యోసేపును తనఅన్నలు ఐగుప్తుకు సాగనంపిరా? లేక దేవుడే సాగనంపెనా! అని ప్రశ్నించుకొంటే ఇద్దరును సాగనంపిరి. ఉదా:– ఒక తండ్రికి ఒక కొడుకు కలడు. ఒక దొరవద్ద గుమస్తా పని చేయుచుండెను. ఆ దొర అతనిమీద తప్పుమోపి పనిలోనుండి తీసివేయతలచెను. తండ్రిగార్కి ఈ వార్త తెలిసినది. తండ్రి, కుమారుని పిలిచి ఆ దొరగారు తీసివేసేవరకు ఉండక ముందుగానే ఉద్యోగమునకు రాజీనామా ఇచ్చి రావలసినదని చెప్పెను. ***గనుక అయ్యగార్కి ప్రభువు చెప్పినమాట నిజమే. వారు వెళ్లుమన్నది నిజమే.*** ఒకే సమయమందు అది జరిగింది గనుక అదే సత్యము.

## బైబిలుమిషను ద్వారా ప్రపంచ సౌవార్తికరణ:-

ప్రపంచమంతటికి సువార్త పంపించేటందుకు ఇండియా మూలస్థానము అగును. ఇది నెరవేరునని కనిపెట్టుచున్నాను. ఒక పత్రికాధిపతి ఈ వార్త వేయవచ్చునా? అని అయ్యగారిని అడుగగా, వేయుమని అయ్యగారు చెప్పిరి. ఉపన్యాసకుడు ఈ ప్రసంగములో ఎందుకు? ఈలాగు చెప్పెను' అని అడుగగా ప్రభువు నాకు చెప్పిరి అని అనిరి గాని ఫలాన సం॥లో జరుగునని చెప్పలేదు. అదెప్పుడు జరుగునో తెలియదనిరి. లోకమంతటికి సువార్త పోవుటకు అమెరికా, ఐరోపాదేశములు కావలసినది కాని ఇండియాను ప్రభువు ఏర్పరచెను. ఆశ్చర్యము.

## బైబిలుమిషను నిష్ఠ:-

రాజమండ్రిలో ఒక దొరగారు తనవద్దనున్న ఒక పేదవానిని పెంచి, పెద్దవానినిచేసి, అచ్చు ఆఫీసులో ఉద్యోగము ఇచ్చెను. ఆ వ్యక్తి కొద్ది కాలము చేసి, దొరగారు జీతము చాలలేదని హెచ్చింపుమని కోరినాడు. నాకు తెలియదు, నేనివ్వను, అంతే ఇస్తానని అట్లే చేస్తానని దొరగారు కొంతకాలము గడిపెను. అట్లు పదేపదే అడిగి, చివరకు జీతము హెచ్చించని యెడల పని మానుకొందునని చెప్పుట దొరసానివిని, నీ కోరిక మంచిదే. పనిమానెదనని అనవద్దు. నీ కష్టము ఆయనకు తెలియు సమయము వచ్చినప్పుడు, ఆయన జీతము హెచ్చు చేస్తాడు. నీ పని మానిన ఇంతకంటే ఎక్కువ కష్టములు వస్తాయని ఆమె చెప్పెను. ఆ సలహా అతనికి నచ్చక జీతము హెచ్చించకపోతే, పనిమానివేయుదునని దొరతో అనగా మానివేయుము అనెను. అందుచేత అతడు పని మానెను. అప్పుడు అతడు పనిలో ఉండగా వచ్చిన కష్టములకంటే ఎన్నో కష్టములు తిండికి, బట్టకు ఇబ్బందిపడి చివరికి చనిపోయెను. అట్లే బైబిలు మిషనులో మావల్ల (దేవదాసు అయ్యగారు) కె. విజయరత్నంగారివల్ల మరి కొంతమందివల్ల, ఏవైనా కష్టమున్నప్పటికిని విడిచిపోవద్దని నేను చెప్పుచున్నాను.

## లూథరన్ మిషను అధికారులతో సంవాదము:-

1938, జనవరిలో ప్రభువు నాకు వ్రాతమూలముగా బైబిలు మిషనును బైలుపర్చెను. అపుడు లూథరన్ మిషను కమిటీవారు నన్ను అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పితిని. కోల్మన్ దొరగారు (Chairman) చెప్పినదేమంటే, మీ బోధలు బైబిలులో నున్నవి గాని లూథరన్ మిషన్‌లో లేవు. అప్పుడు మేము చెప్పినదేమంటే, "ఇప్పుడైన చేర్చండి. నాకు సెలవిచ్చిన యెడల ఇప్పుడైన, మిషను అంతా తిరిగి బోధించెదము. అప్పుడాయన చెప్పినదేమనగా, "వల్లపడదు, 'Step out' బైటకువెళ్లు. మరొక సంఘముగా ఏర్పడి,

బోధించుకొనండి. అప్పుడు మేము ఇతర మిషనులను గౌరవించునట్లు మిమ్మునుకూడా గౌరవింతుము".

1938 ఫిబ్రవరి నెలలో **'రిజైన్'** అని ప్రభువు నాకు ఇంగ్లీషులో వ్రాసి చూపించెను. ఆ తరువాత రెండవమారు కమిటీ సమావేశమై, ఇకమీదట లూథరన్‌మిషన్‌కు లోబడియుందుమని సంతకముపెట్టమనిరి. నేను మీటింగునకు వెళ్లక, రిజిగ్నేషన్ కాగితము ఇంగ్లీషులో వ్రాసి, (చేతి వ్రాతలో) కమిటీకి పంపినాము. వారందరు చాలా విచారపడిరి. మీటింగు అయిన తరువాత న్యూడార్ఫర్ గారు వచ్చి నాతో చాలాసేపు సంభాషణ చేసి, మిషనులోనికి రమ్మని చెప్పిరి. అప్పుడు నేను "స్టెప్ ఔట్ (బయటకు వెళ్ళు!) అని వారు అన్న తర్వాత వెళ్లిపోవలెను గాని వెనుకకు ఎందుకు రావలెను? ఆ మాట మీరు విన్నారుగదా!" అని అన్నాను. అవును, విన్నాను అన్నారు. ఇదా కారణము! నేను ఇప్పుడు కోల్మన్‌కి ఈ సంగతి చెపుతాను అని వెళ్లిపోయెను. కోల్మన్ దొరగారు వచ్చి, 2 గంటలసేపు నాతో మాట్లాడి, మీ రిజిగ్నేషన్ రద్దు చేసికొనవలసినది అని చెప్పి వెళ్ళిపోయెను. ఆ తరువాత నేను ఆ రిజిగ్నేషన్ పేపరు అచ్చువేయించి అన్ని తాలూకాలకు, మిషనెరీలకు, పాదిర్లకు, నన్నెరిగిన వారికందరికి పంపించితిని.

'మీరు లూథరన్ మిషన్‌లోనే ఉండి పనిచేయుట పరిశుద్ధాత్మయొక్క ఇష్టమని' నాకు ప్రార్థనలో తోచినది. అని నైడార్ఫర్‌గారు నాకు వ్రాసిరి. Stepout అని అనకపోతే లూథరన్‌మిషనులోనే ఉండిపోదును. గాని రిజైన్ చేయకముందే స్టెప్ ఔట్ అని, వారు కొట్టివేసికొంటే, ప్రభువు నాకేమి చెప్పునో సంగతి ఏలాగు ఉండునో నాకు ఏలాగు తెలియును? పరిశుద్ధాత్మ వారికి, ఆయనకు చెప్పితే నాకు మాత్రము చెప్పవద్దా? చెప్పలేదు. చెప్పనిదే ఏలాగు లూథరన్ మిషనులోనికి వెళ్లుదును?

**మార్చినెల:–** Comeout as a prince of an Army అనగా ఒక సైన్యము యొక్క యువరాజు వలె బైటికి వచ్చివేయుము. అని ప్రభువు

నాకు రెండవ తేదిన వ్రాసి చూపించెను. ఒక పరిశుద్ధుడు దర్శనములో, ఒక గదిలోనుండి గంతువేసి, మరొక గదిలోనికి దుమికెను. ***(1892, మార్చి నెల,1వ తేదిన లూథరన్ మిషన్ పనిలో ప్రవేశించాను. 1938 మార్చి1వ తేదిన ప్రభువు బైటకు రమ్మనెను).***

**ఏప్రిల్ నెల:–** నేను రిజిగ్నేషన్ ఇచ్చినప్పటికిని నాకు ఎండార్సుమెంటు రాలేదు గనుక ఇంకా నేను లూథరన్ మిషనులోనే వారినిబట్టి మెంబరుగానే యున్నాను గనుక గుడికి వెళ్లుచునేయున్నాను. అప్పుడు ఏప్రిల్ 24వ తేదీన ప్రభు భోజన సంస్కారము ఇవ్వవలసిన రోజు. శనివారమునాడు బ్లేర్ మిస్సమ్మగారు (Blair) టౌన్‌లో ఉన్న కోల్మన్‌గార్కి ఉత్తరము వ్రాసిరి. ఏమని? ఆయన మిషనులోనుంచి వెళ్లిపోయినాడు గనుక బల్లయొద్దకు రానీయవద్దు. ఆ రాత్రి పంచాయితీని పిలిచినాను. కోల్మన్‌గారు ఈ సంగతి చెప్పిరి. అందరికి కోపము వచ్చి, నా పక్షముగా వాదించిరి. ***కాని దొరగారి మాటే నెగ్గింది.*** ప్రభు భోజనమునకు సిద్ధపడి నేను ఉదయమున గుడికి వెళ్లితిని. అప్పుడు గుడిలో కూర్చుని ప్రార్థించితిని. సంఘము ప్రభు భోజనము తీసికొనుచుండగా పరలోకమునుండి ఒక బల్ల, ఆ బల్లమీద తెల్లటి బట్ట, దానిమీద పాదిర్లు ఇచ్చే రొట్టెలు, ద్రాక్షారసము పాత్ర వచ్చెను. యేసుప్రభువే పాదిరి డ్రస్సుతో నిలువబడిరి. ప్రభు భోజనము తీసికొంటిని. నా ప్రక్కన కూర్చుని యున్న డాక్టరు గారికి గాని తక్కిన వారికి గాని ఈ సంగతి తెలియదు. ఆయన రాకముందు సమరయ స్త్రీ ధవళ వస్త్రధారియై నీళ్లు తోడుచుండెను.

**వారి వాదము:** ఇప్పుడు ఈ సంగతి విన్నవారు కొందరు, దొరగారిది తప్పు అని అన్నారు. మరికొందరు దొరగారిది న్యాయమే అనిరి.

**నా వాదము :** ఏదనగా అది ప్రభువుబల్ల గనుక నాకు హక్కు ఉన్నది. లూథరన్ బల్ల కాదు. ఇంతటితో శానిటోరియంలోని నా సేవ ముగిసెను. ***(1926 మే నెలనుండి 1938 ఏప్రిల్‌తో ముగిసెను.)***

## అసలైన బైబిలుమిషను:-

రాజమండ్రిలో అయ్యగారి చిన్నతనములో మ్యూజియం దగ్గర ఎదుట గుమ్మములో కుక్క బొమ్మ పెట్టారు. వచ్చేవారు ఆ కుక్కను చూచి కరుస్తుందని పారిపోతారు. ఆలాగుంటుంది ఆ కుక్క బొమ్మ. తెలిసినవారు అది బొమ్మ అని చెప్పితే నిజమా అందురు. పిండితో తేళ్లు చేస్తారు. పిల్లలైతే నిజముగా తేలే అని అనుకుంటారు. ఆలాగే మన మిషను పేరు కొందరు పెట్టుకుంటారు. (అది అసలు మిషను కాదు) కుక్కవంటి కుక్క, తేలువంటి తేలు, సిల్కు వంటి సిల్కు తీస్తున్నారు గానీ నిజమునకు అవి కావు. (ఈ బైబిలు తరగతికి 2వేలు ఖర్చుపెట్టితేనే కానీ ఈ బైబిలు క్లాసు జరుగదు). **ఇది దేవుని మిషను.** కాబట్టి దేవుని పనికి అయనే సొమ్ము ఇస్తారు. మీరందరు అంతరంగముగా, బహిరంగముగా ఉండే ఇవన్నీ ఇతరులకు చెప్పవలసిందే. నచ్చకపోయినా, వారింటికి వెళ్ళి చెట్టు నీడను నిలువబడి చెప్పండి. బైబిలుమిషనువారు మంచి జవాబే చెప్పినారు గానీ, మన మిషను ఎట్లు విడిచిపెట్టగలమని వారు అనుకుంటారులేండి.

## బైబిలుమిషను వ్యాప్తి:-

దేవుడు బైబిలుమిషనును ఎవరికి బైలుపర్చినాడు. 1) అయ్యగారికి 2) మనకు 3) ఇతరులకు 4) ఐదు ఖండములవారికి బైలుపర్చినాడు. గందర గోళములోఉన్న రష్యావారికికూడ ఈ బైబిలుమిషను వెళ్లిపోయినది. అందుచేత క్రైస్తవ మతము ఇష్టములేనివారికికూడ అయ్యగారిమీద పగ, మనమీద పగ, వాయుమండలములోనున్న సాతానుకు పగ. అందుకే అయ్యగారిని రేయింబగళ్ళు వాడు పీడించినాడు. అయిననూ ఆయనజంకలేదు. గనుక మనమును జంకకూడదు.

## బైబిలుమిషను వారి సంతోషము:-

ఇతర మిషనులకు లేని సంతోషము బైబిలు మిషనుకు ఉన్నది. బైబిలు మిషను వారు చివరివరకు సరిగా నడిస్తే, వారు పరలోకమునకు వెళ్లేటప్పుడు ఎక్కువ సంతోషముండును. **1)** స్వయంగా యేసుక్రీస్తు ప్రభువు చెప్పిన మిషనులోనే ఉండుటను బట్టి నేను పరలోకమునకు వచ్చితిని. అదే సంతోషము. ఇది నా సంతోషములలో ఒకటి. **2)** ఇతర మిషనులవల్ల వినిన బోధలు బైబిలు మిషనులో నేర్చుకొని పరలోకమునకు వచ్చితినని సంతోషము. **3)** యేసుక్రీస్తు ప్రభువు నాకు కనబడ్డారని ఏ మిషనులో నాకు కలుగలేదు. ఇది బైబిలుమిషనులో నాకు కలిగినదని సంతోషము. దర్శనము ఆత్మ కుమ్మరింపు. **4)** నేను బైబిలు మిషనులో ప్రవేశించినాను. ***నా నాయకులలో లోపములున్నవి. అయినను నేను అందులో నున్నాను. విడిచిపెట్టలేదని సంతోషము.*** **5)** యేసుక్రీస్తు ప్రభువు నాకైతే చెప్పలేదు గాని దేవదాసు అయ్యగారు చెప్పినారు. వారి మాట విని దైవ సంబంధముగానేకాక, మానవ సంబంధముగా నేను అనుసరించితిననే సంతోషము. నరసంబంధమైన సంతోషమని సంతసించుము. **6)** మనలోనుండి ఇరువురు వెళ్లిపోయి కొన్నాళ్ళకు వచ్చి చేరిరి. కొన్నాళ్ళకు పరలోకమునకు వెళ్లిరి. ఈ సంతోషము వీరికేగాని మిగిలిపోయిన వారికి ఉండదు. **7)** ఇంకొకరు వెళ్లిపోయిరి. రాగానే చేర్చుకొనలేదు. ఇతర మిషనులోనికి వెళ్లలేదు. చివరికి పరలోకము వెళ్లినారు. ఇది అంతరంగ బైబిలుమిషనైయున్నది.

బైబిలుమిషనులోనికి యేసుక్రీస్తు ప్రభువు చెప్పితేనే రావలెను. జ్ఞానమునుబట్టి, మనస్సాక్షినిబట్టి వచ్చిన యెడల రావద్దు అనను. (1) బైబిలుమిషనును ఎత్తి చూపించుము. (2) హెచ్చించుము (3) *యేసుక్రీస్తు ప్రభువు ఎక్కడికి నడిపించునో, తిరిగి పరలోకమునకు పిలిచేవరకు అక్కడే ఉండవలెను. ఐక్యత ఉన్నప్పుడు జరుగని కార్యముండదు. ఏకమైయుండవలెను.*

1894–95 సం॥లో రాజమండ్రిలో జరిగిన మిషనెరీ కాన్ఫరెన్స్‌లో దేవదాసు అయ్యగారు బోధించుటకు, ఒక ఇంగ్లీషు బుక్ సహాయముగా ఇచ్చిరి. అంతా చెప్పిన తరువాత మిషనెరీలు ఈ సంగతులు ఎక్కడవని అయ్యగారిని అడిగిరి. మూడు విశ్వాస ప్రమాణములు (అపోస్తులుల, నికేయ, అతనేషియన్ విశ్వాస ప్రమాణములు) పుట్టుటకు గల కారణములు అయ్యగారు చెప్పిరి. అనగా పుస్తకములో లేని సంగతులు వారికి వివరించిరి.

## క్రీస్తు అంతరంగములోని బైబిలు మిషను:-

వీరు ప్రభువును ముఖాముఖిగా చూచినవారు, ఇతరులకు చూపించిన వారైయున్నారు. " అదిబైబిలు మిషనురా, నీవు కీర్తనల పుస్తకము మిషను పెట్టురా!" అని హేళనచేసే ఒక అబ్బాయి ఉన్నాడు. అతని తండ్రి ఆ అబ్బాయిని అయ్యగారి దగ్గరకు ప్రార్ధనకు తీసికొని వచ్చినాడు. 10వ తరగతి పరీక్షలో పాసు కావలెనని తీసికొనివచ్చెను. అయ్యగారు ఆ అబ్బాయితో నీవు గదిలో 10 ని॥లు ప్రార్ధన చేసికో! నేను కొంచెము పని ముగించి వస్తానని చెప్పి గదిలోనికి పంపెను. అబ్బాయి తండ్రి వరండాలో బల్లపై కూర్చుండెను. 10 నిమిషములలో అయ్యగారువచ్చి తలుపుతట్టి, బైటికి రా బాబూ! అని పిలిచి చెప్పు అన్నారు. ఆ అబ్బాయి చేతులు కట్టుకొని నిలువబడి ***'అయ్యా! ప్రభువు నా ఎదుట ఉన్నారు. ప్రభువు ఛాతిమీద, గుండెపై, 'బైబిలు మిషను' అని బంగారు అక్షరములతో మెరయుచు వ్రాయబడియున్నది'*** అని చెప్పెను. ఇంకే మిషను లేదా అని అయ్యగారు అడిగినారు. ఆ అబ్బాయి లేదని చెప్పెను. ఈలాగున ఆ అబ్బాయి ప్రభువును చూచుటయే గాక అనేకులకు ప్రభువును చూపించెను.

### బైబిలుమిషను నిరుకు:–

ఆ కాలములో బైబిలు మిషను నిరుకును గురించి అనేకులకు కలిగిన సందేహములకు, అనుమానములకు, అభ్యంతరములకు, ఆవేదనలకు దైవజనులే స్వయముగా ఇచ్చిన జవాబులు ఈ క్రింద పొందుపర్చబడినవి.

మేము బైబిలు మిషనును బైలుపరచినందున మా మీద అనేకులు అనేకమైన ప్రశ్నలు వేయుచున్నారు. కొన్ని ఈ దిగువను ప్రకటించుచున్నాను.

**1. ప్రశ్న:** 'బైబిలు మిషను' అనుమాటలు దేవుడు గాలిలో వ్రాసి చూపించెనని మీరు ప్రకటించినారు గదా! అలాగైన మీ మిషను చెత్తవలె గాలికి కొట్టుకొని పోవును గదా!

**జవాబు:** గాలి ఎవరియొద్దకు వెళ్ళునో మా మిషనుకూడ వారియొద్దకు వెళ్ళక మానదు. ఎందుచేతననిన ఇది దేవుడు స్వయముగ బైలుపరచిన మిషను. గాలి కూడ దేవుడు బైలుపరచిన దానమే.

**2. ప్రశ్న:** మిమ్మును పైకి తీసికొనివచ్చిన అమెరికన్ ఇవాంజిలికల్ లూథరన్ మిషనును విడిచిపెట్టుట న్యాయమా?

**జవాబు:** నేను ద్వేషభావముచేత గాని, నాకు ఏదో ఒక కష్టము కలుగుట వలనగాని, ఏదో ఒక నేరస్థాపన ఉండుటవలనగాని, పోషణ చాలక పోవుటవలనగాని, విడిచిపెట్టియుండిన యెడల గొప్ప దోషమే. కాని దేవుడు వచ్చివేయుమని చెప్పగా వచ్చివేయుట న్యాయమే గదా! మిమ్మును దేవుడు రమ్మనిన రారా యేమి? నన్ను గౌరవముతోను, ప్రేమతోను చూచుచున్న మిషనును విడిచి- పెట్టుట ఎంత కష్టమైయుండును? లూథరన్ మిషనునకు నేను నిత్యము కృతజ్ఞత గలవాడనై ఉన్నాను. బోధకుడగు నా జనకుడును, ప్రార్థనాపరురాలగు నా జననియును ఉండి గతించిన మిషనును విడిచిపెట్టుట సుళువైన పనికాదు గదా!

**3. ప్రశ్న:** వృద్ధాప్యమును బట్టియు, ఊహలను బట్టియు నీకు తప్పుడు దర్శనములు కలుగవచ్చునని కొందరి యభిప్రాయము.

**జవాబు:** అందుకే గదా, 'దేవుని నడిగి తెలిసికొనండని' మొదటి నుండియు మీకు మొరపెట్టుచున్నాను. నా ఊహ తప్పు అయిన యెడల నీ ఊహకూడ తప్పని నేను చెప్పవలసియుండును.

**4. ప్రశ్న:** అన్ని దర్శనములు నిజమా?

జవాబు: నేడు మా మిషనులో దర్శనవరములు గలవారనేకులు గలరు. వారు పడుచువారే. ముఖ్యముగా ఈ మధ్య లేచిన సన్నిధి కూటస్థుల దర్శనములు నా దర్శనములను స్థిరపరచుచున్నవి. మీకు ఓపిక ఉన్నయెడల గుంటూరు, బెజవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, కాకినాడ అను పట్టణములలో అనుదినము జరుగుచున్న సన్నిధికూటములకు వెళ్ళి మీ ఇష్టమువచ్చిన మత సంబంధమగు ప్రశ్నలు వేయవచ్చును. ఈ కూటములకు ప్రభువు, పరలోక పరిశుద్ధులు, దేవదూతలు వచ్చుచున్నారు, మాటలాడుచున్నారు. భూలోక విశ్వాసుల ఆత్మలుకూడ వచ్చుచున్నవి. ప్రభువు తీసికొని వచ్చుచున్నారు. పిశాచములనుకూడ అప్పుడప్పుడు రానిచ్చుచున్నారు. దర్శనములలో వినబడు మాటలు కూటస్థులు వ్రాసికొనుచున్నారు. ఎట్టి పాపులైన, ఏ మతస్థులైన దైవసన్నిధి కూటము పెట్టుకొనవచ్చును.

**5. ప్రశ్న:** దర్శనములు కలుగుచున్నవని ఇతర మతస్థులుకూడ చెప్పుచున్నారుగదా?

**జవాబు:** ఇది నిజమే. వారు దర్శనములో కనబడిన వారియొద్దకు జీవాంతమందు వెళ్ళుదురు. గాని క్రీస్తునొద్దకు వెళ్ళరు.

**6. ప్రశ్న:** శక్తిపూజ గలవారికి దర్శనములు గలవని చెప్పుచున్నారు. ఇది ఏమి?

**జవాబు:** ఇదికూడ నిజమే. శక్తిని పూజించుచున్నారు గనుక వచ్చి కనబడును. శక్తిపూజ కూడదని బోధించు బైబిలు వచనము లనేకములు గలవు. మోషే సర్పమును చేసినప్పుడు మాంత్రికులుకూడ సర్పములను చేసిరిగదా! పౌలు బోధలు విని మాంత్రికులు తమ గ్రంథములు కాల్చివేసి క్రీస్తు భక్తులైరి. "కాబట్టి మోషే అహరోనులు ఫరో యొద్దకు వెళ్ళి యెహోవా తమకాజ్ఞాపించినట్లు చేసిరి. అహరోను ఫరో యెదుటను, అతని సేవకుల యెదుటను తన కఱ్ఱను పడవేయగానే అది సర్పమాయెను. అప్పుడు ఫరో తన

విద్వాంసులను, మంత్రజ్ఞులను పిలిపించెను. ఐగుప్తు శకునగాండ్రుకూడ తమ మంత్రములచేత అలాగే చేసిరి. వారిలో ప్రతివాడును తన కర్రను పడవేసినప్పుడు అది సర్పమాయెనుగాని అహరోను కర్ర వారి కర్రలను మ్రింగివేయగా, యెహోవా చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను. గనుక అతడు వారి మాట వినకపోయెను.” నిర్గమ 7:10-13.

క్రీస్తు బోధకుడైన పౌలుచేసిన బోధనాద్భుతములు చూచి మాంత్రికులు తమ పుస్తకములను కాల్చివేసిరి. కార్య. 19:19.

ఒక మతమునుగాని, ఒక మనుష్యునిగాని తృణీకరింపరాదు. ‘ప్రతిమతములోను దైవకళలు, నీతిబోధలు, మంచి ఆచారములు, సజ్జన చరిత్రలు ఇట్టివి గలవు. కాని క్రీస్తులేడు.’ ఇది సాధు సుందరసింగు చెప్పినమాట.

**7. ప్రశ్న:** దర్శనాదులు బైబిలు కాల వృత్తాంతములు. నేటి కాల వృత్తాంతములు కావుకదా?

**జవాబు:** క్రీస్తుప్రభువు నిన్న నేడు నిరంతరము ఒకలాగే ఉన్నాడని బైబిలులో లేదా! (హెబ్రీ 13:8). బైబిలులో ఉన్న అద్భుతములన్నియు అవసరమునుబట్టి నేడుకూడ జరుగక మానవు. విశ్వాసులు క్రీస్తుప్రభువు చేసిన క్రియలకంటె ఎక్కువ క్రియలు చేయుదురని ప్రభువు చెప్పిరి. (యోహాను 14:12).

**8. ప్రశ్న:** బల్లయొద్దకు మిమ్మును మిషనెరీవారు ఎందుకు రానీయలేదు.

**జవాబు:** నేను సభ్యత్వమును వదులుకొన్నందువలన రానీయలేదు.

**9. ప్రశ్న:** మీరు సభ్యత్వము వదులుకొన్నారుగదా! బల్లయొద్దకు రానిత్తురని ఎందుకనుకొన్నారు?

**జవాబు:** బల్ల ప్రభువు బల్ల, అందుచేత సిద్ధపడియుంటిని. ఏ మిషను వారినైన రానిత్తురు. కనుక నన్నుకూడ రానిత్తురని తలంచితిని. రిజైను చేసినప్పటికిని వారు జవాబు ఇవ్వలేదు. అందుచేత నేను ఇంకను లూథరు మిషనులోనే ఉన్నట్టు భావించితిని. సంఘము ఇయ్యలేదు గనుక సంఘాధిపతియైన ప్రభువు ఇచ్చి సంతుష్టి పరచెను. ఆయనకే స్తోత్రము.

**10. ప్రశ్న:** లూథరన్ మిషనువారు మీకు ఆర్డినేషను ఇచ్చెదనన్నప్పుడు ఎందుకు పుచ్చుకొనలేదు?

**జవాబు:** నిర్వహింపలేనని పుచ్చుకొనలేదు.

**11. ప్రశ్న:** మీకు ఆర్డినేషను లేనిదే ఒకరికి ఆర్డినేషను ఇచ్చిరని తెలిసినది. ఇట్లు ఇచ్చుట సరియా?

**జవాబు:** బహుశ 1917లో నేను ఒక ప్రార్థనాకూటములో ఉండగా త్రియేక దేవుడు వచ్చి నాకు ఆర్డినేషన్ ఇచ్చెను. అందుచేత నేను పాదుర్లు లేని సమయమందు ఆర్డినేషను, బాప్తిస్మము, ప్రభువు భోజన సంస్కారము జరుపవచ్చును.

**12. ప్రశ్న:** ఆ ఆర్డినేషను జరిగిన కూటములోనివారు ఎవరైనా ఇప్పుడు ఉన్నారా?

**జవాబు:** లేరు. ఈ మార్చిలో ఒక వృద్ధుడు 'యేసుప్రభువే రక్షణ కర్త' అని చెప్పి చనిపోయెను. కాని 'ఆయన 1938లో నాకు వ్రాసిన ఉత్తరములో ఆ కూటము యొక్క మినిట్సు ఉన్నవి' అని నేను అప్పుడే మా పత్రికలో ప్రచురించితిని.

**13. ప్రశ్న:** యూరఫ్, అమెరికావంటి క్రైస్తవ దేశములలో గాక ఇండియా దేశములోనే దేవుడు ఎందుకు బైబిలు మిషనును బైలుపరచెను?

**జవాబు:** ఇదికూడ దేవుని అడిగి తెలిసికొనవలసినదే.

'ప్రభువా! నీవు జ్ఞానులకును, వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను. అవును తండ్రీ! ఈలాగు చేయుట నీ దృష్టికి అనుకూలమాయెను' (మత్తయి 11:25,26). 'మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి' (మార్కు 16:15).

తెల్లదొరలకు దేవుడు బైబిలు మిషనును బైలుపరచి యుండినయెడల యీ పదునెనిమిది ఏండ్లలో సర్వలోకమునకు వెల్లడిచేసి యుందురు. కాని అది దేవుని పద్ధతికాదు. క్రైస్తవమతము వ్యాపించుటకు కావలసినంత సొమ్ము పోగుచేయ- గల ఒక మిషనుగాని, ఒక సమాజముగాని, ఒక వ్యక్తిగాని నేటివరకు పుట్టలేదు.

**14. ప్రశ్న:** బైబిలు మిషనులోనికి రానివారికి రక్షణ దొరకదా? మోక్ష ప్రవేశము కలుగదా?

**జవాబు:** రక్షణ మిషనునుబట్టికాదు. విశ్వాసమునుబట్టి. అన్ని మిషనులలో రక్షణ బోధ గలదు. మరియొక సంగతి. ఇతర మతములలోనివారు సిలువమీద నేరస్థునివలె మారిన యెడల, క్రీస్తు ప్రభువు వారినికూడ మోక్షములో ప్రవేశపెట్టకమానరు.

**15. ప్రశ్న:** ఎంతోమంది భక్తులుండగా దేవుడు మీకే ఎందుకు బైబిలు మిషనును బైలుపరచెను?

జవాబు: అది నన్నడుగవలసిన ప్రశ్నకాదు. దేవునిని అడుగండి. 1) ముగ్గురు కుమాళ్ళుండగా దేవుడు ఎందుకు నోవహునకు నావ నిర్మాణకార్యమును అప్పగించెను? 2) యాకోబునకు పన్నెండుమంది కుమాళ్ళుండగా దేవుడు ఎందుకు యూదాను క్రీస్తునకు పితామహునిగా నేర్పర్చెను? 3) అనేకమంది కన్యకలు ఉండగా, ప్రభువు జన్మించుటకు దేవుడు ఎందుకు మరియమ్మను ఏర్పర్చెను? అన్నా ను ఎందుకు ఏర్పరుపలేదు? 4) పన్నెండు మంది శిష్యులుండగా, ఇతరులు యూదులతో సమాన వారసులు అను సంగతి

దేవుడు అపోస్తలుడైన పౌలునకే ఎందుకు బైలుపరచెను? 5) అనేకమంది విద్యార్థులుండగా బైబిలు అచ్చునకిచ్చుటకు దేవుడు ఎందుకు మార్టిన్ లూథరును ఏర్పర్చెను? ఇట్టి ఉదాహరణములు బైబిలులో అనేకములు గలవు. **నా యోగ్యతనుబట్టికాదు. ఆయన చిత్తమునుబట్టి నన్ను బైబిలు మిషను ప్రత్యక్షతకు ఏర్పరచుకొనెను.**

**16. ప్రశ్న:** బైబిలు మిషనునకు పోషణాధారములేదు. కనుక తక్కిన మిషనులవలె వ్యాపించునా?

**జవాబు:** ఇదికూడ ప్రభువు నడుగవలసిన ప్రశ్నయే. నాకు ఇట్లు తోచుచున్నది: 'దేవుని వాక్యము నరుల భాషలోనికి రాకముందు అనాదియందే ఉన్నది. భాషలోనికి వచ్చిన తరువాత వ్రాతలోనికి వచ్చినది. ఆ తరువాత అచ్చులోనికి వచ్చినది. ఇది కడవరకు అనగా లోకాంతము వరకు ఉండును. అట్లే బైబిలులోనున్న క్రీస్తుప్రభుని చరిత్రకూడ ఉండును. చరిత్రతో పాటు ఆయనను గురించిన సువార్త ప్రకటనకూడ ఉండును. లోకాంతమైన తర్వాత పరలోకములో క్రీస్తుప్రభువును ఆయనను భూలోకములో ప్రకటించిన వారును, అట్టి ప్రకటనకు ఆధారమైన బైబిలు ప్రమేయము ఉండవచ్చుననుట సబబుకాదా! అలాగైన యెడల బైబిలుమిషనుకూడ ఉండును. బైబిలుయొక్క సిద్ధాంతముల ననుసరించువారేగదా పరలోకములో నుండువారు. ఆ సంఘము బైబిలు మిషనుకాక ఏ వ్యాఖ్యాన మిషనై యుండును?'

**17. ప్రశ్న:** ఈ లోకములోనున్న మిషనులు అక్కడకూడ ఉండునా?

**జవాబు:** భిన్నబోధలు ఉండవు గనుక సంఘము చీలికలైన మిషనులు కూడ అక్కడ ఉండవు.

**18. ప్రశ్న:** అలాగైన మీ బైబిలు మిషను ఏలాగు ఉండగలదు?

జవాబు: ఇది స్వయముగ దేవుడే బైలుపరచిన మిషను గనుకను; ఏక సిద్ధాంతముగా బైలుపడిన మిషను గనుకను; అందరి నిమిత్తమై బైలుపరచిన మిషను గనుకను; దేవుడే స్వయముగా బైబిలు మిషను అను

పేరుపెట్టినాడు గనుకను ఇది పరలోకములోకూడ నుండగలదు. పరలోకములో నున్నవారందరు బైబిలు సంఘములోని వారేగదా! సంఘము అనుమాటకు మిషనులకు ఉన్న చీలికలను అర్థము రాదు. ఇది చీలిక కాదు. ప్రత్యేక సంఘము. దీనిని మరింత వివరముగా చెప్పుచున్నాను. బైబిలు మిషను మెంబర్లు ఎవరనగా, **1)** భూలోకములోనున్న బైబిలుమిషనులోని విశ్వాసులు, **2)** భూలోకములోని ఇతర మిషనులలోనున్న బైబిలు మిషను విశ్వాసులు, **3)** భూలోకములోనున్న ఇతర మతములలోని బైబిలుమిషను విశ్వాసులు, **4)** సృష్ట్యాది మొదలుకొని రెండవ రాకడవరకు చనిపోయిన భక్తులు అనగా పరలోక వాస్తవ్యులైన పరిశుద్ధులు, **5)** పసితనమందే చనిపోయిన పిల్లలందరు, **6)** రెండవ రాకడకు ఆరోహణము కానైయున్నవారు, **7)** అటు తరువాత లోకాంతము వరకు ఉండి ఎప్పుడో ఒకప్పుడు మారినవారు, (అన్ని మతములలో నున్న పసిపిల్లలందరు రాకడనాడు ఆరోహణమగుదురు. ఎందుకనిన వారు దేవునికి అపకీర్తి కలిగించు పనులు చేయలేదు గనుకను, వారు భూలోకములోని ఏ మతములోను చేరలేదు గనుకను వారు సృష్టికర్తయైన దేవునికి మాత్రమే సంబంధించి యున్నవారు. ఏలూరులో ఒక క్రైస్తవురాలు గలదు. ఆమె బాప్తిస్మము పొందక ముందు తన పిల్లలు ఇద్దరు చనిపోయిరి. ప్రభువును తెలిసికొన్న తర్వాత ఆయన ఆమెకు ప్రత్యక్షమై 'నీవు ఎందుకు ఏడ్చుచున్నావు, నీ పిల్లలు నా దగ్గర నున్నారు' అని చెప్పి వారిని తీసికొనివచ్చి చూపించిరి, **8)** హిమాలయ పర్వతములలో ఉండి, లోకమంతటి నిమిత్తమై విజ్ఞాపన ప్రార్థనలు చేయుచున్న పన్నెండు వేలమంది క్రైస్తవ ఋషులున్నారనియు, వారిలో మనము ఎరిగిన కైలాస ఋషిగారును, సాధు సుందరసింగుగారును ఉన్నారనియు తెలిసినది. వారుకూడ బైబిలుమిషను మెంబర్లే. **9)** మారుమనస్సు లేకుండా చనిపోయినవారు మోక్షమునకు వెళ్ళక పాతాళ లోకమునకు వెళ్ళుదురు. వారిలో ఎవరైనా మారుమనస్సు పొందిన యెడల మోక్షమునకు వెళ్ళుదురు. వారుకూడ బైబిలు మిషను మెంబర్లే.

**19. ప్రశ్న:** మీరు బైబిలు మిషను స్థాపించినపుడు లూథరన్ మిషనువారు ఏమన్నారు?

**జవాబు: 1)** నాకు వచ్చిన దర్శనము కేవలము ఊహ దర్శనమని కొందరును, తప్పుడు దర్శనమని కొందరును, పిశాచి దర్శనమని కొందరును అనుకొన్నారు. **2)** ప్రభువు దర్శనమే అని కొందరు అనుకొన్నారు. నమ్మినారు. కాని బైబిలు మిషనులోనికి రాలేకపోయినారు. **3)** 'ఈ ఆలోచన యైనను ఈ కార్యమైనను మనుష్యులవలన కలిగినదాయెనా అది వ్యర్ధమగును. దేవుని వలనకలిగినదాయెనా మీరు వారిని వ్యర్ధపరచలేరు' అని ఒక మిషనెరీ మాత్రమే ఒక మిషను మీటింగులో తన అభిప్రాయమును తెలియపరచెను. (అపో.కార్య. 5:38-39) **4)** మీరు లూథరన్ మిషనులోనే ఉండవలెను అని నాకు పరిశుద్ధాత్మ వలన తెలిసినది అని ఒక మిషనెరీ నాకు వ్రాసెను. మేము ఉండి బోధింతుమని అది వరకే మీటింగులో చెప్పితిమి. **కాని వారే ఉండనీయలేదు. 5)** మీరు బైబిలు మిషనువారి యెడల మృదువుగా ప్రవర్తించి మరల లూథరను మిషనులోనికి తీసికొని రండి అని అమెరికాలోలోని లూథరన్ బోర్డువారు, ఇండియాలోని మిషనెరీ వారికి వ్రాసిరి. కాని ఇది నెరవేరలేదు. **6)** మీ దర్శనమును గురించి తీర్పు విధించుట నా పనికాదు అని ఒక మిషనెరీ నాకు వ్రాసెను.

**20. ప్రశ్న:** మీరు బైబిలుమిషను పెట్టినప్పుడు మీ కారణములన్నియు ఎందుకు ప్రచురించలేదు?

**జవాబు:** ప్రచురించితిని. అప్పటినుండి నేటివరకు ఇతరులకు, క్రైస్తవులకు ఉపయోగముగా నుండు పత్రికలు, పుస్తకములు ప్రచురించుచునే యున్నాను. కోట్లకొలది పత్రికలు, కొన్ని పుస్తకములు ముద్రించి, వాటిలో సందర్భమునుబట్టి బైబిలు మిషనును గురించి పేర్కొనుచున్నాను. వంద కీర్తనలు రచించినాను. నా పత్రికాదులు ఎవరైనా అచ్చువేయించు

కొనవచ్చునని ప్రచురించినాను. ***బైబిలుమిషను విషయములు అంగీకరించినవారు, తమ తమ స్థలములలో బైబిలుమిషనును స్థాపించుకొనవచ్చును.*** దేవుని సందేశము ఆకాశమునకు, భూమికిని ఉద్దేశించినది. యెషయా 1:2; దా.కీర్తన. 148; మత్తయి 28:19; మార్కు 16:15,16; కార్య. 1:8; ఫిలిప్పీ. 2:10,11; ప్రకటన 5:13; ఈ వచనములు చదువగా దేవుని సందేశము పైలోకమునకును, భూలోకమునకును, పాతాళ లోకమునకును, అందినట్టు కనబడుచున్నది. మరియు దేవుని సందేశము బైబిలులోనున్నది. బైబిలుమిషనులోకూడ ఉన్నది. కనుక బైబిలుమిషను విషయములు మూడు లోకములలోను, మూడు కాలములలోను ఉన్నవని గ్రహించుకొనవచ్చును. (మూడు స్థలములలో, మూడు కాలములలో నున్నవారేగదా! మూడు లోకములలోను ఉన్నవారు).

'ఇది వ్రాయుచుండగా ఒకరికి వచ్చిన దర్శనము: పరలోకమునందు ఒక మెరుపుతీగ బయలుదేరి భూమిమీదికి వచ్చి తిన్నగా పాతాళలోకమునకు వెళ్ళెను' . "అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను'. ఫిలిప్పీ. 2:9-11. చదువరీ! బైబిలుమిషను భూమిమీద నుండగనే నీవు దానిలో ప్రవేశించిన యెడల పాతాళమునకు వెళ్ళక మోక్షమునకు వెళ్ళుదువు. ఒకవేళ బైబిలుమిషను సంగతి నీకు తెలియనియెడల మోక్షమునకు వెళ్ళినప్పుడైన తెలిసికొందువు. అక్కడ తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ, దేవదూతలు, భూలోకమునుండి వెళ్ళిన భక్తులు, పాతాళలోకము నుండి వెళ్లిన భక్తులు; అనగా క్రైస్తవ సంఘము ఉన్నట్టును, ఈ సంగతులున్న బైబిలు

ఉన్నట్టును, ఈ విధముగా బైబిలుమిషను ఉన్నట్టును, అట్టి బైబిలుమిషనులో నీవు ఉన్నట్టును గ్రహించి బహుగా ఆనందింతువు.

**21. ప్రశ్న:** బైబిలు మిషను ఏ విషయములో అన్ని మిషనులకంటె గొప్పదని కొందరు అడుగుచున్నారు?

**జవాబు:** అది మరలా చెప్పుచున్నాను.

**1)** దేవుడు స్వయముగా బైలుపరచినాడు గనుక, **2)** ఇన్ని సం॥ల నుండి బైలుపరుపక 1938లో అనగా మన కాలములో బైలుపడినది గనుక, **3)** అనుకొనని నాకు బైలుపడినది గనుక, **4)** అనుకొనని ఇండియాలో బైలుపడినది గనుక, **5)** క్రైస్తవమత సంఘములోనుండి వేరైపోయి, చీలికయై ఆయా మిషనులుగా ఏర్పడిన మిషనులవలె ఇది ఏర్పడలేదు గనుక, **6)** నేను ఒక చీలిక మిషనులోనుండి వెలుపలికి వచ్చినాను గాని క్రైస్తవ మతములో నుండి వెలుపలికి వెళ్ళిపోలేదు. కాని దేవుని బైబిలు మిషనులోనికి వెళ్ళినాను. ఇది మనుష్యులు స్థాపించిన మిషనుకాదు. నేను స్థాపించిన మిషనుకాదు. ***దేవుడు బైలుపరచిన మిషను గనుక ఇది దేవునిమిషను.*** ఇది దేవుని మిషను గనుక అంతస్థులో అన్నిమిషనులకన్న గొప్పది. అంత మాత్రమున మెంబర్లు అందరు తక్కిన క్రైస్తవులందరికంటె గొప్పవారని చెప్పలేము. బైబిలుమిషనులో ఉండి ఆ మిషనుయొక్క ఏర్పాటును అనుసరించువారే అధికులు. మొదటి తరగతినుండి బి.ఏ. తరగతి వరకు ఉండునది విద్యయే. కాని ***ఆ విద్యలో అంతస్థులు గలవు గదా!*** అట్లే మంచి అంతస్థులు గల అన్ని మిషనుల అంతస్థుకన్న బైబిలుమిషనుయొక్క అంతస్థు గొప్పది గాకపోతే దేవుడు ఎందుకు బైబిలు మిషనును బైలుపరచెను!

మరియొక సంగతి : భక్తుల భక్తిలో అంతస్థులు గలవు గదా! ఒకరి భక్తికంటె మరొకరిభక్తి ఎక్కువగా కనబడుటలేదా! భక్తినిబట్టి అనగా విశ్వాసమునుబట్టి మనము భక్తులను తరగతులుగా భావించుకొనవచ్చును.

పంటనుబట్టి పొలములు ఏర్పడినవి. ఒక పొలము ముప్పదంతలు, ఒక పొలము అరువదంతలు, ఒక పొలము నూరంతలుగా పండినవి. అన్నియు పొలములే. కాని పొలములలో అంతస్థులు లేవా! పంటలలో అంతస్థులు అనగా ఎక్కువ తక్కువలు లేవా! అట్లే మిషనులన్నిటిలో అంతస్థులు ఉండవా? రక్షణ, మోక్షప్రవేశము అను రెండు అంశములు ఈ సందర్భమున తలంపవలసినవికావు. తలంపవలసినది అంతస్థు. మోక్షమునందు సంఘమునకు ఏడు తరగతులు అనగా ఏడు అంతస్థులు గలవు. (ప్రకటన 2,3అధ్యా). మొదటి అంతస్థునకు ఎఫెసుసంఘ అంతస్థు అని పేరు. మిగుల ఉన్నతమైన అంతస్థునకు లవొదికయ సంఘాంతస్థు అని పేరు. బైబిలు మిషనులో నున్న మెంబర్లు ఎవరైనను దేవుడు బైలుపరచుచు వచ్చిన సిద్ధాంతములనుబట్టి నడువని యెడల, అట్టివారు బైబిలు మిషనులో *బహిరంగమైన మెంబర్లైనను అంతరంగమైన మెంబర్లుకారు*. మరియు 1938లో బైలుపడిన బైబిలు మిషనులోనుండి వెళ్ళిపోయినవారు చీలిక మిషనుకు సంబంధించినవారే గాని మొదటి బైబిలు మిషనుకు సంబంధించిన వారుకారు. వారికి రక్షణ లేదు అని చెప్పము కాని అంతస్థు లేదని చెప్పగలము. ఒక మిషనువారు ఒక మిషనువారిని దూషించిన యెడల, ద్వేషించిన యెడల అట్టివారు దేవునికి ఇష్టులు కారు. (మత్తయి 5:22-24). గద్దింపు వంకమీద దూషింపవచ్చునా? మా దైవప్రత్యక్షత గ్రహింపనివారు నిశ్శబ్ధముగా నుండుట మంచిది. కాని చేయిపెట్టి కెలుకుట హాని. పరీక్షింపకుండను, దేవుని అడుగకుండను, అడిగి ఆయన చెప్పునది ఆలకించుటకు కనిపెట్టకుండను ఉన్నవారు ఎట్లు సత్యము తెలిసికొనగలరు? వారు కేవలము దూషింపగలరు కాని తెలిసికొనలేరు. ఒక విద్యార్థి అన్ని తరగతులలోనుండి బి.ఎ. తరగతిలోనికి వచ్చినప్పుడు తక్కిన తరగతులవారు సంతోషింపవలెనా? దూషింపవలెనా?

**22.ప్రశ్న:** బైబిలు పండితులకంటెను, బైబిలు భక్తులకంటెను, మీరు ఎక్కువ తెలివిగలవారా? ఎక్కువ భక్తిగలవారా?

**జవాబు:** కాను. కనుకనే దేవుడు బైబిలు మిషనును బైలుపరచినాడని తలంచుచున్నాను. 'మీలో లోకరీతిని జ్ఞానులైనను, ఘనులైనను, గొప్ప వంశము వారైనను అనేకులు పిలువబడలేదు గాని ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండు వెర్రివారిని దేవుడు ఏర్పర్చుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పర్చుకొని యున్నాడు. ఎన్నికైనవారిని వ్యర్థముచేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింపబడినవారిని, ఎన్నికలేని వారిని దేవుడు ఏర్పర్చుకొనియున్నాడు" (1కొరింథీ. 1:26-29) నేను మూడవ ఫారంవద్ద ఆగిపోయినాను. కాని బి.ఎ. తరగతివరకు వెళ్ళియుండిన యెడల ఈ బైబిలుమిషను ప్రత్యక్షత నాకు అందకుండునేమో! దేవుడు మోషేవంటి ఒక ప్రవక్తను త్వరలోనే లేపును అని ఒక పెంతెకొస్తు సంఘ బోధకుడైన పశ్చిమదేశ క్రైస్తవునికి బైలుపడెనట. ఆ ప్రవక్త ఇండియాలోనే ఉన్నాడట. ఇది ఆయన ఏలూరులో చెప్పెను.

**23. ప్రశ్న:** మీరు వస్తారని బైబిలులో ఎక్కడైనా ఉన్నదా?

**జవాబు:** మెతూషెలను అడగండి (ఆది 5:21). హిమాలయ పర్వతములలోనున్న కైలాస పర్వతమందు కైలాస ఋషి ఉన్నాడు. ఆయన యొద్ద క్రైస్తవ ఋషులు పన్నెండు వేలమంది ఉండి లోకము నిమిత్తమై ప్రార్థించుచున్నారు. సాధు సుందరసింగుగారుకూడ అక్కడనే ఉన్నారు. పైన ఉదహరించినవారును, బైబిలు మిషనులోనివారే. బైబిలు మిషనును ఇండియాలోనే ఎందుచేత బైలుపర్చుబడినది? అది దేవుని చిత్తము. కొన్నియేండ్ల క్రిందట బరంపురములో ఐదుగురు స్త్రీలు ఒక ప్రార్థనకూటము ఏర్పర్చుకొనిరి.

ఆ కూటములోనికి ప్రభువును, తక్కినవారునువచ్చి మాట్లాడుచుండిరి. ఆ మాటలు వారు వ్రాసిపెట్టి ఉంచిరి. ప్రభువు అవి ముందునకు బైలుపరచును. నేనుకూడ అప్పుడప్పుడు వారి కూటమునకు వెళ్ళుచుంటిని. **ఆ కూటమునకు క్రీస్తు నీతి సంఘమని పేరు.** ఇదికూడ ఇండియాలోనిదే. వారు ఇప్పుడు పరలోకములో నున్నారు.

**24. ప్రశ్న:** బైబిలు మిషను దేవుడు బైలుపరచిన మిషను అని నమ్ముటకు మాకు ఆధారమేమి?

**జవాబు:** దా.కీర్తన. 22:30,31. దీనిలో సూచన కనబడుచున్నది. బైబిలు కాలములోని భక్తులను మనము చూడలేదు. అయినను వారి విషయములు నమ్ముచున్నాము. బైబిలు మిషను బోధకులను అందరు చూచుచున్నారు. వారి బోధలు వినుచున్నారు, చదువుచున్నారు. చూడనివారి విషయములు నమ్మగలవారు, చూచుచున్న వారి విషయములు ఎందుకు నమ్మకూడదు!

**25. ప్రశ్న:** మారుమనస్సు విషయమై మీ యభిప్రాయమేమి?

**జవాబు:** 1) పాపస్థితిని మార్చుకొనుట మారుమనస్సు. 2) నూతన స్థితిని పొందుట మారుమనస్సు. ఈ రెండును కలిగియున్నవారికి మారు మనస్సు ఉన్నట్టు రుజువు. వివరము : దైవగ్రంథములో ఉదహరించిన పాపములు మానివేయవలెను. ఇదే మారుమనస్సునకు మొదటిమెట్టు. మరియు మనకు తెలిసిన తప్పులు అన్నియు మానివేయవలెను. మనము ఎవరియెడల అపరాధులమో వారియొద్ద తప్పులు ఒప్పుకొనవలెను. దేవుని యెదుట ఒప్పుకొనవలెను. బైబిలులోనున్న అన్ని విషయములు అంగీకరింపవలెను.

# బైబిలుమిషను విషయములో దైవజనుని నిబద్ధత:-

*సంభాషణ:- ఆగస్టు 29 బుధవారం 1949.*

ఆత్మీయరీతిని దైవజనుని విశ్వాస పుత్రునిగా ఎంచబడిన రెవ. కె. విజయరత్నం గారికిని, దైవజనునికిని బైబిలు మిషను నిబద్ధత, క్రమము విషయమై గుంటూరు బేతేలు గృహములో జరిగిన సజీవ సంభాషణ యథాతథముగా ఈ క్రింద ఇవ్వబడినది. విజయరత్నంగారు వేరొక మిషనులో ముంచడముద్వారా బాప్తిస్మము పొందినపుడు, 'విజయరత్నంగారు బైబిలు మిషనులోనుండి వెళ్ళిపోయారని పరలోకమునుండి నాకు రాత్రి టెలిగ్రాము వచ్చినదని' దైవజనులు తనదగ్గరున్నవారితో చెప్పిన కొన్ని దినములకు విజయరత్నంగారు అయ్యగారిని కలుసుకొనుటకు విచ్చినపుడు వారిరువురి సంభాషణ ఈలాగు జరిగినది.

1. దేవదాసు అయ్యగారు:- నీవు జనవరిలో 'ఎలోనిన్' దొరగారివలన ముంచడము (బాప్తిస్మము) పొందిన సంగతి ఎట్లు సంభవించినది?

విజయరత్నంగారు:- ఆయన సజ్జనుడు, అవివాహితుడు, మంచివాడు కనుక ఆయన వలన ముంచడము పొందాను.

2. దేవ:- నీ స్వంత మిషను ఐ.బి.యం. (అప్పట్లో 'బైబిలుమిషను' ఈ పేరుమీదనే రిజిష్ట్రరైనది. అనగా ఇండియా బైబిలుమిషను)కు చెప్పకుండ ఈ పనిచేయుట బాగుగా లేదు.

విజయ:- చెప్పడము అవసరము లేదు.

3. దేవ:- జనకునికి చెప్పకుండా ఏ పని చేయకూడదని ఐ.బి.యం. రూల్స్‌లో ఒకటి కదా? నాకైనా చెప్పలేదు.

విజయ:- మిషను సంబంధమైన పనికాదు అది నా స్వంతపని. మత విషయములో ప్రతివారికి స్వతంత్రత కలదు. అందుచేత చెప్పలేదు. అందుకా మీకు కోపం!

4. దేవ:- నాకు ఎందుకు చెప్పలేదని అడుగదలంచుకొనలేదు. సంభాషణలో అడుగుచున్నాను. ఏదైన ఒక సంగతి విన్నపుడు అడుగకూడదా?

విజయ:- నేనేమి గొప్ప పాపము చేసినాను అని నన్ను అడుగుచున్నారు? ఫలాని పాపము, ఫలాని పాపము చేశానా? అని అన్నారు.

5. దేవ:- మీరు ఫలాని పాపము చేసినారని నేను అన్నానా? బాప్తిస్మము పబ్లిక్ వ్యవహారం. కనుక అడిగినాను. నీ భార్యవల్ల నిశ్చయము తెలిసినది. ఇక్కడకు వచ్చినపుడు చెప్పినది.

విజయ:- మీరు మీవద్దకు వచ్చినవారందరికి ఈ విషయములు చెప్పుచున్నారట. అది బాగున్నదా?

6. దేవ:- ఇది అందరికి తెలిసిన బాహాట విషయము. తెలిసినవార్త విన్నప్పుడు ఎవరు చెప్పుకొనరు? అట్లు నేను చెప్పుచున్నాను.

విజయు:- మీరు నన్ను అల్లరిపెట్టుచున్నారు, అవమానపరచుచున్నారు.

7. దేవ:- నీవు నన్ను అనేకపర్యాయములు అవమానపరచినట్లు అనేకములు చెప్పగలను. కానీ చెప్పను. నిన్ను అవమానపరచినట్లు ఒక్కమనిషి చేత ఋజువు చెప్పించు, వింటాను.

విజయ:- ....... 0......... (నిశ్శబ్దము)

8. దేవ:- నీ మిషనుతో చెప్పకపోవడము, పరాయి మిషనులో ముంచడము పొందడము, ఈ రెండే నేను ఎత్తుచున్న సంగతులు. ఇవే నాకు నచ్చలేదు. ఇంకొక సంగతి ఏదనగా, ఆ మిషనులో బాప్తిస్మము

పొందినావు కనుక ఆ మిషనులో మెంబరువు అయినట్టే. ఐ.బి.యం.లో మెంబరు కానట్టే.

విజయ:- బాప్తిస్మము పొందితే మెంబరు అయినట్టుకాదు. మీరు అన్నది వాక్యానుసారమైనదికాదు.

9. దేవ:- 3వేలమంది బాప్తిస్మము పొందినపుడు, అన్ని మతములలో వారికున్న మెంబరు షిప్పు (సభ్యత్వము) పోయినది. క్రైస్తవ మతములో మెంబరు షిప్పు వచ్చినది. కైసరయలో అన్యులు పేతురువల్ల బాప్తిస్మముపొందిరి, క్రైస్తవులలో చేర్చబడిరి. అన్యులలో మెంబరుషిప్పు పోయినది.

విజయ:- .........0............. (నిశ్శబ్దము). మీరు నన్ను ఐ.బి.యంలో నుండి Eliminate (వెలి) చేయుచున్నారు.

దేవ:- నేను ఎవ్వరిని వెలివేయలేదు. వెలి వేసినది గవర్నమెంటుదే. మిషనుకు చెప్పకుండా వేరే పట్టణమువెళ్ళి, వేరే మిషనులో (పెంతెకొస్తులో) ముంచడము పొందడమువల్ల నిన్ను నీవే ఐ.బి.యం.లో నుండి వెలివేసికొనుచున్నావు. నిన్ను ఎవ్వరును వెలివేయలేదు. నా అభిప్రాయము చెప్పినాను. నా అభిప్రాయము వెలివేయడము కాదు. గవర్నింగ్‌బాడీ వారుగానీ, ఐ.బి.యం. పనివారుగానీ సమావేశమై, మీరు ఇతర మిషనులో ముంచడము పొందినందున, ఏది తీర్మానముచేస్తే అదే ఖాయము (నిర్ణయము) కాని, నా అభిప్రాయము ఖాయము కాదు.

విజయ:- మిషను అనగా మీవద్ద నుండేవారేనా?

దేవ:- వీరే మిషనని నేను అన్నానా? పనివారందరు మెంబర్లు. అందరు మిషనుకానీ వీరు ఒక్కరే కాదు.

విజయ:- నేను బాప్తిస్మము పొందినది పెంతెకొస్తుకాదు (Free Church of Finland), ఫ్రీ చర్చ్ ఆఫ్ ఫిన్‌లాండ్.

10. దేవ:– నేను పెంతెకొస్తు మిషను వాడనని ఎలోనిన్ దొరగారు నాకు చెప్పినారు. అందుకు నేను అన్నాను. ఇదికూడ పెంతెకొస్తులో ఒక శాఖకాదా?

విజయ:– కాదు, మీరు అందరిని ప్రోగుచేసి ఈ విషయము మీరు మాట్లాడవచ్చు.

11. దేవ:– మిషను నీ చేతిలోనున్నది ఆ పని నీ పని. నా పనికాదు.

విజయ:– నేను చెప్పకుండ ముంచడము పొందితే, నాలోనుండి కొందరు వేరైపోతే వేరే క్రొత్తవారు వస్తారు.

12. దేవ:– ఓ.. ఎందుకు రారు? ఎందుకు రాకూడదు? గుంటూరు సంఘము దర్శించుటకు రేపు వెళ్ళు. ఇంటింటికి వెళ్ళుము. చార్లెస్‌గారు ఎదురు చూస్తున్నారు.

విజయ:– మీరు నన్ను ఐ.బి.యం. నుండి వెలివేసినారు. కనుక నేను వెళ్ళి దర్శించను. రాజమండ్రి వెళ్ళిపోవుచున్నాను.

13. దేవ:– నేనుగాని మరెవరుగానీ నిన్ను వెలివేయలేదు.

విజయ:– నాకు ఎవరు చందాలు పంపడములేదు. పోషణకు చిక్కుగా నున్నది.

14. దేవ:– ఒకరి చందాలమీద ఆనుకొని నీవు బైబిలుమిషను పెట్టలేదు.

విజయ:– మేరీ (నా భార్య) తో మీరు 'పంతులుపని (టీచరు) చేయవద్దు సువార్త ప్రకటించుము' అని అన్నారట. ప్రభువు పోషణ ఇస్తారన్నందువలన పంతులు పనికి ప్రయత్నించుటలేదు. ట్రైనింగ్ (శిక్షణ) అయిన తరువాత పంతులు పనికి వెళ్లకపోతే చిక్కుకాదా?

15. దేవ:- "ట్రైనింగ్ అయిన తరువాత స్కూలు పని చేయకపోవుట న్యాయము కాదు" అని ఆమె నాతో చెప్పలేదు. చెప్పియున్న యెడల పని కొరకు ఆర్జీ (దరఖాస్తు) పెట్టుకొనుము అని వెంటనే సలహా ఇచ్చియుందును. ఇప్పుడైన స్కూలు పనికి వెళ్ళవలసినదని చెప్పుము.

16. దేవ:- షారోను పత్రికమీద నాపేరు గాని, ఐ.బి.యం. పేరుగాని లేదని కొందరనుచున్నారు. గాని నేను అనలేదు.

విజయ:- మిషను వృత్తాంతము వేయుచున్నాను గనుక మిషను పేరున్నదికదా! మీ పత్రికలు వేయించుచున్నాను కనుక మీపేరున్నదికదా?

17. దేవ:- ఈ పత్రికమీద ఐ.బి.యం. పత్రికని లేదు.

విజయ:- ........0......... (నిశ్శబ్దము).

18. దేవ:- మనలోనుంచి కొందరు వెళ్ళిపోయినప్పుడు కలహము కలిగినది. అప్పుడు ప్రజలలో నిన్నుగూర్చి చెడ్డ అభిప్రాయములు ప్రవేశించినవి. కాబట్టి 'మనము ఇద్దరము ముఖ్య స్థలములలోనికి సర్క్యూటుకు వెళ్ళుదము' అని నీవు అన్నావు. నేను నీతో సర్క్యూటుకు (ఏలూరు, తాడేపల్లిగూడెం, బెజవాడ, చీరాల, గుంటూరు, భీమవరం, ఆకివీడు) వెళ్ళితిని.

విజయ:- నన్నుబట్టికాదు. ప్రభువు సేవనుబట్టి మీరు సర్క్యూటుకు వచ్చినారు.

దేవ:- రెండును నిజమే.

19. దేవ:- మేరమ్మకు, నీకు కలహము వచ్చినపుడు ఆమె నాతో వెళ్ళిపొండి! వేరే ఇల్లు చూచుకొండి అన్నది. సరే వెళ్ళిపోదును అన్నాను. నీవు ఎందుకు ఇలాగు అన్నావని ఆమెను ఒకమాటయైన అనలేదు. ఒక నెల అయిన తరువాత నన్ను ప్రత్తిపాడు తీసికొని వెళ్ళినావు. 4 నెలలు అయిన పిమ్మట ఏలూరు తీసికొని వెళ్ళినావు. అక్కడనుండి గుంటూరు తీసికొనివెళ్ళి రాజారావుగారి ఇంట్లో అప్పజెప్పినావు. (అయితే, ప్రభువే అయ్యగారితో

"యెహోవా నిన్ను ఇక్కడికి తీసికొని వచ్చెను" అని బైలుపరచిరి) నీ ఇష్టప్రకారమే నేను అన్ని చేసినాను.

విజయ:- నేను ఎప్పుడు వచ్చినా కష్టమైన మాటలే అంటున్నారు.

20. దేవ:- నీవు అనేక మారులు నన్ను కష్టమైన మాటలు అన్నావు. నేను నిన్ను ఒక్కమాటయైన అనలేదు. నీవు ఎప్పుడు వచ్చినా, కలహమాడకుండా వెళ్ళవు.

షరా:- అప్పుడు విజయరత్నం కోపముతో నాయొద్దనుండి వెళ్లిపోయినాడు. నాకు జాలి కలిగినది కాని ఏమి చేయగలము! "నీవు కోపము తగ్గించుకొన్న యెడల అన్నియు సరియౌనని" నేను పలుమారులు అనుచున్నానుగాని ఆయన తగ్గించుకొనలేకపోవు చున్నాడు.

ఈ రీతిని తన విశ్వాస పుత్రుని విషయములోకూడ దైవజనులు తన అభిప్రాయములను నిర్మొహమాటముగా వెల్లడించిరి. ఆయన ప్రేమ ఎవరినీ త్రోసివేయకపోయిననూ, వారికి వారే భిన్నమైన పద్ధతులలో వెళ్ళిపోయిన వారి విషయములో ఆయన దుఃఖముతోనే ఖచ్చితముగా ఉన్నారని మనకు తెలియగలదు. ప్రభువు తనకు బైలుపరచిన బైబిలు మిషను విషయములో దైవజనులు ఈలాగున స్పష్టమైన నిబద్ధతను కనపర్చి, ప్రభువు అంతరంగమునకు తగినట్లుగా దీనిని తీర్చిదిద్దుచున్నారు.

# 7. దానవాయిపేట అనుభవములు

రాజమండ్రి శానటోరియం నుండి బయటకు వచ్చిన తరువాత అయ్యగారు దానవాయిపేటలో ఒక ఇల్లు అద్దెకు తీసికొన్నారు. అయితే బోధపని మాత్రము అయ్యగారు మానలేదు. అపుడు అయ్యగారు ఆనవర్శిరీ పెట్టారు. అది బైబిలు మిషన్‌యొక్క మొదటి Anniversary. అపుడు భీమవరం నుండి ఒక పాదిరిగారు అయ్యగారిని చంపేయమని కొందరు సంఘపెద్దలకు డబ్బులిచ్చి పంపెనట! వారు వచ్చి పందిరి చుట్టూ తిరుగుతూ, ఆ బోధలు వింటూ,

పాటలు వింటూ, 3 రోజులు అలా ఉండిపోయారట. ఇక్కడ ఈ పాదిరిగారు వారు ఇంకారాలేదేంటి? అని ఆందోళన చెంది, వారిని వెదుక్కుంటూ వచ్చి, ఏం! ఎందుకు చంపలేదని అడుగగా వారు– ఆయన మాటలు వింటుంటే మాకు చాలా భయంవేసింది, ఆయన మాటలు ఒక్కసారి వింటే వాటిని తిరిగివదల్లేము! అని చెప్పి, అందరూ కలిసి తిరిగి వెళ్తున్నారు. ఆ పాదిరిగారు తిరిగి భీమవరం వెళ్లుటకు నిడదవోలులో బండి మారాలి. గనుక ఆలాగు బండి మారుతూ ఉండగా, వేరొక బండి ఎక్కి అది కదులుచుండగా క్రిందికి దిగే సరికి పంచె తట్టుకొని రైలు క్రిందపడి చనిపోయారు.

దానవాయిపేటలో అయ్యగారు ఉన్నప్పుడు సూర్యం అనే అబ్బాయి ఉండేవాడు. అతనికి కొన్నాళ్లకు పెండ్లి అయినది. అతను అత్తగారింటికి వెళ్లవలెననుకొని అయ్యగారికి చెప్పుటకు వచ్చెను. సూర్యం అత్తగారింటికి వెళ్తున్నావా! 'జాగ్రత్త తలనొప్పి వస్తాది' అన్నారు. 'సరేలే అయ్యా! అని అతను వెళ్లినాడు. అక్కడ తలనొప్పి వచ్చి అతను చనిపోయినాడు.

వేముల ఛార్లెస్‌గారు కాపవరంలో పాస్టరుగా పనిచేయుచున్నప్పుడు, ఒక సం॥ము డిసెంబరు నెల 2వ తారీఖున కొన్ని డెకరేషన్ కాగితాలు, కొన్నిబట్టలు, ఒక డబ్బా కిరసనాయిల్ తీసికొని అయ్యగారి దగ్గరకు వచ్చి ప్రార్థన చేయించుకొని, 'అయ్యా నేను కాపవరం వెళ్లుచున్నాను' అని చెప్పినారు. అయ్యగారు 'ప్రొద్దుపోయినది వద్దు' అన్నారు. బస్సు ఉన్నదయ్యా! ఎంతసేపు!! అని చెప్పి వెళ్ళిపోయినారు. ఆ దారిలో దొంగలు కొడతారన్న విషయం అందరికి తెలిసినది. పాస్టరుగారు బస్ స్టాండింగుకి వెళ్లేసరికి చివరి బస్సు వెళ్లిపోయినది. ఇక నడక ప్రారంభించినారు. కొంతదూరం వెళ్లేసరికి చీకటి పడినది. అంతలో దొంగ ఎదురు వస్తున్నాడు. అది గమనించిన ఛార్లెస్‌గారు చెట్లు చాటుచేసికొని ఒక ఫర్లాంగు దూరము వెళ్లినారు. ఇంతలో దొంగ ఆయనను చూచి, ఆగు తమ్ముడు నేను వస్తాను అని కేకవేసి పరుగు ప్రారంభించినాడు. ముందు పాస్టరుగారు వెనుక దొంగ పరుగు

మొదలుపెట్టినారు. ఈ విధంగా పరుగెత్తి పరుగెత్తి పాస్టరుగారు రెండు ఫర్లాంగులు దొంగకు ఎడమైనారు. 'దొంగ– పోరా! పారిపోయి తప్పించుకొన్నావు' అని తన చేతిలోని దుడ్డుకర్ర విసిరివేసినాడు. అంతలో **ఒక వృద్ధుడు లైటు తీసికొని** వచ్చి, ఏం నాయనా ఏమైనది? దొంగ తరిమినాడా? నీ ముందు ఇద్దరినికూడ తరిమినాడు అని చెప్పి, ఆయాసపడుచున్న పాస్టరుగారిని కొంత లెక్క తీసికొని వెళ్లి, ఆ ఇద్దరిని చూపించి, ఇక వెళ్లు భయంలేదులే అని చెప్పి ఆ వృద్ధుడు వెళ్లిపోయినాడు.

ఒకరోజున ఛార్లెసుగారు తన పెండ్లికార్డులు తీసికొని వెళ్లి అయ్యా పెండ్లికార్డు ఇదిగోండి! అన్నారు. అయ్యగారు అందులో ఏముందో చదివి వినిపించు అన్నారు. ఛార్లెస్‌గారు చదవకుండానే, మరలా తీసికొండి అన్నాడు. అపుడు అయ్యగారు చదవకపోతే వెళ్లు అన్నారు. వెళ్లి బయట దిగులుతో కూర్చున్నారు. కొంత సేపటికి అయ్యగారే పిలిపించి, నీవు ఈ కార్డును నేను మొదట ముట్టవలెనని తలంచుచున్నావు. ఇది మంచిదికాదు. ***'ఇది నరభక్తి'*** అని చెప్పి ప్రార్థన చేసి పంపినారు.

## దైవజనుని సలహా:-

కె. జీవానందం అనే అబ్బాయి అనకాపల్లిలో 8వ తరగతి చదువు చున్నాడు. ఇక చదువు అక్కడితో ఆపివేసి దేవుని సేవకు వెళ్లాలని అనుకొన్నాడు. ఆ నిశ్చయతతో రాజమండ్రిలో ఉన్న అయ్యగారి దగ్గరకెళ్లి ప్రార్థన చేయించుకొని, సేవకు వెళ్ళిపోవాలని ఒంటరిగా బైలుదేరి రైలుబండి ఎక్కాడు. అబ్బాయి గోదావరి స్టేషన్‌లో దిగే సరికే వర్షం బాగాపడుతుంది. ఇక ఆ వర్షంలో అయ్యగారి దగ్గరకు వెళ్ళలేక, స్టేషన్ ఎదురుగా ఉన్న ఒక పెద్ద బిల్డింగ్ క్రింద నిలబడి చూస్తున్నాడు. అపుడు అయ్యగారు తన వద్దనున్న ఒక మనిషిని పిలిచి, తాటాకు గొడుకు చేతికిచ్చి, పలాన బిల్డింగ్ క్రింద ఫలనా పేరుగల అబ్బాయి, ఫలాని ప్రాంతమునుండి వచ్చియునాడు. తోడుకొని రమ్మని పంపారు. అయ్యగారు పంపగా వచ్చిన ఆయన అయ్యగారు చెప్పినట్టే

సరిగ్గా ఆ అబ్బాయిని కలుసుకొని, అయ్యగారి దగ్గరకు తీసికొచ్చారు. అపుడు అయ్యగారు ఆ అబ్బాయికి ప్రార్థనచేసి, ***బాబూ! బి.ఏ. వరకు చదువుకో!*** అపుడు దేవుని సేవకు వెళ్లుదువు అని చెప్పి పంపించారు. అయ్యగారి మాట ప్రకారం ఆ అబ్బాయి కాకినాడ Mc Lauren school లో చదువు ముగించి, ఆ తరువాత బి.ఏ. వరకు చదువుకొని దేవుని సేవకు వెళ్ళి నేడు గొప్ప చిల్డ్రన్స్ మిషనెరీగా మారారు.

## దైవజనుని ప్రేమ వెలిగింపు:-

రాజమండ్రి ట్రైనింగ్ స్కూల్లో ముగ్గురు అబ్బాయిలు B.Ed చదువుచున్నారు. పరీక్షల నిమిత్తం అయ్యగారి దగ్గరికి వెళ్లి ప్రార్థన చేయించు- కోవాలనుకున్నారు. అయితే వారిపేర్లు కొంచెం మోటుగా ఉండుటనుబట్టి (బుల్లయ్య, సోమయ్య, వీరయ్య), అయ్యగారు వారికి ప్రార్థన చేయరేమో అనుకొని దారిలో ఒక పొద దగ్గర ఆగి యాకోబు, యోసేపు, శామ్యేల్ అనే పేర్లు పెట్టుకున్నారు. అయ్యగారి దగ్గరకు వచ్చి విషయం చెప్పి ప్రార్థించుమని అడిగిరి. అపుడు అయ్యగారు వారిని మోకరించుమని చెప్పి, వారి పేర్లు అడిగిరి. వారు పెట్టుకొన్న క్రైస్తవ పేర్లు చెప్పగానే, 'ఇవేవో పొద దగ్గర పెట్టుకున్న పేర్లు లాగా ఉన్నవే' అని అయ్యగారు అనగానే, వీరికి ముచ్చెమటలు పోసినవి. అపుడు అయ్యగారు వారిని నెమ్మదిపరచి, ప్రార్థనచేసి పంపించారు. ఆ తరువాత మంచి మార్కులతో వారు ఉత్తీర్ణులయ్యారు. ఈలాగు వీరి జీవితములో వీరు చేసి అద్భుతములు కోకొల్లలు; వాటిని వివరించుటకు సమయము, స్థలము చాలవు. వీటినిబట్టి చదువరులు ప్రభువును మహిమ పరచుదురు గాక! ఆమేన్.

## దైవజనుని మాట:-

అయ్యగారు షారోన్ హౌస్‌లో ఉన్నపుడు చార్లెస్‌గారు అయ్యగారిని చూచుటకువచ్చి, తిరుగు ప్రయాణానికి సిద్ధమై, దేవదాసు అయ్యగారితో

చెప్పితే, 'ఛార్లీ ఉండు' ఉదయముననే వెళ్ళవచ్చు అని అయ్యగారు చెప్తున్నా, ఛార్లెస్‌గారు ఉండకుండ వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిన తరువాత ఆయన గొడుగు, సంచి, డబ్బులు ప్రయాణంలో పోయినవి. ఆయన అయ్యగారు వెళ్ళవద్దన్నారు, వెళ్ళినందుకు నాకు తగిన శాస్తి జరిగినది అనుకున్నారు. ఛార్లెస్‌గారు తిరిగిరాగా, **ప్రయాణం బాగా జరిగిందా** అని అయ్యగారు అడిగారు. అయ్యగారు, ఛార్లెస్‌గారు నవ్వలేక ఏడ్వలేక (ఏమి చేయలేక) ఉన్నారు. అయ్యగారు శక్తిని, భక్తిని ఎవరూ గుర్తించలేరు. ఆయన చనిపోరు, బ్రతికే ఉంటారు అనే నమ్మకము ఆ కాలములోని వారికి ఉండేది.

అయ్యగారు రాజమండ్రిలో దానవాయిపేటలో ఉన్నప్పుడు (షారోన్ గృహములో) విశాఖపట్నమునుండి ఒక పాస్టర్‌గారు దేవదాసు అయ్యగారిని గురించి విని, ఆయనను చూచుటకు వచ్చినారు. వస్తూవస్తూ మార్గ మధ్యములో *అయ్యగారు అద్భుతములు చేస్తారట! ఏదో ఒక అద్భుతము* చూస్తే చూద్దాము అనుకుంటూ వచ్చినాడు. ఆయన అయ్యగారున్న ఇంటి గేటుదగ్గరకు రాగా, అయ్యగారే వెళ్ళి గేటు తలుపులు తెరచిరి. ఆయనే అయ్యగారు అని తెలియక ఆ వచ్చిన పాదిరిగారు అయ్యా! దేవదాసు అయ్యగారు ఇక్కడ ఉన్నారట ఎక్కడ! అని అడిగెను. బకెట్‌లో నీళ్ళు ఉన్నవి కాళ్ళు చేతులు కడుగుకొని వరండాలో బల్లపై కూర్చోండి, ఆ తరువాత ఆయనను చూద్దురుగాని అనిచెప్పి బైటికి వెళ్ళిపోయిరి. ఈ పాస్టర్‌గారు కాళ్ళు, చేతులు కడుగుకొని, గుమ్మముముందున్న బల్లపై కూర్చొనిరి. అయ్యగారివద్ద పనిచేసే వ్యక్తి బయటకు వచ్చి, మీరు ఎవరు? ఏ ఊరు? అని అడిగి, అయ్యగారిని చూచుటకు వస్తే, ఆ తలుపు తట్టుతీస్తారు అని చెప్పిరి. ఆయన తలుపు తట్టగా అయ్యగారే తలుపుతీసిరి. అయ్యా! మీరు ఇంతకుముందు బైటికి వెళ్ళిరి! లోపలికి ఏలాగు వచ్చిరి. నేను ముందు వరండాలో కూర్చున్నాను. నాకు కనిపించలేదు అని అడుగగా

అబ్బాయీ! నీవు దారి వెంబడి ఏదోఒక అద్భుతము చూపితే చూద్దామని వచ్చావుగదా! ఇప్పుడు చూసావుగదా! నీ ఆశ నెరవేరినది వెళ్ళు! అని అన్నారు.

*షరా:- దీనినిబట్టి అయ్యగారు హృదయాలోచనలుకూడా గ్రహించగల వారు అని తెలియుచున్నది.*

అయ్యగారు రాజమండ్రి దానవాయిపేటలో నుండగా జేగురుపాడునుండి ఒక విశ్వాసి అయ్యగారియొద్దకు వచ్చినారు. అయ్యగారియొద్దనున్న పాదుర్లను, చూచి పోయినవారము 'అయ్యగారు మా ఊరిలో మీటింగులు పెట్టినారు. దానికి మీ పాదుర్లు ఎవరు రాలేదని' జేగురుపాడునుండి వచ్చిన వ్యక్తి అడిగినాడు. అయ్యగారివద్దనున్న పాదుర్లు- పోయినవారము ఇక్కడే మీటింగులు జరిగినవి' అయ్యగారు మీ ఊరిలో మీటింగులు పెట్టలేదు అని అన్నారు. అప్పుడు ఆ విశ్వాసి అక్కడ మీటింగులో అయ్యగారు చెప్పిన ప్రసంగములు తారీఖులతో సహా తనవద్దనున్న నోట్‌బుక్‌లో చూపించారు. అయ్యగారు వద్దనున్న పాదుర్లు తమవద్దనున్న నోట్‌బుక్స్‌లో చూడగా, ఒకే తేది, ఒకే సమయము, ఒకే ప్రసంగము తేడా లేకుండా కనిపించినవి. అప్పుడు ఉభయులు కలసి, అయ్యగారియొద్దకు వెళ్ళి అడిగినప్పుడు, అయ్యగారు అబ్బాయీ! మీకు ఈ రెండు చోట్లు తెలుసు. నాకు ఒకే సమయములో ఏడు చోట్ల బహిరంగముగా ప్రసంగించగల వరము దేవుడు అనుగ్రహించినారు. దీనిని గురించి మీలోమీరు ఏమీ అనుకొనవద్దు అని సామాన్యముగా చెప్పిరి.

*షరా:- మనమైతే నాకింత గొప్పవరం ఉందని పేపర్లో ప్రకటించు- కొందుము. అయ్యగారు ఇంతగొప్ప వరమున్ననూ తన్నుతాను చూపించుకొనక దేవుని గొప్పతనమును ఆయన వరముద్వారా ప్రకటించిరి.*

# 8. బేతేలుగృహ అనుభవములు

## రెవ. యస్. సమూయేలుగారు:-

ఒకానొక సోమవార దినమున దైవజనులు బేతేలు గృహములో ఉండి, బి.ఎ. శామ్యేలుగారిని పిలిచి, అబ్బాయ్! చూచావా! అని అడిగారట. అప్పుడు వారు ఏమిటి అయ్యగారండీ! అని అడిగినప్పుడు, అయ్యగారు ప్రార్థనలోకెళ్ళి చూడుమనగా; ***"దైవజనుని హస్తము బేతేలు గృహమునుండి కాకాని స్వస్థిశాలవరకు చాపబడి ఉండుట చూచిరి."*** దైవజనులు అక్కడే ఉన్ననూ, ఆయన హస్తము కాకాని వరకు చాపబడి, అక్కడి రోగులను దీవించుట బి.ఎ. గారు స్వయముగా చూచిరి. ఇట్టి మర్మమైన అనుభవములను, అరుదైన దృశ్యములను దైవజనులు బేతేలు గృహములోనుండి, తన శిష్యులకు కనుపరచిరి. ఈ కాలములో సుజీవరాజు గారు అయన దగ్గరకు వచ్చారు. ఓ అడివి మనిషీ! ప్రభువు నిన్ను ఎక్కడికి పంపితే అక్కడికి వెళ్లు! అని చెప్పి, వారి తలమీద పత్రికల కట్టపెట్టి అయ్యగారు పంపించేశారు.

## రెవ. బి. చార్లెస్‌గారు:-

ఒకసారి ఛార్లెస్ గారికి భోజనమునకు అయ్యగారు డబ్బులిచ్చినారు. అవి ఆయన బేతేలు గృహములో కోటు జేబులో పెట్టుకొని కోటు మర్చిపోయి, హోటలుకు వెళ్లి భోజనం చేసి బయటకు వచ్చినప్పుడు గుర్తు వచ్చినది. వెంటనే హోటల్ మేనేజర్‌కు సాయంత్రం ఇస్తాను అని చెప్పివచ్చినారు. బేతేలు గృహమునకు రాగానే అయ్యగారు ఛార్లీ! హోటల్‌వద్ద ఏమి జరిగినది? అన్నారు ఏమి జరుగలేదు అయ్యా! అన్నారు. నీవు భోజనంచేసి డబ్బులు ఇచ్చినావా? లేదయ్యా అన్నారు. ఆలాగు చేయవచ్చా? తప్పుకదా! అని అయ్యగారు అన్నారు.

ఒకరోజు అయ్యగారు ఈజీ చైర్‌లో కూర్చొని ఛార్లీ ఇటు రా! పరలోకము పెండ్లికుమార్తె కొరకు ఎలా అలంకరింపబడినదో చూడు అన్నారు. ఛార్లెసుగారు కొద్ది సేపు చూచి ఎక్కడయ్యా అన్నాడు. గదిలోకి నీవు వెళ్లి కూర్చో! అని అయ్యగారు అన్నారు. ఆయన అలా కూర్చోగానే పరలోకపు శోభ అంతా ఆయనకు కనబడినది. ఛార్లెసుగారు గవినివారిపాలెంలో చిన్న సంఘమును ఏర్పరచి అయ్యగారి దగ్గరకు వెళ్లి, అయ్యా గవినివారి పాలెంలో సంఘము ఏర్పరచినాను అక్కడ అబ్రాహాము అనే ఒకతను ఉన్నాడు అని చెప్పుచుండగా, నాకు అతను తెలుసు, నేను అతన్ని చూచినాను అని అయ్యగారు అన్నారు.

## అయ్యగారి గదిలోని భూతము:-

అయ్యగారి గది దగ్గర ఎప్పుడూ ఒక భూతముండెడిది. అది అయ్యగారిని ఆవరించి మ్రింగివేయవలెనని ఆయనను వదలిపెట్టకుండా ఎదురుచూస్తా ఉండేది. అది ఆ స్థలమును వదిలిపెట్టుట లేదు. ఆ గదియందు మకాము వేసికొనినది. అది ఉండుట అయ్యగారికి క్షేమము. అది కట్టబడిన గాడిదవలె కట్టుకర్రకే కట్టబడియున్నది. గాని ఆ కట్టునుండి కదలిపోవాలని దానికున్నను, అయ్యగారు దానిని పోనీయకుండ కట్టివేసిరి. ఆయన కట్టు విప్పనిదే అదిఎట్లు పోవును. అది పోవుటకు పరుగెత్తుచుండగా గదిలోనే కట్టివేసినారు. అయ్యగారి అంతమును చూడవలెనని, అది సెలవు తీసికొని చూచిపోదామని వచ్చిన, భూతమును 'వచ్చినదానవు రానే వచ్చావు నా గదిలోనే ఉండు, నిన్ను కట్టివేస్తానని' అయ్యగారు కట్టివేసినారు. అయ్యగారు దానిని కట్టివేయుటకు కారణమేమనగా, ఉన్న దయ్యములకు, భూతములకు బుద్ధి వచ్చునని అయ్యగారు ఆ పని చేసిరి. కట్టబడిన గాడిద కట్టు విప్పితే పోవును గాని కట్టివేస్తే ఎట్లు పోవును? అయ్యగారు దానికి కట్టిన కట్టును విప్పిపొమ్మంటే పరుగెత్తుకొని పోవును.

Bible Mission HQ Guntur

## దయ్యములను ఆడించుట:-

అయ్యగారు గొప్ప ప్రార్థనాపరులు, ప్రభువు సన్నిధిలోనుండి ఆయనను చూచి, ఆయనతో మాట్లాడి **ఆ జయముతో సాతాను, దయ్యములపై అధికారముగల దైవజనుడు.** ఒకప్పుడు రాజమండ్రినుండి బండిపై కోరుకొండ తీర్థమునకు సువార్త చేయుటకు వెళ్లుచుండగా, దయ్యము ఆయనను పడవేయవలెననే ఉద్దేశముతో బండి చక్రమునకున్న సాయిమేకు ఊడదీసెను. ఆత్మనేత్రము కలిగిన అయ్యగారు బండి దిగి ఆ దయ్యమును పిలిచి, మేకు లాగివేసినావు గాన నీ వ్రేలు ఆరంధ్రములో ఉంచి త్వరగా బండిని తోలుమని ఆజ్ఞాపించెను. ఆ దయ్యము ఆలాగే ఆ రంధ్రములో తన వ్రేలుపెట్టి, బండిని కోరుకొండ గ్రామము చేరువరకు తోలుకొని వెళ్ళెను. అక్కడ ఆ బండివానితో చక్రము మేకు ఊడిపోయింది. చూచుకొమ్మని జాగ్రత్తగా వెళ్లుమని అయ్యగారు చెప్పెను. బండి ముసలాయన **'అయ్యో అయ్యగారిని పడవేసేవాడనే'** అనెను. పాపము అతనికేమి తెలుసు అసలు సంగతి.

మరియొక మారు అయ్యగారి దగ్గర పొడగాటి బలమైన యౌవనస్తుడు పరిచర్య చేయుటకు ఉండెను. ఆ అబ్బాయితో ఎప్పుడైన దయ్యమును చూచినావా? అని అడిగినారు. చూడలేదండి అయ్యగారండీ అన్నాడు. మరి దయ్యమును చూస్తావా? అని అంటే ఆ అబ్బాయి చూస్తానన్నాడు. ఒక సాయంకాలము ఆ అబ్బాయితో, అయ్యగారు– ఇదిగో రోడ్డుమీద వెళ్లిపోవుచున్న ఆ స్త్రీని నేను రమ్మంటున్నానని పిలుచుకురా! అని చెప్పినారు. ఆ అబ్బాయి గబగబా నడచి ఓ అమ్మా! అని పిలుస్తూ వెళ్లినాడు. ఆ అమ్మ దొరకలేదు. పరుగెత్తినాడు, ఆ అమ్మ నడుస్తూనే ఉన్నది. ఆ అమ్మ అందలేదు. అంతలో చీకటి పడినది, అబ్బాయి తిరిగి వచ్చివేసినాడు. ఆ అమ్మ సంగతి ఏమి ఆ అబ్బాయి చెప్పలేదు. అయ్యగారు అడుగలేదు. తెల్లవారి కాఫీ సమయమందు, అబ్బాయ్! ఆ స్త్రీ సంగతి చెప్పలేదే అని అడిగినారు. దొరకలేదండి అయ్యగారండీ అన్నాడు. సరే

దయ్యాన్ని చూచావా? అన్నారు. అయ్య బాబోయ్! చూచానండి అన్నాడు. ఆలాగు ఆయన జీవితమంతటిలో దయ్యాల్ని ఆట ఆడించారు. ఆయన రమ్మంటే అవి వచ్చినవి, పొమ్మంటే పోయినవి.

మూడు నెలలనుండి అయ్యగారి గది దగ్గర అయ్యగార్కి వినబడునట్లు ఒక పిట్టవచ్చి కూయుచున్నది. టైం ప్రకారము అది అయ్యగారు వింటున్నారు. ఒక దినమున గుంటూరు నిత్యజీవసన్నిధి కూటస్థులను పిలిచి, అయ్యగారి గదిలో ఉన్న 48మంది కూటస్థులతో ఈ పిట్ట 3 నెలలనుండి ప్రతి దినము ఎందుకు ఇట్లు వచ్చి కూయుచున్నదో ప్రభువును అడిగి తెలిసికొనుడని సన్నిధిలో పెట్టిరి.

అయ్యగారు ఎరిగిన ఒక ముసలి క్రైస్తవుడు పల్లెటూరినుండి తరచుగా వర్తమానము పనిమీద అయ్యగారివద్దకు వస్తుండేవాడు. ఆ ముసలివాడు జ్ఞాని కాదు. కాని నమ్మకమైన క్రైస్తవుడు. అతడు మే నెలలో మిట్ట మధ్యాహ్నం వేళ అయ్యగారి దగ్గరకు వచ్చి, వరండాపై పండుకొని ఆహారములేకుండా పాటపాడేవాడు. 'నమ్మితినయ్యా' అనేపాట పాడి ఆ తరువాత అన్నము వండుకొని తినేవాడు. ముందు అన్నముకాదు. ***ముందు పాట తరువాత అన్నము.*** పోయినవారము అయ్యగారు స్వంత అంశమునుగూర్చి పరుండి ప్రార్థించుచున్నను; ప్రభువు వచ్చి, చాలా సంగతులు మాట్లాడి, '1) నీ హృదయము దుఃఖముతో నిండియున్నదని నాకు తెలుసు. 2) **నేను నీకు *తోడైయుండుట మాత్రమేకాక, నీలోకూడా ఉన్నాను' అని చెప్పిరి.*** ఆ మాట చెప్పే సరికి అయ్యగారికి చాలా బలము వచ్చింది. ఆయన నాకు తోడైయుండుట, చుట్టు ఉండి కాపాడుట మాత్రమేకాదు నాలో ఉన్నారు నాలోనే బస చేయుచున్నారు; గనుక నేను ప్రభువును మోసినట్టుకాదా! అని సంతోషించి, బలము తెచ్చుకొనిరి.

Time is a small point in eternety. ***ఇది అయ్యగారికి 4వ తరగతిలో తెలిసింది.*** భాగింపబడని భాగమునకు బిందువు అని

పేరు. జామెంట్రీలో భాగింపబడును. దానికి క్షేత్ర గణితము అనిపేరు. అనగా భాగింపబడని భాగమునకు బిందువు అని పేరు. రాత్రి రెండు గంటలకు మెళకువ వచ్చి భూగోళమంతయు జ్ఞాపకము వచ్చి, "ప్రభువా ఇన్ని కోట్ల జనులను నరకానికి పంపుతారా! అని బాధతో అయ్యగారు ప్రార్థించారు.

## మామిడి తోట అనుభవము:-

అయ్యగారు బేతేలు గృహములో నివాసమున్నపుడు, గుంటూరునందు సమీపమున నున్న కాకాని తోటలో చాలా మామిడి చెట్లు ఉండేవి. ఆ తోటపూత పూసినప్పుడు రైతులు మామిడి పండ్లు కొరకు పాడుకొన్నారు. ఆ మామిడితోట పూత రాలిపోవుచుండగా, తోట పాడుకున్న రైతులు దండుగవచ్చునని రాజారావుగారి దగ్గర గోలపెట్టుచుండిరి. దేవదాసు అయ్యగారు కారుమీద వెళ్లి ప్రార్థనచేసి వచ్చినారు. తరువాత తోటపూత పూర్తిగా రాలిపోయినది. రాజారావుగారు దేవదాసు అయ్యగారి గదిలోనికి వచ్చిఏమియు చెప్పకుండా వెళ్లిపోయేవారు. కొన్ని దినములు గడిచిన తరువాత రాజారావుగారు గదిలోనికి వచ్చినప్పుడు, అయ్యా! తోటచూచినారా అని అడిగినారు. అయ్యా పూర్తిగా రాలిపోయి కాడలు ఎండి– పోయినవని చెప్పినారు. 'తోట చూచినారా?' అని అడిగితే, పూత పూర్తిగా రాలి– పోయినది చెప్పుచున్నారేమిటి అని అయ్యగారు అన్నారు. రాజారావుగారు వెంటనే కారువేసికొని వెళ్లిచూడగా మామిడి చెట్లుకు రెట్టింపుపూత పూయగాచూచి, ఆశ్చర్యముతో వచ్చి సంగతి అయ్యగారికి చెప్పిరి. అప్పుడు రాజారావుగారు కూటముపెట్టి, ఈ దివ్య అనుభవమును చెప్పి ప్రభువును స్తుతించినారు.

## దైవజనుని ప్రార్థనా పటిమ:-

శాంతిరాజుగారు లెటర్స్ చదువుతుంటే అయ్యగారు వింటుండేవారు. **ఆయన అలా వినటమే ప్రార్థన చేయటము.** ఒకసారి ఒక టెలిగ్రాం

వచ్చినది. విషయమేమనగా 'మా తమ్ముడు చనిపోయేలా ఉన్నాడు' అని అప్పుడు అయ్యగారు ఆ టెలిగ్రాంను కాల్చేయమన్నారు, కాల్చివేసిన వెంటనే మరొక టెలిగ్రాం ఆ అబ్బాయి బ్రతికాడని వచ్చినది. ఆ అబ్బాయిది బేతనియపేట, భీమవరం. ***అయ్యగారి ప్రార్థన స్విచ్‌వేస్తే వెలిగే లైటువలె పనిచేస్తుంది.*** అనగా జవాబు వస్తుంది. ఆయన్ని ముసలాయనని కొందరు చులకనగా చూసేవారు. ఒకసారి శాంతిరాజుగారు అయ్యగారి దగ్గరనుండగా కిటికిలోనుండి గాలి వచ్చినది. అయ్యగారి శరీరము బైటికి వెళ్ళిపోయినది, ప్రక్కమీద అయ్యగారు లేరు. కొంచెము సేపటికి మరలా గాలి వచ్చినది. తరువాత అయ్యగారి శరీరము మాకు కనబడినది. అయ్యగారు బైబిలు మిషను మాజీ అధ్యక్షులైన బెంజిమన్ అయ్యగారి పరలోక యాత్రకు ముందు ఇలా అన్నారు, 'ఇప్పుడే బెంజిమిన్, నేను పరలోకము వెళ్ళి వచ్చాము, బెంజిమన్‌తో మాట్లాడుతూ మాట్లాడుతూ పరలోకములో దించి వచ్చాను" అన్నారు. ఒకసారి గుంటూరు పట్టణములోని ఎ.సి. కళాశాల దగ్గరనున్న ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణము అప్పటికి ఇంకా జరుగుతుంది. అయ్యగారు– 'అబ్బాయ్ మీరు మెడికల్ కళాశాలమీదుగా రైలుపేట రావద్దు, జిన్నాటవర్ సెంటర్ మీదుగా రండి' అని కబురు పంపారు. అనగా బ్రిడ్జి దగ్గర ప్రమాదము జరుగబోతుంది అని. ఆ సమయములోనే బ్రిడ్జి కూలిపోయింది. అప్పుడే 11మంది చనిపోయారు, వారిలో ఒక ఇంజనీరుకూడ ఉన్నారు, అయ్యగారి మాట నెరవేరినది.

## మాయమైన బొల్లి మచ్చ:-

గుడివాడనుండి 5గురు స్త్రీలు ఒక యవ్వన బిడ్డను తీసికొని వచ్చిరి. ఆ బిడ్డకు చెవిదగ్గర బొల్లు మచ్చ గలదు. ఆ మచ్చవలన వివాహము జరుగుట లేదు. వారు అయ్యగారి గురించి విని, ప్రార్థన చేయించుకొనుటకు గుంటూరు బేతేలు గృహమునకు తీసికొనివచ్చిరి. అయ్యగారి గదిలో ఆయాచోట్లనుండి వచ్చిన వారుండుటవలన వారు సిగ్గుపడి, విషయము చెప్పకుండగానే, చూచి

వెళ్ళుటకు వచ్చినాము. ప్రార్థన చేయండని ప్రార్థన చేయించుకొని వెళ్ళిపోయిరి. గేటు దాటిన తరువాత 'నాకు ప్రార్థన చేయించలేదు' అని ఆ పిల్ల ఏడ్వగా, తిరిగి మరలా అయ్యగారి దగ్గరకు తీసికొని వచ్చిరి. మీరెందుకు మరలా వచ్చారని అయ్యగారు అడిగినప్పుడు, "ఈ అమ్మాయికి దవడమీద, చెవివెనుక మచ్చ ఉన్నందున ఎవరును వివాహమునకు ఇష్టపడుటలేదు. అందుకు ప్రార్థన చేయించుకొనుటకు వచ్చి, అందరిలోను ఈ విషయము చెప్పుటకు సిగ్గుపడి వెళ్ళితిమి. గేటు దాటిన తరువాత ఈ పిల్ల నాకు ప్రార్థన చేయించలేదు అని ఏడ్చినందున మరలా వచ్చితిమని" చెప్పిరి. అయ్యగారు అందుకేగదా ఆ అమ్మాయి దవడమీద చెయ్యివేసి వెళ్ళిరండని అన్నాను. అది అప్పుడే పోయింది కాని మీరు చూచుకొనలేదు' అని చెప్పగా, వారు వెంటనే చూసుకొనగా, ఆ మచ్చ కనిపించలేదు.

షరా:- వచ్చినవారు వారి అవసరములు చెప్పుకొనకపోయినా, వారి వారి అక్కరలను ఎరిగిన స్థితిగలిగిన వారు అయ్యగారు. దీనినిబట్టి వారికొరకు ప్రార్థించి, వారి అక్కర తీర్చగల స్థితి దైవజనునికి కలదు అని ఋజువు అగుచున్నది.

## 9. డా॥ ఆత్మనమ్మ గారితో సహవాసము

ఒరిస్సా రాష్ట్రములోని గంజాం జిల్లాలో అందరికి తెలిసిన, పేరుకెక్కిన డాక్టరమ్మగారు, ఆత్మనమ్మగారు ప్రభువు చెప్పగా, ఈమె తన ఉద్యోగము మానివేయగా, వారితో 4గురు స్త్రీలు ఏకీభవించిరి. వారిలో ఒకరు ఆమె అక్కగారు. ఆమె ఇంగ్లాండులో నున్నది. లండన్‌లో ఉన్న తన అక్కకు, ఆత్మనమ్మగారు- 'ప్రభువు నీ పేరు నాకు చెప్పారు. రా! అక్కా!' అని వ్రాసినపుడు, ఆమె లండన్‌నుండి వచ్చారు. పరంజ్యోతమ్మను కూడ ఆత్మనమ్మగారు రమ్మని రాశారట. అప్పుడామె అయ్యగారి దగ్గరకు వచ్చి, 'అన్నయ్యా ఆమె ఇలా రాశారు, వెళ్లమంటావా! అని అడిగితే, చెల్లీ తప్పకుండా వెళ్లు అని అయ్యగారు చెప్తే; అన్నయ్య నాకు అమ్మ ఉన్నదిగా! అమ్మను విడిచి ఎలా వెళ్లను అన్నప్పుడు

అయ్యగారు చెల్లీ! అమ్మను నేను చూస్తాను. నీవు తప్పకుండా వెళ్లు అని అన్నారట. వీరు ఐదుగురు సన్నిధి కూటము పెట్టుకొన్నారు. అప్పుడామె వ్రాసుకొన్నా నోట్సులన్నీ ఒక గదిలోపెట్టి seal చేసారు. ఆ 5గురు స్త్రీలేకాక, ఆ ఊరిలోనే 3 ఫర్లాంగుల దూరములోనున్న ఒక ఒరియా క్రైస్తవుడు డా॥ అనాం పాత్రోగారు ఉన్నారు. ఆయన భార్య రాజమండ్రి అమ్మాయి. అందుచేత వారికి, అయ్యగారికి బాల్యమునుండి స్నేహమున్నది. ఆయనకు తెలుగు బాగా వచ్చు. అయ్యగారు బరంపురం వెళ్లేటప్పటికి 1000 మంది తెలుగువారు అక్కడ ఉన్నారు. ఆ కూటముపేరు ప్రార్థనా కూటముకాదు, సన్నిధి కూటముకాదు. 'క్రీస్తు నీతి సంఘమని' ఆ కూటమునకు పేరు. అనాంపాత్రోగారు, ఆయన భార్యగారు ఈ కూటమునకు వెళ్లేవారు. వీరితో ఏడుగురు. సెలవు దినములలో అయ్యగారుకూడ వెళ్ళేవారు. 8మంది వెళ్ళారు. కూటమునకు వెళ్లగానే ప్రభువు వచ్చి, అయ్యగారిని చూచి, "కుమారుడా! నేను ఏర్పరచిన కుమారుడా! నేను పిలువగానే వచ్చివేసితివి. చాలా సంతోషము అని అన్నారు. అయ్యగారికి రాజమండ్రిలో పని ఉన్నందున 3 వారములకంటే ఎక్కువ ఉండేవారు కాదు. అయ్యగారి బస పాత్రో ఇంటివద్దే. ఆ కూటము వారు ప్రభువునడిగి ప్రభువు చెప్పేవన్ని వ్రాసికొనేవారు. కూటమునకు టైముకు వెళ్లాలి, ముగించాలి. సాయంకాలము 6గంటలనుండి ఉదయం 6 గంటలవరకు సన్నిధిలో ఉండవలసి వచ్చేది. అది ప్రభువే సెలవిచ్చేవారు. ప్రభువే ఆపివేసేవారు. మిస్సమ్మగారు ప్రభువు చెప్పేవన్ని నోట్సులో వ్రాసి, టిన్‌డబ్బాలోపెట్టి సీలుచేసేవారు. మన ఎదరనున్న గదికంటే అది పెద్దగది. ప్రభువు చెప్పగా వ్రాసిన పుస్తకాలన్నిటితో ఆ గది నిండిపోయినది. అయ్యగారి పుస్తకముకూడ అందులో ఉన్నది. ఆ 5గురు చనిపోయిరి గాని ఆ గదిని, ఆ గదిలోనున్న వ్రాతలు అన్ని రాకడవరకు ఉండునని వారు నిరీక్షించారు. వారు రాకడవరకు ఉంటామని నమ్మి, ఆ వ్రాతలు వారికి ప్రభువు అప్పజెప్పితే,

రాకడవరకు ఉంటవని భద్ర పరచిరి. ఆ వ్రాతలన్ని తీసి అచ్చువేస్తే తెలుగు బైబిళ్లు సుమారు 100 బైబిళ్లు అవ్వచ్చు. అవి లోకమంతటికి పంపాలి. ఆ పుస్తకమునకు దిట్టమైన ఖరీదు వెయ్యాలి. అని ప్రభువు చెప్పారు. ఈ మెంబర్లంతా భయపడ్డారు. ఆ ఖరీదు కూటస్థులు పెట్టుకోవాలి. రాబోయే ప్రజలు, అనగా ఇవి కొనబోయే ప్రజలు భాగ్యవంతులై ఉంటారనుకొన్నారు. వారికి ఇప్పుడున్నంత జీతములులేవు. 5గురు చనిపోయారు. పాత్రోగారి భార్య మహా భక్తురాలు. ఆమెకూడ చనిపోయారు. పాత్రోగారు వృద్ధాప్యములో లేవలేకుంటే వారి మంచము దగ్గరుండి, వారి తమ్ముడు గారు అయ్యగారికి ఉత్తరము వ్రాసిరి.

30 సం॥ల వరకు దేవుని సన్నిధిలో ఉండి, ఆయన చెప్పిన సంగతులు విని, వ్రాతలు వ్రాసినవారు చనిపోయారు. ఆమె డాక్టర్ ఉద్యోగము రిజైన్ ఇచ్చేటప్పటికి ఆమెజీతం 9 అణాలు. ఆ తర్వాత ఆమె లక్షలు ఖర్చుపెట్టి, ఒక దమ్మిడి అప్పు చేయకుండా చనిపోయారు. అయ్యగారు ప్రార్థనలో ఉంటుండగా మనీయార్డరులు వస్తే సంతకాలు చేసి పంపేవారు. ఆ సన్నిధిలో ఉంటే ప్రభువు చెప్పే మాటలువిని, నవ్వేవారు. ఆ సంగతి ఎవ్వరికి తెలియదు. ఆమెకు 7గురు నౌకరులు ఉన్నారు. ఆ 7గురికికూడ ఆ సంగతి తెలియదు. తలుపులు, కిటికీలు తీసే ఉంచేవారు. కారణం. గేటు దగ్గర ఇద్దరు దేవదూతలు కావలిగా ఉండేవారు. ఆ ఇంటి అద్దె. 45 రూపాయలు. ఆ ఇంటి యజమాని అమ్మా! 45రూపాయలు అద్దె ఇస్తారా? అని అడిగారు. 45 రూపాయలునకు 5రూపాయలు కలిపి 50 రూ॥లు ఇచ్చారు. 'ఊరికే అనుకున్నాను, ఇచ్చారు' అని ఆ ఇంటి యజమాని ఆశ్చర్యపోయాడు. అదే విశ్వాసము, దర్శనముకాదు. ***విశ్వాసము, దర్శనముకంటే గొప్పది.*** విశ్వాసముగలవారిని ప్రభువుచూచి సంతోషిస్తారు. జబ్బుగానున్న ముసలాయనకు 2,3 వారములనుండి అయ్యగారు తరచుగా ఉత్తరములు

వ్రాస్తున్నారు. అందులో ఆత్మనమ్మగారి పుస్తకములు అచ్చువేయించటానికి నీవే తగుదువు. నీవే మిగిలావు. ఆరోగ్యము కొరకు ప్రార్ధన చేయి. ఆలాగు వ్రాసినందుకు వారి తమ్ముడు చాలా సంతోషించారు.

"అన్నగారు మంచముమీద బాధపడుతూ ఉండి ఒకమాట అన్నారు. మీరు Captain of Salvation రక్షణయొక్క నాయకుడు". భక్తులందరు మరణము పొంది, రక్షణనుభవించి, మోక్షానికి వెళ్లారు. మిగిలిన వారు రాకడకు సజీవులుగా వెళ్తారు. పాత్రోగారు రక్షణకర్త, రక్షణకర్త అని రెండు మాటలు చెప్పి ప్రాణము విడిచారు. గనుక మోక్షానికి వెళ్లిపోయారు. ఆవ్రాతలు ఆ విధముగానే ఉన్నాయి. భక్తులు విచారపడవచ్చునా? అని అయ్యగారు అడిగారు. మీకుండే విచారముకంటే 1) బాల్యమునుండి స్నేహముగానున్న అయ్యగారికెంత విచారమో, 2) ఆ వ్రాతలను గురించి విచారము, 3) ఆయన వృద్ధుడు. వెళ్లిపోవలసినవాడే గాని వ్రాతలనుబట్టి ఉండవలసినది. అది నా విచారము. ఆ పని ఎవరిచేత ప్రభువు చేయిస్తారో! 4) బరంపురం కూటమువారు, 'రాకడవరకు ఉంటాము' అని నిరీక్షించినవారు వెళ్లిపోయారు. 5) సమస్తమును ప్రభువే సప్లై చేసారు. వారు అయ్యగారి వంక చూస్తున్నారు. వారు ఎవరిని ఒక్క దమ్మిడికూడ అడుగలేదు. ఈ కూటములోనున్న వారికి ఈ మాట చాలా కష్టము. అయ్యగారు కూడా 8 యేండ్లలో ఎవరిని అడుగలేదు. అప్పుచేయలేదు. కాని గుంటూరు వచ్చిన పిదప కోటాను కోట్ల పత్రికలు అచ్చువేయించినారు. దేవునియొక్క మహిమ. అయ్యగారు కారు ఎక్కేటప్పటికి డబ్బు వచ్చినది. ఇది దేవునియొక్క మహిమ. **దేవుని పనివారు ఇతరులయొక్క సహాయము కోరకూడదు.** మనుష్యులయొక్క సహాయము కోరకూడదు.

డా॥ ఆత్మనమ్మగారితో ప్రభువు ఏమి చెప్పిరి అనగా "మీ అక్కరలు మనుష్యులకు చెప్పక నాకు మాత్రమే చెప్పుడి" అన్నారు. వ్రాయబడిన ఈ వ్రాత అన్ని విషయములలో ఉన్నది. ప్రతి విషయములో నన్ను తప్ప ఎవరిని

అడుగకూడదు అని ప్రభువు చెప్పిరి. 9 అణాలతో ఆరంభించిన సేవ 9 లక్షలకు ముగించారు. అని పాత్రోగారు అయ్యగారితో చెప్పిరి. జీతగాండ్రకు అంత సొమ్ము ఉంటుందా? క్రిస్మస్ రోజున ప్రతి సంవత్సరము పండుగకు 3 కేకులు వచ్చేవి. మద్రాసు, కలకత్తానుండి వచ్చేవి అని చెప్పుకొని నవ్వుకున్నారు. ఒక దేవదూత వచ్చి చేయి చూపించింది. ఆ బీరువా తీయగానే కేకు కనబడింది. ఎనమండుగురు దానిని తిన్నారు. తాళము వేసే ఉంది ఏలాగు ఉందో! అనాంపాత్రోగారి ఇంటివద్ద ఒక బీరువా ఉన్నది. దానికి ఉన్న 4 గుండ్రపు కాళ్లలో ఒక కాలు విరిగిపోయినది. తుడిచివేసేటప్పుడు విరిగిపోయిన ఆ కాలునుకూడా తీసివేసినారు. అయితే, ఆ బీరువా పడకుండ ఒక దూత పట్టుకున్నది. అది చూచి ఆశ్చర్యపడకండి. మీకు కూడ అనగా సంపూర్ణ సమర్పణ కలిగినవారికి ఈ అనుభవము వస్తుంది. ఇది మీకొక బోధన పాఠము. అనాంపాత్రోగారి గురించి, అయ్యగారి గురించి, వారి వ్రాతలు గురించి ప్రార్థించండి.

# 10. దైవజనుని స్వీయ వృత్తాంతము

**దైవజనుని స్వానుభవము, సన్నిధి అనుభవము, సేవా అనుభవము:-**

1. 1918లో బరంపురంనకు 9 మైళ్ళ దూరములో సముద్ర తీరమునందున్న గోపాలపురములో డా॥ ఆట్మనమ్మగారి కూటములో త్రియేక దేవుడు నాకు ఆర్డినేషన్ అనగా పాదిరి పని ఇచ్చినారు. అందుకు బరంపురం ఒరియా చర్చికి పాస్టరుగా ఉన్న అనామ్ పాత్రోగారు నేటివరకు జీవించియున్నారు. ఈ సంగతి నేను కొన్ని సం॥లు అనగా 18 సం॥ల వరకు ఎవరికిని చెప్పలేదుగాని 1938లో నేను బైబిలుమిషను వెల్లడిలోనికి తెచ్చినప్పుడు చెప్పి, పాత్రోగారికి ఉత్తరము వ్రాస్తే ఆయన 'అవును నేను ఉన్నాను' అని ఇంగ్లీషులో జవాబు చెప్పిరి. అది నేను షారోను పత్రికలో ప్రచురించినాను. ఈయనకు గొప్ప దర్శన వరమున్నది. ఆ కూటములోని తక్కిన మెంబర్లందరును చనిపోయిరి. ఇప్పటికి ఆయన ఒక్కరే

బ్రతికియున్నారు. **(ఇది బాహాట దర్శనము)** షరా:– అయ్యగారు ఈ సంగతి చెప్పునప్పటికి ఆయన బ్రతికే ఉన్నారు. అయితే, నేటికి ఆయనకూడ చనిపోయిరి. అంతకు, కొన్ని సం॥లకు ముందు రాజమండ్రి లూథర్ మిషనువారు, నన్ను రాజమండ్రికి పాదిరిగా పిలిచినారు. నేను అంగీకరించలేదు. గనుక త్రియేక దేవుడు పిలిచి ఆర్డినేషన్ ఇచ్చినారు. ***సంఘము ఆర్డినేషన్ ఇస్తే సంఘమునకు మాత్రమే సరిపోవును. దేవుడు ఇచ్చాడు గనుక లోకమంతటికి సరిపోయేదైయున్నది.*** (దేవుడు లోకమంతటికి సరిపోయే ఆర్డినేషన్ ఇచ్చారు) కాబట్టి నేను బాప్తిస్మములు ఇవ్వవచ్చును. సంస్కారములు ఇవ్వవచ్చును. అన్ని దేశములలో ఎక్కడ బడితే అక్కడ ఊరూరికి, కోరినవారికి ఇవ్వవచ్చును. గాని పాదుర్లు ఉన్నచోట నేను ఇవ్వను. (యేసుప్రభువు) ఎప్పుడును ఎవరికిని బాప్తిస్మము ఇవ్వలేదుగాని ఆయన శిష్యులు ఇచ్చిరి.

**2.** నేను లూథర్‌గిరిలో బోధించేపనిలోను, రాజమండ్రిలో బడిపనిలోను, శానిటోరియం, బోధ పనిలోను ఉంటూ ఉండగా నాయొద్దకు తరచుగా కొందరు ప్రార్థనకు వచ్చేవారు. ప్రభువు ఈ కాలమందుకూడ కనబడును అనియు, పరిశుద్ధాత్మ బాప్తిస్మము క్రైస్తవులు పొందవలెననియు, దేవుడు విశ్వాసులకు పరలోక బాషా వరము దయచేస్తాడనియు, ప్రభువు రెండవ రాకడ అతిసమీపమనియు, స్వస్థతవరము దయచేస్తాడనియు, దర్శనములు దయచేస్తాడనియు; ఇటువంటి సంగతులు బోధిస్తూ వచ్చితిని. కొందరు అడిగిన స్వంత ప్రశ్నలకు ప్రభువు ఇచ్చిన జవాబులు చెప్పితిని. (ఇప్పుడు జవాబులు చెప్పుట మానివేసితిని). ఈ విషయము క్రమక్రమముగా మిషనెరీలకు తెలిసి, ఆయాసపడ్డారు గాని వారు నన్ను పిలిచి అడుగలేదు. అప్పుడు నేను వారిని అడిగితిని. ఏమనంటే **'మీరు నన్ను పిలిపించి అడగండి'** అని అర్జీపెట్టుకున్నాను. గాని రెండు సం॥ల వరకు నా అర్జీ మంజూరు కాలేదు. అటు తరువాత రెండవసారి ఖచ్చితముగా అడిగినాను. అప్పుడు కౌన్సిల్ వారు ఒక కమిటీ ఏర్పరచి పరీక్షించుకున్నారు ఆ కమిటీలో 18మంది ఉన్నారు. అప్పుడు 1938

సం॥ము జనవరి నెలలో లూథర్ గిరిలో మీటింగుపెట్టి నన్ను నా తరపున ఉన్నవారిని పిలిపించారు. పిలిచిన వారిలో ముఖ్యులు పెద్ద నైడార్ఫర్ దొరగారు, కోల్‌మన్ దొరగారు. ఆ మీటింగులో చాలా వివాదము జరిగింది. ఏర్పాటు చేయబడిన ఆ 18మందిలో 4గురే వచ్చిరి. వారిలో కోల్‌మన్ దొరగారు చెప్పినదేమంటే (ఆయన ఛైర్‌మన్‌గారు) "ఈ బోధ బైబిలులో ఉన్నది గాని లూథర్ మిషను సిద్ధాంతములలో లేదు" అని చెప్పిరి. అప్పుడు నేనన్నాను– "ఆలాగైతే ఇప్పుడు నా బోధలు లూథరుమిషను సిద్ధాంతముల గ్రంథములో చేర్చండి. నాకు సెలవిస్తే ఈ విషయములు మిషనంతా తిరిగి బోధిస్తానని" చెప్పితిని. ఛైర్‌మన్‌గారు ఒక మాట అన్నారు. 'మీరన్నది వల్లపడదు. మీరు వేరే మిషను పెట్టుకొని బోధించండి గాని లూథర్ మిషనులో బోధించకూడదు అన్నారు. మరియు మేము అందరి మిషనుల వారిని గౌరవించినట్లు మిమ్మును గౌరవించెదమన్నారు.

**3.** 1938 జనవరి చివరి వారము దేవుడు నా గదిలో పట్టపగలు గాలిలో 'బైబిలు మిషను' అను వ్రాతవ్రాసి నన్ను ప్రేరేపించిరి. కాబట్టి నేను బైబిలుమిషనును వెల్లడిలోనికి తెచ్చినాను. నా నిత్యవాదము ఏమిటనగా నేను చెప్పినవి వ్రాసి, నిజమో కాదో ప్రభువునడిగి తెలిసికొనండి. ఇదే నా వాదన. గాని వారెవరు అట్లు చేయలేదు. 'దేవుడు ఈ కాలములో ఎవరికి జవాబివ్వడు. ఎందుకంటే అన్నియును బైబిలులోనే ఉన్నవి' అని వారంటున్నారు. ప్రభువు ఫిబ్రవరి నెలలో **'రిజైన్'** అని ఇంగ్లీషు అక్షరాలలో వ్రాసి చూపించినారు. అప్పుడు నేను రిజిగ్నేషన్ వ్రాసి కమిటీకి పంపి అది అచ్చువేసి, మిషను అంతటికి పంచిపెట్టినాను. అప్పుడు చాలా ఆందోళన మిషనులో కలిగింది.

**4.** *'గాలిలో వ్రాయబడిన మిషను గనుక అది గాలికి కొట్టుకొని పోవును'* అని కొందరు ఆక్షేపించిరి. దానికి నేనిచ్చిన జవాబు ఏమంటే ***'గాలి ఏ మనిషి యొద్దకు వెళ్లునో, ఆ మనిషిని బైబిలు మిషనులోనికి***

***నడిపించుము'*** అని జవాబిచ్చాను. ఎందుచేతనంటే ఇది మనిషి బైలుపర్చిన మిషనుకాదు. ఇది దేవుడు బైలుపర్చెను గనుక అందరికి తెలియవలెను.

**5.** బైబిలుమిషనను తలంపు లేనివాడను, వృద్ధుడను, ఉన్నతవిద్య లేనివాడను, లూథరుమిషను అభిమానిని, బీదవాడను, అయోగ్యుడను, ఇల్లువాకిలి లేనివాడను, ఏకాకిని, రాబడి ఏర్పాటులు లేనివాడను, అయినను నాకు దేవుడు *బైబిలు మిషనును బైలుపర్చుట నాకే ఒక చిత్రముగా ఉన్నది.* మిషనెరీలు మిషను పెట్టవలసిందిగాని ఇండియా దేశస్థులు పెడితే అదికూడ మిషనవుతుందా! అని ఆక్షేపించిరి. తల్లి మిషను విడిచిపెట్టినాడు గనుక చనిపోయినప్పుడు ఆ శవాన్ని సూదికొండమీదవేసి, ముక్కముక్కలుగా చేసి కాకులకు, గ్రద్దలకు ఎగురవేసినా పాపములేదని చెప్పిరి. ఆయన కట్టిన కీర్తనలన్నీ లూథరన్ కీర్తనల పుస్తకములో ఉన్నవి గనుక మరియొక కూర్పులో అవి తీసివేయవలెను. ఎవరూ ఆయనవద్దకు వెళ్లకూడదు. ఆయనకు దెయ్యము పట్టినందువల్ల 'బైబిలు మిషను' పెట్టినాడని కొందరన్నారు. నాయందు అభిమానము, ప్రేమగల ఒక దొరసాని గుడిలో నాయొద్ద కూర్చోలేదు. స్వస్థిశాలలుకూడా పిశాచిపనులే అంటున్నారు. బూరతో ప్రసంగములు చేయుచున్నందువల్ల ***'కొమ్మ దాసులు'*** అని అంటున్నారు. జీతనాతములు లేక సువార్త చేయుచున్నందువల్ల వీరు అడుక్కొని తినేవారంటున్నారు.

**6.** బోధకుడగు నా తండ్రియు, ప్రార్థనా పరురాలగు నా తల్లియు, నాకు గతించిన తరువాత నన్ను పెంచి, చదివించి, ఉద్యోగమిచ్చి, గౌరవ ప్రేమలను కనపర్చిన మిషనును విడిచిపెట్టుటయు సుళువైన పనికాదు. మరియు జీతనాతములు లేకుండా పని ఆరంభించుట సుళువుకాదు.

**7.** Comeout as a Prince of an army. 'ఒక సైన్యముయొక్క యువరాజువలె వెలుపలకి వచ్చివేయి' అని వ్రాసి, ***ఆయననాతో కలసి నా గదిలోనుండి బైటకు వచ్చివేసెను.*** 'ఇన్ని మతములుండగా, 850 మిషనులు

ఉండగా, ఎంతోమంది ఉన్నత విద్యగలవారుండగా, ఎంతోమంది కోటీశ్వరులు ఉండగా, యోగ్యులు ఉండగా, ఆస్తిపరులుండగా, స్వజనులుండగా, బ్యాంకులో సొమ్ము, మిగతా సొమ్ములులేని నాకు బైబిలు మిషను బైలుపడెను. వారికే గనుక బైలుపరిస్తే అప్పుడే వ్యాపింపజేసి ఉందురు'. అప్పుడు నాయొద్ద 40 రూ/– మాత్రమే ఉండెను. అప్పుడు నా ఊహదర్శనమేమంటే 'ఈతరాని నేను సముద్రములో దూకుచున్నాను'. ఇదే నా దర్శనము. ఈ 18 సం॥లలో నేను ఏ ఒక్కరియొద్ద ఒక్క దమ్మిడీ అయినా అప్పుచేయలేదు. నేను కొన్నాళ్ళు బడిపని, కొన్నాళ్ళు వార్డెన్ పని, కొన్నాళ్ళు బైబిలు తరగతులపని, ఒక నెల పాదుర్ల తరగతిపని, ఆ తరువాత టూరింగ్ ఇవాంజిలిస్ట్ పని, ఆ తరువాత క్రొత్తగా రాజమండ్రిలో స్థాపించిన దగ్గుల ఆసుపత్రిపని, దగ్గుల ఆసుపత్రిలో బోధపని. ఈ ప్రకారము ***లూథర్ మిషనులో 46 సం॥లు చేసిన పనిని విడిచిపెట్టుట కష్టముకాదా?***

**8.** క్రొత్త మిషను వచ్చింది గనుక లూథరన్ మిషను పడిపోవును అని మిషనెరీలు భయపడి, మిషనులో ఉన్న పాదుర్లందరిని లూథర్‌గిరికి పిలిపించి, నన్ను గూర్చియు, బైబిలు మిషనును గూర్చియు వారికి చెడ్డ సంగతులు చెప్పిరి.

**9.** తుదకు నన్ను గురించిన ఈ చెడ్డ రిపోర్టు అమెరికాలోని బోర్డువారికి వెళ్లింది. వారు వీరికి జవాబు ఇచ్చిరి. ఏలాగంటే మీరు ఆయన యెడల మృదువుగా ప్రవర్తించి, నెమ్మదిగా ఆయనను తిరిగి తీసికొని రండని జవాబిచ్చిరి. అప్పుడు బోర్డువారు నన్ను చూచుటకు ఒక మిషనెరీని పంపించారు. గాని ఆయన నన్ను సమీపించనేలేదు.

1938 ఏప్రిల్ 24వ తేది ప్రభుభోజన సంస్కార దినము. అప్పటికి ఇంకా పంచాయితీవారు నా రిజిగ్నేషన్‌కు ఎండార్స్‌మెంట్ ఇవ్వలేదు. కాబట్టి నేనింకా లూథరన్ మిషను మెంబర్‌నే అని తలంచి గుడికి వెళ్లితిని. బల్లవద్దకు రావద్దని వారు నాకు ఆజ్ఞ పంపిరి. అప్పుడు నేను అక్కడ నా స్థలములో

కూర్చుండి, ప్రభువును ప్రార్థించుచుండగా, మొదట సమరయ స్త్రీ వచ్చి నీరు తోడుచున్నది. తరువాత పరలోకము నుండి ప్రభువు పాదిరిగారి దుస్తులు వేసికొని వచ్చి ప్రభు భోజనము నాకిచ్చిరి. నేను అది అందరికి చెప్పడము, మన పత్రికలలో వేసి వెల్లడించడము జరిగింది. అప్పుడు వివాదము లేచినది. ఇవ్వకపోవడము, మిషనెరీలు రానివ్వక పోవడము న్యాయమే అని అందరూ అన్నారు. నా తరపున ఉన్నవారు ఏమన్నారంటే ఆయనను బల్లయొద్దకు రానివ్వకపోవడము గొప్ప అన్యాయమే అన్నారు. ఎండార్స్‌మెంట్ ఆగస్టులో ఇచ్చినారు. గనుక నేను బల్లయొద్దకు వెళ్లితిని. అది ప్రభువుబల్ల, దేవుని బల్ల గనుక నేను వెళ్లాను గాని లూథర్ మిషనువారి బల్ల అని నేను వెళ్లలేదు.

**10.** అక్కడనుంచి తాడేపల్లి గూడెంలో నున్న ప్రత్తిపాడులో స్వస్థిశాలపెట్టి 4 నెలలు పనిచేసేటప్పటికి, అక్కడనున్న కేటకిస్టుగారికిని, మద్దా డేవిడ్, విజయరత్నంగారికిని కలహం వచ్చుట చేత అక్కడ పని ఆగిపోయినది. వర్షములు విస్తారముగా ఉన్నందువల్ల నన్ను కాపాడుటకు ప్రసాదరావుగారు ఏలూరు రమ్మన్నారు. గాని నేను ఒప్పుకోలేదు. అయినప్పటికిని బలవంతము మీద వెళ్లాను. అక్కడ 4 నెలలు ప్రకటన బోధించాను. కొంతమంది స్వస్థత పొందినారు. ఆ తర్వాత ఏలూరునుండి గుంటూరు వచ్చిన కొన్నాళ్ళకు నా గదిలో ఈ తెలుగు అక్షరములు కనబడినవి: 'యెహోవా నిన్ను ఇక్కడకు తీసికొని వచ్చినారు'.

**11.** 1949 మే 16న స్వస్థిశాల కాకానిలో స్థాపించబడినది. నేటి వరకు ఆ పని క్రమముగా జరుగుచున్నది.

**12.** దేవుడు నాకు మరియొకసారి ***'బైబిలు మిషనును పైకి ఎత్తి చూపించుము'*** అని తెలుగులో వ్రాసి చూపిరి. అప్పటినుండి ప్రతి పత్రికలో పేరు వేసికొంటున్నాను. ఇది నా నైజమునకు విరుద్ధము.

**13.** నాకు వచ్చిన పై వ్యాసములోని ప్రత్యక్షతలు ఏవంటే,

*1) బైబిలు మిషను, 2) రిజైన్, 3) కమౌట్ యాజ్ ఏ ప్రిన్స్ ఆఫ్ యాన్ ఆర్మి, 4) లార్డ్స్ సప్పర్, 5) బైబిలు మిషనును పైకెత్తి చూపించుము, 6) యెహోవా నిన్ను ఇక్కడికి తీసికొని వచ్చెను, 7) ఇండియా విల్ బికమ్ ఏ సెంటర్ ఫర్ సెండింగ్ గాస్పల్ మెస్సేజ్ టు ద హోల్ వరల్డ్ (సర్వ ప్రపంచమునకు సువార్త పంపుటకై ఇండియా ముఖ్యస్థానము), 8) క్రీస్తు మతాభివృద్ధి అను మాటలు నా గదిలో వ్రాయబడి ఉన్నవి. (పెద్ద అట్టమీద, పెద్ద అక్షరములతో). **అయ్యగారి బోధ కరకురాళ్ళు, ఇరుకుమార్గం కాని చివరకు అది చెఱకు రసమగును.***

షరా:- ***పత్రికల పని చేయుటయే నా ముఖ్యమైన పని.***

ప్రార్థన:- మేము మాట్లాడుకొన్న సంగతులన్నియు దీవించుము. మా పొరపాటులవల్ల, మా అజాగ్రత్తవల్ల, మా పాపములవల్ల సృష్టికి నష్టము కలుగుచున్నది. కాబట్టి మా ద్వారా సృష్టిని దీవించుము, కాపాడుము. మా ప్రభువా! నీవు మాకు తోడైయుండకపోతే ఏదియు నెరవేరదు. ***ప్రతి నిమిషము లోకము అవస్థలో నున్నది.*** ఏ నిమిషమందు ఏ అపాయము కలుగకుండా కాపాడుమని వేడుకొంటున్నాము. ఆమేన్.

**మిషను చరిత్ర - అనుభవ సాక్ష్యము:-**

మీకు ఇష్టములేనివి, చెవులకు కర్ణకఠోరమైన సంగతులు చెప్పనైయున్నాను. ఆలాగు చెప్పి, దేవుని చిత్తము నెరవేరుస్తాను గనుక నన్నెవ్వరు నిందించకూడదు. నిందించేవారు దాని ఫలితము తప్పకుండా పొందుదురు. ఇక్కడ వినే మంచి సంగతులు అవతలకువెళ్లి, తప్పుగా మార్చి చెప్పేవారుండవచ్చును. అట్టివారు దానియొక్క ఫలితము అనుభవించకమానరు. కాబట్టి జాగ్రత్తగా వినండి. చెప్పేటందుకు నాకు ఓపిక దయచేయుమని ప్రార్థించండి. నేను ఈ సంగతులు మనుష్యుల ఎదుట మాత్రమే కాదు, భూతముల ఎదుటకూడ, చెప్పుటకు సిద్ధము. భూతములు నామీద ఇదివరకే పగపట్టినవి గనుక ఇంకా పగపట్టును.

అయినప్పటికిని తప్పదు. రోటిలో తలపెట్టి రోకటి పోటుకు వెరవనా? అనే సామెత జ్ఞాపకము తెచ్చుకొనండి. ***బైబిలు మిషనులోనున్న మీరందరూ నావలె చేయవలెను.*** మన ఎదుట భూతములున్నవి చూడండి. దూతలుకూడ ఉన్నారు గనుక చూడండి. మనము చేసే ప్రార్థనలు భూతములను ఓడించుట మాత్రమేకాక అవి పారిపోయేటట్టు చేయాలి.

నేను పత్రికలలో ఏమి ప్రచురించినానో అది మీలో నా బదులు ఎవరైనా ప్రచురించినా మేము అని సందేహించేవారికి ఈ సంఘము మేము ఆయనవద్ద కూర్చొని విన్నామని చెప్పండి. నేను లూథరన్ మిషనులో మిగుల ఖచ్చితముగా నడచుటకు ప్రయత్నించిన పంచాయితీ నెంబరును, సెక్రటరీని, స్కూలు ఉపాధ్యాయుడను, మత ప్రచారకుడను, బైబిలు తరగతిలో బోధకుడను, పాదుర్ల తరగతిలో బోధకుడను. కాబట్టి తల్లి మిషనును విడిచిపెట్టుట నాకు ఇష్టముంటుందా? నా తల్లి ఇవాంజిలిస్టు. నా బాల్యమందే వారు చనిపోదుము అని చెప్పి చనిపోయారు. అప్పుడు లూథరన్ మిషనువల్ల పైకి వచ్చినాను. అటువంటి మిషనును విడచుట నాకు బాగుంటుందా? ఎవరికైనా బాగుంటుందా! అయినను పరలోకపు తండ్రి చెప్పాడు కనుక బైటికి వచ్చివేసినాను. ఆ మిషనువల్ల నాకేమియు కష్టము కలుగలేదు. 'ప్రేమతో, గౌరవముతో నన్ను చూచారు.

**[1]The minutes of the March 18-21, 1918 Meetng:** "Resolved, that we convey to Mr. M. Devadas our appreciation of his faithful labor during 25 years of service in our mission. He has quietly and patiently carried on his work of training our workers and his upright Christian character has made permanent impression upon the minds of hundreds of our boys that have associated with him. We hope that he will yet have many years of service in the vineyard of the Lord. Unanimously carried." [1]

---

1. From the Library Archives of the American Evangelical Lutheran Church, Chicago.

కాబట్టి విడచి వచ్చుటకు ఇష్టముంటుందా! నేను ఒకరితో చెప్పినాను. తల్లి మిషను విడిచిపెట్టి పరలోకపు తండ్రి మిషనులోనికి వచ్చినాను. ఎందుకంటే 1938వ సం॥ము జనవరి నెలలో ప్రభువు పట్టపగలు నా గదిలో

గాలిలో అచ్చు అక్షరములలో, తెలుగు అక్షరములలో 'బైబిలుమిషను' అని ముద్రించినారు. ఇంతవరకు మీరు విన్నారుగదా? ఫిబ్రవరిలో లూథరన్ మిషనును విడిచిపెట్టవలెను అని అక్షరములలో వ్రాసి చూపించిరి. అప్పుడు దిగులు పుట్టింది. అయ్యా! ప్రభువా! ఏలాగు? ఏమని రిజిగ్నేషన్ వ్రాయాలని ప్రార్థించాను. తెలుగు, ఇంగ్లీషులలో వ్రాసి, మిషనెరీలకు పంపినారు. అంతకుముందే నా దగ్గరకు వచ్చేవారికి క్రొత్త బోధలు వినిపిస్తున్నాను. అనగా లూథరన్ మిషనులో లేని బోధలు 1) భాషలు, 2) దర్శనములు చూచుట, 3) యేసుక్రీస్తు యొక్క స్వరము వినుట, 4) యేసుక్రీస్తు యొక్క వ్రాతలు చూచుట, 5) మందులేకుండా జబ్బులు బాగుచేయుట మొదలగునవి. అవి మిషనెరీల చెవిలో పడ్డవి గాని నన్ను అడుగలేదు. అయ్యో! ఎందుకాయన అట్టి బోధలు చేయుచున్నాడని ఆయావారి దగ్గర అన్నారు. అప్పుడు నేను 'అయ్యా! నన్ను పిలిచి అడగండి. నేను చెప్పుతాను అన్నాను,' గాని రెండేండ్ల వరకు అడుగనేలేదు. నేను జ్ఞాపకము చేసినాను. మన దేశీయ పాస్టర్లు, మిషనెరీలు, మిస్సమ్మలు కలసి ఒక్కొక్క మిషనుగా ఏర్పడి, తారీఖు చెప్పి లూథరుగిరిలోనికి రమ్మన్నాను గాని 18మంది రాలేదు. ఎందుకంటే అక్కడకు వచ్చి ఆయనను మేము ఏమని అడుగము? అని రాలేదు. గాని ఇద్దరు మిషనెరీలు (ఇద్దరు, ముగ్గురు మిషనెరీలు) వచ్చారు. అప్పుడడిగారు చెప్పవలసినవి చెప్పాను. అప్పుడు వీరు చెప్పినవి బైబిలులో ఉన్నవిగాని, లూథరన్ సిద్ధాంతములో లేవు అన్నారు. అలాగైతే ఏర్పర్చండి అని అన్నారు. అసలు వల్లపడదన్నారు. మేము మిషనంత తిరిగి బోధిస్తాము అన్నాను. వల్లపడదు అన్నారు. మీకు కష్టమైతే మాలోనుండి వేరై ఒక మిషను పెట్టుకొని బోధించుకోండి అన్నారు. అప్పుడు ఇతర మిషనుల వారిని గౌరవించినట్లు మమ్ములను గౌరవించెదమన్నారు. step out అన్నారు. (బైటికి వెళ్లండి అన్నారు).

అప్పుడు మార్చి నెలలో ప్రభువు కనబడి, 'Comeout as a Prince of an Army' అని చెప్పినారు. అప్పుడు ఏమి చేయాలి? అప్పుడు అయ్యగారి దగ్గర 40రూ/లు మాత్రమే ఉన్నవి. ఈతరానివాడు ఈదడానికి సముద్రములో దూకినట్టు దూకి యేసుక్రీస్తు మాటకు లోబడి వచ్చిరి. ఆ 40రూ.ల ఖర్చు అయిపోయెను. ఒక మిస్సమ్మ గారు 100రూ.లు పంపినారు. వారు ఏమని వ్రాసినారంటే God put in my heart that I should give you hundred rupees. అయ్యగారి కష్టము వారికి తెలియనే తెలియదు. అప్పుడు దేవుడు పోషిస్తాడనుకోవాలా! ఏప్రిల్ 24వ తేదీన సంస్కారము అందించుచుండగా వారు ఇవ్వలేదు. ప్రభువే ఇచ్చినారు. 'నేను మిషను విడచినాను గాని దేవాలయము ఎందుకు విడిచిపెట్టాలి?' అని దేవాలయములోనే ఉండిపోయిరి.. బైటికి వెళ్లలేదు. సంఘము ప్రభు భోజనము ఇవ్వనంటున్నారు. నాకు ఇవ్వమని ప్రార్థించగా యేసుక్రీస్తు వచ్చి ఇచ్చినారు. అంతకుముందు సమరయ స్త్రీ వచ్చినారు. దాని అర్థము ఇప్పటివరకు ప్రభువు చెప్పనూలేదు, అయ్యగారు అడుగనూలేదు. 1938వ సం॥ము మే 5వ తేదీన స్థాపించినారు. నేను తిరుగలేను గనుక విజయరత్నంగారిని తిరుగుటకు ఏర్పర్చినాను బాగా పనిచేస్తాడని. పెద్దగా ఏర్పర్చినాను గనుక అతడు ఏమి చెప్పితే అదే చేసినాను. అనగా పలాని ఊరు రమ్మంటే వెళ్లాను. పలాని పేపరు వ్రాయమంటే వ్రాసాను. పలాని మీటింగు చేయమంటే చేసాను. మార్చుటకు కాకుండా అన్నిటికి తానే పెద్దగా ఉన్నాడు.

## పత్రికల పని:-

ఈ మధ్య అయ్యగారికి ఒక చెడ్డ కల వచ్చింది. ఆ చెడ్డ కల ఏమిటంటే అయ్యగారు ఒక్కరే ఉన్నారు. అక్కడ రాజారావుగారు ఉన్నారు. ఇంకొక ప్రక్క ఈ మీటింగుకు వచ్చే మంచివారొకరున్నారు. అక్కడ నిల్లబడ్డ ఆయన,

రాజారావు గారితో 'అయ్యా పత్రికల పని ఆపుచేయండి' అని అన్నారు. ఆయన అయ్యగారితో ఏమన్నారంటే, 'మీరు కూడా మీ పత్రికల పని ఆపు చేయండి. ఆ పత్రికల వల్ల దుష్ట ఫలితములు కలుగుచున్నవని' అన్నారు. ఆ కలలో ఆ మాట విన్నప్పటినుండి, అయ్యగారి మనస్సులో పత్రికల పని మునుపటికంటే ఎక్కువ చేయాలని గొప్ప పౌరుషము వచ్చింది. గనుక దానికి వ్యతిరేకముగా పత్రికల పని ఎక్కువగా అయ్యగారు జరిగించారు. అపుడు ఆ పనిలోని విలువ మనకు తెలుస్తుంది.

## పత్రికల సేవ:-

అయ్యగారు పత్రికల మూలముగా అన్ని మిషనుల వారికి సన్నిధి కూటముల ఏర్పాటు, సలహాలు ఇచ్చినారు. బైబిలు మిషనుకే కాదు. అన్యులకు కూడా. తెలుగులో, ఇంగ్లీషులో వ్రాసి పంపిరి. మద్రాసులో బిల్లిగ్రహం దొరగారి కూటములో అయ్యగారి పత్రికలు పంచిరి. అయ్యగారు– 'ప్రభువు కనబడతారు, మాట్లాడతారు' అని 56 సం॥ల క్రిందటే బోధించితే అలాగా కనబడతారా! మాట్లాడతారా! అన్నారే గాని నిజము తెలిసికొన్నవారు కాదు. ఇప్పుడు 5 సన్నిధి కూటములున్నవి. కనీసము 500 కూటాలైన ఉండకపోతే ఏలాగు?

## సన్నిధి అనుభవము:-

అయ్యగారు లూథరుగిరిలో ఉన్నపుడు, 6సం॥ల వయస్సుగల ఒక అమ్మాయిని ఆమె తండ్రి తీసికొని రాగా, ఆ అమ్మాయిని అయ్యగారు చెయ్యి చాపమన్నారు. చేతిలో తేనె ఒకబొట్టు వేసి, అమ్మాయీ! ఇది చేదుగానున్ననూ, నాకివేయాలి అని అన్నారు. అది మందైనా తినాలి. ఇది తింటే నీకు జబ్బు పోవును. అని నీకు తెలిసినను తినాలి. తీరా చేతిలో వేసాను గనుక తినాలి అని అన్నారు. ఆ అమ్మాయి ఇన్ని మాటలు విని తినుటమానివేసెను. పైగా ఆమె తేనె ఎప్పుడును చూడలేదు, తినలేదు.

ప్రక్కనన్న తండ్రి తినమంటున్నారు. అయ్యగారు తినమంటున్నారు. ఇద్దరి మధ్యనున్న ఆ అమ్మాయి తప్పించుకొనగలదా? తనకిష్టము లేకపోయిననూ బలవంతముగా తినివేసినా, మందు తేనె తన నాలుకకు తగలగానే ఆమె తలపైకెత్తి, అయ్యగారి వంక చూచి నవ్వింది. ఆ తరువాత పూర్తిగా నాకి వేసింది. అలాగే మీరు సన్నిధి కూటమునకు వెళ్ళండని చెప్పితే లేదా స్వయంగా పెట్టుకోండి అంటే ఆ అమ్మాయి ఏలాగు ఏడ్చిందో అట్లే దైవ సన్నిధి రుచి తెలియనివారు ఇష్టపడరు, ఏడుస్తారు. అలవాటైతే ఆనందముతో అనుభవిస్తారు.

## దైవజనుని స్వానుభవము:-

ఓ ప్రభువా! పాతాళములో బోధలున్నవని కొందరు, ఉండవని కొందరు అంటున్నారు. ప్రభువు చెప్పినారు. అందుకు మేము వ్రాసినాము. బైబిలునకు మేము వ్రాసిన జవాబులకును మధ్య 850 మిషనులున్నవి. అందరు అన్ని రకములుగా బోధిస్తున్నారు గనుక తేడా వచ్చింది. అందుచేత మేము ప్రభువును అడిగినాము. ప్రభువు చెప్పినారు. 20 ఏండ్లకు ముందు 40 సం॥లకు ప్రభువు నా గదిలో నాకు ఇచ్చిన రాత్రి భోజనము తీసికొంటున్నాము. నేను ఇక్కడ నా గదిలో జబ్బుగానుండి సంస్కార భోజన సమయములో ప్రభువా! క్షమించు నాదే తప్పు నీవే ఇయ్యి అని నేను అనగా ప్రభువు పాదిరి డ్రస్సుతో ప్రభు సంస్కారము ఇచ్చిరి. 40 ఏండ్లనుండి చెప్పుచున్నాను. గాని ఎవ్వరు నమ్ముటలేదు. బైబిలులో ఎక్కడనున్నది అని అడిగిరి. నేను 1938 సం॥లో ఏప్రిల్ 24వ తారీఖున రాజమండ్రిలో ప్రభువు భోజనము పుచ్చుకొనుటకు గుడిలోనికి వెళ్లినాను. మిషనువారు నాకు కబురు పంపినారు. మీరు మిషనులోనుండి వెళ్లిపోయినారు. గనుక బల్లవద్దకు వద్దన్నారు. అప్పుడు ప్రభువు భోజనము పుచ్చుకొనుటకు, ఆ సమయములో అక్కడ ఉండాలా! బైటకు వెళ్లిపోవాలా? సాధారణముగా ఎవరు సిద్ధపడకుండా ఉందురో, వారు వెళ్లిపోవుదురు. నేను అలాగే

వెళ్లిపోవాలి. పొమ్మనప్పుడు వెళ్లక నిలిచి ఉంటే, ఈ బల్లమీద నున్నప్పుడు అందరూ నా వంక చూస్తారు. సంగతి తెలియదు. ఉన్నారన్న సంగతి సంఘస్తులకు తెలియదు. నాకు బిడియమున్నదా? లేదా? 'అయ్యగారియొక్క పొరపాటు ఏమనగా తల్లి మిషనును విడచి, తండ్రి మిషనులోనికి వెళ్లుట' అని ఆ కాలపువారు  అనుకొన్నారు.

నా తల్లి నాకు తెలియకుండా పాలు ఇచ్చినది. నాకు ఊహ తెలియనప్పుడు నా కొరకు ప్రార్థన చేసెను.  ఆ తల్లి మిషను నన్ను వృద్ధిలోనికి తెచ్చెను. ఆ తల్లి మిషను విడచిపెట్టితిని. గొప్ప నేరము ఆక్షేపించారు. దూషించారు. ముఖము రాల్చుకొన్నారు.  ప్రక్కన ఉన్న ఇద్దరు ప్రముఖులు గుడిలో ఉన్నారు. ప్రభు భోజనము ఇవ్వకముందు అయ్యగారి దగ్గరకు సమరయ స్త్రీ వచ్చినది. వచ్చి, బావిలోని నీళ్లు తోడుచున్నది. ఇది నా స్నేహితునికి చెప్పితిని. ఇది నా మొదటి అనుభవముకాదు. 40 ఏండ్ల నుండి ఉన్నదని చెప్పితిని.

దేవుని ఆలయములోనున్న నన్ను బల్లవద్దకు రావద్దు అని దేవుడు చెప్పలేదు. దేవాలయములోనున్న సంఘము చెప్పినది. గనుక నేను గుడిలోనే ఉంటాను అన్నాను. అప్పుడు ప్రభువు బల్లపై నుండి క్రిందికి దిగివచ్చినది. దానిమీద తెల్లని వస్త్రము ఉన్నది. రొట్టె, ద్రాక్షారసము ఉన్నది.  రెండవ సారి చెప్పుటలో  ఇంకా ఎక్కువ వచ్చును. అది నా తీరు, నా పద్ధతి. అప్పుడు ప్రభువు పాదిరి డ్రస్సుతో వచ్చారు. గాని నేను ఎరిగియున్న ప్రభువే. ***అప్పుడడిగాను ప్రభువును. నా ఒక్కనికే కనబడి ఇస్తే, ఏమి లాభము! ప్రభువా! అందరికి కనబడి, అందరికి ఇవ్వాలి అన్నాను. అప్పుడు ప్రభువు– 'వారు నమ్మరు' అన్నారు.*** 'చనిపోయినవారిలో ఒకడు వచ్చి బోధించినా వారు నమ్మరు' అని నేను చెప్పలేదా! అని అన్నారు సువార్తలలో అనేక అద్భుతములు చేసినను, సూచనలు చేసినను నమ్మరని చెప్పలేదా! మహాత్కార్యములను, సూచక క్రియలను చేసినను నమ్మనే నమ్మరు.

కపెర్నహూములో ఒక ప్రధానికి చెప్పలేదా! ఇప్పుడు అంతే. ప్రభువా! అలాగైతే ఏలాగు? అందరికి రాకడకు ముందు చెప్పి, సిద్ధపర్చు. నీవు కలుగజేసిన ఏ ఒక్క మనిషినైన నరకమునకు వెళ్లనియ్యక రెక్కపట్టుకొని *లాగు! లేదా నాలుగు వడ్డించు!* ప్రతి మనిషినొద్దకు నన్ను పంపించు. సైతానుకు, *దయ్యములకు* నేను చెప్పుతాను, నేను నచ్చజెప్పుతాను. నరకమునకు కూడా నన్ను పంపించు అన్నాను. అప్పుడు ప్రభువు- నా వాక్యములో నరకమున్నదని సైతానుకు, దయ్యములకు తెలుసు. గనుక నా వాక్యము కొట్టివేసికోనా? అన్నారు. 'ప్రభువా! నీ వాక్యము నీవు కొట్టివేసికొంటే తప్పేమిటి? నేను కొట్టివేస్తే తప్పు' అని అన్నాను. యెహెజ్కేలు గ్రంథములో 'దుష్టులకు నాశనము' అని వ్రాయించినావు. దానిప్రక్కనే ఇంకొకమాట వ్రాయించినావు. ఆ దుష్టుడు మారుమనస్సు పొందితే రక్షిస్తానని చెప్పినావు. అక్కడ నీ వాక్యమును కొట్టివేసికొనలేదా! అని గడుసు మాటతో అన్నాను. అప్పుడు దేవుని న్యాయము అగ్నివంటి కోపము వచ్చి, సొదొమ, గొమొర్రా పట్టణములను నాశనము చేసినట్లు, నన్నుకూడా నాశనము చేయవలసినది. ఆయన కృపా లక్షణము ఒప్పుకొనలేదు. అందుచేతనే ఈ సభలో ఈవేళ కూర్చొని, మాట్లాడుచున్నాను. లేకపోతే ఏమో! ఎక్కడ ఉందునో! నాకు ప్రభు భోజనము ఇవ్వకపోవడము న్యాయము అని లూథరన్ మిషనుకు తోచింది. గనుక ఇవ్వలేదు. తప్పులేదు. ఆ బల్ల ప్రభువు బల్ల. సెలవు ఇయ్యవలసినది ఒక్క లూథరన్ మిషనేకాదు. దానికి లూథరు మిషను బల్ల అని పేరులేదు. ప్రభువు బల్ల అని ఉన్నది. నేను ప్రభువు మనిషిని. దేవునివల్ల బైబిలు మిషను తెలిసికొన్న మనిషిని. నాకు హక్కు ఉన్నది. ***సంఘము ఇవ్వలేదు. గనుక సంఘముయొక్క నాయకుడైన యేసుప్రభువు ఇచ్చారు. ఏలాగైతేనేమి బాగా భోంచేస్తిని.*** అప్పుడు ప్రభువా! ఈ తేడా ఏమిటి అని అడిగితే, ప్రతి గురువారము సన్నిధి కూటస్థులు నన్ను అడిగితే నేను వచ్చి, చిన్న ప్రసంగము చేసి, ప్రభురాత్రిభోజనము ఇస్తాను. అలాగే ఇస్తున్నాను అన్నారు. అందరికికాదు, ఎవరి హృదయము సిద్ధముగా

నున్నదని.ఆయన దైవదృష్టికి తోస్తున్నదో అట్టివారికే ఇస్తున్నారు. రేపును కూటమునకు రమ్మని వచ్చి, సంస్కార భోజనము ఇమ్మని నేను అడుగనైయున్నాను. ఆయన వచ్చి ఇస్తారు. ***ఎంతమందికి ఆయన సంస్కార భోజనము ఇవ్వవలెనని ఇష్టమో చేతులెత్తండి. ఈ రాత్రి నావలె ప్రార్ధన చేయండి.*** ప్రభువా! నీ గడియకు నీవే స్వయముగా వచ్చి, సాక్షాత్తుగా కనబడి, మర్మముగాకాదు. ఆయనకు రాజమండ్రిలో ఏప్రిల్ 24వ తేదిలో బాహాటముగా ఏలాగు ఇచ్చినావో, ఆ ప్రకారముగా మాకును ఇమ్ము. ఈ రాత్రే నీ బసలో పట్టుదల ప్రార్ధన, పట్టు ప్రార్ధన, గట్టి ప్రార్ధన చేయండి ఇస్తారు.

## సన్నిధికూటముల నిగ్గు:-

నన్ను (అయ్యగారిని) ఇదివరకు ఎప్పుడూ ఎరుగని వారు, ఇప్పుడు ఇక్కడికి రండి. ఆడవారు కానీ, మగవారు కానీ, పిల్లలుగానీ పెద్దవారు గాని ఇక్కడకు వచ్చి నిలబడుము, గుంటూరు సన్నిధి కూటస్థులలో ఒకరినికూడ ఎరుగనివారు ఒకరు రండి. అనగా ఒకరు వచ్చిరి. ***ఆమె పేరు, ఇంటి పేరు, ఊరిపేరు; సన్నిధి కూటస్థులు 7 గం॥కు చెప్పితే ఈ సన్నిధి కూట వర్తమానములు రైట్ అని చెప్పవచ్చును.*** ఈ ప్రశ్నలు ప్రభువు అయ్యగారికి రాత్రి చెప్పిరి. వీటికి జవాబు సన్నిధి కూటస్థులు చెప్పితే వారి దర్శనములు నిజమని అనవచ్చును.

అయ్యగారు ఒక మీటింగు చేయుటకు వెళ్ళినపుడు, అందరినీ వెళ్లనిచ్చి, ఒకామె అయ్యగారి కాళ్లు పట్టుకుంది. ఆమె హాని చేయుటకు వచ్చింది. పొమ్మన్న పోనంటున్నది. ఎంత వెళ్లమన్నా వెళ్లక, అయ్యగారు పరిశుద్ధాత్మ  గనుక పోనియ్యనంటున్నది. ఆమె అంటుండగా ఆమె భర్త, ఆమెలో పరిశుద్ధాత్మ ఉండగా మీరు అట్లు వెళ్లగొట్టుట మంచిదిగాదన్నాడు. మరొకరు మీకు శాపం శాపం అన్నారు. పరిశుద్ధాత్మ ఆ విధముగా చేయదు. ఆమెలో ఉన్నది దయ్యం. ఆమె అయ్యగారిని దేవుడంటున్నది.

అయ్యగారికి తల్లి దండ్రులున్నారు. దేవునికి తల్లిదండ్రులులేరు. గనుక ఆలాగు అనుచున్నది భూతమే. వారి అజ్ఞానమే అట్లు అంటుంది గాని అది వారికి తెలియదు. వారు ఇంతకుముందు ఒక చెడ్డ ఉత్తరము వ్రాసిరి. వారికి అయ్యగారు ఒక మంచి ఉత్తరము వ్రాయవలెనని తలంచుచున్నారు. వారికొరకిపుడు ప్రార్థన చేయుదుము.

## సన్నిధి విలువ:-

ఒకసారి అయ్యగారిని పరిక్షాధికారిగా ఏర్పాటుచేసారు. పిల్లలజవాబు కాగితములు దిద్ది పంపాలి. అప్పుడు అయ్యగారు పొరుగూరు వెళ్లి, సన్నిధి కూటములో ఉండి తొందరపడుతున్నారు. అప్పుడు ప్రభువు ఏమన్నారంటే ***సన్నిధికంటే పని ఎక్కువా?*** అది మిషను పని, విధియైనప్పటికిని ***సన్నిధి కంటే అది ముఖ్యముకాదన్నారు.*** అయ్యగారు సన్నిధికూటములలోనే ఉండిపోయిరి. కొన్ని రోజులైన తర్వాత ప్రభువు- మిషనెరీలు నీ మార్కుల కొరకు కనిపెట్టుచున్నారని చెప్పగా, వెంటనే దిద్ది పంపివేసినాను. 6వ తేదీన దిద్ది పంపితే సరిపోతుంది గాని 8వ తేదినే దిద్ది, పంపుటకు ప్రయత్నిస్తే వద్దాన్నారు. ***ఎందుకంటే పంపవలసిన టైం ప్రభువుకు తెలుసును.*** అక్కడనుండి అయ్యగారు ఎప్పుడు బైలుదేరవలెనో ప్రభువుకు తెలుసు గనుక ఆ రోజు ఉదయము త్వరపడు నిమిత్తము ప్రభువు చాలా తొందరపెట్టిరి. బైలుదేరునప్పుడు నేనుకూడ నీతో వస్తున్నాను అన్నారు. గనుక చెప్పవలసినది ఏమనగా, ***అన్ని పనులకంటే సన్నిధి పనే ముఖ్యము.***

**స్వస్థత:-** కపెర్నహూములో రోగులు బాగవుట నిజమైతే, ఏలూరులో, ప్రత్తిపాడులో, గుంటూరులో, రాజమండ్రిలో బాగుపడుట నిజమే. ప్రతిపాడులో 5 వేలమంది ప్రజలు వచ్చి బాగయ్యారు అయ్యగారు బోధించుచుండగానే, రోగులు బాగయిరి. ఇవే నిజమైతే అనగా ***కపెర్నహూములో బాగవుట అనగా లోకములో అందరినీ బాగుచేయుట కూడ నిజమే.***

## మొదటి సన్నిధికూటము:-

ఇండియాలో మొదటిసన్నిధికూటము బరంపురములోని ఆత్మనమ్మ గారిది. దానిని గురించి నేను 1912 సం॥మున తెలుసుకొన్నాను. అంతకుముందు 1901 ఆగస్టు 21వ తారీఖునుండి ప్రభువు నాతో స్పష్టముగాను, ముఖాముఖిగాను, వ్రాతమూలముగాను మాటలాడిరి. అది అయిన తర్వాత 11సం॥లకు ఆత్మనమ్మగారి సంగతి తెలియగా, సెలవులలో అప్పుడప్పుడు ఆ కూటము చూచుటకు వెళ్ళితిని. అప్పుడు ఆ కూటస్థులు అయ్యగారిని నిందించిరి! నీకే ఈ అనుభవము ఉన్నప్పుడు అందరికి ఎందుకు చెప్పలేదు అని అన్నారు. అయ్యగారు స్నేహితులకు రహస్యముగా చెప్పిరిగాని పబ్లిక్‌లో చెప్పలేదు. ***ఎందుకంటే దొరలకు లేనిది ప్రభువు నీకు కనబడి నీతో మాట్లాడినాడా? అని అంటారు.*** పరిశుద్ధాత్మ తండ్రి, అయ్యగారు ప్రార్థన చేయునప్పుడెల్లా ఎక్కువ తక్కువగా ప్రతిరోజు, అయ్యగారు ప్రార్థనకు కండ్లు మూసికొంటే చాలు దగ్గరకు వచ్చి నిలువబడి ఉండును.

## హేడెస్సు అనుభవము:-

భూలోకములోని పాపస్థితులలో ఎన్ని అంతస్తులున్నవో ఆ అన్ని అంతస్తులు హేడెస్సులో ఉండును. ***ఒకదానికంటే ఒకటి చీకటిమయము. హేడెస్సులో ఒక పాదిరిగారిని అయ్యగారు చూచిరి. ఆయన ముఖ వర్చసులో ఎంతో వినయము, జాలిఉన్నది.*** అది చూడవలెనేగాని వివరించటానికి వీలులేదు. ఆయన బోధచేయుటకు వచ్చెను. ఏ తరగతికి ఏ టీచరు వెళ్ళి బోధ చేయవలెనో వారే అక్కడికి వెళతారు. ఆ పాదిరిగారి ముఖములో ఎంతో జాలి వినయము పాదుకొనగా, వారిని చూచి భూలోకములో అటువంటి మనిషిని చూచి ఎరగను' ఒక మనిషి అంటాడు. అయితే ఆ పాదిరిగారు ***'నాకు నెలకు 24 రూపాయలు జీతము ఇస్తావా'*** అప్పుడు

**పరదైసుకు వస్తాను'** అన్నారు. పరదైసులోని భక్తులందరు క్రీస్తులాగా ఉంటారు. ఇందులోని (హేడెస్సు) వారందరు దయ్యాలలాగా ఉంటారు. హేడెస్సులో మారుమనస్సుపొంది డ్రస్సు వేసికొని పరదైసుకు వెళ్లుటకు సిద్ధంగా ఉన్నవారినికూడ అయ్యగారు చూస్తారు. ఆ హేడెస్సులో అయ్యగారు ఎంతదూరంగా ఉన్నారంటే, ఇక్కడే ఉంటే వరండా క్రింద ఎంతదూరమో అంత దూరములో ఉన్నారు.

# 11. దైవజనుని ప్రత్యేక వరములు-అనుభవ అంతస్థులు

## దైవజనుని పరిశుద్ధత:-

అయ్యగారు Snuff లేదా Gray రంగు కోటు వేసికొనేవారు. దానికి రెండువైపులా జేబులుండేవి. కుడివైపు జేబులో అనేక చేతిరుమాళ్ళు ఉండేవి. అందులోనుండి ఒక రుమాలు తీసి, మూతికి అడ్డముగా పెట్టుకొని నెమ్మదిగా తుడుచుకొని, ఎడమ చేతితో దానిని ఎడమప్రక్క కోటు జేబులో వేసికొనేవారు. ఇక దానిని మరలా ముట్టేవారు కాదు. దేనిమీద మూతలేకపోయినా అయ్యగారు తినేవారుకాదు. బహు ప్రత్యేకమైన రీతిలో ఆయన గడ్డం గీయించుకొనేవారు. ఒకసారి రేజర్ పెడితే ఇక అది తిన్నగా క్రిందకు రావలస్సిందే. మరలా పైకి ఎత్తరాదు. అటూ ఇటూ కదలరాదు, ఆ చివరనుండి ఈ కడ వరకూ అలా ఒక ప్రయత్నంలోనే చేయించుకొనేవారు.

ఆయన మాట్లాడుతుంటే చాలు, మనసు బాగుపడేది. ఆయన మనసులోని విషయములు ఎత్తి మాట్లాడేవారు. అంత శక్తి ఆయనలో ఉండేది. అందుకే ఆయన దగ్గరికి ప్రజలు అలా వేచ్చవారు. తమ్ముసుతాము, గేటు దగ్గరే దిద్దుకొంటూ వారు వచ్చేవారు. ***ఎంత పెద్దమనిషైనా ఆయన దారిలోకి వచ్చేసరికి కరిగిపోవాల్సిందే.*** ఆయన నిత్యం పరిశుద్ధులతో మాట్లాడుతుండేవారు. దేవదూతల సంచారం ఆయన గదిలో ఉండేది. మోక్షముయొక్క కళ తన క్రియలో చూపించేవారు. **'బైబిలు మిషను చివరి**

***కాలంలో జర్మన్ సిల్వర్ వలె, రోల్డ్ గోల్డ్‌వలె ఉంటుంది'*** అని ఎక్కువగా చెప్పేవారు. కన్ను కనబడినంత కాలము అయ్యగారు బైబిలు మూయలేదు అనగా బైబిలు చదవటం ఆపలేదు.

వీరు అంతరంగ, బహిరంగశుద్ధిగలవారు. వీరు ఎప్పుడైనా, సొమ్ము ముట్టుకొనినయెడల ఫెనాయిల్‌తో లేక డెటాల్‌తో చేయి కడుగుకొనేవారు. దగ్గరనున్నవారుకూడ అలాగే శుభ్రము చేసికొనవలెను. ఇట్టి బహిరంగ శుద్ధి గలవారు, మరొకరు కనబడరు. అంతరంగశుద్ధిని గురించి చెప్పవలెననిన, తలంపులోకూడ చెడు తలంపు లేనివారు, అపరిశుద్ధ తలంపులేనివారు. సైతానుతో 'సాతానా! నీచేతనైతే చెడుతలంపు నాలో పుట్టించుము' అని సాతానును సవాలు చేసిన పరిశుద్ధుడు, భక్తుడు.

ఒక రాత్రి అయ్యగారు మిక్కిలిగా బాధపడుచుండగా అయ్యగారి దగ్గరకు ప్రభువువచ్చి నిలువబడెను. ఎందుచేత? హృదయం పరిశుద్ధముగా నున్నది గనుక ప్రభువా! బాధ తీసివేయమంటే మాట్లాడలేదు. ఆయనకు కావలసినది ఆరోగ్యమిచ్చుటకాదు గాని అయ్యగారి హృదయం శుద్ధిగా నుండుట.

## దైవజనుని కృతజ్ఞత:-

నాకు కొందరు బహుమానముగా, ద్రాక్షాపండ్లు, అరటి, బత్తాయిపండ్లు ఇచ్చుచున్నారు. ఈవేళ కూటస్థులు కొందరు కట్టుపంచెలు, తెచ్చినారు. ఈలాగు ఇచ్చే వారికి వందనములు తప్ప మరేమి ఇవ్వగలను. ఇచ్చారని నాకు సంతోషముండును. ఈ కళ సంతోషకళ. 'మీకు వందనములు' అని అంటే మీకు కళ ఉంటుంది. **నాకైనా, మీకైనా ఆ వేళ *కళ ఉంటుంది*** తర్వాత మరచిపోదుము. పరలోకమునుండి మనకు ప్రతి నిమిషము దీవెన వస్తుంటే ప్రతి నిమిషము వందనమని అంటున్నామా? అనలేము. పరలోక వాస్తవ్యులు, తండ్రిని ప్రతి నిమిషను స్తుతించుచున్నారు. అయితే ప్రతి నిమిషము దీవెన పొందుచూనే మనము ప్రతి నిమిషము

వందనము చేయుట సబబుగాలేదా! కాని మనము చేయలేము. కాని ఆ ఉద్దేశము కలిగి ఉండగలము. అదే నిమిష నిమిషము, స్తుతి చెల్లించుట క్రింద చెల్లును. అభిప్రాయము ఉన్నదిగదా అని, చేతులు జోడించి అనలేము గనుక ప్రతి నిమిషము దేవునికి స్తుతి చెల్లించుటనే సంతోషము ఉంటే, అదికూడ రైటే.

**అయ్యగారి సలహా:–** నాకు బహుమానము ఇచ్చువారికి ఒకమాట. వస్త్రాలు కొనుటకంటె, ఆ ***ఖరీదు డబ్బు పూర్వకముగా ఇస్తే నాకెక్కువ ఉపయోగము.***

## కోపపడని స్థితి:-

అయ్యగారు– 'నేనెవరినైన చూచి జాగ్రత్త అంటే వారు బ్రతుకరబ్బాయ్. మరి నేను ఆలాగు గద్దించను' అని అయ్యగారు అన్నారు. ఒకావె అయ్యా! మీ బోధలు బాగుండును. చేలో గోంగూర కోసికొనవచ్చునా? అని అడిగినది. చిన్నదైనా తప్పే, పెద్దదైనా తప్పే. ఇంటిలో ఏమిలేదు. ఎదురుగా గోంగూర కనిపించుచున్నది. అది కోసికుంటే ఆ రాత్రి గడిచిపోవును. అయినా అది ఆమెది కాదు గనుక అది తప్పే.

## దైవజనుని దీవెనక్రమము:-

కడప నుండి మరియమ్మ అనే ఒకామె మూడు సం॥ల క్రిందట వచ్చినది. ప్రార్ధన చేయమంది. అయ్యగారు బోధించారు, ప్రార్థించారు. ప్రార్థనలోనుండగా అయ్యగారికి తెలియకుండగా వీరిచెయ్యి పట్టుకొని నెత్తిమీద పెట్టుకొనెను. దీవెన అందుకొందా? నీళ్లు పోయనిదే, పోసినట్లే అనుకుంటే చెట్టు ఫలించునా! అయ్యగారి ఉద్దేశ్యములో దీవించవలెనని లేదు. 1) బోధించవలెను 2) ప్రార్థించవలెను. ఈ రెండు ఉన్నవి.

మూడవదికూడా ఉన్నది కానీ ప్రార్ధన అయిపోయిన తరువాత తండ్రీ! దీవించుము అని దీవించును గాని, ఆలాగు అనకముందే నా చెయ్యి పట్టుకొని నెత్తిమీద పెట్టుకుంది. అది దీవించడమా? కాదు. మరొక ఆయనకూడ అయ్యగారు ప్రార్ధన ముగించక ముందే చేయి పట్టుకొని నెత్తిమీద పెట్టుకొని రుద్దుకొని పోయారు. **అయ్యగారు దీవించ కుండానే చెయ్యినెత్తి మీద పెట్టుకొనడము క్రమముకాదు.**

## ప్రార్ధనకు సూదికొండ ఎక్కుట:-

అయ్యగారు పిల్లల బోర్డింగ్‌లో వార్డన్‌గా పనిచేసేటపుడు, పిల్లలు అందరూ నిద్ర పోయిన తర్వాత అయ్యగారు సూదికొండ పైకివెళ్ళి తనపని ముగించుకొని 3గం॥కు వచ్చేవారు. రాత్రి అంతా వారు ఆలాగున కొండపైకి ఎక్కి ఆయన సహవాసంలో గడిపేవారు. అపుడు అయ్యగారి దగ్గరుండే కొందరు పిల్లలు 'అయ్యగారూ! ప్రతిరోజూ మీరెక్కడికి వెళ్ళుచున్నారు? 'మేము నిద్రబోయేటపుడు చూస్తే, మీ బట్టలు అలా తగిలించే ఉంటున్నవి. అయితే మధ్యలో మెళకువ వచ్చి చూచినపుడు అవి కనబడుటలేదు, మరలా తెల్లవారుఝామునచూస్తే అలానే తగిలించి ఉంటున్నాయి. కాబట్టి మేముకూడ మీతో వస్తాము' అని అడిగినపుడు, అయ్యగారు– 'సూదికొండకు వెళ్తున్నానని' వారితో చెప్పి, తాను వెళ్ళే సమయమునకు వారినికూడ లేపుకొని వెళ్లి కాలి నడకను సూదికొండ ఎక్కారు. అందరూ అక్కడ కొద్దిసేపున్న తరువాత పిల్లలు అందరూ అలసట వలన నిద్రపోయారు. అపుడు ప్రభువు వచ్చి ఎందుకబ్బాయ్! ఈ చెత్త అంతా తెచ్చావు? అని అన్నారు. అపుడు అయ్యగారు చూస్తానన్నారు ప్రభువా! అందుకని తెచ్చినానన్నారు'. అప్పుడు ప్రభువు, అయ్యగారు చాలా సమయం మాట్లాడుకొన్నారు. ఈలాగున చిన్నపిల్లల కోరికనుకూడ తృణీకరించక వారికిని ప్రభువును చూపించవలెనని వారి మనసులో ఉండెడిది.

## జీవరాసులకు బోధించే అనుభవము:-

ఎవరైనా సరే నడుము కట్టుకొని ప్రాణత్యాగము చేసివస్తే, మృగములకు, పక్షులకు, జంతువులకు బోధించే భాష నేర్పించెదనని దేవదాస అయ్యగారు అన్నారు. అవి పొడిచేవైనా, చంపేవైనా వాటికి సువార్త చెప్పితే, వాటి స్వభావము మారిపోయి, వాటికి మనమీద ప్రేమ పుట్టును. ఆలాగు వాటికి చెప్పకపోతే, మనదే నేరము, మనదే అజ్ఞానము, మనదే మందము, మనదే పొరబాటు.

## పరదైసు అనుభవము :-

తాడేపల్లిగూడెంలోని ఏలేశ్వరములో పనిచేసిన భక్తిగల మిషనెరీ అమెరికాలోని లూథరన్ మిషను మీటింగు, చికాగో అనే పట్టణములో పై అంతస్థులో మేడమీద జరుగుచుండగా, దొరగారున్న ఇంటికి అగ్ని అంటుకొని, నిద్రలోనున్న స్మిత్ దొరగారు కాలిపోయి చనిపోయిరి.

షద్రక్, మేషక్, అబెద్నెగో అనేవారు అగ్నిలో ఉన్నప్పటికిని కాలలేదు. వేడి వారికి తెలియలేదు. అగ్నిలో ఉన్నను వారికి తెలియలేదు. ఆలాగే దొరగారికి తెలియలేదు. ప్రభువు వచ్చి, వెంటనే పరదైసుకు తీసికొని వెళ్లిపోయినారు. ఈ ***అనుభవము నా స్వంత అనుభవము కూడా అయియున్నది.*** ఎందుకంటే ఎప్పుడైనా నాకెక్కువ కష్టము వచ్చినప్పుడు అది కష్టమని నాకు తోచదు. ఆ తోచకపోవడము ఇట్టిదే. అది మీకును కలిగియుండును గాని మీరు చెప్పుటలేదు. స్మిత్ దొరగారుకూడ అపాయకరమైన స్థితిలో చనిపోయెను. కోటగిరిలో ఉన్న మరొక గొప్ప మిషనెరీ వేరొక అపాయములో చనిపోయెను. వారికి ఎందుకలాంటి మరణమును ప్రభువు రానిచ్చెను? ఈ ఇద్దరు భక్తులే. వారినింకా ఉంచితే,

నేను బయలుపరచబోవు బైబిలు మిషనును దిక్కరిస్తారు. బైబిలు మిషనును అయ్యగార్ని కూడ దిక్కరిస్తారు. వారిద్దరికి అయ్యగారు అభిమానే. అయినను బైబిలు మిషనునుబట్టి వారి మనసు మారిపోవును గనుక వారిని నా చేతులతో హేడెస్సుకు పంపడము ఇష్టములేక మరణము రప్పించినాను అని ప్రభువు చెప్పిరి.

రాజమండ్రిలో ఒక మిషనెరీ చాలాకాలము పనిచేసినాడు. రాజమండ్రిలో, భీమవరంలో చాలా కాలము చేసిన రెవ. డా॥ హెచ్. సి. స్మిత్ దొరగారు. ఇలా వ్రాయకపోతే వారియొక్క వివరము తెలియదు. ఇపుడు జరుగుచున్న ఈ మీటింగు సమయములో దర్శనములోనికి వచ్చి, వారు ఈ మాటలు చెప్పిరి: 'దేవదాసుగారు నా జతపనివాడు. (అయ్యగారి గుండె దడదడ లాడుచున్నది. ఎందుకనగా మీటింగులయొక్క ఆయుష్కాలము తక్కువ (అనగా మీటింగులో బోధించే బోధనాసమయం తక్కువ). ఈ విషయములన్ని విశ్వాసులకు ఎప్పుడు చెప్పాలి అని!) అయితే, ఇప్పుడు ఆయన పరలోకములో మాకందరకు అధికారి అయినాడు. మేము ఆయనచేతిక్రింద పని వారముగా ఉన్నాము!' (అయ్యగారు పరలోక భక్తులకు క్రొత్త సంగతులు బోధించుచున్నారు). అందుకే త్వరగా రమ్మని వారు పిలుచుచు ఉన్నారు.

షరా: ఈ దొరగారు నా యెడల ప్రేమయు, గౌరవమును గలవాడు. అయ్యగారు ఐదవ తరగతి చదువుచున్నప్పుడే, ఒక ఇంగ్లీషు ప్రసంగము, సభలో చదువుటకు ఆయనకు ఇచ్చినారు. అప్పుడే ఇంగ్లీషు ఏమి వచ్చును? అంటే, మిషనెరీకి అయ్యగారంటే అంత నమ్మకము. ఆయనకూడా అంతే. అయ్యగారిని. మొదటిసారి దొరగారు భీమవరం తాలూకా తీసికొని వెళ్లినారు. అయ్యగారు ఏమి చెప్పలేదు. ఊరకనే తీసికొని వెళ్లినారు.

## పరలోక భాష:-

ఒక విడ్డూర సంగతి. అయ్యగారి ప్రార్థనా కూటములోనికి పరలోకము నుండి ఒక పాతమిషనరీ వచ్చి, భూలోకములో నేనున్నప్పుడు భాషనుగూర్చి నాకు తెలిసినది కాదు. అది సంఘ ప్రారంభ కాలమువారికే అనుకొన్నాను. నేను చనిపోయేటప్పుడు, 'అందరు చనిపోయాను' అని అనుకున్నారు. గాని 15ని॥లు నా ప్రాణము నాలోనుండగా పరిశుద్ధాత్మవచ్చి, నాకు భాష నేర్పగా నాకు భాష వచ్చినది. అప్పుడు మోక్షమునకు వెళ్లగలిగితిని అని చెప్పిరి.

1923వ సం॥లో బెంగాల్‌లో ఒక పుస్తకము అమ్మారు. ఆ పుస్తకము పేరు 'దయ్యాలను వెళ్లగొట్టే పుస్తకము' ఆ పుస్తకమును చదవాలని అయ్యగారికి ఉంది. డబ్బులేదు. అయినా కబురు చేస్తే ప్రభువు వద్దన్నారు. 'అంత ఉపయోగకరమైన పుస్తకము ఎందుకు వద్దన్నారు ప్రభువు' అని అయ్యగారు అనుకున్నారు. ఒకవేళ కొంటే చాలా కీడు వచ్చియుండును. చీకటి రాజ్యములో అందరి పేరులకంటె అయ్యగారి పేరే ఘనత (Hit List).

### ప్రభువు ఇచ్చిన బలాదరణ:-

అయ్యగారు ప్రభువును ఒక ప్రశ్న అడిగినారు, ఒక మనవి చేసినారు. ప్రభువా! దుర్మార్గపు పనులు చేయువాడే, ఎక్కువగా పని చేస్తాడు. అతని బలమే ఎక్కువగా ఉన్నది. మాకు అంతకంటె ఎక్కువ బలము దయచేయుమనగా, అందుకు ప్రభువు అన్నారట! "లేదు లేదు. మీకే ఎక్కువ బలము ఇచ్చితిని" ప్రభువుయొక్క మహాశక్తినిబట్టి బలవంతులైయుండుడి. (ఎఫెసీ 6:10). అయ్యగారు మొదటిగా పనిలో ప్రవేశించునప్పుడు (ఎఫెసీ 6:10) పై వాక్యము ప్రసంగించిరి.

ఒక పంతులమ్మ అయ్యగారినొద్దకు వచ్చి, 'నాకు ట్రాన్స్‌ఫర్ ఇచ్చుటలేదు' ప్రార్థించుమని కోరింది. అయ్యగారు ఆమెను ఉపవాస ప్రార్థన చేయమన్నారు. ఆమె అయ్యగారు చెప్పినట్లు చేయగా, ఇంటికి వెళ్లేసరికి

ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చింది. ఆమె ప్రార్థనలో ట్రాన్స్‌ఫర్ మాత్రమేగాని, ఇతర అంశములులేవు. డబ్బు, పిల్లలు, ఇల్లు ఆమె తలంపులో లేవు. ఆ పంతులమ్మకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. చివరకు రోగులను బాగుచేయువరము వచ్చింది.

అయ్యగారినిగూర్చి 1) అవమానకరమైనవి, 2) చెడ్డ వార్తలు. ఇంకను ఎక్కువగా తీసికొనివస్తారని ప్రభువు అయ్యగారికి తెలియపరచినారు. ***ఒకదరినుండి అవమానములు ప్రవాహమువలె వస్తుంటే, ఇంకొక ప్రక్కనుండి వర్తమానములు ప్రవాహమువలె వస్తున్నవి.*** ఒకదరినుండి మనుష్యులవల్ల అవమానము వస్తూఉంటే వెనుక ప్రక్కనుండి భూతముయొక్క పని, బెదిరింపులు, దర్శనములు, స్వరములు వస్తున్నవి. ప్రభువు దగ్గరనుండి వర్తమానములు మాత్రమేగాక, మరొకదరినుండి అయ్యగారికి ప్రభువు పొగడింపులు పంపుచున్నారు. దయ్యము దగ్గరనుండి గాని, ***మనుష్యుల దగ్గరనుండిగాని అవమానములు, ప్రవాహమువలె వస్తున్నప్పుడు అయ్యగారికి అంత విచారము కాదుగాని ప్రభువు దగ్గరనుండి పొగడింపులు వచ్చేటప్పుడు ఎక్కువ విచారము, కన్నీరు అయ్యగారికి వస్తుంది.*** అయ్యగారికి సంబంధించిన ఈ నాలుగును అయ్యగారికేకాదు. బైబిలు మిషను విశ్వాసులందరికి కలుగును. తప్పకుండా కలుగును.

గంజాం జిల్లాలోని బరంపురమునకు అయ్యగారు వెళ్లినప్పుడు, ఒరియాదేశములో వారి పట్టణములో తెలుగువారు 1000మంది ఉన్నారు. ఆ తెలుగువారిలో ఒక సంఘము ఉన్నది. వారు వారియొక్క చిన్న గుడిలో అయ్యగారిని ప్రసంగము చెప్పవలెననిరి. అయ్యగారు– ప్రభువా! దేని గురించి చెప్పను! అని ప్రభువును అడుగగా 'నమ్మికను గురించి ప్రసంగించుము' అని ప్రభువు చెప్పిరి. అట్లే చేసిరి. గుడికి వచ్చినవారు 50 మందే. అది ఇంగ్లీషు బాప్టిస్టు మిషను.

## పరిశుద్ధాత్మ అనుభవము:-

అయ్యగారు పరిశుద్ధాత్మునికి ఒక ఉత్తరము వ్రాసినారు. మొదటిగా 'దైవాత్మ రమ్ము' అన్నారు. ఇటుల పిలిచినప్పుడు ప్రభువు అంతరంగము ఎలా ఉన్నది, అయ్యగారి అంతరంగము ఎలా ఉన్నది. అని ప్రార్థించగా, ప్రభువు Zivista అని ప్రార్థనచేసి, ఈ మాటపై కనిపెట్టుమనగా అయ్యగారు కనిపెట్టుట ప్రారంభించినారు. ఇందువలన పరిశుద్ధాత్ముని అంతరంగము అయ్యగారి అంతరంగములు తెలిసినవి. అనగా ప్రభువు అంతరంగమునకు అయ్యగారి అంతరంగమునకు ఫోన్ ఏర్పడినది. Zivista అను మాటకు అయ్యగారు 25 అర్ధములు చెప్పినారు. ***పరిశుద్ధాత్మ తండ్రి అయ్యగారి అంతరంగములోనికి వచ్చిన తరువాత కొంతకాలము అయ్యగారు లోకములో తనపని మర్చిపోయినారు.*** శుద్ధిచేసిన తరువాత రమ్ము అని పిలువవలెను. అప్పుడాయన తనువున వ్రాలును. ఆయన వ్రాలగానే ఎస్తేరురాణి సుగంధ ద్రవ్యములతో నలుపబడినట్లు. శ్రమలతో నలుపబడతారు. ఆయన చిత్తము, మన ప్రతి అవయములో జరుగవలెను.

## సంస్కారము అందుకొను విధానము:-

గుడి అయిన తరువాత నేను ఎవరినైనా చూచి ఈ ప్రశ్న వేస్తాను. ఏమనంటే మీరు ప్రభు భోజనము తీసికొన్నారా అంటాను. అప్పుడేమంటారు. తీసికొన్నామంటారు. మీరు తీసికొనేటప్పుడు ఇతర తలంపులు రాలేదా అంటాను. వచ్చినవి అంటారు. అయితే మీరు ప్రభు భోజనము తీసికోలేదంటాను. మరియొకరిని ప్రశ్నించుదును. ఇతర తలంపులు రాలేదా అంటాను. వచ్చినవి గానీ నేను ఈగలను, దోమలను తోలినట్లు తోలివేసాను అంటాడు. ఆలాగైతే నీవు పుచ్చుకొన్నట్టే అంటాను. మూడవ అబ్బాయిని అడుగుతాను. నీవు పుచ్చుకొన్నవా అంటాను. ఆ! అంటాడు. అయితే ఇతర తలంపులు రాలేదా అంటాను. రాలేదంటాడు.

అయితే నీవు నిజముగా పుచ్చుకొన్నావంటాను. ఈ మూడు సంగతులు ఈ ముగ్గురు ఒక భాగము. 3వ వాడు ఒక భాగము. ఈ 3వ భాగము, నేను వ్యక్తుల మీద వేసిన ప్రశ్నలు చివరి భాగం. *ఈ మూడు భాగాలు జ్ఞాపకము ఉంచుకొని ప్రభు సంస్కారపు విందులోనికి పరుగెత్తికొని రండి, ప్రభువే మనవిందు.*

## అంతరంగ సంస్కారము:-

దైవజనులైన అయ్యగారి అనుభవములు అనేకములు. ప్రభువుతో వీరి పరిచయము గొప్పది. ***ఆది సంఘకాలమునుండి ఎవరికిని అందని అనుభవములు వీరు అందుకున్నారు.*** ఆదివారము ఆరాధనలో మొదటి బల్లమీదనే వీరెప్పుడు కూర్చుండేవారు. ఒక సంస్కార ఆదివారము సంఘ పాదిరిగారు సంస్కారము ఆయనకు ఇవ్వము అని కబురు పంపిరి. అయ్యగారు అక్కడే కూర్చున్నారు. బైటికి వెళ్లలేదు. పరలోకమునుండి ఆయన ఎదుట బల్ల వేయబడెను. దానిపై రొట్టె ద్రాక్షారసము ఉండెను. ప్రభువే స్వయముగా వచ్చి అయ్యగారికి సంస్కారము ఇచ్చిరి. ఎంత గొప్ప అనుభవము! 'ప్రభువిచ్చే ఈ అంతరంగ సంస్కారము, నాకు మాత్రమేకాదు; అందుకొరకు కనిపెట్టే వారందరికి ఇస్తారు' అని బోధించారు. పత్రికలలోను ప్రకటించినారు. ఇది ప్రత్యేకమైన అనుభవము. నమ్మలేనివారు వీటిని గారడీ విద్య అన్నారు. ప్రభువు వారిని క్షమించునుగాక!

ఇదే అనుభవము ప్రభువు మరొకరికి ఇచ్చిరి. ఆమె బైబిలుమిషను విరోధి. అయ్యగారంటే ఇష్టములేదు. 40 దినములు ఆమె ప్రభువు మాటనుబట్టి ఉపవాసము చేసిరి. చివరి దినములలో ప్రభువే ఆమెకు సంస్కార మిచ్చిరి. ఇచ్చి వెళ్లిపోవుచుండగా ప్రభువా! నీతోనున్న ముసలాయన ఎవరు? అని ఆమె అడిగెను. ప్రభువన్నారు– ***ఆయన నేను బైబిలు మిషను బైలుపరచిన నా కుమారుడు యం. దేవదాసు*** అని చెప్పిరి. అప్పుడామె అయ్యో! ఆయనను దూషించినానని ఏడ్చెను.

## దేవుని స్వరము:-

ఒకప్పుడు ఇంటికి దూరముగా మధ్యరాత్రి, చీకటి రాత్రులలో అయ్యగారు ఉండవలసివచ్చింది. అప్పుడు స్వభావ సిద్ధముగా ఆయనలో కొంచెము దుడుకున్నది. ఆ దుడుకు వృద్ధి కాకముందు అనగా దుడుకు రాగానే, ప్రభువు ఒకమాట అన్నారు. ఆయన స్వరము వినబడినది, ఆయన కనబడలేదు. ఆ మాట ఏమిటంటే **'నేను ఎక్కడికి వెళ్ళినాను'** అనుమాట వినబడినది. **అప్పుడు దుడుకుపోయి బిడియము వచ్చినది.** నేను ఎక్కడికి వెళ్లాను? అని ప్రభువు నెమ్మదిగా అనెను. అది అయ్యగారి చెవిలోకి వెళ్ళినది. అట్టి స్వరమును వినే స్థితి, ఈ వరండామీది వారికి కలుగునుగాక! అట్టి స్థితి ఉన్న వారికి అది వృద్ధి అగునుగాక! ప్రభువు కనబడలేదు గానీ స్వరము వినబడినది. మీరు నా ఎదుట ఉన్నారు. అది నిజమేగానీ ముఖ్యముగా మీరు ప్రభుని ఎదుట ఉన్నారు. అన్నము తిన్నా, బసలో ఉన్నా, ఎక్కడ ఉన్నా ప్రభువు  మన ఎదుటనున్నారు అనే తలంపు మరచిపోకూడదు.

## సిలువ గుర్తు:-

గుడివాడ వాస్తవ్యుడు ఒకాయన పుస్తకము వ్రాసి అయ్యగారిని దిద్దమన్నారు. అయ్యగారు దిద్దినారు. అయితే అయ్యగారు ఈ మాటన్నారట. ఇప్పుడు దిద్దిన పుస్తకముపై సిలువగుర్తువేసి ఉంచండి. లేకపోతే దయ్యము ఎత్తుకొని పోతుందన్నారు. ఆయన నిజముగా దయ్యము ఎత్తుకుపోతుందేమో అని తలంచి ఆ పుస్తకముపై సిలువగుర్తు వేయించినారు. మరునాడు ఉదయమున లేచి చూస్తే ఉంది.అప్పుడు అచ్చు ఆఫీసుకు వెళ్లి అచ్చువేయించినారు. దయ్యమెత్తుకొని పోలేదు.

రాజమండ్రిలో ఒకాయన పుస్తకము వ్రాసినారు. అయ్యగారిని దిద్దమన్నారు. అయ్యగారుపై వ్యక్తికి చెప్పినమాటనే ఈయనకు కూడా చెప్పినారు. అయితే ఆయన ఈలాగన్నారు. దయ్యమునకు కాళ్లున్నవా? చేతులున్నవా?

ఏమి! అయితే **పెట్టెలో పెడతాను. పెట్టికి తాళము వేస్తాను. అప్పుడు ఏలాగు ఎత్తుకు వెళ్లగలదో చూస్తాను అన్నాడు.** సిలువగుర్తు వేయలేదు. అయితే ఇప్పటికి 30 సం॥లు అయినది. గాని ఇంతవరకు ఆ పుస్తకము అచ్చుపడలేదు. మొదటి వ్యక్తి విశ్వసించినాడు, నమ్మినాడు. సిలువగుర్తు వేసినాడు. గాని ఈ రెండవ వ్యక్తి నమ్మలేదు. కాబట్టి సిలువ వేయలేదు. అందుచేత ***ఈ 30 సం॥లకు కూడా ఆ పని జరుగలేదు.***

## దైవజనుని కవిత్వము:-

దేవదాసు అయ్యగారు ప్రార్థనచేస్తే చాలామంది బ్రతికారు. ఒక ఇంజనీరింగ్ చదివే అబ్బాయి డాబాయెక్కి క్రిందపడి చనిపోయాడు. అయ్యగారు గదిలోనికి తీసికొని వెళ్ళి, ప్రార్థనచేసారు, బ్రతికాడు. అయ్యగారు రాజమండ్రిలో ఉన్న కాలములో దానవాయి పేటనుండి గోదావరి నది వరకు ఎరుపు రంగుగల పెద్దజండాతో పెద్ద ఊరేగింపుతో అందరూ పాటలు పాడుకుంటురాగా క్రొత్తవారికి బాప్తిస్మము ఇచ్చేవారు. **"ఎవరు కావలె నాకు ఎవరు కావలె"** అనేపాట దేవదూతలు దిగివచ్చి పాడుతున్నట్లు ఉండేది. దేవదాసు అయ్యగారు బూరలు ఇచ్చి, చెట్లపైనుండి పాటలు పాడమనేవారు. ఒక బ్రాహ్మణుడు వచ్చి ఈ మాలవానికి కూడ కవిత్వము వచ్చిందా అన్నాడట! అది అయ్యగారికి చెప్పితే, అయ్యగారొక కీర్తనకట్టి పాడి వినిపించగా, ఆ బ్రాహ్మణుడు 'పాడినపాట, కవిత్వము, రాసిన పాటకాదు. అది ఆయన ఎవరో మహానుభావుడు, ఆయనను చూడాలని' వచ్చి చూచి నమస్కారము చేసాడట!

## దైవజనుని పాండిత్యము:-

శ్రీ. యం. దేవదాసు అయ్యగారు తన జీవితకాలములో అపారముగా తన శిష్యులతో అనేక గ్రంథములు వ్రాయించారు. వాటిలో అధికభాగము వచన గ్రంథములు, అవికూడా బైబిలు వ్యాఖ్యానాలు,

ఉపన్యాసములు, క్లుప్త ధ్యానములు. అంతేగాక దేవదాసు అయ్యగారికి దైవికముగా అద్భుతమైన కవితాశైలి అలవడినది. వీరికున్న కవితా వరాన్ని భకితో గీతోన్ముఖంచేసి వందలకొలది గీతాలు రచించారు. అయ్యగారు తన సంగీతాన్ని ప్రతివ్యక్తి పాడుకోగలిగినంత సులభశైలిలో ఉండే విధముగా తన పాటలను అమర్చారు. అయ్యగారి గీతాలలో ఎక్కువభాగము పరతంత్రత లేక భక్తి ప్రపత్తతను సూచిస్తాయి. ఎందుకంటే అయ్యగారి కీర్తనలన్ని ప్రభువే స్వయముగా అందించగా వాటిని అందుకొని రచించినవి గనుక. అది స్తుతిగీతమైనను, అనుతాప కీర్తనయైన, సమర్పణ గీతమైన వాటిమూల ఉద్దేశము ఏదనగా, భక్తుడు తనను తాను శూన్యపరచుకొని తన ఆశ్రయాన్ని దేవునిలో చూచుకొని తన్మయంతో గానాలాపన గావించుటయే.

దేవదాసు అయ్యగారు బైబిలులోని 23వ దా॥కీర్తన భావాన్ని “నాకేమి కొదువ” అనే కీర్తనగా రచించి, అందులో ‘తండ్రి తనివితీరా మేళ్ళనుగ్రహించి, దారితప్పినపుడు మన్నించి మళ్లీ సక్రమ మార్గములో నడుపుతాడని’ వ్రాసారు. ఆ కీర్తన చివరి చరణములో ‘దురితములుండే ఈ ధరణి నాకు నివాస స్థలము కాదని పరమ దేవుని మందిరమే నా ఇల్లు’ అని ప్రతి వ్యక్తి తన స్థిరనివాసాన్ని చూచుకొని మురిసిపోయే విధంగా వ్రాసారు. అదేవిధంగా తన మనస్సుకు భావాన్ని ప్రభోధిస్తూ 13చరణముల సుదీర్ఘ స్తుతిగీతం “దేవ సంస్తుతి చేయవే మనసా” రచించారు. మనము దేవునిని ఎందుకు స్తుతించవలెనో, ఈ కీర్తనలోని ప్రతి చరణములో ఒక కారణమును వ్రాసారు. రసవత్తరమైన దైవప్రేమకు ఈ కీర్తన ఒక మచ్చుతునక.

“నాకింత ప్రోత్సాహనందముల్ గల్గుట” అనే కీర్తనలో “సిల్వబడి జయించి లేచిన క్రీస్తు వలనేగదా!” అని నిండుమనస్సుతో తన సంపూర్ణ సమర్పణవల్ల కలిగిన ప్రయోజనాన్ని వర్ణించారు. అయ్యగారు ఈ కీర్తనలో సిల్వబడిన క్రీస్తు ఆయనలో భక్తిభావాన్ని కలిగించి తన కంఠాన్ని పాటలతోనెత్తి, తన పాపభారాన్ని మోసి, దేవునికి తనకు స్నేహము కలిపాడని,

క్రీస్తు సాధించిన రక్షణ కార్యాన్ని విశ్వసించినందువల్ల కలిగిన ప్రయోజనాన్ని వేనోళ్ల ప్రస్తుతించారు. క్రీస్తుప్రభువువారు చేసిన గొప్పకార్యాన్ని ఇంత స్పష్టముగా, ప్రపత్తి భావాత్మకంగా వ్యక్తంచేసిన కవులలో అయ్యగారు ముఖ్యులు. ఈ కీర్తనలోనున్న 5 చరణములలో దేనికదే ఒక సంపూర్ణకావ్యం. ఓపికగా ఎవరైనా ఒక్కొక్క చరణములోని భావాన్ని ఆధారం చేసికొని క్రీస్తు మరణ, పునరుత్థానములవలన చేకూరిన ప్రయోజనములను ఒక గ్రంథముగా వ్రాయవచ్చును. ఆయన భావనా పఠిమ అంత విశాలమైనది, ఆయన వ్రాసిన పదాల పొందిక అంత నిశ్చితమైనది. ఇది కేవలము పుస్తక పరిజ్ఞానమువలన కాక, పరిపూర్ణ దైవ సహవాసము, భక్తిభావ పరవశత్వంవలన జనించిన భావం అని చెప్పవచ్చును. ఆయన రచించిన కవితాసాహిత్యం తెలుగు క్రైస్తవుల గుండెలలో ఒక ధృవతార వంటిది. ఇంతగొప్ప మహనీయుని “జీవిత విశేషముల లోనికి” తొంగిచూస్తే, అదొక మహాగొప్ప ముగింపుకాని సజీవసాక్ష్యం.

## శరీర సంచార స్థితి:-

వీరు ప్రత్యక్షతలు, వరములు ఎక్కువగా గలవారు. ఎక్కువ ప్రార్థనా జీవితము, ధ్యానజీవితము, దర్శన జీవితము గలవారు. గనుక ఇతరులు అనుభవములో లేనివి, ఇతరుల నమ్మలేని అనుభవములు వీరి జీవితములో గలవు. దేవుడు సర్వవ్యాపి అను లక్షణము గలవాడు, నాకును సర్వవ్యాపకత్వము గలదు అని చెప్పిరి. అంతేకాదు ‘దేవుడు ఈ లక్షణము అందరకును ఇచ్చినాడుగాని వాడుకొనుటలేదు’ అని బోధించిరి. శరీర సంచార వరము, ఆత్మ సంచారవరములు గలిగిన దైవజనుడు. ఒక సువార్తికుడు రాత్రియందు అడవిలో దారి తప్పి తిరుగుచుండెను. వీరు అప్పుడు రాజమండ్రిలో నుండెను. రెండు నెలలు సువార్తికుడు అక్కడ పనిచేసి, రాజమండ్రి అయ్యగారి దగ్గరకు వచ్చెను. సువార్త రిపోర్టు అడిగి ఆ సంగతి అడిగెను. ఆ రాత్రి అయ్యగారే సిల్కు కండువా, లాల్చి ధరించి, చేతిలో గొడుగుతో వెళ్లి, ఆ సువార్తికుని

అడవిలోనుండి బైటకు నడిపించెను. ఆ సువార్తికుడు ఎవరనగా మురముండలో సేవచేసిన రెవ. టి. సంగీతరావుగారు. వీరు ఎక్కడనున్న వారినైనా చూచుదృష్టిగల దైవవ్యక్తి, దేవదాసు అయ్యగారికి ఇట్టివి అనేకములు గలవు. అయ్యగారు బైబిలు తరగతిలో 66 పుస్తకములకు ఉపోద్ఘాతము ఉపదేశించిరి. ఏ పుస్తకమును వివరించునపుడు ఆ గ్రంథకర్త వచ్చి, అక్కడఉండి, వారు చెప్పు వివరము సరిగా నున్నది అని చెప్పేవారు.

## స్వస్థిశాలల స్థాపన:-

వీరు గొప్ప ప్రార్థనాపరులు. ప్రార్థనవలన ఎన్నో అద్భుతములు చేసిరి కానీ వాటిని బైటకు కనబడనీయలేదు. మరణమగుదురని విడిచివేసిన వారిని ప్రార్థనచేసి బ్రతికించిరి. పాములు కరచి మరణావస్థలో నున్నవారిని ప్రార్థనవలన బ్రతికించిరి. శానటోరియంలో మరణస్థితిలో నున్నవారిని బ్రతికించి వారికి, రక్షణవార్తనందించి విశ్వాసములోనికి నడిపించిరి. పశువులకు ప్రార్థనచేసి బాగగుటకు తోడ్పడిరి. కలరాతో చనిపోవుచున్న గ్రామములకొరకు ప్రార్థించి, అనేకులకు ఆ వ్యాధి రాకుండా చావును ఆపుచేసిరి. వర్షములులేని ప్రాంతములలో ప్రార్థనచేసి వర్షము కురియునట్లు చేసిరి. పంటలు బాగా పండెను. ప్రజలు సంతోషించిరి. ***వీటన్నిటిలో తన్ను చూపించుకొనక ప్రభువునే చూపించి మహిమ పరచిరి.*** ఆయన బ్రతుకు కాలమంతయు ప్రార్థనవలన అద్భుతములు చేయుచూనే యుండిరి.

వృద్ధాప్యములో రాజమండ్రి విడిచి ఏలూరు, విజయవాడ, తాడేపల్లిగూడెం, భీమవరం, ఆకివీడు, గుంటూరు, చీరాల మొదలైన పట్టణములలో బసచేసి వాక్యోపదేశ కూటములు జరిగించిరి. తరువాత తాడేపల్లిగూడెం దగ్గరనున్న ప్రత్తిపాడు గ్రామములో పాకలువేసిరి. అయ్యగారు ఒక పాకలో మకాముండిరి. మరియొక పాకలో ప్రార్థనలు జరిపిరి. ప్రతి శుక్రవారము రోగులకొరకు ప్రార్థనలు చేయుట మొదలుపెట్టిరి. వేలకొలది రోగులు గ్రామముల నుండి పట్టణములనుండి

వచ్చెడివారు. అనేకులు బాగుపడినట్లు ఇతర మేళ్లు పొందినట్లు సాక్ష్యములు చెప్పిరి. కొంత కాలము ఆ పని సాగెను. తరువాత అయ్యగారు ఏలూరు పట్టణమునకు వచ్చిరి. అక్కడ తోటలో ప్రతి ఆదివారము రోగులైనవారికి ప్రార్థనలు మొదలు పెట్టిరి. వేలాది ప్రజలు ఏలూరు స్వస్థిశాలకు వచ్చుచుండిరి. అనేకులు శరీరాత్మీయ మేలుపొందిరి. కొంతకాలమైన తరువాత అయ్యగారు గుంటూరు పట్టణముచేరి, అక్కడ రక్షణ సంకల్పన వివరము, ప్రకటన గ్రంథ వివరము బోధించిరి. గుంటూరు దగ్గరనున్న కాకాని గ్రామములో రోగులకొరకు ప్రార్థనలు ప్రతి సోమవారము చేయుట మొదలుపెట్టిరి. ఈ పని 1949వ సం॥లో మొదలుపెట్టిరి. వేల సంఖ్యలో ప్రజలువచ్చి వాక్యము వినేవారు. తరువాత సాక్ష్యములు చెప్పేవారు. తరువాత పాస్టర్లు, తైలాభిషేకము చేయగా విశ్వాసముతో వెళ్లిపోయి మేలుపొందేవారు. ఈ పని నేటివరకు జరుగుచూనేయున్నది. ***కాకాని తోటలోనే ఏ వారము ఆగకుండా ఈ పని జరుగుచున్నది. ప్రభువునకే స్తోత్రములు.*** మహిమ కలుగునుగాక!

భూలోకములో, పరలోకములో, పాతాళలోకములోనికి ప్రభువు నన్ను తీసికొని వెళ్లుచున్నారు. నేను వెళ్లుటలేదు. ఈ దినము ఈ మీటింగుకు రావటము నాకు ఇష్టములేదు. కారణము కారు ఎక్కుట, దిగుటలో గుండె కదలి కడుపులోనికి జారినట్లనిపించి, నా శరీరమంతయూ వణకుచున్నది. చంటిబిడ్డను ఎత్తుకొన్నట్టు నన్నిద్దరు ఎత్తి కారులో పెడుతున్నారు. ఇది వృద్ధాప్యమువలన జరుగుచున్నది. ఇట్టిస్థితిలోనున్న నేను దేశ సంచారము చేయలేను అని ఈ రీతిగా ప్రభువు నన్ను తీసికొని వెళ్లి, పనిచేయించుచున్నారు. నాకు కునికిపాట్లు వస్తున్నవి. దీనిలో ప్రభువు నన్ను తీసికొని వెళ్లుతున్నారు. నేను కుర్చీలో ఉన్నప్పుడు, భోంచేయునప్పుడు, ప్రసంగించునపుడు, ప్రభువు నన్ను తీసికొని పోతున్నారు. ***ఆయన శక్తికి ఏమి ఆటంకము.*** నేను క్రమముగా

అసలు పనిలోనికి, అసలు గదిలోనికి, అసలు జ్ఞానములోనికి వస్తున్నాను. అది నాపనికాదు. నా వశము కాదు, నా మిషనుకాదు గాని పరలోకములోని దేవుని ఏర్పాటు. అది లేకపోతే భూలోకములో ఏమియు జరుగదు.

ఒక పల్లెటూరిలో ఒకరు అయ్యగార్కి చందా పంపిరి. (దేవుని సేవకునికి అని అన్నారు). ఆ చందా తెచ్చిన ఆసామికూడా దేవుని సేవకుడు గనుక నేనుకూడా దేవుకి సేవకునే గదా! అని తాను తెచ్చిన చందాను జేబులో వేసికొని, అసలు అయ్యగారికే ఇవ్వలేదు. ఇది అపరాధము. **దొరకగా దొరకగా కల్దీయులమధ్యను కల్తీలేని అబ్రాహాము అను వజ్రము దేవునికి దొరికెను. అట్టి నమ్మకమును మనము సంపాదించుకొనవలెను.**

1948వ సం॥ము శ్రీ రావుసాహెబ్ జె. రాజారావుగారు నన్ను గుంటూరులోని వారి స్వగృహమునకు పిలిచినారు. నేటివరకు నేను ఆయన సంరక్షణలోనే ఉన్నాను. 'యెహోవా నిన్ను ఇక్కడికి తీసికొని వచ్చినాడు' అను మాటలు ఒకనాడు గాలిలో కనబడినది. దేవుని కృప వలన నేటివరకు ఇక్కడ రోగుల ఆరోగ్యము నిమిత్తమైన స్వస్థిశాల పని అద్భుతకరముగా జరుగుచున్నది. నేను వృద్ధుడను, అనారోగ్యవంతుడనుగా ఉన్నందున, ఓపిక తక్కువగా ఉన్నందున, తగిన సహాయకులు లేనందునను (బైబిలు మిషనును పైకెత్తి చూపించుము) అని ప్రభువు చెప్పిన మాటను నెరవేర్చలేక దుః ఖించుచున్నాను. ***అయినను ఇది నేను ఆలోచించిపెట్టిన మిషనుకాదు. దేవుడు పెట్టిన మిషను గనుక దీనిని ఆయనే సాగించును.***

## సూక్ష్మ గ్రాహి:-

సుమారు 30 సం॥ల క్రిందట అయ్యగారు అమెరికా పేపరులో ఒక సంగతి చదివిరి. అది ఏమనగా యేసుప్రభువు పుట్టినప్పుడు అది మొదటి శతాబ్దము. మనది 20వ శతాబ్దము. శతాబ్దము అనగా 100 సం॥లు. అయితే కొన్ని వందల సం॥ల క్రితం భూమిలోని రాళ్ళమీద వ్రాయబడిన వ్రాత, ప్రభువు అయ్యగారికి చూపించిరి. వ్రాసినవారు హెబ్రీ కవి.

సిరియాబాషలో అవి వ్రాయబడగా, ప్రభువు వాటిని తెలుగులో అయ్యగారికి చూపిరట. అప్పుడు– ఆలాగు చెప్పుట ఎందుకు ప్రభువా! ఆ రాళ్ళు తీసి కడిగి చూపరాదా అని అయ్యగారు అడిగిరట. అనగా వాటిని వెల్లడిలోనికి తీసుకురావచ్చుకదా! అని అడిగినపుడు; అటువంటి పని చేయుటవలన రక్తపాతము జరుగును. ఏలాగనగా పలాన చోట రాళ్ళున్నవని చెప్పితే, బ్రిటీషువారు తవ్వటానికి పూనుకొందురు. మా దేశములో త్రవ్వకూడదని, ఆ రాళ్ళు ఉన్న దేశస్థులు అంటారు. ఎన్ని చెప్పినా వినరు. అందువలన యుద్ధము జరుగును. అందువలన ***త్రవ్వడము ఎందుకు? ఆ బిడ్డలు చావడమెందుకు అని ప్రభువు అన్నారట.***

## సైతానును గూర్చిన ప్రార్థన:-

యం. దేవదాసు అయ్యగారు 40 సం॥ల క్రిందట చేయకూడని దేవుని న్యాయ గుణమునకు వ్యతిరేకమైన ఒక ప్రార్థన చేసిరి. అది ఇప్పుడు మరలా చేసిరి. 40 సం॥ల క్రితము చేసిన ప్రార్థన ఏమంటే, 1. సైతానుకుకూడ రక్షణ ఇవ్వమని ప్రార్థించిరి. దానివల్ల సైతానుకు మోక్షమిస్తే దయ్యములకు కూడా రక్షణ ఉండును. నరకమునకు పోవలసిన నరులకు (దుష్టనరులకు) రక్షణ ఉండును. అప్పుడు ఇక నరకమే ఉండదు.

అప్పుడు చేసిన ప్రార్థనకు ఇప్పుడు ఒక రవ్వ ఎక్కువ చేర్చిచేసిరి. అదేమంటే సైతానును భూమిమీదకుగాని, మోక్షమునకుగాని తీసికొని రావద్దు. గాలిలోకములో ఎక్కడో ఒక మూల కటకటాలలోపెట్టి, అక్కడేనుంచుము. సరిహద్దులుంచుము. (లబ్బా సాహెబ్‌కు గవర్నమెంటువారు సరిహద్దులు ఏర్పర్చినట్లు). ఆలాగే దయ్యములకును అనగా సైతానుకు, దయ్యములకుకూడా ఏ సంబంధములేకుండా వాటినికూడా గాలిలో ఒక ప్రక్కపెట్టి, కటకటాలు నియమించి ఉంచుము. బాధవద్దు, సుఖము,

మోక్షమువద్దు. ఈ సైతాను సంబంధికులగు నరులకుకూడా సైతానుతోను, దయ్యములతోను, సంబంధము లేకుండా భూమిమీద ఎక్కడో ఒకచోట, ఏదోఒక దేశములో కటకటాలు ఏర్పర్చి, సరిహద్దులు ఏర్పాటుచేసి ఉంచుమని ప్రార్థించిరి.

## నరకము తీసివేయుమనుట:-

అయ్యగారు కొన్ని సంవత్సరముల క్రితము నరకము తీసివేయుమని 'నిత్యాగ్ని' అనేది తీసివేయమని ప్రార్థించిరి. సాతానును నరకములో పెట్టి శిక్షించి తీసి మోక్షములో పెట్టుమని 4,5 సం॥లు ప్రార్థించిరి. 7 సం॥లు ప్రభువా! ఇదేమి బాగులేదని ప్రార్థించిరి.

దుమ్మంపాడులో అయ్యగారు పనిచేస్తుంటే ఒక స్త్రీ వచ్చి, అయ్యగారి పాదములను ముద్దు పెట్టుకొనెను. అయ్యగారు స్థలము మార్చగా మరల వచ్చి ముద్దుపెట్టుకొనెను. అది తప్పు, విగ్రహారాధన. యేసుప్రభువు పాదములు ముద్దు పెట్టుకొనవలెను. పెనుమంట్రలో హిందూ దేవత పట్టిన స్త్రీ ప్రార్థించినపుడు, ఆమె లేచి అరువగా సాతానును పోగొట్టి, మోకరించుమనగా మోకరించి చేతులు జోడించి యేసురక్తమునకు జై అనగా ఆమె ఊరుకుండెను.

## సైతానును ఆటాడించుట:-

ఒకసారి దేవాలయమువద్ద సాతాను అయ్యగారి గది తలుపులు గజగజ లాడించుచుండగా పిల్లలు ఏమిటో అని బైటికి వస్తుంటే అయ్యగారు– 'రావద్దు అది సాతానని' చెప్పిరి. ఒకరోజు దయ్యము, అయ్యగారున్న కంపౌండ్‌లోని ఉసిరిచెట్టుక్రింద తెల్లని వస్త్రము కట్టుకొని చంటిబిడ్డను ఎత్తుకొని నిలబడగా అయ్యగారు అందరికి చూపించిరట. సాతాను అయ్యగారిని 'నన్ను విడిచిపెట్టండి, నేను వెళ్లిపోతాను' అని బ్రతిమాలగా, అయ్యగారు దానిని విడిచిపెట్టి, వెళ్లగొట్టుట అందరును చూచిరి.

## సైతానుపై జయము:-

పెనుమంటలో సువార్త చేసి, ఉదయము వేల్పూరు వస్తూయుండగా కాలువ గట్టుమీద ఒక కుర్రవానిపై ఒక కుక్క మొరుగుచూ పైన పడుచుండెను. అప్పుడు ఆ కుర్రవాడు భయపడుచుండెను. అప్పుడు అయ్యగారు బెంజిమన్ పాదిరిగారూ! ఆ! ఆ! అని అనగా, అదేమాట ఆ కుర్రవాడు అక్కడ అనగా ఆ కుక్క వెనుకకు తిరిగి వెళ్ళిపోయెను. ఆలాగే క్రీస్తుమీద భారమువేసి, ఆయన పలికినట్లు మనము పలికితే సైతాను ఒత్తిగిలిపోవును. అనగా ఓడిపోయి, చప్పబడును.

ఆత్రేయపురం టి. సుందరరావు అనే ఆయన అయ్యగారినొద్ద నుండగా, ఒకసారి ఆయన అయ్యగారితో 'సాతాను ఎలాగుంటదని' అడిగారు. ఒకరాత్రి ఒంటిగంటకు అయ్యగారు సుందరరావుగారితో 'అబ్బాయ్! రోడ్డుమీద ఒక స్త్రీ వెళ్ళిపోతుంది, పాపము భర్తమీద కోపముంచి కాబోలు ఆమెను పిలుచుకొని రా, లేక ఏ సంగతి తెలిసికొని రా' అని పంపిరి. ఆయన ఆమె వెంట వెళ్ళుచు ఏమ్మో? నిన్నే పిలిచేది! మాట్లాడవేమిటి! ఆగవమ్మా! అనగా కోరుకొండ వెళ్ళే రోడ్డు రెండుమైళ్ళు దూరమువరకు పరుగెత్తినదట, వెనుదిరిగి మాట్లాడలేదట. అప్పుడు ఈయనగారికి ఆయాసమువచ్చి తిరిగివచ్చినారట. మరుసటి ఉదయం అయ్యగారు అబ్బాయ్! రాత్రి సంగతి చెప్పావుకాదు? అని అడుగగా- 'నేనెన్ని పిలుపులు పిలిచినను ఆమె మాట్లాడలేదు, ఎంతోదూరము వెళ్ళుతూనేయున్నది. నాకు ఆయాసమువచ్చి తిరిగివచ్చానండి అని చెప్పగా- అబ్బాయ్! నీవు కోరుకొన్నావుకదా! ఆమే దయ్యము, బాగాచూచావా! అని అన్నారట. ఈ సుందరరావు గారు ఒకప్పుడు అయ్యగారి పుస్తకాలు సర్ది సూట్‌కేస్‌లో పెట్టుచుండగా అయ్యగారు పిలిచి అబ్బాయ్! నీవు పెట్టెలోపెట్టిన ఆ ఎర్ర అట్టలుగల పుస్తకము తీసుకురా? అని చెప్పిరట. అందులో అయ్యగారు చెయ్యి ఉంచి ప్రార్థనచేసి పదిరూపాయల కాగితములు క్రొత్తవి నాలుగు

తీసి, బైట ఉన్న పాలవాడికి ఇచ్చిరా! అనగానే ఆయన వెళ్ళి పాలవాడికి ఇచ్చి వచ్చారట. అయ్యగారు అద్భుతము చేయకముందు పదిరూపాయల కాగితములున్న ఆ పుస్తకములోని కాగితములన్నీ ఈ సుందరరావుగారు తిరగవేసిరి అప్పటికి ఆయనకు ఏమి కనబడలేదు ఇది చాలా ఆశ్చర్యకరమైన సంఘటన.

## భిక్షగానిని మార్చుట:-

దేవదాసు అయ్యగారు ఒక అడుగుకొనువానిని చూసి, 'నీవు భక్తుడవు. ఎందుకు అడుగుకొందువు? అది మానుము. నేను నీకు ధ్యానము చేయ నేర్పుదును. ఒక మార్గమును గూర్చి చెప్పుదును. ఒక మతము పేరు ఎత్తను. ఒక మత గ్రంథముపేరు ఎత్తను. ఒక మనిషి పేరు ఎత్తను. ఒక దేవత పేరు ఎత్తను. నీవెందుకు అడుగుకొంటావు ధ్యానము నేర్పించెదను' రమ్మన్నారుగాని, అతడు 'నా మూలమున నేను అడుగుకొంటున్నాను నేను రాను' అనెను. అందుకు అయ్యగారు **'నీ మూలముననే, మనమూలముననే యేసుప్రభువు బీదవాడయ్యేను, ఇక నీవు అడుక్కోవటము ఎందుకు?'** అని జవాబు ఇచ్చెను.

## తిక్కమనిషిని మార్చుట:-

అయ్యగారు ఒకప్పుడు ప్రభువుతో ఒక తిక్కమనిషిని గూర్చి చెప్పుచూ, అతనిని నేను త్రిప్పలేకపోతిని. అతడు తిరుగలేదు. అతడు మరల నాకు సువార్త చెప్పవద్దు అన్నాడు. ఈలాటివారిని ఏలాగు నీవు రక్షిస్తావు ప్రభువా! అని ప్రభువును అడిగారు. అందుకు ప్రభువు చూచుకో! నా మహిమ అని అన్నారు. ఆ తరువాత ఆ తిక్క మనిషికి చనిపోయేటంత జబ్బు వచ్చింది. ఆ వ్యక్తికి డాక్టర్‌గారు 24 గంటలలో చనిపోతాడు. ఇక నేను మందివ్వను, నేను రాను, సరియైన మందివ్వలేదని నాకు పేరు వస్తుంది అన్నాడు. ఆ తిక్క మనిషి చస్తానని భయపడి, అయ్యగారికి కబురు చేసాడు. అయ్యగారు 'నీవు

చస్తావో! బ్రతుకుతావో! సువార్తికుడనైన నేను చెప్పవలెను గాని ఆ డాక్టరు చెప్పేదేమో అతనికేమి తెలియును' అన్నారు. అప్పుడు ఆ తిక్క మనిషి అయ్యగారిని ఎప్పుడు చస్తానో చెప్పమన్నాడు. దానికి అయ్యగారు నేను చెప్పినట్లు చేస్తే బ్రతుకుతావు నీవు చావవు అన్నారు. ***నీవు సువార్త వినిన బ్రతుకుదువని ప్రభువు చెప్పెను' అని అయ్యగారు ఆ వ్యక్తితో చెప్పగా అతను సువార్త విని బ్రతికెను.***

## మిలటరీ అబ్బాయి:-

కొన్ని సంవత్సరముల క్రితము నా వద్ద చదివిన అబ్బాయి మిలటరీకి వెళ్లినాడు. మిలటరీలో ఎక్కడ ఉన్నాడో కనుగొనుటకై పై అధికారికి ఉత్తరము వ్రాసాను. ఆయనగారికి కోపము వచ్చి పిల్లవానిని గద్దించి పంపివేసెను. తిన్నగా అయ్యగారియొద్దకు వచ్చెను. బికారిగా వెళ్లిన అబ్బాయి ధనికుడుగా వచ్చినాడు. ఆయన పేరు ఒనేసిం. అయ్యగారు గుర్తించి పిలిచెను. ఎన్ని మాటలు నేర్చినా, ఎన్ని క్రొత్త దుస్తులు వేసికొన్నా, స్వరూపము ఎక్కడికి పోవును. ఆలాగే తెల్లని తల వెంట్రుకలైతేనేమి? బంగారమైతేనేమి 60 సంII ల క్రితము చూచిన మెరుపు ఉన్న ప్రభువు రూపము కనబడుచున్నది. గాన అయ్యగారు గుర్తించెను. ***అయ్యగారు ఇప్పటివరకు అచ్చువేసిన పత్రికలన్ని కలపి ఒకపెద్ద పుస్తకముగా చెయ్యాలనుకుంటున్నారు. అదే లోకమంతటా పంపించాలి.***

## నాస్థికుని మార్చుట:-

ఒక నాస్థికుడు 'నిజముగా దేవుడు ఉన్నట్లయితే చాలా గొప్ప వాడైయుండవలెను'. అని అయ్యగారి దగ్గరకు వచ్చి ఒప్పుకొన్నాడు. ఏలాగంటే ఇంత భూమిని ఆకాశమును ఇట్లు ఎవరు చేయగలరని అయ్యగారు అన్నారు. అయినను ఆయన ఇంకను నమ్మలేదు. కొంతకాలమునకు ఆయన చనిపోయే స్థితిలో, అయ్యగారియొద్దకు వెళ్లి

మాట్లాడిరి. అప్పుడాయనకు 40 సం॥లు. ప్రభువు ప్రార్ధన పద్యములో పాడిరి. ఆ పద్యము విన్న తరువాత, 'దేవుడు నా జబ్బు పోగొట్టినట్లయితే నేను నమ్ముతానన్నాడు. బాప్తిస్మము తీసుకుంటానన్నాడు' చివరకు చనిపోయినాడు. **ఆస్తికత్వమును, నాస్తికత్వము ఈ రెండును కలసియున్నవి. కాబట్టి నాస్తికుడు కాడు.**

## బ్రాహ్మణుడు బాగుపడుట:-

అయ్యగారు బోధించుటకు శానిటోరియములో నున్నప్పుడు, ఒక బ్రాహ్మణుడు వచ్చెను. ఆయన ఎక్కువ మాటలాడగా, డాక్టరు– 'బాగుపడుటకు మాటలు తగ్గించుమనగా' పూర్తిగా మాటలే మానివేసెను. డాక్టరు గారు చెప్పిన దానికన్న ఎక్కువ చేసెను. ప్రతి దినము కాగితముమీద వ్రాసి చూపెను. ఎవరైన మాటలాడించ ప్రయత్నించిన మాటలాడలేదు. అతడు తప్పక బాగుపడును. **ఔషధ సహాయమున్ననూ, నిశ్శబ్ధకాల విశేషమున్నది.** ఆయనను కారుమీద తీసికొని వచ్చెను. బాగుపడి వెళ్లిన ఒక నెలకు, 3 మైళ్ళ దూరమున ఉన్న తన గ్రామమునుండి నడచి వచ్చెను. **ఊరుకొన్న వానిని ఊరేమి చేయదు. ఊరుకొన్న వానిని జబ్బుకూడ ఏమి చేయదు.**

## దేవదూతలు ఇంటిపట్టాలు తెచ్చుట:-

అయ్యగారి బంధువులలో జమాయమ్మ అనే ఆమె అయ్యగారికి అక్క అవుతారట, ఆమె లూథరుగిరివచ్చి, అయ్యగారిదగ్గర తనకున్న అప్పులబాధ చెప్పి అప్పులవాళ్లు పీడించుకు తింటున్నారని ఏడ్చినారట. అయ్యగారు ఆమెతో ఏమి మాట్లాడకుండా సరే వెళ్ళు అని చెప్పినారట. ఆమె వెళ్ళిన తరువాత దేవదూతలు ఆమె ఇంటి తాలుకు అప్పును అప్పులవాళ్లకు చెల్లించి భూమి లేక ఇంటి పట్టా తీసికొని వచ్చి అయ్యగారికిచ్చి తలక్రింద పెట్టిరట. నాకెందుకు ఆ పట్టాలు, మీరే తీసికొనివెళ్ళి ఆమెకివ్వండి అనిచెప్పితే దేవదూతలు వెళ్ళి ఆమె ఇంటి పట్టాలు తీసికొనివచ్చి ఆమె

తల(క్రింద పెట్టుటచూచి పరమాశ్చర్యము చెంది అయ్యగారి దగ్గరకువచ్చి చెప్పినది.

## ప్రభువుతో పెనుగులాడుట:-

అయ్యగారు లూథరుగిరిలో పనిచేయునపుడు, ఒకరోజు మధ్యరాత్రిలో ఒక కుర్రవాడు మూత్రమువచ్చి గదిపెద్దనులేపి బైటికివచ్చి, తన అవసరము తీరినపిమ్మట గదిపెద్ద ముందుగా లోపలికి వెళ్ళినాడట. కుర్రవాడు అయ్యగారి గదిలో గొప్ప వెలుగు కనబడుటచూచి భయములేకుండా కొంచెము దగ్గరకు వెళ్లగా అయ్యగారు ఒక మనిషితో గోజులాడి గోజులాడి పెద్దగా వినబడేలాగున మాట్లాడుచున్నారట. గదిలో ఎవరు కనిపించలేదు తరువాత ప్రభువుతోనే ఆయన అట్లు బ్రతిమిలాడి అడుగుచున్నట్లు ఆ కుర్రవానికి తోచినదట.

## తిరస్కరణి విద్య:-

ఒకప్పుడు లూథరుగిరిలో ఒక కుర్రవానికి అయ్యగారు తాళముచెవి (ఆయన గదితాళము) ఇచ్చి, నీవు ప్రతిరోజు నీళ్లుపెట్టి, తుడిచివెళ్లిపోతుండుము. నేను ప్రార్థనలో యుంటాను. నన్ను మాట్లాడించవద్దని" చెప్పినారట. అతడు గది తాళము తీసి ఆ ప్రకారము చేయునపుడు కొన్ని రోజులవరకు మోకాళ్లమీదనేయున్నట్లు కనిపించినారట. కొన్ని దినములు ఎవరు కనిపించలేదట. తరువాత 40 రోజులు అయిన తరువాత ఆయన అక్కడేయున్నారట. ఆ కుర్రవాడు 'మీరు ఎక్కడికి వెళ్లినారని' ప్రశ్నించినపుడు ఇక్కడనేయున్నానని అయ్యగారు చెప్పగా ఆశ్చర్యపోయినాడట.

## ఆపత్కాల సహాయము:-

ఒకప్పుడు అయ్యగారు లూథరుగిరిలో ఉన్నపుడు మధ్యరాత్రి 12గంటలకు, తన దగ్గర పండుకొనియున్న కుర్రవానినిలేపి లేచి నాతో రా

అనిపిలిచినారట. నిద్రమత్తువల్ల కుర్రవాడు త్వరగా లేవలేదట. ఆయన వెళ్లిపోవుచుండగా గబగబ కూడా వెళ్లినారట. ఆయనది నడక, కుర్రవానిది పరుగట. అలాగు అయ్యగారు రాజమండ్రి స్టేషనుకువెళ్ళగా, అక్కడ ఒక స్త్రీ తన ఇద్దరు పిల్లలను దగ్గర పెట్టుకొని ఏడుస్తున్నదట. అయ్యగారు కారణమడుగగా టిక్కెట్టు, డబ్బుకూడా పోయినదనిచెప్పి ఏడ్చినదట. అప్పుడు అయ్యగారు ఆమెకు కావలసిన డబ్బు ఇచ్చి వెంటనే వచ్చివేసిరట.

## సైతాను పన్నాగమును వమ్ముచేయుట:-

ఒకప్పుడు గున్నేశ్వరావు అనే డ్రామాయాక్టర్ రాజమండ్రిలో ట్రైనింగ్ కాలేజ్దగ్గర పెద్ద పెండాలువేసి (పూర్వము అంత సినిమాలు ఉండేవికావు) బాగుగా నాటకమువేసి, డబ్బు సంపాదించేవాడట. ఆ డబ్బుతో 5రూపాయలు, 10రూపాయలు, 100రూ.ల నోట్లు అచ్చువేసి విస్తారముగా డబ్బు సంపాదించువాడట. అతడు ఈ పని బాగుగా తెలిసిన ఇద్దరిని ఏ కారణముచేతనో చంపి, రహస్యముగా ఆ స్థలములోనే పాతిపెట్టినాడట. అయితే అతడు కొలిచే దేవత ఈ డబ్బు అతనికే నిలబడుటకు, తానుచేయు పని ఎవరికి తెలియకుండ ఉండుటకు, 'ఒక పవిత్రమైన జీవితముగల బ్రహ్మచారి శ్రేష్ఠుడు కావలయును అతనిని నాకు బలి ఇవ్వవలెయునని' కోరినది. వెంటనే ఆయన వాకబు చేయగా లూథరుగిరిలో అట్టి బ్రహ్మచారి భక్తుడు ఒకాయన ఉన్నారని చెప్పినారట. అప్పుడు అతడు అయ్యగారి దగ్గరకు 'ఫలానరోజు డ్రామా వేయుట మానివేసి మీ బోధ చెప్పించవలెయునని ఉన్నది, రమ్మని' అడిగినాడట. అయ్యగారు సరే వస్తానని చెప్పినారట. తీరా వాళ్లు రమ్మని తీసికొనివెళ్లుటకు రాగా, యేసుప్రభువు– 'నిన్ను తీసికొనివెళ్లుటకు వచ్చినవారితో వెళ్లవద్దు' అని చెప్పినారుగాన 'మీరు ఇంకొకసారి ఏర్పాటుచేసికొనండి అప్పుడు వస్తానని' అయ్యగారు అతనితో చెప్పినారట. ఈయన మీటింగు అయిపోయిన

పిదప దేవతకు బలి ఇయ్యవలెనన్న ఉద్దేశము వాళ్లదేవుడు ఆయనకు చెప్పేయుంటారు అది మనకు చెప్పలేదని' మరలా ఆ వ్యక్తి ఎప్పుడు అయ్యగారి దగ్గరకు వెళ్లలేదట.

## దైవజనుని ముఖప్రకాశము:-

రాజమండ్రికి తూర్పువైపున ఉన్న చిత్రపువారితోట, చాలా పెద్ద పండ్లతోట. అక్కడ ఉజ్జీవ కూటములు పెట్టిరి. చాలామంది లూథరుగిరినుండి స్కూళ్లకు సెలవుపెట్టి, టీచర్స్, పెద్దవారు అనేకులు వచ్చిరి. అప్పుడు అక్కడున్నవారిలో ఒకాయన అయ్యగారి ముఖము సూర్యకాంతివలె ప్రకాశించుట నేను చూచినానని సాక్ష్యమిచ్చిరి. పెద్దాపురంలో జరిగిన ఒక మహాసభలో అయ్యగారు ప్రసంగించు చుండగా, పెద్దగాలి వర్షమురాగా 'ఓ గాలి! ఆగు'. అని నెమ్మదిగా మామూలుగానే చెప్పిరట వెంటనే గాలి, వర్షము ఆగిపోయినదట.

## పరలోక పరిశుద్ధుల సహాయము:-

అయ్యగారు లూథరుగిరిలో వార్డన్‌గా పనిచేయునపుడు బజారులో సరుకులు ఇచ్చే కోమటికి కొంతడబ్బు ఇవ్వవలెనట. తరువాత పంపిస్తామని చెప్పి, కొన్నాళ్లయిన తరువాత అయ్యగారు డబ్బు పంపించిరట. ఆ కోమటి మీరు అపుడే ఇచ్చివేసినారు. మీరు ఎవరిచేతనో పంపినారుగదా! అన్నాడట కోమటి. అయ్యగారు నేను ఎవరిని పంపలేదు. డబ్బు ఇచ్చిన ఆయన ఎట్లు ఉన్నారని అడుగగా, 'పొడవుగా, ఎర్రగా ఉన్నాడు. చేతులకు మురుగులు ఉన్నవనిచెప్పినాడట'. అప్పుడు అయ్యగారు ఆ ఇచ్చినాయన బైబిలులోని యాకోబు కుమారుడగు యోసేపు అని చెప్పినారట.

# 12. దైవజనుని అనుచరుల అనుభవములు

## మాదే సుందరరావుగారి అనుభవము:-

1944సం॥ము రంపచోడవరము సువార్త పనిచేయుటకు సర్వాధికారియైన దేవుడైన క్రీస్తు ప్రభువును ప్రార్థించి అయ్యగారు సుందరరావుగార్ని పంపినారు. బస్సు చార్జీ 1-25/. అయ్యగారి మాట ప్రకారము ఆయన వెళ్ళుచుండగా మహా అరణ్యములో వెళ్లుచున్నాను. నాకెవ్వరు తెలియదు. తిరుగు చార్జీ ఎవరిస్తారు అనుకొనుచు భయపడుచుండిరి. రంపచోడవరము 10 మైళ్ల దూరము గలదు. బస్సు ఆగెను. ఒకరు బస్సు దిగి, అబ్బాయి నీకు తిరుగుచార్జీ అని 1-50/-పైసలు ఆయన జేబులో వేసినారు. ఆయన అడవిలోనికి పోయిరి. వెంటనే సుందరరావుగారికి ఆశ్చర్యము. సంతోషము కలిగి ప్రభువును స్తుతించిరి. తిరిగి దానవాయిపేట, రాజమండ్రి దేవదాసు అయ్యగారి దగ్గరకు వచ్చినారు. అయ్యగారు మరలా పనిచెప్పిన బాగుండును. అద్భుతము జరుగును అని అనుకొన్నారు. సువార్త రిపోర్టు వినిపించి వెళ్ళిపోవుచుండగా, సుందరరావూ! అని అయ్యగారు పిలిచి, గోదావరి అవతల ఓడపల్లి దానియేలు గారికి కబురు చెప్పిరమ్మన్నారు. 'అయ్యా! గోదావరి పొంగి పొర్లుచున్నది. రైళ్ళు, పడవలు వెళ్లుటలేదు' అన్నారు. అపుడు అయ్యగారు పడవకు డబ్బులు ఇస్తాను వెళ్లమన్నారు. ప్రార్థనచేస్తాను అని చేసినారు. నీకు ఆకలి అవుచున్నది గదా! అని వ్రేలు కడుపుమీద పెట్టి త్రిప్పినారు. మధ్యాహ్నము 2గం॥లు అవగా, హోటల్‌కు అయ్యగారు డబ్బులిస్తారని ఆయన అనుకొన్నారు. 5 అణాలు పడవకు ఇచ్చి వెళ్లి రమ్మన్నారు. వెంటనే ఆయన గోదావరి ఒడ్డునకు వచ్చిరి. ఉదయమునుండి పడవలు పోలేదు. ఒక పడవ తెగించి బైలుదేరినది. ఆయన డబ్బులు ఇచ్చి ఎక్కిరి. ప్రవాహములో పడవ ఎంతో వేగముగా పోవుచుండగా అందులోనున్నవారు భయపడిరి. మధ్యాహ్నం 3:30ని॥కు దానియేలు గారి ఇల్లు చేరగా, వారి

అమ్మాయి చాపవేసి, అన్నము, కూర, మజ్జిగ, పండ్లు వడ్డించి తల్లిని పిలిచి ఇవి ఎవరికి వడ్డించాలని అడిగెను. వీరు అదే సమయమునకు అక్కడకు చేరుకొన్నారు. ఆ బిడ్డ తల్లి వజ్రమ్మగారు. ఎక్కడనుండి వచ్చినారని అడిగి వెంటనే వారికి ఆ ఆహారము పెట్టిరి. చాలా ఆకలితో ఉన్న వీరికి అయ్యగారు హోటల్ డబ్బులిచ్చి ఉంటే ఈ వింతకార్యము గోదావరి పడవ చూడలేముగదా! **దేవదాసు అయ్యగారి ప్రార్థన ఇట్టి అద్భుతములు ఎన్నో చేసెను.**

## పి.యం. జాకబ్‌గారి అనుభవము:-

వీరికి చిన్నవయసునుండి అనగా వారు ఆరవ తరగతి చదివేటప్పటినుండి అయ్యగారితో పరిచయము ఉండేది. జాకబ్‌గారు 5వ తరగతిలోనుండగా ఒకరోజు పొలము వెళ్ళి, చీకటిపడి ఇంటికి వెళ్ళలేక, గడ్డి వామిపైకి ఎక్కి అందులో పండుకొన్నారు. వారి తండ్రిగారు, ఇంటివారు లాంతరుతోఈయనను వెదుకుచు పొలములోనికి వచ్చి, ఆ రాత్రివేళ యాకోబు యాకోబు అని కేకవేయగా, గడ్డివామినుండి క్రిందికి దుమికెను. పి.యం. యాకోబుగారు అయ్యగారి దగ్గరకు వచ్చినప్పుడు 'ఆ గడ్డివామిలో దాగుకొన్న అబ్బాయివి నీవేనా' అని అన్నారట! అయ్యగారు షారోన్ గృహములో బోర్డింగ్ నడిపించేవారు, అందరికి భోజనం పెట్టేవారు, చిలకడ దుంపలు ఉడికించి అందరికి పెట్టేవారు, మజ్జిగ ఇచ్చేవారు. ఈలాగు అయ్యగారి బోర్డింగ్‌లో చదువుకొన్న విద్యార్థులే తరువాతికాలములో బైబిలుమిషను నాయకులయ్యారు. ఒకసారి అన్నములో బల్లి పడితే అందరికి వాంతులు, విరోచనములు అయినపుడు, అయ్యగారు ప్రార్థన చేస్తే అందరికి స్వస్థత జరిగినది. దానవాయిపేటలో ఉన్నప్పుడు ఎక్కువగా అగ్ని ప్రమాదములు జరిగేవి. ఒకసారి అగ్ని ప్రమాదము జరుగుచున్నపుడు, అయ్యగారు అబ్బాయ్ మీరుందరు సన్నిధిలో మోకరించి ప్రార్థించండి అని అనగా 5ని॥లు అందరు మోకరించి ప్రార్థించగా అగ్ని ఆరిపోయినది.

# నేతల సుదర్శనంగారి అనుభవములు:-

వీరి స్వగ్రామం నర్సాపురం తాలూకా, తుందుర్రు. వీరి తల్లిదండ్రులు లూథరన్ మిషను క్రైస్తవులు మంచి ప్రార్థనపరులు. వీరు నర్సాపురంలోనున్న లూథరన్మిషను హాస్టల్నందు చేరి ఆ స్కూలులోనే చదువుచుండిరి. ఒకనాడు (1929సం॥ము) వీరు హాస్టల్లోనుండగా బాలురందరు రాజమండ్రికి ఒక భక్తుడు వచ్చారు ఆయన దొరగారి కారులో మీటింగునకు వెళ్ళుచున్నారు అని తెలిసినది. బాలురందరు చాలామంది కారువెంట పరుగెత్తిరిగాని కారు వారికి అందలేదు. వారందరు నిరాశలో వెనుకకు వచ్చేసిరి. ఆ సమయములో నర్సాపురంలో దొరగారు రెవ. యస్. డింకుల్ బర్గర్గారు వెంపలో మీటింగుకు అయ్యగారిని తీసికొని వచ్చిరి. స్వగ్రామస్తుడు గురాల. లాజరు అనే ఆయన అయ్యగారు ప్రసంగించు చుండగా, 'అయ్యగారియొక్క శరీరము (ముఖము, చేతులు) సువర్ణమువలె ప్రకాశించినది, నేను చూచాను అని సాక్ష్యము చెప్పాడు. 1935వ సం॥లో హైస్కూలులో జరిగిన లూథర్ 'లీగ్ ఆనివర్సరీకి' అయ్యగారు వచ్చి ప్రసంగించిరి.

1936సం॥లో మోయల్ దొరగారి మేడయొద్ద ఏడు సంఘముల చరిత్ర, అయ్యగారు నర్సాపురం, భీమవరం తాలూకాల మాస్టర్లందరికి పనివారల సభలో వివరించిరి. అప్పుడు ఖాళీ సమయములో నేనుకూడా హాజరైతిని. నేను లూథరన్ మిషను హాస్టల్లో నుండగా దేవదాసు అయ్యగారియొద్ద శిష్యత్వము పొందుచున్న రెవ. కె. విజయరత్నంగారు మా హాస్టలునకు వచ్చి రాకడగురించి బోధించిరి, మరియు రెవ. డి. ఏలియాగారు పరిశుద్ధాత్మను గురించి బోధించిరి. 1935సం॥లో దేవదాసు అయ్యగారు భీమవరంలోని రూపాంతర దేవాలయంలో చేసిన సిలువధ్యాన సమయంలో అయ్యగారు అడిగిన అన్ని ప్రశ్నలకు వెంటనే జవాబు చెప్పగలిగితిని. హాస్టలునుండి నాతోకూడా 8మంది దేవాలయమునకు వెళ్ళితిమి. ఆ సమయములో రెవ. పి. బెంజిమన్గారు భీమవరంలో లూథరన్

మిషను స్థానిక పాస్టరుగా ఉన్నారు. ఆ దినము దేవదాసు అయ్యగారి శిష్యుడైన మాత్యూ శామ్యేల్‌గారు B.A.L.T Lutheran High School హెడ్మాష్టరుగా ఉన్నారు. వారు అయ్యగారిని భోజనమునకు పిలిచిరి. భోజనము అనంతరము 'మీరు దేవాలయమునొద్దకు వెళ్ళుటకు బండి ఏర్పాటు చేస్తాము' అన్నారు. అయ్యగారు– వద్దు నేను వెళ్ళిపోతానన్నారట. మేము దేవాలయ కాంపౌండ్‌లో అయ్యగారికొరకు ఎదురుచూస్తున్నాము. అప్పుడు అయ్యగారు గేటులోనుంచి రావడము మానివేసి గాలి రెక్కలతో ఆవరణములోనికి దిగి నడిచివచ్చుట నేను చూచితిని ఎవరు చూడలేదు, ఎవరు గ్రహించలేదు. అయ్యగారు– తేలికగా వచ్చితిని, తేలికగా వచ్చితిని అని చేతులు చూపిస్తు ఆ విషయం మరుగు చేశారు. ఆ రాత్రి దేవదాసు అయ్యగారు హాస్టలునుండి వచ్చిన మా 8మందిని మోకాళ్ళమీదనుంచి మనో నిదానము నేర్పించిరి. అప్పుడు నాకు పరిశుద్ధాత్మ శక్తి వచ్చినది. నేను వణకిపోతుండగా నన్ను రెండు చేతులు పట్టుకొనిట933–36వరకు ఎ.యి.యల్.సి. హైస్కూల్‌లో చదువుచున్నపుడు యల్. మానార్ అను ఒక మాస్టరుగారు ఎప్పుడూ దేవదాసు అయ్యగారిని గురించి చెప్పుచుండెడివారు. నేను, కొందరు బాలురు కలిసి బేతనియ పేటలోని హైస్కూల్ టీచర్స్ లైనులో ప్రార్థనలు చేసికొంటూ ఉండెడివారము. మానార్‌గారి ఉపదేశమువలన నేను తల్లిదండ్రులకు చెప్పకుండా 1936సం॥ము మేనెల 15వ తేదీన అయ్యగారి వారియొద్ద శిష్యత్వము పొందవలెనని శానిటోరియంలోఉన్న దేవదాసు అయ్యగారి యొద్దకు వెళ్ళిపోతిని. అయ్యగారు నాకు సువార్త పని ఎట్లు చేయవలెనో అనేక విధములుగా ఒక గంటలోనే ఎన్నో విషయములు చెప్పిరి, వ్రాసికొంటిని. మీ తల్లిదండ్రులు ఏడ్చుచున్నారని మానార్ గారియొద్దనుండి ఉత్తరమురాగా దేవదాసు అయ్యగారు వెంటనే నా స్వగ్రామం పంపించివేసిరి. నేను 1939వ సం॥లో యస్.యస్.యల్.సి. పాస్ అయితిని. లూథరన్ మిషనులో లీగ్ సెక్రటరీగా ఒక సం॥ము పనిచేసితిని. ఆ సం॥మే దేవదాసు అయ్యగారు

ఆనివర్సరీకి వచ్చారు. 1939వ సం॥లో హెచ్. రత్నమ్మగారు– 'దేవదాసు అయ్యగారు బైబిలుమిషనును స్థాపించిరి' అని నాతో చెప్పగా నేను రాజమండ్రిలోని శానిటోరియంలో ఉన్న అయ్యగారియొద్దకు వెళ్ళాను. అప్పటికి విజయరత్నంగారు, అయ్యగారు కలిసి శానిటోరియం దిగువన ఒక పెంకుటింటిలో ఉన్నారు. నేను బైబిలుమిషనులో చేరడమనే తలంపు భీమవరంలో ఉండగానే హెచ్. రత్నమ్మగారి ఉపదేశముద్వారా జనించినది. 1939 సం॥ము సెప్టెంబరు మాసములో భీమవరంలో నున్న లూథరన్ మిషను నుండి రాజమండ్రిలోనున్న బైబిలుమిషనుకు ఒక్క దుముకు దుమికినట్లయినది. అప్పుడు అయ్యగారు పలికిన మాటలు– ఇప్పుడే పుట్టావా! బైబిలు మిషనులో! అని అన్నారు.

## శానిటోరియంలో ఉండగా జరిగిన సంఘటన:-

అయ్యగారికి ఆ కాలములో రాజమండ్రి టౌన్‌లో, మిషనులో ఎక్కువ పలుకుబడి, మిషనెరీలుమధ్య ఎక్కువ ఘనత ఉండినది. ఆయన ఆంగ్లమునందుకూడ గొప్ప ఉపన్యాసకులు. దీనివలన కొందరు ఆయనయందున్న అసూయచేత ఆయనను చంపవలెనని ప్రయత్నించి కొట్టకుండా చంపాలని ఆలోచించిరి. సరే కొన్ని దినాలు భోజనము లేనియెడల ఆయనే చస్తాడని ఒక ఇంటిలోపెట్టి రెండు ప్రక్కల రెండు తలుపులు బిగించిరి. ఆయన గోడలోగుండా రాలేడు గనుక భోజనము అందకపోతే చావక ఏమి చేస్తాడని తలుపులకు తాళమువేసి, ఎవరు తీయకుండా చేసిరి. ఇది తెలియని కొందరు ఆయనను ఎరిగినవారు ఆయన ఏదో ఊరు వెళ్ళిపోయాడు అనుకొనిరి. మూడు మాసముల తరువాత చంపాలనుకొన్న ఘనులువచ్చి చచ్చిపోయి ఉంటాడుగదా చూద్దామని తలుపులు తీసిరి. తలుపులు తెరవగానే లోపల ఆయన ఈ ప్రక్కనుండి ఆ ప్రక్కకు షికారులు చేస్తూ తిరుగుచున్నారు. ఆయన చావలేదు బ్రతికేయున్నాడు. ఆయనను చూడగానే చంపాలనుకొన్నవారు చచ్చినట్లు అయిపోయారు. ఆ

మూడు మాసములు దేవదాసు అయ్యగారు బరంపురంలోనున్న **"క్రీస్తు నీతి సన్నిధి కూటములకు"** హాజరైనవారితోకూడ దైవసన్నిధిలో ఉన్నారు.

"మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? యెహోవా బాహువు ఎవనికి బయలుపరచబడెను?" యెషయా. 53:1. ఈ వాక్యము ఎత్తుకొని అయ్యగారు బోధించిన అనుభవము:– అయ్యగారు రాజమండ్రికి సమీపమునయున్న చిన్న పేటలోని పాస్టరుగారి ఇంటికి వెళ్లగా పాస్టరుగారు లేరుగాని పాస్టరమ్మగారు ఉన్నారు. అయ్యగారు అమ్మా! పాస్టరుగారు ఎక్కడికి వెళ్లిరని అడిగినప్పుడు ఆమె రాజమండ్రి వెళ్ళిరని చెప్పినది. అయ్యా! వారు వస్తారు మీరు భోజనము చేయండని చెప్పగా, అమ్మా! నేను భోజనము చేసి వచ్చితిని అని అన్నారు. అయితే కుటుంబ ప్రార్థన చేయండి అనగా కుటుంబ ప్రార్థన జరిగించిరి. ఆ తరువాత అయ్యగారు, పాస్టరుగారి అబ్బాయి ఒక గదిలో, పాస్టరమ్మగారు మరొక గదిలో పండుకొన్నారు. పాస్టరుగారు రాలేదు. అయ్యగారికి ఒక కల వచ్చినది. ఒక పాము పాస్టరుగారి అబ్బాయిని కరచుటకు సిద్ధముగా నున్నట్లు. వెంటనే అయ్యగారు లేవగా దీపము ఆరిపోయినది. గది చీకటిగా ఉన్నది. అప్పుడు అయ్యగారు పాస్టరమ్మగారినిలేపి అమ్మా! దీపము వెలిగించుమనగా ఆమె దీపము వెలిగించినది. అయ్యగారు పండుకొనియున్న గదిలోనికి వచ్చిచూస్తే– పాస్టరుగారి అబ్బాయి పండుకొన్న మంచము సమీపమునయున్న టేబుల్‌పైన ఒక పాము పడగవిప్పి అబ్బాయి తలవరకు చాపి కరచుటకు సిద్ధముగానున్నది. పాస్టరమ్మగారు వణకిపోయారు. ఆమెకు చెమటలు పట్టినవి. అయ్యా! ఇంకా చూస్తారే! అంటూ లైటు చూపినది, చీపిరి ఇవ్వబోయినది. అంతట అయ్యగారు అమ్మా! వద్దు మోకరించుము, ప్రార్థించుము అని చెప్పిరి. ప్రార్థించేవరకు పాము కదలలేదు. అప్పుడు అయ్యగారు– 'ఓ సర్పమా! నీవు క్రిందికి దిగివచ్చి నీ తల నేలమీద కొట్టుకొని

చనిపో!' అని పలికిరి. వెంటనే ఆ పాము ఆ బల్లమీదనుండి దిగివచ్చి నేలమీద దానంతటదే తలకొట్టుకొని చనిపోయినది. "యెహోవా బాహువు ఎవనికి బయలు పరచబడెను?" అనే వాక్యము వివరించి ఈ అనుభవము అయ్యగారు చెప్పిరి.

ఈ వివరమును 1936వ సం॥లో మా స్వగ్రామమైన తుందుర్రు వాస్తవ్యుడు బొందా. రాజారత్నం నాకు చెప్పారు. దేవదాసు అయ్యగారు రాజమండ్రి హాస్టల్ పిల్లలకు 400మందికి ఒక దినమునకు 25 కుంచాలు బియ్యం ఇచ్చుచుండువారు. ఆయన బైబిలు టీచరు. అదే సమయములో హాస్టలు పిల్లలను (వార్డన్) చూచుచుండువారు. గనుక బియ్యము ఇచ్చుట ఆయన పని. ఒక దినము బియ్యము కొలిచే పని చిందాడ. శిఖామణి అనే విద్యార్థికి వచ్చినది. ఈ అబ్బాయి బియ్యం కొలుచుచుండగా అయ్యగారు ఆ అబ్బాయినుండి కొంత దూరము నడుస్తూ పుస్తకము చదువుకొనుచున్నారు. కొలత కొలవడము అయినది. కొలత దగ్గర అయ్యగారులేరు. దూరముగానున్నారు. ఈ కొలిచే అబ్బాయి ఎక్కువ కొలిచెను. అయ్యగారికి తెలియకుండా ఉండాలని ఆ అబ్బాయి ఉద్దేశ్యము. అప్పుడు అయ్యగారు– శిఖామణి కొలత అయిందా? అయిందండి. ఎన్ని కుంచాలు కొలిచావు? 25 కుంచాలు కొలిచానండి అని అబద్ధమాడినాడు. అప్పుడు అయ్యగారు నీవు 27 కుంచాలు కొలిచావుకదా! ఎందుకు అబద్ధమాడు చున్నావు అన్నారు. చాలదని కొలిచానయ్యా అన్నారు. మరలా ఆ బియ్యము తీసివేయలేదు. అయ్యగారికి ఆత్మ వివేచన వరమున్నది. ఎక్కువ కొలిచినా ఆ విధ్యార్థిని శిక్షించలేదు, క్షమించివేసినారు. ఆ బియ్యము తక్కువగా కొలిచినా సమృద్ధిగా సరిపోయేటట్లు దీవించగల దేవుని విశ్వాసశక్తి అయ్యగారికి ఉన్నది.

ఒక దినమున 42మంది పిల్లలు అయ్యగారియొద్దకు వచ్చి అయ్యా! మీరెల్లప్పుడు దేవుడు దేవుడు అంటారు. మీకేగాని దేవుడు మాకు వద్దా? అని మాకు దేవుని చూడాలని ఉన్నది చూపించండి అన్నారు. దేవునిని

మాకు కనబడుమని అడగండి అన్నారు. అప్పుడు అయ్యగారు ఆ 42మందిని మోకరింపజేసారు. దేవా! ఈ బాలురకు నిన్ను చూడవలెనని ఉన్నది. మీరు వీరికి కనబడండి అని ప్రార్థించగా ప్రభువు మహిమతో కనబడ్డారు. వారు ఆ మహిమకు తట్టుకోలేక– 'మేము చనిపోతున్నాము, మేము కాలిపోతున్నాము, ఈ మంటలకు, ఈ అగ్నికి మేము ఆగలేము మేము చూడగలిగిన స్థితిలో కనబడునట్లు ప్రార్థించండి. అలాగైతే దేవుని చూడగలము' అని అడిగారు. అప్పుడు అయ్యగారు మరలా ప్రార్థించగా ప్రభువు 42 మంది బాలురల దగ్గర బాలురలవలె ప్రభువు కనబడెను. వారికి దేవదర్శనం కలిగినది, సంతుష్ఠి పడిరి ఆనందించిరి. దేవుడు నాకు కనబడ్డాడు, నాకు కనబడ్డాడు బాలునివలె కనబడ్డాడు అని చెప్పుకొనిరి.

పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన స్వస్థత కార్యములు:– అత్తిలి మంచిలి మధ్యను బొబ్బరాజుపాడు అను ఒక ఊరు ఉన్నది. అక్కడ లూథరన్ మిషను పనివారికి ఏడు దినములు పనివారల సభలు జరిగినవి. దేవదాసు అయ్యగారుకూడ ఆ సభలకు హాజరైరి. దొరలంతా హాజరైరి. మీటింగులు ఏడు దినములు జరిగినవి. ఆఖరు దినమున కొందరు పాస్టర్లు షికారుకు వెళ్ళారు. అబ్రాహాము అనే ఒక పాస్టరుగారు బహిర్భూమికి వెళ్లియుండగా ఒక పాము ఆయనను కరచినది. ఆయన నురగలు కక్కినాడు. మూర్ఛిల్లి పడిపోయిన ఆయన్ను దగ్గరనున్న పాస్టర్లు భుజముమీద వేసికొని తీసికొని వచ్చి, ప్రార్థనశాలలో పరుండబెట్టిరి. దొరలు, పాస్టర్లు ఏమి చేయలేకపోవు చున్నారు. అప్పుడు అయ్యగారు ఈయన బ్రతికినాడా? చనిపోయినాడా? అని అందరిని ప్రశ్నించగా ఎవరు మాట్లాడలేదు. అప్పుడు అయ్యగారు తలుపులువేసి మోకరించి ప్రార్థనలో ఉన్నారు. మధ్యరాత్రి ఒంటిగంటకు ఆయనకు ప్రాణము వచ్చినది. చనిపోయిన ఆయన బ్రతికినాడు. అప్పుడు పరలోకములో ఆ పాదిరిగారి ఆత్మ వేటిని చూచినదో అవన్నీ చెప్పగా లూథరన్ మిషను పనివారందరు ఆశ్చర్యపడిరి.

ఒక దినము అయ్యగారు పెండియాల అనే గ్రామము వెళ్ళుచున్నారు. ఒక అబ్బాయి తన తమ్ముని భుజముమీద వేసికొని ఏడ్చుచూ వచ్చుచున్నారు. ఎందుకు ఏడుస్తున్నావు అని అయ్యగారు అడిగారు. పాము కరచినది అని అన్నాడు. సరే దింపుమని అయ్యగారు ప్రార్థించిరి. వెంటనే విషము హరించినది, బాధ తగ్గినది. అప్పుడు సంతోషముగా వారు ఇంటికి వెళ్ళిరి.

అయ్యగారు శానిటోరియం కొండమీదనుండగా అయ్యగారి గదియొద్దకు ఎన్నో దయ్యాలు వచ్చేవి. అప్పుడు అయ్యగారిదగ్గర ఏలీయాగారు ఉన్నారు. అబ్బాయి నీవు ప్రభు యేసు రక్తమునకు జయము – సైతాను క్రియలకు లయము అని ద్వారబంధములకు వ్రాయుము, స్తుతి మానకుము అని చెప్పిరి. అలాగే ఆయన స్తుతించిరి. రక్తస్తుతి చేయగా ప్రభువు యేసు రక్తము కనబడి, ఆ దయ్యములు ఇంటి లోపలికి రాలేదు. బైటనుండే వెళ్లిపోయినవి. ఏ కీడు రాలేదు. దేవదాసు అయ్యగారియొద్దకు దయ్యములు మనుష్యులవలె వచ్చి కనబడేవి. అయ్యగారు ఆయన దగ్గర శిష్యులతో– 'అబ్బాయ్ వీటిని ఆ రోడ్డుమీదికి తీసికొనివెళ్ళి అక్కడ విడిచిపెట్టి రండి' అని పంపేవారు. వారు వెళ్లి వాటిని అలా పంపేసివచ్చేవారు అవి వెళ్ళిపోయేవి. దయ్యములు మనలను ఏమి చేయవు. మనుష్యులకంటే అవే పిరికివి. ఎదిరిస్తే పారిపోవును. జడిస్తే జడిపించును గాన వాటికి భయపడకూడదు. శానిటోరియంలోనుండగా అయ్యగారి దగ్గరనున్న ఇద్దరు శిష్యులు విజయరత్నంగారు, ఏలియాగారు. వీరిద్దరు కలసి– 'అయ్యగారూ! మీ జోడు (చెప్పులు) కుక్కలు ఎత్తుకొనిపోయినవి' అని అంటే అది 'నా జోడుకాదు ప్రభువుకు సమర్పణ చేసాను అది ప్రభువే చూసుకొంటారు' అని అయ్యగారు అనిరి. మరి రేపు మీరు బయటికి వెళ్ళునపుడు ఏమి వేసికొని వెళ్ళతారు అని అడుగగా అప్పుడు ఆ కుక్కలే మరలా తీసికొనివచ్చి అక్కడ పెడతాయి అని అన్నారు. ఆయన బైటికి వెళ్లవలసిన సమయము వచ్చినది అప్పుడు వెంటనే ఆ కుక్కలు ఆ జోడు తీసికొనివచ్చి అక్కడ పెట్టినవి. **అయ్యగారు ప్రతి చిన్నవస్తువు దేవునికి**

**సమర్పించిరి.** ఆయన విశ్వాసమేమంటే కావలసినపుడు దేవుడే ఇస్తాడు అదే ఆయన విశ్వాసము. ఒకసారి అయ్యగారు నన్ను బోధచేయుటకు పంపిరి. అక్కడ అయ్యగారిని ఎరిగిన వృద్ధురాలుండెను. బోధ చెప్పుట మాన్పించి, అయ్యగారి గురించి చెప్పుమనగా అయ్యగారి గురించి చెప్పగా చాలా సంతోషించినది. రాజమండ్రి వచ్చిన తరువాత అయ్యగారు అబ్బాయ్ ఏమి బోధించావు? అన్నారు. అయ్యా! మిమ్మల్ని గురించి ఒక వృద్ధురాలు చెప్పుమనగా చెప్పాను. అప్పుడు అయ్యగారు అవును నాకు తెలుసు. నా గురించి ఎందుకు చెప్పావ్! ప్రభుని గురించి చెప్పక. నన్ను గురించి ఎవరికి చెప్పవద్దుగాని ప్రభువు గురించి చెప్పుము అని చెప్పిరి. ఆయన ఆత్మ సంచార వరముకూడ కలిగియున్నారు, ఎవరి హృదయములో ఏమి ఉన్నదో గ్రహించగలరు. ఎవరేమి చేసేది ఆయన ఆత్మ కంటితో చూడగలరు.

ఒకప్పుడు నేను అయ్యగారివద్ద అనగా అయ్యగారు ఏలూరులోనుండగా కె.యస్.డి.వి. ప్రసాదరావుగారి పెంకుటింట్లో ఉండగా ప్రార్థన జరిగినది. ప్రార్థన అనంతరము విజయరత్నంగారు, జి. సమూయేలుగారు, రూతమ్మగారు ఎవరి పనులలో వారు వెళ్ళిపోయిరి. రాజమండ్రినుండి టెలిగ్రామ్ రాగా విజయరత్నంగారు వెళ్ళిపోయారు. నేను (సుదర్శనం) ఒక్కడినే ఉండగా ఆ ఇల్లంతా మహిమతో నిండియున్నది. అప్పుడు అయ్యగారు నాతో– 'దేవుడు నాలో సంపూర్ణముగా నిండియున్నారు' అని చెప్పిరి. ఆ రాత్రి నాకు ఒక ప్రత్యక్షత కలిగినది. ఆ ఇంటి వసార గదిలో నాకు మంచము వేయించినారు. ఆ గదిలో నేను పరుండియుండగా పరలోక సింహాసనమునుండి ఒక టెలిఫోన్ తీగెవంటిది అయ్యగారివద్దకు పెట్టబడినది. అయ్యగారియొద్దనుండి ఆ టెలిఫోన్ తీగె నాయొద్దకు ఏర్పాటు చేయబడినది. అనగా పరలోక సింహాసనమునుండి దైవసందేశము అయ్యగారియొద్దకు అక్కడనుండి నాయొద్దకు ఏర్పాటుచేయబడినది. ఒక ఆదివారము అయ్యగారు ఒకే సమయములో రెండు స్థలములలో బోధించిరి. ఒకే అంశముమీద బోధించిరి. ఆ ఆదివారము అందరికి ఆశ్చర్యము

కలిగినది. ఒక దినము అయ్యగారియొద్దకు ఒకాయన వచ్చారు. అయ్యా! రోగిని పరీక్షించుటకు ఎక్స్‌రే అనే ఒక యంత్రము ఉన్నది. అయితే మానవుని పాపమును చూచే దుర్భిణి యంత్రమున్నదా? అని అడిగారు. అయ్యగారు లేకేమి! ఎక్కడున్నదని అడుగగా, "దైవసన్నిధి"లో అన్నారు. అయ్యగారు ప్రత్తిపాడులో, ఏలూరులో స్వస్థత ప్రార్థనలు ప్రారంభించిరి. ఆయన ప్రార్థనవలన తండ్రియైన దేవుడు ఎన్నో వ్యాధులు బాగుచేసారు. ఏలూరు స్వస్థత శాలలో అయ్యగారు ఈ మిషను అమెరికా, ఇతర ఖండాలకు వ్యాపించును అని అన్నారు. ఒకసారి అయ్యగారు విజయరత్నం గారిని, నన్ను చీరాలకు సేవకు పంపించారు. ప్రార్థించి పంపిరి. ఆయన ప్రార్థన ఏమనగా– 'సువార్తకు వ్యతిరేకముగా గొడ్డలి, తుపాకి, కత్తి నిలువబడగలదా? అవి అన్నియు సువార్తఎదుట పడిపోవును' అని ప్రార్థించి పంపిరి. రైలులో ప్రయాణము చేయుచుండగా నేను ప్రార్థనలోనే ఉన్నాను. రైలుప్రయాణములో ఏమిదర్శనము వచ్చినదని విజయరత్నంగారు అడుగగా అయ్యా! గొడ్డళ్ళు, కత్తులు కనబడుచున్నవని చెప్పితిని. ఆ సమయములో చీరాలలో బి. దీవెనయ్య పాస్టరుగారు గొప్ప సేవ చేస్తున్నారు. వారు బేర్ కంపౌండ్‌లో ఉండేవారు. రాత్రికి మేము వారింటికి చేరితిమి. భోజనము తరువాత రాత్రి ప్రార్థనల తర్వాత ఆ పాస్టరుగారు మాతో అయ్యా! మీరు రాత్రికి బయటకి వెళ్లవద్దు. లూథరన్ మిషనువారు బైబిలుమిషనువారిని ద్వేషించి మిమ్ములను కొట్టవలెనని చూచుచున్నారు అని చెప్పిరి. ఆ రాత్రి కొందరు యువకులు మమ్ములను చంపవలెనని ఇంటిని చుట్టుకొనియుండిరి. కాని ఉదయము లేచి బయటకు వెళ్లగా మమ్ములను ఎవరు చంపవలెనని ఉండిరో ఆ యువకులు నమస్కరించిరి. అయ్యగారియొక్క ప్రార్థన ఫలితముగా దేవుడు అద్భుతము జరిగించిరి. ఆయనకే మహిమ.

ఒకసారి అయ్యగారు– "స్తుతియాగము" అనే పాఠము నేర్పించుదునని బైబిలు క్లాస్‌లో ప్రాక్టికల్‌గా చూపిస్తానన్నారు. నాలోనికి దైవాత్మ వచ్చినారు.

నా హృదయమంతా వెలుగుతో, స్తుతితో నిండియున్నది. దైవాత్మ వచ్చినందువలన శరీరమంతా చెమటపట్టి, దైవశక్తి ఆపుకోలేకపోవుటచే అయ్యగారు, విజయరత్నంగారు తలమీద చెయ్యి ఉంచి ఎంత ప్రార్థన చేసినను ఆ శక్తి ఆగలేదు. నా తరువాత మునిపెల్లనుండి వచ్చిన బర్రె దావీదుగారి మీదికికూడ స్తుతియాగము వచ్చుట జరిగినది. ఇది చెప్పుట వలన తీరదు అనుభవించవలసినదే. అప్పుడు అయ్యగారు ఇదిగో స్తుతియాగము వచ్చినదన్నారు. దేవునికి స్తోత్రములు. ఒక దినము రాజమండ్రిలో గోదావరి పుష్కరాలు జరుగుచున్నవి. దేవదాసు అయ్యగారు బేతేలుగృహములోనే ఉన్నారు. ఆయన ప్రతిదినము మూడు గంటలవరకు విశ్రాంతి తీసికొంటారు. నాతో వరండాలో కూర్చుని చదువుకో అన్నారు. చదువుకొంటున్నాను. ఆ దినము ఒంటిగం॥కు వరండాలో కూర్చున్న నన్ను లోపలికి పిలిచి- కోటి లింగాలలో తీర్థము జరుగుచున్నది. అక్కడకు పరలోకమునుండి పురాతనకాల మనుష్యులు వచ్చారు. వారు చాలా ఎత్తుగా ఉన్నారు, తలపాగా చుట్టుకున్నారు, చిందులు త్రొక్కుచున్నారు, చిందులు త్రొక్కుచు సువార్త చెప్పుచున్నారు- ఆ సువార్త ఏమంటే "వచ్చివేసిన దేవుని సభకు చేరుదము రండి-త్వరలో యేసుని కలసికొని విని దొరలౌదము రండి" అని పాడుచున్నారు. ॥జయము కీర్తనలు జయశబ్దముతో రయముగా పాడండి అనే కీర్తనలోఉన్నది. అబ్బాయ్! అచ్చు ఆఫీసుకు వెళ్ళి, వారు పాడిన ఈ చరణము 'జయము కీర్తనలు' అనే కీర్తనలో చేర్చి అచ్చువేయించు అని వెంటనే పంపిరి. అయ్యగారు- గుంటూరులో బేతేలు గృహములో ఉన్నారు, రాజమండ్రిలో- కోటిలింగాల దగ్గర జరుగుచున్న ఆ దృశ్యము ఇక్కడ కనబడుచున్నది. వారు పాడుచున్న పాటలు అయ్యగారికి ఇద్దరు రండి"- అని పాడితే, క్రైస్తవురాలు- ""త్వరలో యేసుని కలిసికొని విని దొరలౌదము రండి" అని పాడి పరలోకము వెళ్ళిపోయారని అయ్యగారు

చెప్పిరి. ఆ కోటి లింగాలలో పాడిన పాట, ఈ పరలోకమునుండి వచ్చిన వారి పాట పాడుచున్నపుడు అయ్యగారి గది అంతయూ మహిమతో నిండియుండెను.

ఇద్దరు భార్యభర్తలు ఒక దినము అయ్యగారియొద్దకు ప్రార్థన చేయించుకొనుటకు వచ్చిరి. అప్పుడు అయ్యగారి గదిలో పరలోకమునుండి మహిమ వర్షము వస్తున్నది. నేను నోరువిప్పి అయ్యగారూ! మీ గదిలో మహిమ వర్షము కురుస్తున్నది అని చెప్పుటకు సిద్ధముగానుండగా, అయ్యగారు నాకు సైగ చేసిరి. ఆ మహిమ సంగతి ఆ భార్యభర్తలు నమ్మనందున వారి సమక్షములో అది చెప్పనీయలేదు. అయ్యగారిచుట్టు దేవుని మహిమ ఎప్పుడు ఆవరించియుండేది, అది అందరకు చిత్రముగాని, అయ్యగారికి అది మామూలే దేవునికి స్తోత్రము.

అయ్యగారు – బైబిలుగ్రంథములోని 66 పుస్తకములను 66గదులుగల "బైబిలు మ్యూజియంగా" (Bible Museum) ఎవరు కట్టుదురు? అని అడిగిరి. ఆ బిల్డింగునకు 66 గదులుండవలెను, ఒక్కొక్క గదిలో ఒక్కొక్క గ్రంథము చొప్పున ఉండవలెను (ఆ విధముగా నిర్మించవలెను లేక తయారుచేయవలెను). ఆ గదులలో, ఆ గ్రంథమునకు సంబంధించినవి యుండవలెను. ఒక్కొక్క గదిలో ఒక్కొక్క గ్రంథము చొప్పున ఉండవలెను. ఆ గదిలో ఆ గ్రంథములోనున్న అన్ని వాక్యములు వ్రాయబడవలెను, ప్రతి గదిలో ఆ గదికి సంబంధించిన పుస్తకము (గ్రంథము) యొక్క బొమ్మలు ఉండవలెను. ఉదా:– ఆదికాండ గ్రంథముయొక్క గదిలో ఆదికాండములోనున్న బొమ్మలన్ని ఆ గదిలో ఉండవలెను. ఆ గదిలోనికి వెళ్ళగానే ఆదికాండము అర్థమైపోవలెను. అలాగే 66 గదులు ఉండవలెను. 66వ గది ప్రకటన. ప్రకటన గదిలో ఆ గ్రంథములోని బొమ్మలన్ని ఉండవలెను. ఆ గదిలోనికి వెళ్ళి చూడగానే ఆ గ్రంథము అర్థమవ్వాలి. అటువంటి మ్యూజియం ఎవరు కడతారు? అని అడిగిరి. అది

బైబిలుమిషనువారే కట్టవలెను దేవునికి స్తోత్రము. ఇది దేవునియొక్క సర్వజ్ఞానములోని అంశము గనుక ఆయన సర్వశక్తిలోని అంశము ఈ మ్యూజియంను సర్వలోకమునుండి వచ్చిచూస్తారు ఇది తండ్రియొక్క సర్వవ్యాపకత్వములోని అంశమైయున్నది. అట్టి కృప మనలో ఒకరికి ఇచ్చి ఈ ఘన కార్యము చేయించునుగాక!

ఒక దినము రాజమండ్రిలో దేవదాసు అయ్యగారియొద్ద లాజరు అనే అబ్బాయి ఉన్నాడు. అయ్యగారిదగ్గర ఇద్దరు అబ్బాయిలున్నారు. అయ్యగారు– అబ్బాయీ! ఎందరున్నారని అడిగిరి. ఇద్దరున్నామని చెప్పిరి. అయితే భోజనము ఎంత ఉన్నదని అన్నారు. కొద్దిగా ఉన్నదన్నారు. ఇద్దరికి సరిపోవచ్చునన్నారు. విస్తర్లో వడ్డించు అన్నారు. ఆ! లాజరు.... కొంచెము కొంచెము విస్తర్లో వడ్డించు అన్నారు. వడ్డించిన తరువాత మరో ఇద్దరు వచ్చారు. అయ్యా! మరలా వంట చేయమంటారా? అని అయ్యగారినడుగగా వద్దు. మరలా రెండు విస్తర్లు తెచ్చి ఆ అన్నమే వడ్డించుమన్నారు. ఆ అన్నమే నాలుగు విస్తర్లకు సర్దినారు. ఇది ఏమి సరిపోతుందని లాజరు తలంచినాడు. అయ్యగారు భోజనము పడవేయవద్దు అని అన్నారు. ఇదేమిటి కొంచెము కొంచెము పెట్టితినిగదా, అయ్యగారు ఇలా చెప్తున్నారేమిటి! అని అనుకున్నాడు లాజరు. అప్పుడు అయ్యగారు ప్రార్థన చేసిరి. ప్రార్థన ముగించగానే, తినడము ప్రారంభించగా ఐదు రొట్టెలు, రెండు చిన్నచేపలు పెరిగినట్లుగా, ఆ అన్నము పెరిగినది. వారు ఆ భోజనము తినలేకపోయిరి. ఎంత ఆశ్చర్యము! ఇది మహాద్భుతముకాదా! దేవునికి స్తోత్రములు.

బైబిలు మిషను స్థాపన జరుగకముందు రాజమండ్రిలో లూథరు మిషను A.E.L. C. కాన్ఫరెన్స్ లూథరుగిరిలో జరిగినది. అప్పుడు 'షారోను సంస్తుతి సమాజము' అనే పేరుమీద అయ్యగారు పనిసాగిస్తున్నారు. దేవదాసు అయ్యగారు పరిశుద్ధాత్మ కూటాలు పెట్టుచున్నారని భాషలు మాట్లాడుచున్నారని మీటింగులో పాస్టర్లు హేళనచేసిరి. అయ్యగారి

పక్షముగా శ్రీ. యస్. దేవిడ్ ఫిలిప్సన్‌గారు ఉన్నారు, విజయరత్నంగారున్నారు. మిషనెరీలు మీరు చెప్పేబోధలు లూథరు మిషను సిద్ధాంతములోలేవు. గాన మీరు వాటిని ప్రవేశపెట్టవద్దు అని అన్నారు. మిషనులో లేకపోయినా బైబిలులో ఉన్నవిగాన మేము మానము అని అయ్యగారు ఆయన తరుపున ఉన్నవారు అన్నారు. భీమవరంనుంచి వచ్చిన ఒక పాస్టరుగారు టంగ్స్ టంగ్స్ అని హేళన చేసిరి. అప్పుడు టంగ్స్–కింగ్స్ అవుతాయి అన్నారు విజయరత్నంగారు. అనగా భాషలు మాట్లాడేవారే రాజులు అవుతారన్నారు మనవారు. దొరలు విజయరత్నం గారిని మీకు థియాలజీ తెలియదు అన్నారు. అంటే మీకు వేదాంత శాస్త్రము తెలియదని అన్నారు. అప్పుడు విజయరత్నంగారు మీకు నియాలజీ తెలియదన్నారు. అంటే ఓ దొరలారా! మీకు మోకాళ్ళ జీవితములోని అనుభవము తెలియదన్నారు. అప్పుడు దేవదాసు అయ్యగారిని హేళనచేసిన ఒక పాస్టరుగారు భీమవరం వెళ్లుచూ, నిడదవోలులో నర్సాపురం బండి ఎక్కబోయి ఏలూరు బండి ఎక్కుటలో నిడదవోలు స్టేషనులోనే బండిక్రిందపడి చనిపోయెను. రాజమండ్రి గోదావరి స్టేషను సమీపమున ఉన్న సెంటర్‌లో ఒకాయన అయ్యగారిని హేళనచేసినందుకు బస్సుక్రిందపడి చనిపోయెను, 'ప్రభువుకు విరోధమైన పాపము క్షమింపబడును గాని పరిశుద్ధాత్మకు విరోధమైన పాపము క్షమింపబడదని' యున్నదిగదా! మత్తయి. 12:31.

దేవదాసు అయ్యగారివద్ద, పి. బెంజిమన్‌గారు విద్యార్థిగానున్నారు. బెంజిమన్‌గారికి అయ్యగారి ప్రార్థనవల్ల పరిశుద్ధాత్మ అగ్ని బాప్తిస్మము వచ్చినది. అందుచేత ఆయన హృదయము సంవత్సరము పొడవునా కాలినట్లుండేది. ఆయన హృదయము అగ్ని బాప్తిస్మమువలన శుద్ధిచేయబడినది. ఈ సంవత్సరము పొడవున పి. బెంజిమన్‌గారి ఎదుట యేసుప్రభువు మనిషివలె, అనగా పాలస్తీనా దేశములో అందరికి కనబడినట్లే, ఆయనకుకూడ కనబడేవారు. ఇది పి. బెంజిమన్ అయ్యగారు బైబిలుమిషనులో

చేరిన తరువాత ఆయన ఇచ్చిన సాక్ష్యము. ఒకసారి అయ్యగారు తనయొద్దనున్న ఒకరికి నీ హృదయ జ్ఞానమును వెలిగించుకోమని వెలిగించిరి. అప్పుడు ఆ వ్యక్తికి ఎంతో జ్ఞానము వచ్చినది. అతనికి అంతా గ్రహింపైపోవుచున్నది. అయ్యో! ఇదేమిటి? ఇదేమింత ఆశ్చర్యము! ఇంత జ్ఞానము వచ్చినదని అనుకున్నాడు. నరునికి ఇంత జ్ఞానముండవచ్చునా అని అనుకున్నాడు. కొద్ది దినములు తర్వాత అది అపరిమితమైనది. అటుతర్వాత కొన్ని దినములనుండి ఆ అపరిమితమైన జ్ఞానము అంతరించిపోయినది. అదియుంటే గర్విష్టుడైపోతాడని మరలా ఇచ్చిన వరమే తీసివేసినారు. ఇది అయ్యగారి ప్రార్ధనవలన జరిగిన ఒక చిత్రమైన సంగతి.

**ఒకరి సాక్ష్యము:-** బేతేలు గృహములో నేను అయ్యగారినొద్ద నుండగా ఒక దినము నా కాలు అనగా కుడి పాదము వాపు వచ్చినది. ఉదయమే అయ్యగారినొద్దకు వెళ్ళి అయ్యా! నా కాలు బోధకాలుగా తయారగు- చున్నదేమోనని బాధపడుచుంటిని. అయ్యగారితో చెప్పి అవతలికివెళ్ళి చూచుకొనగా, ఆ వాపు వెంటనే తగ్గిపోయినది. అయ్యగారు ప్రార్ధనకూడా చేయలేదు. ఆయనతో చెప్పడమే ప్రార్ధన అయినది. యుద్ధకాలములో రాజమండ్రిలో బైబిలు తరగతులు పెట్టిరి. అప్పుడు గాలి ఓడలు (విమానములు) ఎక్కువ తిరుగుచు ఉండేవి. క్లాస్ జరుగుచుండగా విమానము శబ్దము వినపడినపుడు చెప్పడము మానివేసి, కొద్దినిమిషాలు ప్రార్ధనలో ఉంచేవారు, అది ఒక మంచి అలవాటు. ఒకప్పుడు నేను విజయరత్నంగారిని విమర్శించుట ప్రారంభించితిని. అప్పుడు అయ్యగారు- 'నేను విజయరత్నంను పెద్దగా ఏర్పాటుచేసితిని, గాన నీవు ఆయనను ఎదిరించవద్దు ఆయన చెప్పినట్లు విను' అని అన్నారు. అప్పటినుండి మిషనులో నేను ఆయనను ఎదిరించలేదు. ఆయనకు లోబడియుంటిని. ఒకప్పుడు నేను అయ్యగారికి దూరములోనున్ననూ, అయ్యగారు నా దగ్గరే ఉన్నట్లు ఉండేది. ఏదైనా తప్పుచేస్తే ఆయన నన్ను చూస్తున్నారుగదా! తప్పు

చేయకూడదనే భయముండేది. ప్రభువుకు భయపడటముకాదు, ఆయనకే భయపడవలసినట్లు నా జీవితములోనుండేది. ఆయన చూస్తున్నారు. ఆయన అడుగుతారనే భయము నాలో పాతుకొని పోయింది, అనగా అయ్యగారు నన్ను ఇక విడిచిపెట్టరు. నా దగ్గరే ఉంటారు. ఇక నేను కానిపని చేయకూడదు, కానిమాటలు ఆడకూడదు. ఆయన నా దగ్గరే ఉన్నారు అనే తలంపు నాలో ఎక్కువగా పనిచేసేది. ఆయన నా దగ్గరే ఉండేవారు. ఆయన సన్నిధి నాదగ్గరే ఉన్నది అన్న భావాన్ని స్ఫురింపజేసేది. అందుచేత ఏ చెడును చేయటానికి నాకు సందులేదు. అనగా ఆత్మలో ఆయన అంత సమీపముగానుంటారు.

బైబిలుమిషను స్థాపన జరిగిన కొన్నాళ్లకు పెద్ద న్యూడార్ఫర్‌గారు రత్నవిలాస్‌లో ఉండగా లూథరుగిరినుండి ఆయన భార్యతోపాటు దేవదాసు అయ్యగారియొద్దకు ముమ్మారువచ్చారు. వారికిని దేవదాసు అయ్యగారికిని జరిగిన సంభాషణ ఇలాగున్నది:

దొరగారు :– దేవదాసుగారూ! మీరు ఈ చిన్న ఇంటిలో ఎందుకు ఉండుట? నాయొద్దకు వచ్చివేయండి, మీకు పెద్ద మేడ ఇస్తాను, మీకు పనివాళ్లను ఇస్తాను, ఏమి కావలెనో అంతా ఇస్తాను, మీకు అన్ని సదుపాయములు చేస్తాను. మీరు ఏమి పనిచేయవద్దు. రండి మాతో ఉండండి. మీరు బాధపడవద్దు .

అయ్యగారు:– 'ప్రభువు మీకు కనబడతారు, ఒక పని చేయమంటారు. మీరు చేస్తారా! చేయరా?

దొర :– ప్రభువు కనబడిచెప్పితే ఎందుకు చేయను? చేస్తాను.

అయ్యగారు :– 'అట్లయితే నేను ప్రభువు చెప్పినట్టు చేయవద్దా! అంటూ మీరు చేస్తున్నారుకదా! నేను చేయవద్దా? అన్నారు.

దొర :– మీరు ప్రభువు చెప్పారు అంటున్నారుగాని అది వట్టి ఊహ.

అయ్యగారు :– ఊహకాదు, ప్రభువు నాకు స్వయముగా కనబడి చెప్పారు అన్నారు 'నేనువస్తే నా పిల్లలు ఊరుకోరు, ప్రభువు చెప్పినట్లు నేను చేయాలి' అని అనగా ఇక ఈయన నా మాట వినరుగదా! అని మనసులో బాధపడి దొరగారు వెళ్లిపోయిరి. దొరలందరికి దేవదాసు అయ్యగారంటే ఎంతో గౌరవము, ప్రేమ, అనురాగము కలదు.

నేను తుందుర్రునుండి దేవదాసు అయ్యగారియొద్దకు రాజమండ్రి వెళ్ళితిని. అప్పుడు అయ్యగారు తుందుర్రులోనున్న నా గదిలోనున్న పుస్తకములు చూచి అబ్బాయ్! నీ పుస్తకములు చెల్లాచెదురుగా పడవేసావేమి? క్రమముగా ఉంచుకోవద్దా! అన్నారు. నా గదిలోనున్న పుస్తకములు రాజమండ్రిలోనున్న అయ్యగారికి కంటికి కనబడుచున్నవి. ఇది గొప్ప అనుభవము. నా పెండ్లి అయిన క్రొత్తలో నా భార్య చంద్రవతమ్మ జబ్బు పడినది. కాళ్ళు రెండు కురుపులతోనిండి, రక్తమువలె ఎర్రబడిపోయినవి. లేవలేదు, కూర్చోలేదు, కదలలేదు అందరు చనిపోతుంది అన్నారు. ఈ జబ్బు వచ్చినవారు బ్రతుకరు అన్నారు. నేను రాజమండ్రివచ్చి అయ్యగారికి ఈ సంగతి చెప్పగా అయ్యగారు ప్రార్థన చేసిరి. ఏ నిమిషములో ప్రార్థన చేసిరో, ఆ నిమిషములోనే స్వస్థత వచ్చినది. ఎర్ర కురుపు అనేదిలేదు లేచినడచినది. మూడురోజులనుండి ఆహారము తీసికొనని, ఆమె ఆహారము తిన్నది. స్వస్థపడి దేవునిసేవ చేయుచున్నది.

అయ్యగారు దానవాయిపేటలోనున్నపుడు (రత్నవిలాస్)లో అయ్యగారియొద్ద రూతమ్మగారు ఉండేవారు. ఆమె శరీరమంతా కురుపులులేచి చనిపోయినది. ఆమె దగ్గరకు భయపడి, ఎవరు పోలేదు. మూడు దినములు అయిన తరువాత అయ్యగారే ఆమె దగ్గరకు వెళ్లి ప్రార్థించి ఆమెను బ్రతికించిరి. ఇదే స్థలములో యాకోబుగారు అనే ఆయన చనిపోగా అరుగుమీద గదిలోనుంచిరి. ఆయననుకూడ దేవదాసు అయ్యగారు వెళ్ళి

ప్రార్థించగా తండ్రియైన దేవుడు బ్రతికించెను. సువార్త వినుటకు ఒకరోజు అయ్యగారి యొద్దకు ఎవరు రాలేదు– ప్రభువా! ఈ దినము ఎవరు నా దగ్గరకు రాలేదని మనసులో అనుకొనగా, పరలోకమునుండి భక్తులు, పరిశుద్ధులు ఆయన గదిలోకి వచ్చి నిండిపోయిరి. అప్పుడు అయ్యగారు– "మహోన్నతులగు మనుష్యులను ఈ గృహాన జేర్చెను యెహోవా తండ్రి" అనే కీర్తన పాడిరి.

ఒకప్పుడు నన్ను హాస్టలు బాలురను చూచుటకు పెట్టిరి. ఆ సమయములో విజయరత్నంగారు కలకత్తా వెళ్లిరి. హాస్టల్ పిల్లలకు ఆహార పదార్ధములు లేవు. అప్పుడు దేవదాసు అయ్యగారు రత్నవిలాస్‌లో (దానవాయి పేట) మోకాళ్ళు వంచి ప్రార్థించిరి. మధ్యాహ్నమువరకు అయ్యగారు, పిల్లలు, మేము (నా భార్యకూడ) ఉన్నాము. ప్రార్థిస్తూనేయున్నాము. అప్పుడు పోస్టుమన్ వచ్చి దేవదాసుగారు ఎక్కడ? మనియార్డరు వచ్చినదని పిలుచుచున్నాడు. ఎంత అనగా 100 రూపాయలు. ఎక్కడనుండి వచ్చినది? అరేబియానుండి. ఆయనను అయ్యగారు ఎరుగరు. ఎరుగని మనిషినుండి సొమ్ము రావడము ఆశ్చర్యము కలిగినది. వెంటనే కావలసినవికొని ఆకలి తీర్చుకొన్నాము. అది అయ్యగారి విశ్వాస పద్ధతి జార్జ్‌ముల్లర్ అనుభవమును ఇట్టిదే. అయ్యగారియొద్ద ఉన్న పిల్లలందరు పెరిగి పెద్దవారై దేవుని సేవలో ఉన్నారు. దేవునికే మహిమ.

ఒకనాడు నేను ప్రాతఃకాలముననే అయ్యగారికి 'మరనాత' చెప్పుటకు నమస్కరించుటకు వెళ్లితిని. అయ్యగారు– అబ్బాయ్ నేను ఇప్పుడే నా సేవ ముగించుకొని వచ్చాను. పాతాళలోకము వెళ్లి సువార్త చెప్పి వచ్చివేశాను. అక్కడ చాలామంది విద్యావంతులు ఉన్నారు. బి.ఎ.లు, యం.ఎ.లు చదివినవారున్నారు. భూమిమీదయుండగా ఏ పనులు చేసిరో ఆ పనులే చేస్తున్నారు. మారలేదు. సువార్తకు చెవి పెట్టలేదు. అయితే, కొందరు వృద్ధులైన స్త్రీలు బాగా విన్నారు. ప్రతిదినము అయ్యగారు పాతాళలోకమువెళ్ళి

బోధించివచ్చి– నేను పాతాళలోకములో బోధచేసి వచ్చాను అని చెప్పేవారు. ఒకసారి అయ్యగారు విజయరత్నంగారితో– విజయరత్నం! నీవు సిద్ధపడు, ఈ రాత్రి మనము పాతాళమునకు వెళ్ళి బోధచేసి వచ్చెదమన్నారు. అయ్యగారి ఆత్మ పాతాళమువెళ్ళి అక్కడ బోధించి వచ్చినది. మరుసటి దినమున "పాతాళములో ఏడు అంతస్థులు ఉన్నవి. వారు కఠినమైపోయి వాక్యము విన్నా, నిర్లక్ష్యముగా ఉంటారని" చెప్పిరి. ఇక్కడ మార్పురాలేదు గనుక దేవుడు వారికి ఇంకా మారడానికి గడువు ఇచ్చి పరలోకమునుండి, భూలోకమునుండి బోధకులను పంపి బోధించుచున్నారు. అయినా మారుటలేదు మారినవెంటనే మోక్షములోనికి వారిని చేర్చుకొనును. మా పాస్టరమ్మగారు మా అమ్మ దయ్యమైవచ్చి నా కలలో కనబడుచున్నది ఆమె మోక్షమునకు వెళ్లలేదు. కొంచెము ప్రార్థించండి అయ్యా అని అడిగినది. అప్పుడు అయ్యగారు నీవు వెళ్లి బోధించు అమ్మా అన్నారు. ఏమి చేసిరో తెలియదు మర్మము. అప్పటినుండి ఆమె కనబడడము మానివేసింది. అయ్యగారే ఆమెకు బోధించి ఉంటారు, ఆమె మోక్షమునకు వెళ్లి ఉంటుంది అనుకున్నాము.

అయ్యగారి మనస్సు ఒకరిని నొప్పించక తానొవ్వక ఉండునట్లుగా ఉండేది. ఆయన ఎవరిని తిరస్కరింపరు, ఎవరిని ద్వేషింపరు, దూషించరు అనే మాదిరి చూపించారు. కోపపడుట అనేది ఆయన జీవితములో లేదు వాక్యోపదేశముద్వారా అంతరంగమును శుద్ధిచేయుటయే ఆయనపని. ఆయన దగ్గర సొమ్ము లేకపోయిన యుద్ధకాలములో బైబిలు తరగతులు పెట్టినపుడు ఎవరు ఏమి తెచ్చుకొనకపోయిననూ, అందరికి ఆయనే బత్యాలు ఇచ్చారు. బియ్యం, కూరగాయలు అన్ని సరఫరాచేస్తే వంటచేసికొని క్లాస్‌కు హాజరయ్యేవారు. మరి ఎక్కడనుండి వచ్చేదో ఎవరికి తెలియదు అదే ఆయన విశ్వాసజీవిత మర్మము. ఆయన కీర్తి, గొప్పతనము, పేరు కోరుకొనలేదు గాని సమస్త విషయములలో మహిమంతయు దేవుని సింహాసనమునకే వెళ్ళేటట్లు చూచుకొనేవారు. ఆయన మనోదృష్టి ఎప్పుడు అంతట సంచారము

చేసినట్లే ఉండేది. ఇది చిత్రం ఒక పుస్తకము వ్రాయలన్నా, ఒక పత్రిక వ్రాయాలన్నా ఆ పని పూర్తి అయ్యేవరకు ఆయనకు నిద్రపట్టేది కాదు. పనిలో అంత శ్రద్ధ ఉండేది. ఒక దినమున నేను 1949వ సం॥లో కాకాని స్వస్థిశాలకు వెళ్లితిని. దేవదాసు అయ్యగారు బేతేలు గృహములో ఉన్నారు. అయిననూ, దేవదాసు అయ్యగారు, ప్రభువు కలిసి జట్టుగా రోగులమధ్య తిరుగుచుండుట నా నేత్రములకు కనబడినది. బేతేలు గృహములో ఉన్న వ్యక్తి కాకాని స్వస్థిశాలలో కనబడుట చిత్రముకాదా? ఈలాగున అనేకమైన చిత్రమైన అనుభవములు ఆయన తన దగ్గరున్నవారికి చూపించారు, కలిగించారు.

**రెవ. బి. జీవరత్నంగారి అనుభవము:–** వీరు 1956సం॥లో ఏప్రిల్ నెలలో కాకాని మీటింగులకు మూడు దినములు హాజరగుటకు వచ్చిరి. వీరితోపాటు కాల్దరి వీర్రాజుగారు కుటుంబముతోసహ ఆ కూటములకు హాజరైరి. చివరిరోజున గుంటూరువెళ్లి దేవదాసు అయ్యగారితో ప్రార్థన చేయించుకొని తిరిగు ప్రయాణము కావలెనని వీరు అనుకొనిరి. అపుడు అయ్యగారు బేతేలు గృహములోనికి సంఘమంతటిని తీసికొని రమ్మన్నారు. అయ్యగారు అందరికొరకు, అన్ని అంశములు గురించి ప్రార్థించిన తరువాత "వీర్రాజుగారిని పిలిచి– మీరు నన్ను ఒక విషయము అడగాలి అనుకొన్నారు, గాని మరచిపోయారు, అడుగకుండా వెళ్ళిపోతున్నారు" అనగా వీర్రాజుగారు కొంచెము సమయము ఆలోచించి– నాకేమి జ్ఞాపకము వచ్చుటలేదు, మీరే చెప్పండనగా అందుకు అయ్యగారు 'ఇప్పుడు చెప్పను తరువాత చెప్పుతాను' అన్నారు. మేము ఒంటిగంటకు ప్రయాణము చేయవలసింది గాని 10గంటలకే ప్రయాణము చేయుటకు బైలుదేరాము. వీర్రాజుగారు– 'అయ్యగారు అనవసరముగా మాట అని నా మనస్సులో సందేహము పుట్టించారు' అన్నారు కోపముగా. నాకు జ్ఞాపకము లేదంటే అదే చెప్పవచ్చుగదా? ఎందుకు చెప్పకూడదు? ఇదంతా వట్టిదే! అని బైలుదేరారు. ఈలోపు కాకానిలోనున్న జనమంతయు ఒక్కొక్కరే బేతేలు గృహములో

అయ్యగారితో ప్రార్థన చేయించుకొనుటకు వచ్చారు. అప్పుడు అయ్యగారు– ఒక్కొక్కరు రావద్దు అందరు వరండాలో కూర్చొండి ప్రార్థిస్తాను అన్నారు. అందరు వరండానిండా కూర్చున్నారు. నేను వీర్రాజుగారితో ఈ ప్రార్థన అనంతరము వెళ్ళదాము అని బ్రతిమిలాడాను, ఎంత చెప్పినా వినలేదు. అందరము వెళ్లిపోతు మేడయొద్దనుండి పెద్దవీధిలోనికి వెళ్లేసరికి అయ్యగారు ఒకరిని పంపి కాల్దరి. వీర్రాజుగారిని ఒకసారి పిలవండి అన్నారట. అందుకు వీర్రాజుగారు ఎందుకు? బండిదాటిపోతుంది! అని విసుగుకున్నారు, ఆయన భార్యమాటమీద తిరిగి వెనుకకు వచ్చిరి. అప్పుడు అయ్యగారు– మీరు అనుకొన్నమాట జ్ఞాపకము వచ్చిందా? అన్నారు. జ్ఞాపకముంటే ఇంతకుముందే చెప్పేదనన్నాడు వీర్రాజుగారు విసుగ్గా. అయితే నేను చెప్తూతాను వినండి అన్నారు అయ్యగారు. ఏమన్నారో చెప్పనుగాని, ఎక్కడన్నారో చెప్పేదనన్నారు. మీరు ఆ మాటను తణుకులో అన్నారు జ్ఞాపకము తెచ్చుకొండి! కాసేపు ఆగి జ్ఞాపకము వచ్చిందా? అన్నారు. రాలేదండి అన్నారు వీర్రాజు. ఎవరితో అన్నారో చెప్పనా? అన్నారు, చెప్పమన్నారు, A.C.T.O. గారితో అన్నారు. అప్పుడు వీర్రాజుగారు జ్ఞాపకము వచ్చిందన్నారు, తణుకు పనిమీద వెళ్లగా ఆఫీసరుగారు కనిపించిరి. ఏ పనిమీద వచ్చారని అడుగగా– రేపు మా ఇంటివద్ద క్రిస్మసు పండుగ జరుగును. కొన్ని సరుకులకొరకు వచ్చానండీ! అని ఆయనతో అన్నారు. అప్పుడు A.C.T.O.గారు– (ఆయన పెంతెకొస్తు మిషనుకు చెందినవారు) క్రిస్మసు పండుగ బైబిలులోలేదు, క్రిస్మసు పండుగ చేయకూడదు అన్నారు. అప్పుడు మీరు అసలు ఇన్ని మిషనులు ఎందుకు వచ్చాయి అనగా ఆయన మీతో కొన్ని విషయములు చెప్పిరి. కాని అవి మీకు సరిపడలేదు. అప్పటికే ఈ జీవరత్నం వేసవి కాలము మీటింగులకు గుంటూరు వెళ్ళదాం! అక్కడ ఒక భక్తుడున్నాడని మీతో అంటూ ఉండేవాడు. మీరు ఆయనతో వెళ్ళాలనుకొంటున్నాను, వెళ్లినట్లయితే ఆయననుకూడ అడిగి తెలిసికొనివస్తాను అని అనుకున్నారు. అని అయ్యగారు చెప్పారు. అప్పుడు అయ్యగారు– ఇది

ఎప్పుడు జరిగింది? డిసెంబరులో. ఇప్పుడు ఏప్రిల్ నెల, ఎంతకాలమైంది? నాలుగు నెలలైంది అన్నారు. ఆ తరువాత ఇన్ని మిషనులు ఎలాగు వచ్చాయో వివరించి చెప్పారు. మీరు కోపముతో వెళ్లిపోతున్నారనే మిమ్మల్ని మరలా పిలిచాను అని చెప్పారు. అప్పటినుండి వీర్రాజుగారు విశ్వాసిగా మారినారు.

ఆ సాయంత్రం వీర్రాజుగారి కుటుంబముతో నేను (జీవరత్నంగారు) కూడ వెళ్లిపోవాలని అయ్యగారితో చెప్పాను. ఎందుకనగా ఆ కుటుంబము మొదటిసారిగా ఈ మీటింగులకు ఇక్కడకు వచ్చినారు. గనుక బాధ్యతగా విడిచిపెట్టుట మంచిదని భావించాను. అయితే, అయ్యగారు నీవు తరువాత వెళ్లకూడదా? అని అన్నారు. అప్పుడు నేను స్టేషనువరకు వెళ్లి వస్తానండీ అనిచెప్పగా, నీవు కడవరకు వెళ్లితే స్టేషనుకు వెళ్ళు (అనగా నీవు వెళ్ళదలచినయెడల వారి ఊరివరకు వెళ్లి విడిచిపెట్టి రా!), కడవరకు వెళ్లకపోతే (వారితోపాటు ఊరికి వెళ్లకపోతే) స్టేషనుకు వెళ్లవద్దు అన్నారు. ఇక నామనసు ఏమి బాగోలేదు, అయ్యగారు వెళ్లొద్దన్నారు! అయినను వీర్రాజుగారిమీద అభిమానంతో మొదటిసారి వారు వచ్చి వెళ్లుచున్నారు గనుక మొత్తంమీద అనుమానంతోనే వారితో స్టేషనుకు వెళ్లాను. నేను వెళ్లేసరికి బండి వచ్చినది, నేను బండిలోనుండి దిగినానని టిక్కెట్ కలెక్టరు పట్టుకొన్నారు. అప్పటికి వీర్రాజుగారు నేనే తీసికొనివస్తిని అని చెప్పగా ఊరుకొని, బండి వెళ్లిన తరువాత మాచర్లనుండి డబుల్‌చార్జ్ (రెట్టింపు సొమ్ము) చెల్లించమనిరి. నావద్ద డబ్బులు లేవనగా రాత్రి 9గం॥ల వరకు గదిలోపెట్టి తాళమువేసిరి. ఆ గదిలో అయ్యగారి మాటమీరి మొఖమాటమునకుపోయి, అభిమాన పాపముచేసితినని ప్రభువువద్ద ఒప్పుకొంటిని. తరువాత ఇంటికివెళ్లి అయ్యగారితో చెప్పగా "నిన్ను తెల్లవారువరకు ఉంచలేదు నయమే!" అనిరి.

ఆ కాలములో ఆర్యసమాజము సభ్యుడైన ఉమామహేశ్వరరావు అనేవ్యక్తి నిడదవోలులో మీటింగులుపెట్టి క్రైస్తవులను దూషించుచు,

క్రైస్తవులపై అధిక విమర్శ చేయుచుండెను. మరియు క్రైస్తవులుంటే నాతో సమాధానము చెప్పుటకు రండి? అని బల్లగుద్ది సవాలు చేయుచుండెను. ఇక నాలుగు దినములకు మా ఊరు వస్తాడనగా ఈ విషయం కొందరు మిత్రుల ప్రోత్సాహముతో తెలిసికొని, అయ్యగారియొద్దకు వెళ్లి ఉమామహేశ్వరరావు విషయము చెప్పి, కొందరు పాస్టర్లను పంపమనగా అందుకు అయ్యగారు– 'ఎవరు వెళ్లనక్కరలేదు, లాభములేదు.మనదగ్గర ఒప్పుకొన్నను, వేదికమీద తన వాదము, తనపని మానడు అనచెప్పి నీవు వెళ్లు! మీ గ్రామములో బుధవారం రాత్రి ఒకరిని కొడతారు అతను పెంతెకొస్తు సంఘస్తుడు. అతడు నీవే అనుకొని వానిని కొడతారు గాన ఆరోజు నీవు గ్రామము వెళ్లవద్దు! వెళ్లితే కలహమురేగితే వెనుకకు తిరిగి చూడకుండ పరుగెత్తుకొని పోవాలి ఇంటికి అనిచెప్పారు. నేను ఇంటికివచ్చి ఆ సంగతి అందరితో చెప్పాను. తరువాత బుధవారం రాత్రి అలాగే జరిగింది. తెల్లవారు ఉదయం అతనినిచూడగా, మా ఊరిలో బోధచేసే జీవరత్నం అనుకొన్నాము అని అతనిని విడిచిరి.

తణుకు తాలూక మోర్తగ్రామ కాపురస్తుడు రొట్టె చంద్రయ్య అనే అబ్బాయి 1958వ సంIIము మార్చిలో S.S.L.C. పరీక్షలువ్రాసి, ఫలితములు వచ్చేవరకు అయ్యగారివద్ద ఉందామనే ఉద్దేశముతో గుంటూరు వచ్చాడట. గుంటూరు వచ్చేసరికి మధ్యాహ్నము అయినది. అయ్యగారి దగ్గర బి.ఎ. సమూయేలుగారు ఉన్నారట. అయ్యగారియొద్దకు చంద్రయ్యగారు వెళ్లగానే నమస్కారము చేసినమీదట అక్కడ తాటాకు షెడ్డులో పండుకో అన్నారట. చంద్రయ్య ప్రయాణ బడలికచేత కొంచెము మత్తుగా నిద్రించుచున్న సమయమున అయ్యగారు ఒక మామిడి పండు, చెంబుతో నీళ్లు, కత్తి ఎవరిచేతనో అక్కడ పెట్టించిరి. చంద్రయ్య లేచేసరికి ఇవన్నియు అక్కడ ఉన్నవి. ఇవి నాకే అనుకుంటాను ఎవరు లేరుకదా! అనుకొని తినడమా? మానడమా? అని సందేహించుచున్నాడట. అంతలో

అయ్యగారు చంద్రయ్యను పిలిపించి, చంద్రయ్యతో– 'గదిలో ఎవరు లేరుగాన నాకే ఇవి అని తినవలెను' గాని ఎంతసేపు అనుమానముతో కూర్చుందువు అనిచెప్పి అవి తిను అన్నారట. తరువాత చంద్రయ్యకు పేపర్ల పనిచెప్పి, సాయంత్రం నీవు ఫలాని హోటల్‌కివెళ్ళి, భోజనంచేసి త్వరగా రా! నీకు ఒకపని చెబుతాను అన్నారట. అలాగే చంద్రయ్య అయ్యగారు చెప్పినట్లు ఆ హోటల్‌కే వెళ్లి త్వరగా భోజనంచేసి వస్తూ, "నాజ్" టాకీస్‌వద్దనున్న ఒక రాతిమీదకూర్చుని, కొంచెంసేపు సినిమా రికార్డులు విని వచ్చాడట. తరువాత అయ్యగారు ఇంతసేపు ఏమి చేసావు అని అడుగగా ఏమి చేయలేదండి భోజనము చేసి వచ్చానండి అన్నాడట. అందుకు అయ్యగారు ఎన్ని రికార్డులు విన్నావు రాతిమీదకూర్చుని అన్నారట. అందుకు చంద్రయ్య రెండు రికార్డులు అన్నాడట. అందుకే నిన్ను త్వరగా రమ్మన్నాను అన్నారట. ఈ మాటలతో చంద్రయ్య తనలోనున్న పొరబాటులన్ని బయటపెడతారేమో అని ఇక ఇంటికి వెళ్లిపోవాలని నిశ్చయించుకొని, మరునాడు అయ్యగారితో నేను వెళ్లిపోతానండి అన్నాడట. అందుకు అయ్యగారు నీవు ఎందుకు వచ్చావు? అన్నారట. తమరిని చూచుటకు, ప్రార్థన చేయించుకొనుటకు వచ్చాను అన్నాడట. తరువాత నన్నుగురించి నీకు ఎలాగు తెలుసు అని అయ్యగారు అనగా మిమ్మునుగూర్చి బి. జీవరత్నంగారు చెప్పినారు అన్నాడట. అందుకు అయ్యగారు ఎప్పుడు వస్తున్నాడు జీవరత్నం అని అడిగితే ప్రతి బుధవారం వస్తున్నాడని అన్నాడట. ఆయన వచ్చినప్పుడు నీవు ప్రార్థనకు వెళ్ళుతున్నావా అని అడుగగా, చంద్రయ్య వెళ్ళుచున్నానని జవాబు చెప్పగా– అయ్యగారు మొన్న బుధవారంకాక అంతకుముందు బుధవారం నీవెందుకు వెళ్ళలేదు అన్నారట. అతను ఆలోచించుకొనగా నిజముగా ఆ రోజు ప్రార్థనకు రాలేదట. అందుకు శరీర బడలికచేత వెళ్లలేదని చెప్పినాడట. చంద్రయ్య నాకు బాప్తిస్మము కావలెనని అడుగగా అయ్యగారు నీవు క్రమముగా ఆరాధనకు వెళ్లుచున్నావా? అని అడుగగా, లూథరన్ సంఘములోనికి వెళ్లుచున్నానని అన్నాడట.

అందులోనికే? క్రమముగా వెళ్ళుచున్నావా? అన్నారట. అందుకు వెళ్ళుచున్నానండి అనగానే మొన్న ఆదివారం ఆరాధనకు వెళ్లలేదే? అన్నారట. చంద్రయ్య ఆలోచించుకొని నిజంగానే వెళ్లలేదు! అందుకు తగిన కారణము చెప్పినాడట. అయ్యగారు– 'బైబిలుమిషను విషయములు ఇంకా బాగా తెలిసికొనవలెను. ఇక్కడ నేను బాప్తిస్మము ఇవ్వగలను ఇచ్చుటకు అధికారము ఉన్నది. కాని పాస్టరు లేనప్పుడు అవసరమునుబట్టి చేయుదునుగాని నీకు అప్పుడే కాదు. నీవు వెళ్లి జీవరత్నంతోచెప్పుము ఆయనే పాస్టర్ ఎలిషాగారిని తీసికొని వస్తాడు. ఇక్కడైనా, అక్కడైనా వారేగా ఇచ్చేది! అనిచెప్పి మోకరించు ప్రార్థనచేస్తా' అని అన్నారట. అతని అంశములన్ని ప్రార్థనచేసి, "ప్రభువా! ఈ చంద్రయ్య వచ్చిన ఉద్దేశము నాతో చెప్పలేదు. నాతో చెప్పుటకు జడియ– చున్నాడుగాని మీతో చెప్పుకుంటాడు. ఎందుకంటే నీవు తండ్రివి గనుక చనువుతో చెప్పును. నాతో చెప్పకపోయినను, నేను ఈ ప్రార్థనద్వారా జవాబు చెప్పుచున్నాను, అదేమంటే కొంతకాలమున ఇక్కడ ఉండవలెనను ఉద్దేశముతో వచ్చినాడు. ప్రస్తుతము ఖాళీలేదు" అని నేను తెలియజేయుచున్నాను అని ప్రార్థించిరట.

## నైనాల వెంకటరత్నంగారి (కట్టుంగ) అనుభవము:-

అయ్యగారు లూథరన్ మిషనులో ఉండగానే ఈయనకూడ దొరల ఆధీనములోనే ఉండేవారు. అయ్యగారు పెద్దవారు, అప్పటికి ఈయన చిన్నవాడు. అయ్యగారు ఒకప్పుడు ప్రయాణమై వెళ్ళుచున్నారు. ఈయనకూడ అయ్యగారితో ఉన్నారు. మార్గమధ్యములో అయ్యగారు ఈలాగు చెప్పిరి– నేను పడిపోతే పట్టుకో! మర్చిపోకు అన్నారట. అప్పుడు ఈయన అయ్యగారికి తలతిప్పుట ఉందేమో అనుకున్నాడట. తరువాత రెండు రోజులు జరిగిన పిమ్మట అయ్యగారు ఆయనను పిలిచి, నీవు బావివద్దకు వెళ్లి, సబ్బుతో బట్టలు ఉతుకుకొని, స్నానముచేసి ఆరిన బట్టలు వేసికొని రా! ఒకపని చెప్పుతానన్నారట. ఈయన అలాగు చేసిరాగానే వీపు నలుపుమనిరట.

ఈయన అయ్యగారి వీపు నలుపుతూ! అయ్యగారూ! మీకు తలత్రిప్పుట ఉన్నదా? అండి, మొన్న దారిలో నన్ను పట్టుకోమన్నారు అని అడిగాడట. అప్పుడు అయ్యగారు– **నాకును, దేవునికినిగల సంబంధములు ఎన్నో గలవు. ఇకమీదట ఎప్పుడు అట్లు అడుగవద్దు. ఈసారి మాత్రమే చెప్పుతాను విను!** నేను పనిచేస్తున్నా, పరుండియున్నా, ప్రయాణములో ఉన్నా, నా ఆత్మ దేవునితోనే ఉండును. ఒక్కొక్కప్పుడు నాయాత్మ దేవునితోకూడ మరియొకచోటికి వెళ్లిపోవును. అప్పుడు ఒకవేళ నేను ప్రయాణములో ఉంటే, నా శరీరములో నేను లేను గనుక పడిపోవుదునేమో! అని పట్టుకోమన్నానుగాని అంత పడిపోయే పరిస్థితి రాదులే అన్నారు.

ఒకప్పుడు అనగా 1956వ సం॥లో ఈర్పిని సత్యవతమ్మ (వేలివెన్ను) అను ఆమెకు ఒకరోజు, 'స్వప్నములో ఎవరో తనకు చేతబడి చేయించినట్లు, ఒక మన్నుతో బొమ్మను తయారుచేసి తన తలవాకిట గడప దగ్గర పెట్టినట్లు కల వచ్చినది. ఆ కల వచ్చిన వారము రోజులకు అట్లే ఆమె తలవాకిట గడపవద్ద ఒకమట్టి బొమ్మ, కుంకము, పసుపు కలవు. అవి ఆమెచూచి, తీసికొని పారవేసి ఇంటిలోనికి వచ్చుసరికి చలిజ్వరము, కాళ్లుచేతులు లాగుట ప్రారంభమైనవి. ఆ మరుసటిదినము నేను, డి.జాన్ అనే ఆయన ఆమె ఇంటికి వెళ్లగా సంగతి అంతయు వారు మాకు చెప్పగా, నేను ఆ సంగతులు అయ్యగారికి ఉత్తరము వ్రాసితిని. తరువాత మేము ఈ విషయములో ప్రార్థన చేయుచూనే ఉన్నాము. కాని, లోపల అధైర్యమున్నది. తరువాత మూడు రోజులకు అయ్యగారు "ఏకష్టమైనను ఏదయ్యమైనను– నీ ప్రార్థనకు మించి– నిలువగలదే" అను పద్యము వ్రాసి పంపిరి (రక్షణ పద్యములలో 126వ పద్యము). ఈ పద్యము చదివి ధైర్యము తెచ్చుకొని, ప్రార్థించితిమి. తుదకు ఆ చేతబడి చేసిన అతడే చనిపోయెను. ఆ సత్యవతమ్మ అనే విశ్వాసి నేటికి సజీవముగానే ఉన్నది.

కానూరు గ్రామములో అనపర్తి సత్యమ్మ అను విశ్వాసి తన కుటుంబము చిక్కుల కొరకు ఏవో ప్రార్థనలు చేసికొనిరట. ఈమె కానూరులో

తన స్వగృహమునందు గదిలో శుక్రవారము ప్రార్థనచేసికొని, అయ్యగారికికూడ కార్డు వ్రాయవలెనని ప్రయత్నించెనుగాని, కార్డు దొరకనందున మానివేసెను. ఆ మరుసటి దినము ఆదివారం గనుక వ్రాయలేదు ఆ తరువాతి దినము సోమవారం గుంటూరునుండి ఒక కార్డు వచ్చినది. అది దేవదాసు అయ్యగారు వ్రాయించినది. పైన అయ్యగారు వ్రాయమన్నారు అని ఉన్నది. తరువాత వ్రాయబడిన సంగతి "అమ్మా! నీవు శుక్రవారము నీ గదిలో చేసిన ప్రార్థన నేను విన్నాను, నీ కోరిక నెరవేరును, భయపడకుము," అంతే ఇంకేమియు వ్రాయబడిలేదు. ఈమె ఏమి ప్రార్థించిందో, ఏమో! అక్కడ వ్రాయించిన అయ్యగారికిని, ఇక్కడ ప్రార్థించిన విశ్వాసికిని తప్ప వ్రాసిన ఆయనకుగాని, చదివినవారికిగాని ఎవరికి తెలియదు. ఈ విషయములో మేము చాలా ఆశ్చర్యపడితిమి.

## పమ్మి సుందరరావు (పొడగట్లపల్లి) గారి అనుభవము:-

నాకు తెలిసినంతవరకు దేవదాసు అయ్యగారి చిన్నతనములోనే ఆయన తల్లిదండ్రులు చనిపోయిరి. 10సం॥ల వయస్సులో రాజమండ్రి లూథర్‌గిరిలో అయ్యగారు చదువుకొన్నారు. పిల్లలందరు ఆటలాడుకొంటూ, పాటలు పాడుకుంటూ ఉండగా, ఈయనకేమి తెలియదనుకొనేవారు. ఎందుకనగా, అయ్యగారు ఒకవైపువెళ్లి ప్రార్థన ధ్యానములో ఉండేవారట. అయ్యగారు థర్డ్‌ఫారమ్ చదివేటప్పుడు ఆయననుచూస్తే ఆ క్లాస్ మాస్టరుగారు భయపడేవారట. ఆర్. పీస్‌దొరగారు అయ్యగారిని రెండువందల మంది పిల్లలమీద వార్డెన్‌గా ఏర్పాటుచేసారు. అయ్యగారు ఎప్పుడు ఏకాంత ప్రార్థనలో సమయము గడుపుచుండేవారు. బి.క్లాస్ చదివి పాదుర్లుగా వచ్చినవారికి, పాస్టర్లకి అయ్యగారు ఇంగ్లీషులో బోధించే మాస్టరుగా ఉండేవారు. ఒకసారి పుష్కరాల సమయములో ప్రభువు అయ్యగారితో– 'పుష్కరాలకు 64భాషలుగల జనులు వస్తున్నారు గనుక నీవు నేను చెప్పేది

వ్రాయుము' అని– 64 భాషలతోగల సువార్త ఒక గంటలో వ్రాయించి అచ్చుకి ఇచ్చి పత్రికలు పంచమనిరట. అయితే, ఆ అచ్చుకు డబ్బులు మార్చుకురమ్మని పిల్లలకు ఇచ్చి పంపగా డబ్బులు మార్చుకొని వస్తుండగా, మధ్యదారిలో గాలివీచగా చేతిలోనున్న రూపాయి కాగితములు ఎగిరిపోయినవి. అప్పుడు ఆ పిల్లలు మధ్యదారిలోనే ఏడుస్తుండగా అయ్యగారు తనదగ్గరనున్న ఇద్దరు పిల్లలను పిలిచి, డబ్బు పడిపోయిందని వెళ్ళినవారు ఏడుస్తున్నారు గనుక మీరు వారివద్దకు వెళ్లి డబ్బు చేతిలో ఎక్కడ జారిపోయినదో అక్కడనుండి కుడివైపువెళ్లి, బ్రహ్మదండి చెట్లుగల డొంకలో పడి ఉంటాయి, పట్టుకురమ్మని అయ్యగారు చెప్పి పంపగా, ఆ విధముగానే డబ్బు దొరకగా పిల్లలు ఆ డబ్బు పట్టుకొనివచ్చిరట.

## సువార్త అనుభవము:-

బలభద్రపురం గ్రామ సువార్తకు 40మందిని అయ్యగారు తీసికొనివెళ్లగా, అక్కడనున్న మాస్టరుగారి పంతులమ్మ, వారందరిని చూచి, ఇంతమందికి భోజనము ఎక్కడ తెచ్చిపెట్టము? ఇంట్లో ఏమి లేదని మాస్టరుగారితోచెప్పి, నాకు తలపోటు వచ్చినది అని పండుకొనినదట. అయ్యగారును పిల్లలను బడిలో కూర్చుండగా మాస్టరుగారు వచ్చి పంతులమ్మగారికి బాగోలేదని తలపోటు వచ్చినదని, ఇంట్లో ఏమి లేవని చెప్పగా, అయ్యగారు– 'నిజమే, తలపోటువస్తుందదండి' అని అనగానే మంచంమీదున్న ఆమెకు తలపోటు వచ్చినది. అపుడు అయ్యగారు మీ ఇంటిలో ఉన్నమటుకు తీసుకురండనగా, మూడు సోలల బియ్యం పట్టుకొని వచ్చిరట. అయ్యగారు వండించిపెట్టగా ఆ కొద్ది అన్నము 40మంది పిల్లలు తిన్నారు, మాస్టరుగారుకూడ తిన్నారు. అప్పుడు మాస్టరుగారు తప్పుఒప్పుకొని అయ్యగారిని తీసికొనివెళ్లి ఇంటిలోని తన భార్యనెత్తిన చెయ్యి ఉంచి ప్రార్థన చేయించగా, పోటు తగ్గినదట ఆయనపేరు జాన్‌మాస్టర్.

## అజరయ్యగారి అనుభవము:-

అజరయ్యగారు 1949లో అయ్యగారి దగ్గరకు వచ్చేసరికి అయ్యగారికి చూపులేదు, ఆయాసము వస్తుండేది. 1949 ఏప్రిల్ నెలలో అయ్యగారు ప్రతి ఉదయము, సాయంత్రం ఆదికాండము మొదలు ప్రకటన గ్రంథము వరకు పాఠములు నేర్పించేవారు. అజర్యాగారి తండ్రిగారు శ్రీ. జె. రాజారావుగారికి ఉత్తరము వ్రాసి గుంటూరు పంపగా, పెదకాకాని తోటలో దేవదాసు అయ్యగారు ఏర్పాటు చేసిన రెండు వారముల బైబిలు తరగతులకు వీరు హాజరైనారు. అప్పుడు కాకాని తోటలో వేయబడిన (మామిడితోట) పాకలో ఒక చిన్నగది ఉండేది. అందులో అయ్యగారు ఉండేవారు. అయ్యగారు ఆ వృద్ధాప్యములో అక్కడ ఉంటూ ఎంతో శ్రద్ధగా రక్షణ మహాసంకల్పన నేర్పించారు. అయ్యగారి జీవితమును వీరు గమనించినపుడు; వీరి వృద్ధాప్య సమయములో అనగా అసలు కన్నులు కనపడని స్థితిలో– మళ్ళీ మొదలుపెట్టి, ఇంకొక తరమువారికి బైబిలు తరగతిలో వాక్యోపదేశము ఈలాగు చేయగలనా? అని అనిపించినది. అయ్యగారు గొప్ప ఉపాధ్యాయుడు. ప్రతి అంశమును మొదటిది, రెండవది, మూడవది అని చెప్పి, మరలా తిరిగి అన్ని అంశములను చెప్పేవారు. ***తగినన్ని ఉదాహరణలు, మరచిపోలేని మాటల కూర్పు ఇచ్చేవారు.*** 1951లో వీరు మరలా దేవదాసు అయ్యగారియొద్దకు వచ్చినప్పుడు, ఇప్పుడేమి చేస్తున్నావు? అని అయ్యగారు పలకరించి, నా దగ్గర రెండు వారములుండి పనిచేసిపెట్టగలవా? అని అడిగినారు. రెండు వారములు ఉంటాను అని చెప్పిన ఆయన రెండు సం॥లు అయ్యగారి దగ్గరే ఉండిపోయారు. అయ్యగారు, వీరితో నీవు ఒక తీర్మానం చేసికో, అనిచెప్పి, కొన్ని అంశములు ప్రత్యేకముగా వ్రాయించి, ఇది 'సమర్పణ పత్రము'; దీని ప్రకారము నేను సేవ చేస్తాను అని తీర్మానపత్రము వ్రాయించిరి. అందులోని అంశములు: (1) నేను ఉచితముగా పొందాను గనుక ఉచితముగా సేవచేస్తాను. (2) క్రీస్తును ఎరుగని హిందూ సోదరులమధ్య

సేవ చేస్తున్నప్పుడు, నీకు పైనుండి ఎంత డబ్బు వస్తుంది? అని వారు అడుగుతారు గనుక నేను జీతము తీసికోకుండా సేవచేస్తాను. (3) నేను ఒంటరిగానే ఉంటాను, నేను సువార్తనే ప్రకటిస్తాను. (4) నేను కాపరిగా సంఘమును చూచుకొనుటకంటే రక్షణ సువార్తను అనేకులకు ప్రకటించుటకు సమయమును వెచ్చించుదును. (5) ముసలమ్మ ముచ్చట్లుమాని, చిన్న బిడ్డలపై ప్రేమ మంచిదేగాని, అందరిమధ్య ఎక్కువ సమయము ఉండుటకు ప్రయత్నము చేస్తాను. (6) పరిశుద్ధముగా ఉంటాను" అని ఈలాగున 24 అంశములపై తీర్మానమును వ్రాయించారు. ఒకసారి వారు అయ్యగారితో ***'ప్రభువు ఇప్పుడే రారు గదండీ' అన్నారు.*** అందుకు అయ్యగారు– ఆయన ఇప్పుడే రావాలని నీకు లేదుగదా? నీకు– వివాహము చేసికొని, పెద్ద ఆదాయము కలిగి, కుటుంబము కలిగి లోకములో జీవించాలనే ఆశ నీకు ఉన్నది కదా! అందుకనే నీకు ఇప్పుడే రావద్దని ఉన్నదికదా! అన్నారు. అయ్యగారు ఎంత పాతకాల సంగతులైననూ, చక్కగా జ్ఞాపకము పెట్టుకొని ఆ స్థలాన్ని, విషయాన్ని చక్కగా వివరించి చెప్పగలిగేవారు. ఆయన మనో నిదానముతో ఆలోచించి మాట్లాడేవారు, ***ఆయన ఎవరిని విమర్శించుట కాని, వ్యాఖ్యానించుటకాని చేయలేదు.*** అయ్యగారు ప్రతి ప్రసంగములోను, పెండ్లికుమార్తె వరుస, ఈ వధువు సంఘ స్థితిలో మీరు ఉన్నారా? పరీక్షించుకొండి" అనేవారు. దైవాత్మగురించి చెప్పినప్పుడు భాషలున్నాయి, భాషలకు అర్థాలు చెప్పాలి అని అనేవారు, ***కాని అయ్యగారు బహిరంగముగా ఎప్పుడూ భాషలలో మాట్లాడలేదు.*** అయ్యగారు భాషలు మాట్లాడుచున్నవారిని ఆపేవారుకాదుగాని, వారిని ఆ భాషకు అర్థము చెప్పమనేవారు. అయ్యగారినిబట్టి ఈ భాషా వరమున్నవారు జాగ్రత్తగా అర్థము చెప్పేవారు. కొన్నిసార్లు దైవప్రత్యేకతను గురించి (భాషతో) మాట్లాడుతూ ఉండేవారు. గనుక అయ్యగారిని ప్రశ్నించటానికి ఎవరును సాహసించే వారుకాదు. అయ్యగారు రిఫరెన్స్ ఎంతో చక్కగా చెప్పేవారు, ***వాక్యాన్ని మాటిమాటికి చదివించేవారు కాదు.*** పేతురుగారు ఇలా వ్రాస్తున్నారు,

పౌలుగారు ఇలా వ్రాస్తున్నారు అని వివరించేవారు. ఆయన పండుకొని యున్నప్పుడు ఏమి ఆలోచించేవారో తెలియదు. లేచిన వెంటనే ఫలాని పుస్తకముల షాపులో ఒక పుస్తకము ఉంటుంది! డబ్బులు పంపించి ఆ పుస్తకము తెప్పించమనేవారు. దేవదాసు అయ్యగారు కలకత్తానుండి "ఇండియన్ క్రిస్టియన్" (Indian Christian) "ఎఫిఫనియా" (Ephiphania) అనే క్రైస్తవ పత్రికలను తెప్పించేవారు. అయ్యగారు ఆయా కాలములనుబట్టి "పత్రికలు" అచ్చువేయించేవారు. ఆ సమయములో పండిట్ నెహ్రూగారి మీటింగ్సు గుంటూరు పోలీస్ ఫేరెడ్ గ్రౌండ్స్‌లో జరుగుచున్నవి. అయ్యగారు ఆ సమయములో ఒక సువార్త పత్రిక అచ్చువేయించి పంచగా, అవి మీటింగు పత్రికలనుకొని ఆ సువార్త పత్రికలను చాలామంది తీసికొన్నారు. అంత పెద్దవయస్సులో చూపులేకపోయిననూ, చార్టులేకపోయిననూ ప్రజలముందు చార్టు చూపుతున్నట్లుగానే పరలోకము, దేవదూతల లోకము, వాయుమండల లోకము, భూలోకము, పాతాళ లోకము అని చక్కగా వివరించి, మనస్సులో ముద్రించినట్లుగా చెప్పేవారు. ఒక పర్యాయము అయ్యగారు ఆరోహణమైపోతారని అందరు పాదుర్లు, పనివార్లు అనుకొనుచుండగా, నేను (అజరయ్య) అయ్యగారూ! పితామహుల కాలములో హనోకుగారు ఎత్తబడ్డారు, ప్రవక్తల కాలములో ఏలియాగారు ఎత్తబడ్డారు, ఈకాలములో మీరెత్తబడతారని అందరు అనుకొంటున్నారు అని అనగా అయ్యగారు చిన్నగా నవ్వుకొని– పితామహుల కాలములో హనోకుగారు ఎత్తబడ్డారు, ప్రవక్తల కాలములో ఏలియాగారు ఎత్తబడ్డారు, సంఘ కాలములో సంఘము ఎత్తబడుతుంది. నేనెందుకు అలా ప్రత్యేకముగా ఎత్తబడతాను, సంఘముతోపాటు ***అందరము*** ఎత్తబడతాము' అని అన్నారు. ఈలాగున అనవసర ఊహాగానాలుచేసే కొందరి భక్తిజీవితము గురించి వారిది ***"చిమిడిపోయిన భక్తి"*** అని అనేవారు. అనగా సరియైన పాకానికి వచ్చిన భక్తికాదు, మిగుల ఉడికినదని అర్థము. యేసుప్రభువు గురించిన సంభాషణకంటే

తన స్వవిషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారంటే అయ్యగారికి ఇష్టములేదు. అయ్యగారు ఇట్టివారినే చిమిడిపోయిన భక్తిగలవారనేవారు.

ఎవరైనా ఆయనను చూడటానికి, ప్రార్ధన చేయించుకోవడానికి వస్తే నాకు వీలులేదని ఎప్పుడు అనలేదు. వారి పరిస్థితులనుబట్టి, వాక్యానుసారముగా ఆయన సొంతమాటలు వివరించి చెప్పేవారు. బైబిలు విషయములైతే మరలా చదవండి అని సామాన్యులైనవారికి కూడ అర్ధమయ్యేలా చెప్పేవారు. **అయ్యగారు అలవాటు భక్తి నేర్పించలేదు.** ఆచార భక్తిని నేర్పించలేదు, ఆత్మానుసారమైనదే నేర్పించారు. అయ్యగారు అందరి భక్తులవలె కాకుండా మానవజీవితము ఎటువంటిదో, ఆధ్యాత్మిక జీవితం ఎటువంటిదిగా ఉండాలో సమతూకముగా తన అనుభవములో చూపించిన దైవజనుడు. కొన్నిసార్లు ఏదైనా చదివి గుర్తుంచుకొని వారితో మాట్లాడితే, అవసరమైతేనే సమాధానము చెప్పేవారు, లేకుంటే సమాధానము చెప్పేవారుకాదు. అయ్యగారు పెద్దవయస్సునుబట్టి అనేకమారులు నాడీ పడిపోవుచుండేది. వైద్యము చేసే డాక్టరుగారితో వారి యోగక్షేమాలు మాట్లాడుచు వైద్యము చేయించుకొనేవారు. అయ్యగారు ఎప్పుడు ఆయన ఆరోగ్య విషయములో నాకు బాగోలేదు అని ఎన్నడు అనలేదు. అయ్యగారి భోజన విషయములో ఏదిపెట్టినను తినేవారు, నాకు ఫలానిది ఇష్టములేదు అని ఎన్నడూ అనేవారుకాదు. ఆరోగ్యానికి ఇది ఏలాగు మంచిది? అని ప్రతిది ఉపయోగము అడిగి తెలిసికొని తీసికొనేవారు.

## పౌలుగారి అనుభవము:-

వీరు (I.A.F) ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ నుండి అయ్యగారి దగ్గరకు వచ్చే సమయమునకు జాన్‌సుందరరావు అనే అబ్బాయి అయ్యగారికి పరిచర్య చేసేవాడు. పౌలుగారి తండ్రిగారు స్టీమర్ డ్రైవరు (నర్సాపురం–ధవళేశ్వరం) వీరు అయ్యగారిని శానిటోరియంనుండి ఎరుగుదురు. అయ్యగారు సోమవారం స్వస్థత ప్రార్థనలు చేసేవారు. ప్రభువు అయ్యగారిలోనుండి పనిచేసేవారు.

'పౌలూ! ప్రభువు వచ్చి మాట్లాడివెళ్ళారు' అని అయ్యగారు వీరితో అంటూ ఉండేవారు. వీరు అయ్యగారికి క్షౌరం చేసేవారు. అయ్యగారు చాలా శుభ్రతను పాటించేవారు. 1960లో అయ్యగారు చనిపోయే సమయమునకు డబ్బు విషయం అంతా పౌలే చూడాలన్నారు. **అయ్యగారి దగ్గరకు అనేకులు ఏడుస్తూ వచ్చేవారు, వెళ్ళేటప్పుడు నవ్వుతూ వెళ్ళేవారు.** ఆయన ఎప్పుడు కోపపడలేదు. పౌలుగారి అక్కగారైన కోటె మాణిక్యమ్మగారు అయ్యగారు రాజమండ్రిలో నుండగా పరిచర్య చేసేవారు. ఆమె కుమార్తె క్రిస్టినా పుష్పాబాయి అనే ఆమెకు చెవి పోటు వచ్చినప్పుడు, అయ్యగారు మీటింగునకు బయటికి వెళ్ళియున్నారు. అయ్యగారు మీటింగులో ఉన్నారు, బాధపడుతున్న ఈ కుమార్తె 'అయ్యగారుంటే బాగుండును' అని అనుకొనగా కొద్దిసేపటికి అయ్యగారు వచ్చి చెవిలో వ్రేలు పెడితే తగ్గిపోయినది. అనగా అయ్యగారు ఆ రోజు మీటింగులో ఉన్నారు. అదే సమయములో ఈ కుమార్తెను బాగుచేసారు. ఒకరోజు మధ్యాహ్న సమయములో అయ్యగారు, పౌలుగారిని గ్లాసులో నీళ్ళు తీసికొని రోడ్డుమీదికి వెళ్ళమన్నారు. అయ్యగారి మాటకు లోబడి ఆయన నీళ్ళగ్లాసుతో వెళ్ళుచుండగా, ఎదురుగా దాహార్తితో, అలసిపోయి వస్తున్న అన్నమ్మగారు ఎదురయ్యారు. వీరు అప్రయత్నంగా ఆ గ్లాసు నీళ్ళు ఆమెకిచ్చేసారు. ఆమె ఆ నీరు త్రాగి, తెప్పరిల్లి ప్రాణం నిలుపుకొని, అయ్యగారి దగ్గరకు వచ్చారు. వారు ఈలాగు అయ్యగారి దగ్గరకు వచ్చినప్పుడు దాహము తీరినదా! అన్నారు. ఒకసారి పౌలుగారి భార్య శ్రీమతి. విజయలక్ష్మిగారు ఆమె చెల్లెలు విశ్వాసకుమారి ఒకరోజు వారి ఇంటిలోని సమస్యలన్నిటిని అయ్యగారికిచెప్పి, ప్రార్థన (22అంశములు) చేయించుకుందాము అని అనుకొని, దారిలో వాటి విషయమై మాట్లాడుకొనుచు బేతేలు గృహము చేరినారు. అయ్యగారు వీరిని చూస్తూనే అటెన్షన్ అనిచెప్పి వారిని నిలువబెట్టి ప్రార్థనచేసి, ఇక వెళ్ళండి అన్నారు. దగ్గరున్న చార్లెస్‌గారు– 'అయ్యగారండీ! మీరు వారి అంశాలేవి అడుగకుండానే ప్రార్థించి వెళ్ళిపొండి' అంటున్నారు అనగా– అబ్బాయ్ నేను వారి ప్రార్థనాంశములన్నీ చేశానోలేదో వారినే అడుగు

అని అయ్యగారు అన్నారు. అప్పుడు శ్రీమతి. విజయలక్ష్మిగారు, ఆమె సహోదరి మేము ఖచ్చితముగా మనస్సులో అనుకున్న అంశాలన్ని అయ్యగారు ప్రార్థించేసారు అన్నారు.

ఒక డాక్టరమ్మగారున్నారు. ఆమె పేరు వరమ్మ. ఆమెకు పిచ్చివచ్చి మతి సరిలేక చెరువులోనికి వెళ్ళిపోయారు. సమూయేలు అయ్యగారు, నలుగురు అయ్యగార్లు వరమ్మా! అయ్యగారు రమ్మంటున్నారు అంటే రాలేదు. శామ్యేల్‌గారు ఒక టవలు గిరాటు వేస్తే, అది కప్పుకొని బైటికి వచ్చారు. అప్పుడు అయ్యగారి దగ్గరకు ఆమెను తీసికొస్తే, వరమ్మా! అని చెయ్యి పట్టుకోగానే ఆ పిచ్చి ఆమెను వదలిపోయినది. ఆమె స్వరైపోయినది. మరలా ఉద్యోగము చేయుటకు హాస్పటల్‌కు వెళ్ళి, విధులలో పాల్గొన్నారు.

పి. ఎస్తేరమ్మ అనే టీచరుగారు 1956లో అయ్యగారిని చూడడానికి వచ్చారు. ఆ కాలములో ఏలూరు పీటర్స్ బిల్డింగ్‌లో జి. సమూయేలుగారు మరికొందరు పాదుర్లువచ్చి ప్రసంగములు చేసేవారు. ఎస్తేరమ్మగారు శ్రమలు కోరుకొనగా శ్రమలు వచ్చినవి అప్పుడే ఆమె ఉద్యోగముకూడా పోయినది. ఈ విషయములు జి. సమూయేలుగారు గుంటూరులోనున్న అయ్యగారితోచెప్పగా ఆమె బాధలో ఉన్నది గనుక ఈ 5రూ/- ఆమెకు ఇవ్వమని అయ్యగారు పంపారు. ఎస్తేరమ్మగారికి ఆ సొమ్ము ఇవ్వగానే సన్నిధిలోనికివెళ్ళి, ప్రభువునకు కృతజ్ఞత చెల్లించి 'అయ్యగారండి మీకు చాలా వందనాలండి' అని మనస్సులో అనుకొన్నారు. తరువాత సోమవారము జి. సమూయేలుగారు, గుంటూరువచ్చి అయ్యగారితో ఎస్తేరమ్మగారు మీకు వందనాలు చెప్పారండి అనగా అయ్యగారు- అబ్బాయ్! శ్యామ్ ఆ 'వందనాలు' ఎప్పుడో వచ్చేసినాయి అన్నారట. కొంతకాలమునకు ఆమె ఉద్యోగము మరలా ఆమెకు వచ్చేసినది.

ప్రతిరోజు అయ్యగారి గది ప్రక్కనే సరిగా సాయంత్రం 5గం॥లు అవగానే నిమ్మచెట్టు మీదికి పిచ్చుకలన్నీ చేరి, సన్నిధి చేసేవి. ఒక గంట

సమయం అనగా సాయంత్రం 5గం॥ల నుండి 6 గం॥ల వరకు ఒక కాకి వచ్చి, కావ్ కావ్ అని అరిచేది. అయ్యగారు అదేమంటుందో వినండి, చూడండి అనేవారు. అది రాకడ, రాకడ అంటుంది అని చెప్పారు.

1935, 36 37,38 సం॥లలోనే అయ్యగారు, విజయరత్నంగారు నంబూరులో ఉన్న నీలం రాజారావుగారి దగ్గరకు వచ్చేవారు. అయ్యగారు రాజమండ్రినుంచి వచ్చి ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించుటకు నీలం రాజారావుగారు నంబూరు స్టేషను వెనుకవైపు తాటాకు పందిరితో ఒక గృహమువంటిది నిర్మించారు. రాజమండ్రినుండి అయ్యగారు, విజయరత్నంగారు, బెంజిమన్‌గారు వచ్చి, అక్కడ నంబూరులో ప్రార్థనలు పెట్టేవారు. అయ్యగారు వచ్చి ఉపవాస ప్రార్థనలు జరిపినపుడు పరిశుద్ధాత్మ కుమ్మరింపు జరిగినది. అపుడు అందరికి వరాలు వచ్చినవి. గుంటూరులోని గాంధీ పార్కులో సుందరసింగ్ గారి మీటింగ్ పెట్టారు. మీటింగులో పెద్దవర్షం, ఓపెన్ గ్రౌండ్ అగుటవలన అందరు తడిసిపోయారు. కానీ, సుందరసింగ్‌గారు తడవలేదు. దేవదాసు అయ్యగారు బేతేలు గృహ వరండాలో ప్రసంగిచేటప్పుడు, ఏ భక్తుని గురించి లేక ఏ దైవగ్రంథము గురించి చెప్తుంటే, దానికి సంబంధించిన పరలోక భక్తులు అక్కడుండేవారు. నీలం రాజారావుగారు ఆదివారం గుడికి వెళ్లకుండా అయ్యగారితో ఎక్కువ సమయము గడపవచ్చునని ఆయన దగ్గరకు వచ్చినప్పుడు ఇది తప్పు గుడికి వెళ్ళుమనిచెప్పి పంపిచేవారట. అయ్యగారికి భోజన సమయమైనపుడు, ***బి.ఎ.గారు – 'అయ్యా! మీకు భోజనసమయమైనది, ముగించండి'*** అంటే ఆయన వెళ్లందే నేను ఎలా ముగించను! అనేవారట.

## పి. సిల్వియమ్మగారి అనుభవము:-

యం. కాంతమ్మగారు తన కుమార్తెను దేవదాసు అయ్యగారి వద్దకు తీసుకొని వెళ్ళుచూ, ఆమెతో "అమ్మా! దైవజనునికి ఇహలోకపు చూపులేదుగాని పరలోకపు చూపు ఉన్నది. ఆయన అన్ని చూడగలరు. జరిగినవి జరుగబోవునవి అన్నియు చెప్పగలరు" అని చెప్పారు. వీరిరువురూ

అయ్యగారి దగ్గరకు వెళ్ళగానే ఆయన, భూషణం అని పిలిచి వీరిరువురికి స్టూలు వేయి అని చెప్పిరి. భూషణంగారు తల్లికి మాత్రమే కూర్చుండుటకు స్టూలు వేసిరిగాని పిల్లకు వేయలేదు. నేలమీద శుభ్రముగా ఉన్నందున ఆ అమ్మాయి క్రింద కూర్చుండెను. అయ్యగారు అప్పటికీ మంచముమీద కూర్చుని చూచి, భూషణం అని పిలిచి ఎందుకు స్టూలు వేయలేదు? అని అడిగి స్టూలు వేయించి కూర్చుండబెట్టిరి. అపుడు వెంటనే ఆ తల్లి చెప్పిన మాటలు పిల్లకు చక్కగా అర్ధమైనవి. అయ్యగారి ఎదుట ఎవరు నిలువబడినా, కూర్చున్నా ఆయన వారి అంతరంగములో ఉన్న సంగతులను చూచి మాట్లాడెడివారు. ఏలాంటి మనస్సుతో ఆయన దగ్గరకు వెళ్లుదుమో, దానినిబట్టి మనకు జవాబు దొరికెడిది.

ఒకరోజున సిల్వియమ్మను అయ్యగారు పిలిచి, తల స్నానము చేయించగలవా? అని అడిగిరి. ఆ పిల్ల తన మనస్సులో 'ఎంత పని? వృద్ధులుకదా! తక్కువ వెంట్రుకలే ఉండునుగదా' అనుకొని చేయిస్తాను అని చెప్పినది. అపుడు అయ్యగారు కుంకుడుగాయలు కొట్టు అన్నారు. అయ్యగారి గది ప్రక్కన ఉన్న చిన్న గదిలో అయ్యగారికి స్నానము చేయించెడివారు. అక్కడ గడపదగ్గర మెట్టుమీద ఆమె కుంకుళ్ళు కొట్టారు. అయ్యగారు గదిలో ఉన్నారు. అయ్యగారి దగ్గరకు వెళ్ళి కొట్టానండి, నానబెట్టాను అని చెప్పారు. వెంటనే ఎక్కడకొట్టావు? అని అడిగారు. మెట్టుమీద కొట్టాను అని ఆమె చెప్పగా, అందరూ నడిచేచోట కాళ్ళ దుమ్ము ఉంటుంది గదా! ఆ దుమ్మంతా నా తలమీద పోస్తావా? అని అడిగారు. వెంటనే భూషణంగారిని పిలిచి పెద్దమ్మగారి దగ్గరకు ఇవి తీసికొనివెళ్ళి, ఉడకబెట్టి పై నీళ్ళు పారబోసి అప్పుడు తలస్నానము చేయించు అని చెప్పిరి. కాళ్లు తోముటకు మిక్కిలి మరియమ్మగారు ఉండెడిది. **కాళ్ళు ముట్టుకొన్నవారు పై శరీరము ముట్టుకోకూడదు.** అయ్యగారికి స్నానము బహు ప్రత్యేకమైన రీతిలో చేయించెడివారు.

స్త్రీల బైబిలుక్లాసు జరిగేటప్పుడు అయ్యగారిని చంపివేయవలెనని సాతాను చాలా ప్రయత్నముచేసింది. చంపడానికి, కీడు చేయడానికి వచ్చిన సైతానును ఆయన తలుపు దగ్గర కుక్కను కట్టినట్లు కట్టేశారు. అందరికి 'తెల్లవారే వరకు తలుపు తీయవద్దు' అని చెప్పారు. ఏ అవసరము ఎవరికి రాకుండ ప్రార్ధన చేసారు. ఎవరికి ఏ అవసరము వచ్చేదికాదు. అయ్యగారు సైతానును విప్పి పొమ్మనేవరకు వెళ్లడానికి వీలులేదు అదే ఆయన పవర్.

## జోసఫ్‌గారి అనుభవము:-

వై. జోసఫ్‌గారు 1953లో పరిచర్య చేయుటకు అయ్యగారి దగ్గరకు వచ్చారు. జి. సమూయేలుగారు వీరిని అయ్యగారి దగ్గరకు తీసికొని వెళ్ళారు. వీరు అప్పటికే యస్.యస్.యల్.సి చదివియున్నారు. అయ్యగారు మోకరించమనగా, వీరు మోకరించారు, అపుడు ఆయన ప్రార్ధన చేసారు. అప్పటినుండి అయ్యగారికి పరిచర్య చేయుటకు స్థిరపడ్డారు. అయ్యగారి కాళ్ళకు తాడు బందులు పెట్టి, లూజ్‌గా ఉండేటట్లు Stockings కుట్టించేవారు. అయ్యగారి కాళ్ళకు బాగా దురదలు ఉండేవి. ఆయన కాళ్ళకు వీరు మర్దన చేసేవారు. ఆయా ఊళ్ళనుండి అనేకులు అయ్యగార్ని చూచుటకు వచ్చేవారు. అయ్యగారండీ! ఫలానా ఊరినుండి వారు వచ్చారండీ అని చెప్పితే వాక్యము చదివి కొంచెం వివరించి చెప్పమనేవారు. మరికొందరు అయ్యగారు మొన్నమీరు వచ్చి (దర్శనములో) నాకు ప్రార్ధన చేసారండి అని అనేవారు. అప్పుడు అయ్యగారు నేనెక్కడ వచ్చాను! ఇక్కడే ఉన్నానుకదా! అనేవారు. అందుకు నేను అయ్యా నిజమేనండి మీరిక్కడే ఉన్నారు నేను మీకు సేవచేస్తూ ఉన్నాను అనేవాడిని, ఇలాంటి వింత వార్తలుకూడా ఉండేవి. తరువాత ఒకరి తరువాత ఒకరిని ప్రార్ధన చేయించి పంపేవారు. రాజారావుగారి భార్య, ఆమె అత్తగారు భోజనం తయారు చేసేవారు. వీరు బజారునకు వెళ్ళి సరుకులు తెచ్చేవారు. టైం ప్రకారము అయ్యగారికి భోజనం

పెట్టేవారు. తయారైన భోజనమును అయ్యగారికి వీరు స్పూన్‌లో ముద్ద కలిపిపెడితే, అయ్యగారు స్పూన్‌తోనే తినేవారు.

ఒకసారి ఎవరో ఒకాయన ప్రార్థన చేయించుకొనుటకు రాగా, భోజనం టైం అయినది అయ్యగారు భోజనం చేసిన తరువాత నేను మరలా మిమ్మల్ని పిలుస్తాను అని వచ్చిన ఆ వ్యక్తితో జోసఫ్‌గారు చెప్పారు. అయ్యగారి గది తలుపులు దగ్గరగా వేసి ఉన్నప్పటికిని, ఆ వ్యక్తి తిన్నగా వెళ్ళి అయ్యగారి కాళ్ళమీదపడిపోయాడు. అయ్యగారు కేకవేసినారు కానీ అప్పటికే ఆ వ్యక్తి రోడ్డుమీదికి వెళ్ళిపోయాడు. అయ్యగారిని ముట్టుకొంటే బాగుపడతాను అనుకున్నాడు. ముట్టుకున్నాడు, చేతికున్న పక్షవాతము తగ్గిపోయింది. స్వస్థత పొందాను అని తర్వాత వారం స్వస్థిశాలలో సాక్ష్యము చెప్పి 4,000రూ. కానుక వేసాడు. ఆ రోజులలో (1953) ఈ కానుక కాకాని చందా రిజిష్టర్‌లో వ్రాయబడింది. జోసఫ్‌గారు అయ్యగారి దగ్గరకి వచ్చేటప్పటికి అయ్యగారి వయస్సు 100 సం॥లు పైనే ఉంటుంది.

## అయ్యగారు కానుకపట్టే విధము:-

పళ్ళెము మీద వస్త్రము ఉంచి, దానిమీద బైబిలుపెట్టి మరలా దానిమీద వస్త్రము ఉంచితే దానిమీద కానుక ఉంచాలి, ఆయన డబ్బు ముట్టుకోరు, ఇలాచేసిన తరువాత వారికొరకు ప్రార్థన చేసేవారు. ఫలాని రోజున ఫలానవారు ఇచ్చినవి అని వీరు అకౌంట్స్ వ్రాసేవారు. 1955వ సం॥లో అయ్యగారు ప్రభువు రమ్మంటున్నారు నేను వెళ్ళిపోతున్నాను అన్నారు. అప్పుడు మిషను నలుగురు అధికారులు, బి.ఎ. సమూయేలుగారు అయ్యగారి ఎదురుగా ఉన్నారు. అపుడు జి. సమూయేలుగారు అయ్యా! మేమింకా చిన్నపిల్లలము, ఈ బైబిలుమిషనును మీరు లేకుండా నడిపించలేము అన్నపుడు అయ్యగారు **"బైబిలుమిషను నాయకుడు ప్రభువే, నేను వెళ్ళిపోతాను *నన్ను సమాధి చేయవద్దుగాని దహనం చేయండి. ఒకవేళ సమాధిచేస్తే ప్రజలందరు వచ్చి నాకే నమస్కారము చేస్తారు. వారంతా దేవునికి***

**నమస్కారము చేయాలి కానీ, నాకు కాదు కదా! ఆయనకు చెందవలసినది నాకు వస్తే, అది గొప్ప నేరము. నేను 'దేవునికి లెక్క చెప్పాలి"** అని ఈ మాట చెప్పుచున్నప్పుడు వై. జోసఫ్‌గారు, నలుగురు పాస్టర్లు ఉన్నారు. ఆ తర్వాత కొన్ని దినములు వీరంతా అయ్యగారి గురించి ప్రార్థన చేశారు. అయ్యగారికి హిజ్కియావలె ఆయుష్షు పెరగటం జరిగినది. అది దేవుని ఏర్పాటు. అయ్యగారి దగ్గర ఉన్నప్పుడు అయ్యగారి రోజువారి కార్యక్రమము అంతా వీరు నోట్ చేసికొనేవారు, అనగా వ్రాసికొనేవారు. కొన్ని కొన్ని కన్‌వెన్షన్స్‌కు అయ్యగారుకూడ వెళ్ళేవారు. "మనోవిచారము", "స్థిమితము లేదు కదా" అనే పాటలు పల్లవి దగ్గర నుండి మొత్తము ఆఖరు వరకు, అయ్యగారు చెప్పితే వీరు వ్రాసారు.

## పెట్టెలో నిండుగా చేరిన డబ్బు:-

ఒకసారి వీరు కొన్ని కరపత్రములు ప్రచురణ కొరకు ఇచ్చారు. అయితే వాటిని తిరిగి తెచ్చుటకు, 'డబ్బు లేదని' అయ్యగారితో అనగా, అయ్యగారు మోకరించి ప్రార్థించమన్నారు. ఒక అరగంట తరువాతవెళ్ళి చూడమన్నారు వెళ్ళిచూడగా, పెట్టెలో డబ్బు లేదు. మరలా రెండు గంటలు మోకరించి ప్రార్థించమన్నారు. ఆ తర్వాత మరలా వెళ్ళి, పెట్టెలో చూడమన్నారు. వెంటనే వీరు పెట్టె తెరచి చూసారు. అంతే, పెట్టెనిండా డబ్బే. కావలసినంత వరకు తీసికొని ప్రింటింగ్ కొరకు మహా హుషారుగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళారు. చాలా ఆనందముగా వెళ్ళి ప్రింటింగ్‌కు డబ్బులు కట్టివేశారు. కావలసినంత సొమ్ము తీసికొన్న తరువాత, పెట్టెలో చాలా డబ్బులున్నవని పెట్టెకు మూడు తాళాలు వేసారు, ఆ తరువాత అంత డబ్బు ఉన్నదో లేదో, అని పెట్టె తీసిచూస్తే, డబ్బు లేదు. పెట్టె ఖాళీగా ఉన్నది. అప్పుడు అయ్యగారు అన్నారు– 'ఇప్పుడు నీకు డబ్బుతో అవసరము ఏమిటీ? మరలా నీకు డబ్బు అవసరమైతే, ప్రార్థన చేయి ప్రభువు ఇస్తారు. నీకు కావల్సినంత ఇస్తారు' అని అన్నారు.

నాకు ప్రభువు కనిపించి, నన్ను రమ్మంటున్నారు, నేను వెళ్ళిపోతున్నాను అని అయ్యగారు ఆరోజుల్లో అన్నారు. ప్రభువు నాకు చెప్పింది నేను మీకు చెప్పాను. 'నన్ను సమాధి చేయవద్దు, దహనం చేయండి' అని అన్నారు. జోసఫ్! నీపనైందా? ప్రార్థనకు ప్రభువు దగ్గరకు రాగలవా? అని అడిగేవారు. కరపత్రములన్నీ ప్రభువు అయ్యగారికి బైలుపర్చినవే, అన్ని అయ్యగారు అచ్చువేయించారు. వీరు అయ్యగారి ప్రక్కనే పండుకొనేవారు. అందరూ వెళ్ళిపోయారా! అని కాసేపు పండుకో అనేవారు. ఒక్కొక్కప్పుడు 'జోసఫ్! ప్రభువు వచ్చారు' అని బెల్‌కొట్టి లేపేవారు. అప్పటికి లేవకపోతే, అంతకుముందే వీరి చేతికి, అయ్యగారి మంచానికి కట్టిఉన్న తాడు లాగి, అయ్యగారు వీరిని లేపేవారు. అయ్యగారు ఎప్పుడూ ధ్యానములో ఉండేవారు. అయ్యగారూ! మీరు మొన్న మా దగ్గరకు వచ్చి ప్రార్థన చేసారు అంటే నేను ఎప్పుడు వచ్చాను అనేవారు. ఉమామహేశ్వరరావు అనే ఆయనను ఎక్కడ మీటింగ్‌పెడితే అక్కడకు వీరిని పంపించేవారు. ప్రసంగములు అయ్యగారే వ్రాసి ఇచ్చేవారు. నాస్తికులైన వారు ఏ అంశమును గురించి, 'దేవుడు లేడు అంటున్నారో, ఆ అంశమును గురించి **'దేవుడు ఉన్నాడు'** అని నిరూపణ వ్రాసి ఇచ్చి పంపేవారు.

అయ్యగారికి ***ఎంత బాధ ఉన్నను ఆయనే భరించేవారు,*** ప్రార్థనే చేసికొనేవారు. ఆయనకు పరిచర్య చేసేటపుడు వీరికి ఏ అసహ్యాత అనేది పుట్టలేదు. మీకు కావల్సినవి ప్రభువును అడగండి ఇస్తారు, ***నా దేవుడు నా మాట వింటారు నేను ఆయన మాట వింటాను*** అనేవారు. అయ్యగారికి భోజనములో కూర ఇష్టములేకపోతే చారుతో కలిపి పెట్టేవారు. అది వద్దు, ఇది వద్దు అనేవారు కాదు. అది బాగోలేదు, ఇది బాగోలేదు అనికూడ అనేవారు కాదు.

# పాస్టర్. కె. నిత్యజీవరావుగారి అనుభవము:-

వీరు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా, కొల్లూరు గ్రామ కాపురస్తులు. వీరి మేనమామగారు ఏలూరులో జి. సమూయేలుగారి ప్రసంగములద్వారా క్రైస్తవులుగా మారినారు. అక్కడికి వెళ్ళిన ఈయన (నిత్యజీవరావు) అయ్యగారిని చూడవలెనని గుంటూరు వచ్చినారు. ఆ సమయములో కాకాని తోటలో (1956) జరుగుచున్న మీటింగులకు వీరు హాజరవ్వగా, కూటము మధ్యలో ఒక సేవకుడు లేచి– 'అయ్యగారూ! ఫలానివారు మిమ్మల్ని అడిగినట్లు అనగా (మరనాత/వందనాలు) చెప్పమన్నారు' అని అనగా అందుకు అయ్యగారు– వారు అలా అనలేదు మీరే అభిమానముకొద్ది అడిగినట్లు చెప్పుచున్నారు అని అన్నారు. దానికి ఆ సేవకుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. మీటింగు ముగింపైనతరువాత ఆ సేవకుడు అయ్యగారు అన్నది నిజమే సంఘముమీద అభిమానముతో నేనే వారు అడిగినట్లు చెప్పాను అయ్యగారు కనిపెట్టేసారు' అన్నాడు. నిత్యజీవరావు గారికి ఈ సాక్ష్యముతో ఈయన దైవజనుడే అని నమ్మిక కలిగింది.

ఆ తదుపరి గుంటూరులోనున్న అయ్యగారి దగ్గరకురాగా 'నిత్యం' అన్నారు. దగ్గరకు వెళ్ళగా మరి! మనోహరంగారిని ఎప్పుడైనా చూసావా? అని అడిగారు. అయ్యా! ఎప్పుడు చూడలేదండి అనగా, మరి ఆయన కనబడితే బోధచేస్తావా? అని అడిగారు. అయ్యా! నాకేమి చేతనవును? చదువురానివాడిని అనగా "**యేసుక్రీస్తు నా రక్షకుడని చెప్పలేవా?**" అని అయ్యగారు అన్నారు. అయ్యా! అలాగే చెప్పుతానండి అని అన్నారు. అప్పుడు ప్రార్థనలో ప్రభువా! మనోహరంగారిని నాకు చూపించు అనగా ఇద్దరు వ్యక్తులు మైసూరు ఎడ్లవలె నాకు దర్శనంలో కనబడుచున్నారు. చెరొకప్రక్కన ఒక బండిని లాగుచున్నారు బండిలో అయ్యగారున్నారు. కొంత సేపటికి ఈ రెండు ఎడ్లు ప్రక్కకు వెళ్ళిపోయి మనుష్య రూపము ధరించుకొన్నాయి (విజయరత్నంగారు, మనోహరంగారు) కాని బండి ఎద్దులు లేకపోయినా

బండి వేగముగా వెళ్ళిపోవుచున్నది. అయ్యో! అయ్యగారు ఎక్కడ పడిపోతారో అని వీరు అరుస్తున్నారు.

ఈ విషయములన్ని అయ్యగారితో చెప్పగా, వారిద్దరు రెవ. విజయరత్నం గారు, రెవ. మనోహరంగారు అని చెప్పారు. వారు విడిచిపెట్టి వేసినా "ఈ బైబిలు మిషనును" ప్రభువే నడిపించుకొంటున్నారు అని అయ్యగారు అన్నారు. ఈ విషయాన్ని పత్రికవేసి పంచిపెట్టండి అన్నారు.

నిత్యజీవరావుగారు కొల్లిపరలో ఐ.బి.యం చర్చ్‌లో నాలుగు వారములు బైబిలు మిషను స్థాపన గురించి, అయ్యగారి గురించి ప్రసంగించిరి. దానినిబట్టి వారిలో ఎక్కువమంది అసలైన బైబిలు మిషనులోనికి వచ్చిరి. ఇది తెలిసికొన్న రెవ. మనోహరంగారు నిత్యజీవంగారిని అరెస్ట్ చేయించుటకు పోలీస్ స్టేషన్‌వద్ద కూర్చున్నారు. అనుకోకుండా నిత్యజీవంగారు కొల్లిపర వెళ్ళకుండా గుంటూరులో ఉన్నఅయ్యగారి దగ్గరకు వచ్చారు. ఆ సమయములో జాన్‌గారిని, భూషణంగారిని, శాంతిరాజుగారిని అయ్యగారు వీరికొరకు ప్రార్థనలో ఉండమన్నారు. నిత్యజీవం గారు రాగానే అయ్యగారు 'అబ్బాయ్! నిన్ను పోలీసులకు పట్టించుటకు రెవ. మనోహరం పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్నాడు, అందుకనే నీగురించి ప్రార్థన చేయించాను' అన్నారు. దేవుడే అయ్యగారి ప్రార్థనలనుబట్టి ఆ అపాయమునుండి తప్పించివేసారు. అయ్యగారు నిత్యజీవంగారితో అబ్బాయ్ నీవు ఒరిస్సా వెళ్ళి సుజీవరాజుతో కలిసి పనిచేయి అన్నారు. దానికి వీరు నిరాకరించారు. మరొకసారి నీవు కృష్ణా జిల్లాలో పనిచేయి అనగా దానికికూడ నిత్యజీవంగారు నిరాకరించారు. అయ్యగారు ఎలీషాగారితో నిత్యజీవంను పాదిరిని చేయండి అనగా అయ్యా నాకు బస్సుమీద నున్న ఊరిపేరుకూడా చదవడంరాదు పాదిరి అభిషేకం వద్దన్నారు.

ఒక దినమున బేతేలు గృహము వరండాలో అయ్యగారు మాట్లాడుచు ఇంతవరకు నన్ను చూడనివారు, ఇంతవరకు ఈ వరండామీదికి రానివారు ఎవరైనా ఉన్నారా? అని అడుగగా అనాలోచనగా ఉన్న నిత్యజీవంగారు నిలువబడగా, అబ్బాయ్ నిత్యజీవం' ఎన్నడు నన్ను చూడలేదా? ఎన్నడు ఈ వరండామీదికి రాలేదా? అని అన్నారు. అప్పుడు నిత్యజీవంగారు 'అయ్యా పొరపాటండి' అని అనగా, పొరపాటుకాదు **'పొరలు'** అన్నారు. అయ్యగారు కోపపడలేదుగాని పొరలు అన్నారు. అప్పుడు నిత్యజీవంగారు తలవంచుకున్నారు. పొరలు అనగా అజ్ఞానపు పొరలు, చెప్పినమాట వినకపోవడము (ఒరిస్సా పనికి వెళ్ళకపోవడము, కృష్ణాజిల్లా పనికి వెళ్లకపోవడము, పాదిరి అభిషేకం వద్దనడము). వీరికి దర్శనములో ఒకరోజు అయ్యగారు కనబడి నిత్యజీవం! నా సొమ్ము నీ దగ్గర 16.50పై॥ ఉన్నది పట్టుకురా అన్నారు. నిద్రలేచి (దశమ భాగము) లెక్కపెట్టగా ఖచ్చితముగా 16.50 ఉన్నది. ఆ సొమ్ము తీసికొని అంగలకుదురునుండి అయ్యగారి వద్దకు రాగా, అబ్బాయ్ రాత్రే వచ్చానుగా నీ దగ్గరకు! అన్నారు. 'అయ్యా నిజమేనండి మీ సొమ్ము 16.50పై॥ నా దగ్గరున్నది పట్టుకురమ్మన్నారు తీసికొచ్చాను' అని వీరు అయ్యగారికి ఇచ్చేసారు.

బేతేలు గృహమునకు ఎప్పుడు వెళ్ళినా అయ్యగారు అబ్బాయ్ "నిత్యజీవం" అర్ధరూపాయి (50పై॥) భోజనమునకు వెళ్లతావా? ముప్పావల (75పై॥) భోజనానికి వెళ్ళతావా? అని అడుగగా, అర్ధరూపాయి భోజనం చాలండి అంటే నీకు అర్ధరూపాయి భోజనం సరిపోదు ముప్పావల భోజనము చేయమని పౌలుగారిద్వారా డబ్బులు ఇచ్చేవారు. అయ్యగారు ఒకసారి ప్రసంగముచేస్తూ కొందరు, భక్తులకు పనిచేయటానికి "అంటు అంటు" అంటారు ముట్టుకోరు. కాని మీరు భక్తులకు పరిచర్యచేస్తే పరమందు పరిశుద్ధులకు చేసినట్లే. ఇక్కడ కులమనేది ఏమీలేదు" అని బోధించగా, ఆ ప్రసంగము వింటున్న నిత్యజీవంగారికి ఆ దినమునుండి కుల పట్టింపులు పోయినవి. అంగలకుదురులో సేవచేస్తున్నప్పుడు ఒక క్రిస్మస్ సమయములో

అయ్యగారు వీరిని పిలిపించి అబ్బాయ్ నీకు క్రిస్మస్‌కు ఎవరైనా బంగారము ఇస్తున్నారా? ఎవరైనా వస్త్రాలు ఇస్తున్నారా? ఎవరైనా ఒక బస్తా ధాన్యము, కోళ్ళు ఇస్తున్నారా? అని అడుగుచున్నపుడు, నిత్యజీవంగారు కన్నీటి పర్యంతమై అయ్యా నాకు ఏమీ ఇవ్వటం లేదండి అని చెప్పారు. అప్పుడు అయ్యగారు– 'అబ్బాయి భాద పడకు, అన్ని వస్తాయి' అని ప్రార్థనచేసి అన్నారు. ఆ ప్రార్ధనా ఫలితంగా ఆ సం॥మే ఒకరు 7 చిన్నాలు బంగారం, 2 బస్తాలు బియ్యం, ఒకరు 60 నెంబరు పంచలు ఇచ్చారు, ఆ సమయంలోనే ఏవేవి రావలెనో అన్ని సమకూడినవి.

## వేలివెన్ను అనుభవము:-

ఒక సారి తణుకు దగ్గరనున్న 'వేలివెన్ను' గ్రామములో భీమవరం యాకోబుగారు మీటింగ్‌లో ప్రసంగించుచుండగా అయ్యగారే ఆయనలో ఉండి ప్రసంగించుచుండినట్లుగా ఉన్నది. ఈ విషయం స్టేజ్‌మీద ఉన్న మిగతా ముగ్గురు పెద్దలు మీటింగు బయటికివచ్చి గ్రహించిరి. దేవదాసు అయ్యగారిదగ్గరకు వచ్చి ఈ విషయములన్ని చెప్పగా అబ్బాయ్ కూటములు బాగా జరిగినవా? అని అడిగారు. ఎలిషాగారు అబ్బా! చాలాబాగా జరిగినవి, చాలామంది జనము వచ్చారండి అన్నారు. అలాకాదు! భోజనం ఏర్పాట్లు బాగా జరిగినవా? అని అయ్యగారు అడిగారు. "భోజనము అంటే ఆత్మీయ భోజనం. కూటము అంటే ప్రజలుకాదు ప్రాముఖ్యం, భోజనము ఏర్పాట్లు ఏలాగున చేసారు? అని అడిగి ***ఆత్మీయ భోజన ఏర్పాట్లలోనే మీటింగు అంతయు ఉన్నది.*** మీటింగుకు నేనుకూడ వచ్చానుకదా! యాకోబు నోవహు ప్రసంగము మాట్లాడుతుంటే నేను మాట్లాడానుగదా!" అన్నారు. అయ్యా నిజమేనండి మేముకూడా గ్రహించాము అనగా అయ్యగారు ముసిముసి నవ్వు నవ్వుకున్నారు.

ఒకసారి వీరు అయ్యగారితో అయ్యాగారండీ! వరండామీదికి కనీసము 400మంది ప్రజలుకూడా రావడములేదు, ఇతర మిషనుల

మీటింగులకు అనేక వందలమంది ప్రజలు వస్తున్నారని అనగా అబ్బాయ్- నన్ను వెళ్ళనివ్వండి (బైబిలుమిషను) పని ఏలాగు జరుగుతుందో మీరు చూస్తారు అన్నారు.

## యం. డేవిడ్‌సన్‌గారి సాక్ష్యము:-

1959లో వీరికి అయ్యగారితో పరిచయం ఏర్పడినది. అయ్యగారు చిన్నవారితోను, పెద్దవారితోను సావధానంగా మాట్లాడుచు తనకడకు వచ్చినవారి ఉద్దేశములు, కోరికలు సంపూర్ణముగా నెరవేర్చుమని ప్రార్థించేవారు. అయ్యగారు పరిశుద్ధతలో ప్రథమమెట్టు అలంకరించి యున్నారని చెప్పవచ్చును. అయ్యగారి శరీరముపై ఏ భాగమునందైనను, గోళ్లతో గీరుకున్న యెడల, ఆయన ప్రార్థనచేసి లోషన్‌తో శుద్ధిచేసికొనెడివారు. అయ్యగారు జీవితకాల పర్యంతము ప్రభువునకే అంకితమైన జీవితము జీవించియున్నారు. సత్యముగా నడచుట ఈలోకములో కష్టమైన సంగతి, అయినను వీరు సత్యమునకు దాసులై, నిత్యము ప్రభువునందు పరిశుద్ధమైన జీవితము గడిపినారు. అయ్యగారు విద్యాభ్యాస ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నపుడు ఎప్పుడైనను ఎవరినైనను "ఒరే!" అని పిలిచినవారుకారట. ఆయన వాక్కులోను దోషరహితులుగా ఉన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నపుడు విద్యార్థులకు ఒక అద్భుతమును చేసి చూపెట్టినారట. విద్యార్థులందరిని ఉపవాస ప్రార్థనలో నడిపించి ఆయన ప్రార్థనా గృహమును పరిశుభ్రపరచి అందులోని వస్తువులన్నిటిని శుద్ధిచేసినారట. వాటిలో ఒకపెట్టెకూడ ఉన్నదట. ఆ గదిలోని పెట్టెనుకూడ కడిగి శుద్ధిచేసి పెట్టినారట. అయ్యగారును, విద్యార్థులును గదిలోచేరి ప్రార్థనచేయుచు అయ్యా! ప్రభువా! మేము ప్రక్క గ్రామమునకు సువార్తకు వెళ్ళవలెను గనుక మాకు కావలసిన ఆర్థిక సహాయమును చేయుమని ప్రార్థించిరి. తరువాత అయ్యగారు అబ్బాయిని పంపి గదిలోనిపెట్టెని తెరచిచూడమనగా వారికి కావలసిన ఆర్థిక సహాయము 20రూ/- అందులో ఉన్నవట. ఎంత ఆశ్చర్యకరమైన క్రియ.

ఈ అద్భుతమును చూచి ఆయనయొక్క విద్యార్థులు ఎంతగానో ఆశ్చర్యపడిరట. అయ్యగారిది ఎంత విశ్వాసభరితమైన జీవితము! నేను (యం. డేవిడ్‌సన్) 1959లో వీరు నడిపించిన యౌవనస్థుల బైబిలు తరగతిలో పాల్గొంటిని మా విద్యార్థులందరికి అయ్యగారే ఖర్చులు భరించిరి. వీరు జీతబత్తెములు లేకయే, సేవాభారమును, జీవిత భారమును ప్రభువుపై మోపి, ఉచిత సేవనుచేసి, ప్రజలకు ముక్తిని ప్రసాదించు మార్గముతెలిపిన గురువులై ఉన్నారు.

# 13. దైవజనుని వృద్ధాప్యము

## వృద్ధాప్యములో దైవజనుని దినచర్య:-

ఆయన ఎపుడు మంచంమీద అలా పండుకొనే ఉండేవారు. ఆ! ఆ! ఆ! అని అంటూ మూలుగుతూ ఊ, కొడుతూ ఉండేవారు. అయినాగాని ఆయనకు ఎవరు ఏం చేస్తున్నారో అంతా తెలిసిపోయేది. పండుకొని అస్తమానం ధ్యానం చేసికొనేవారు. ఎవరి మనసులో ఏముందోకూడ ఆయనే చెప్పేవారు. అయితే ప్రతిరోజు ఉదయముననే ఆయనలేచి, అందరిని పిలిచేవారు. అపుడందరూ రాగా, బైబిలులోనుండి ఒక్క వాక్యం చదవమనే వారు, ఆ తరువాత ప్రార్థన చేసేవారు. చివరగా అందరూ పరలోక ప్రార్థన చెప్పేవారు. ఇక ఆ తరువాత ఎవరి పనుల్లోకి వారు వెళ్లిపోయేవారు.

ఆయన తల దగ్గర ఎప్పుడూ టి.బి. పేషెంట్స్ మాదిరి ఒక సంచి ఉండేది. అది కిట్ బ్యాగ్. టి.బి. పేషెంట్స్ ఏలాగు చేసికొనేవారో ఆలాగు ఆయనకూడ చేసికొనేవారు. ఆయన ప్రక్కనే స్టాండుమీద బేసిన్ ఉండేది. అందులో డెటాల్ కల్పిన లోషన్ ఉండేది. అందులో 50 అంకెలు లెక్కపెట్టేంతసేపు ఉంచాలి. ఆ తరువాత నీళ్ళతో కడుక్కోవాలి. ఆ తరువాత టిఫిన్ వచ్చేది. ఇక సిద్ధపడి ప్రార్థనకు వచ్చేవారు. 11:50 కే అయ్యగారి భోజనం అయిపోయేది. 12:00 నుండి 2:00 వరకు ఆయనకు విశ్రాంతిసమయము. ఆ తరువాత

ఆయన్ను కలుసుకొనుటకు ఎవరెవరు వచ్చారో చెప్పుమనేవారు. లేచిన తరువాత వారి గురించి చెప్పి బయట easy chair వేస్తే, అందులో కూర్చోని వారికి ప్రార్థనచేసి, అవసరాన్నిబట్టి ఆదరణకరమైన మాటలు చెప్పేవారు. మధ్యలో ఎవరైనా రాగానే బయట కాళ్లు కడుగుకొని లోపలికి రావాలి. రాగానే గబగబ లోపలికి వెళ్లకూడదు. ఆయన విశ్రాంతి సమయములో వస్తే బయట స్టూల్ మీద కూర్చొమనేవారు. ఆయనకసలు విశ్రాంతి ఉండేదికాదు. సాయంత్రం 4గం॥ల నుండి 5 గం॥ల వరకు ప్రార్థన ఉండేది. అప్పుడు అందరూ ప్రార్థనలో ఉండగా నలుగురు మోసికొని తీసికొచ్చి అయ్యగారిని కూర్చొబెట్టేవారు. వాక్యం చెప్పి ప్రార్థనలు చేసేవారు. అయ్యగారు ప్రసంగం చేస్తే, దానిని ప్రభువు దగ్గర్నుండి చెప్పించుకొనేవారు. అంటే ప్రభువు వచ్చి దగ్గర నిలువబడి, ఆయన చెవి దగ్గర చెపుతారు. దాన్ని అయ్యగారు విని చెప్పుతారు. కనుక బాగా ప్రభువు స్వరం వినుటకు ఆయన ఒక్కొసారి చెవి లాక్కొనేవారు. ఆ మాటలను అయ్యగారి దగ్గరున్న వారు పెద్దగా చెప్పేవారు.

**దైవజనుని చివరి దినము:-**

అయ్యగారి చివరి దినాల్లో, 23 రోగాలు చెప్పారు. చివరి కాలములో ముఖ్యంగా గుటక పడటంలేదు అన్నారు. ఆ కాలములో అయ్యగారిని హాస్పిటల్‌కు తీసికొని వెళ్లెదమని అంటే అనేకమంది మనద్వారా బాగవుతుంటే మనం హాస్పిటల్‌లో చేరితే అది ప్రభువుకి అవమానం కదా! అని హాస్పిటల్‌కు వెళ్లుటకు దైవజనులు ఇష్టపడలేదు.

సాయంకాలము 5గం॥ల తరువాత అయ్యగారు Enima ఇవ్వమన్నారు. ఆ చివరిరోజు అమ్మా! నా దగ్గరికి పరిశుద్ధులు వస్తారు. గాలిపోతే వారికి బాగోదు అని చెప్పి ఇవ్వమన్నారు. అపుడు ఎనిమా ఇస్తే, ఏదో కొంచెం Motion అయ్యింది. చివరివరకు అంతగొప్ప శుద్ధిని వారు పాటించారు. ఒక రోజున డా॥ కురిగుంట్ల కాంతయ్యగారు వచ్చి అయ్యగారిని బార్లీ త్రాగమంటే, దేవుడిచ్చిన నీళ్లు వదిలేసి, మనుష్యులు కల్పించిన కల్తీ

నీళ్ళు త్రాగమంటారా! అని అయ్యగారన్నారు. ఇక ఆయనకు నోట మాటరాలేదు. ఈ డాక్టరే ఆ రోజు అక్కడికి వచ్చి, ఇక్కడ ఆక్సిజన్ సిలిండర్ లేదు అని చెప్పి వెళ్లిపోయాడు. చనిపోయేరోజు ఉదయము 'శాంతి' అని పిలిచి, పేపరుపై ఈ విషయము వ్రాయి అన్నారు: **'ఈవేళ ప్రభువు తన సేవకునికి ఏమి చేయనైయున్నారో!'** అప్పుడు టైము 6:30 అయినది. ఈ పేపరు నలుగురు అధికారులకు ఇవ్వమన్నారు. వారిలో ఎలీషాగారు, జి. సమూయేలుగారు అక్కడే ఉన్నారు. మేము ఏమి చేయాలని వారు అయ్యగారిని అడిగినపుడు, ప్రభువుని అడగండి అని అయ్యగారు అన్నారు. అయితే ఆ సమయములో ఎలీషాగారు పనిమీద బజారు వెళ్ళారు. జి. సమూయేలు గారు క్రిస్మస్ చేయరాదు అని వాదించు పెంతెకొస్తు పి.యం. సముయేలుగారి విషయమై మాట్లాడుచు కూర్చున్నారు. ఛార్లెస్‌గారు ఇంటికి వెళ్ళారు. పి.యం. జాకబ్‌గారు బైబిలు చదువుకుంటు కూర్చున్నారు. అయ్యగారు మధ్యాహ్నము 3గం॥లకు నా దగ్గరకు భూతము వచ్చింది అన్నారు. నా కొరకు ప్రార్ధన చేయండి అన్నారు. 2,3 రోజులనుండి ఇలాగే జరుగుతుంది. చివరకు అయ్యగారు 7గం॥ల సమయములో ప్రభువు సన్నిధికి వెళ్లిపోయారు (9-2-1960). సన్నిధి కూటస్థులందరు అయ్యగారిని చూచుటకు వచ్చారు. అయ్యగారు చనిపోయిన తరువాత ఎలీషాగారు, ఛార్లెస్‌గారు, జాకబ్‌గారు వచ్చారు. శ్రీ. జె. రాజారావుగారు అందరికి టెలిగ్రాం ఇచ్చారు. అయ్యగారిని (3వరోజున సమాధిచేసారు). సమాధిచేసేరోజున గుంటూరు టౌన్ అంతా గౌరవ సూచనగా షాపులు కట్టివేసిరి, చాలామంది ప్రముఖులైనవారు అయ్యగారిని చివరిసారిగా దర్శించుకొనుటకు బేతేలుగృహము వచ్చారు. అయ్యగారి భౌతికకాయమును గుంటూరునుండి పెదకాకాని తోటకి ఊరేగింపుగా తీసికొనివచ్చి సమాధిచేసారు.

# అపవాది మాటలు (సాక్ష్యము)

గుంటూరు సన్నిధికూటములోనికి ఒక భూతము వచ్చి ఒకరికి చెప్పిన మాటలు. (16-4-58)

దేవదాసు అయ్యగారు కడుపునొప్పి తీసి వేయుమని దేవునికి ప్రార్ధన చేయుచుండిరి. అప్పుడు ఈ ప్రార్ధన చేయుచుండగా సన్నిధి కూటస్థులకు ఈ దర్శనము కలిగినది:-

అయ్యగారు తన గదిలో మంచముమీద ఉదర బాధవలన ఆయాస పడుచున్నారు. మరియొక మెత్తని తలగడలు గల మంచము మీద భూతము పరుండి సేద దీర్చుకొనుచున్నది. ఏమి ప్రభువా! ఈ గదిలోనికి ఈ భూతము వచ్చినది అని ప్రార్ధించుచుండగా భూతము నాతో జోక్యము కలిగించుకొని ఇట్లు చెప్పినది. "ప్రపంచములో ఉన్న నా పనిని; నేను కష్టపడి చేసికొనుచున్న నా పనిని ఆయన (ఫా॥ యం. దేవదాసు అయ్యగారు) పాడు చేయుచుండగా నేను ఆయన పనిని పాడు చేయుటకు ప్రక్కనే చేరి యున్నాను" అని చెప్పెను. అప్పుడు నేనన్నాను "వేమందరము కలిసి నీ పనిని పాడు చేయుచుండగా నీవు మా పనిని, మా తండ్రి పనిని పాడు చేయగలవా? నీకు గుండె ఉన్నదా? నీకు బలము ఉన్నదా?" అని భూతముతో అనగా వెంటనే ఆ భూతము తన ఎడమ చేతిని చంకలో పెట్టుకొని కుడి చేతిని ఆకాశము వైపు ఎత్తగా ఆ చెయ్యి ఆకాశము వరకు ఎదిగిపోవుచున్నది. అది ఏమన్నదనగా: "ఇంత పొడవైన ప్రార్ధన ఆయన వ్రాసి సర్వప్రపంచము పక్షముగా నన్ను బాధ పరుపగా నేను ఆయనను బాధపరుపకుండా ఊరకొందునా" అని చెప్పెను. అప్పుడు నేనన్నాను అది ఇంత పొడవైన ప్రార్ధన అని నీకు తెలిసినది. అది నాకు సంతోషము. నీకు బాధకలిగించినది గనుక నాకు సంతోషము. అయితే మా బైబిలు గ్రంథములో తండ్రి ఇట్లు వ్రాయించిరి "కీడు

చేసి శ్రమపడుటకంటె మేలుచేసి శ్రమపడుటయే బహు మంచిది" (1పేతురు 3:17). కనుకనే లోకమునకు మేలు కలిగించు ప్రార్థన ఆయన వ్రాసి ఉదర బాధ అనుభవించుట మంచిదే. "వాక్యము యొక్క నెరవేర్పును బట్టి తండ్రికి స్తోత్రము" అప్పుడు భూతము వెళ్ళిపోయినది.

# హెన్రీ ఫ్లూఎట్ దొరగారి సందేశము

## (అక్టోబర్ 1959)

ఈయన గుంటూరులోని సన్నిధికూటమునకు వచ్చి యం. నిల్వియమ్మకు ఇచ్చిన సందేశము. ఈయన పరలోక వాస్తవ్యులు. తక్కిన వారివలె ఈయన దేవదాను అయ్యగారిని గాని, బైబిలు మిషనును గాని ఎరుగరు. నెల్సనమ్మ గారు, ఐజిక్ సన్ దొరగారు అయ్యగారిని ఎరుగుదురు.

1. పరలోకాధికారియైన దేవుడు మనకు తోడుగా ఉన్నాడు గనుక ఆయనకు స్తోత్రములు, 2. పరలోకపు దేవుని వాక్యమును దాచి ఉంచిన వారిని తిరస్కరించి దేవుని వాక్యమును బయటకు తీసికొని వచ్చుటకు డా॥ మార్టిను లూథరు గారిని లేపిన దేవునికి స్తోత్రములు. 3. దేవుడు ప్రత్యక్షతల వలన బైబిలు గ్రంథమును మార్టిను లూథరు గారి ద్వారా పైకి ఎత్తి చూపించెను. ఆ రీతిగానే దైవజనునికి బైబిలు మిషను బైలుపర్చిన దేవునికి వందనములు. 4. గాలిలో బైబిలు మిషనును బయలుపర్చుట వలన ఆ మిషను గాలి వ్యాపించునట్లు వ్యాపించుచున్నది దేవునికి స్తోత్రములు. 5. పత్రికలు దేవుని రాజ్యమును ప్రకటించుచున్నవి. పత్రికలు వ్రాసి ప్రకటించుటకు దేవుడు శక్తిని, సమయమును ఇచ్చినాడు ఆయనకు స్తోత్రములు. 6. వృద్ధాప్యములో దైవజనుడు బైబిలు మిషనును వృద్ధి పరచుచున్నాడు గనుక దేవునికి స్తోత్రములు. 7. అనేకమంది యౌవనస్తులు దేవుని రాజ్యమును

ప్రకటించుచున్నను దేవుడు వృద్ధాప్యములో ఉన్న దైవజనునికి బైబిలు మిషనును బయలుపరచి ఘనత పొందుచున్నాడు దేవునికి స్తోత్రములు. 8. దేవుడు బైబిలు మిషనును బయలు పరచినది ఇరువది సంవత్సరములే! అయినను అది ఇంత కొద్ది సమయములో యెక్కువ వృద్ధియైనది గనుక దేవునికి స్తోత్రములు. 9. దాసత్వములో ఉన్న ఇశ్రాయేలీయులలో నుండి దేవుడు మోషేను పిలిచినట్లు నేడు ఈ దైవజనుని పిలిచినాడు దేవునికి స్తోత్రములు. 10. బైబిలు మిషనులో సన్నిధి కూటములకు దేవుడు వచ్చి, ఎన్నడు కనివిని ఎరుగని మర్మములు బయలు పరచుచు మాటలాడుచున్నాడు దేవునికి స్తోత్రములు. 11. వధువు సంఘమును సిద్ధపరచుచున్న దైవజనునికి గొప్ప సింహాసనము పరలోకములో దేవుని ప్రక్కను కలదు గనుక దేవునికి స్తోత్రములు. 12. దైవజనుడు అనేక స్థలములలో బైబిలు మిషనును గురించి బోధించుచు, హేడెస్సులో ఉన్న ఆత్మలకు సహితము బైబిలు మిషనును గురించి చెప్పుచున్నాడు గనుక దేవునికి స్తోత్రములు. 18. మీకును, మాకును దైవజనుడు స్నేహితుడే గనుక దేవునికి స్తోత్రము. 14. పరలోకములో త్రైక దేవుని సముఖములో మేము ముఖాముఖిగా దేవునితో మాట్లాడలేము గాని దైవజనుడు మాట్లాడగలడు దేవునికి స్తోత్రములు. 15. మోషే ఇశ్రాయేలీయులను నడిపించుటకు దేవుని ఆజ్ఞను పొందినాడు. అట్లే దైవజనుడు దేవుని ఆజ్ఞనుబట్టి వధువు సంఘమును నడుపుచున్నాడు దేవునికి స్తోత్రములు. 16. దైవజనుడు దేవుని మహిమ కొరకు స్వస్థిశాలలు, పత్రికలు, సన్నిధి కూటములు ఏర్పరచినాడు గనుక దేవునికి స్తోత్రములు. 11. పరలోకములో ఎన్ని వింతలు జరుగుచున్నవో అవన్నియు దైవజనుడు ఎత్తి చూపించుచున్నాడు గనుక దేవునికి స్తోత్రములు. 18. బైబిలు మిషనులో దెవజనుడు ఏమి చెప్పినను నమ్ము సన్నిధి కూటములు గలవు గనుక దేవునికి స్తోత్రములు. 19. దేవుడు పరిపూర్ణుడు గనుక

ఆయన పని సహితము పరిపూర్ణముగానే జరుగుచున్నది గనుక దేవునికి స్తోత్రములు. 20. దైవజనునికి వృద్ధాప్యము వచ్చినను వధువు సంఘమునకు యౌవన వయస్సు తెచ్చినాడు గనుక దేవునికి స్తోత్రములు.

# దైవసన్నిధికూట సందేశము

## (అక్టోబరు, 1957).

ప్రియులారా ! నేను పాపిని కాను; నేను యోగ్యుడను కాను అని అనుకొనుటలేదు. గాని ప్రభువే తన అమూల్య రక్తము వలన నన్ను శుద్ధి చేయుచున్నాడని ప్రభువు గురించి సాక్ష్యమిచ్చుచున్నాను. ప్రభువు తుదకు తన సంఘమునకు ముడతయైనను, మచ్చయైనను లేకుండ చేసి దానిని పరలోకమునకు కొంచుకొని పోవునని పౌ పౌలు వ్రాయుచున్నాడుగదా! (ఎఫెసి 5:25-27). అలాగే ప్రభువు నన్ను కడకు సంపూర్ణ పరిశుదునిగా స్థిరపరుపనై యున్నాడు. కనుకనే ఆయన నా కూటస్థులకు నన్ను గురించి ఘనముగా చెప్పుచున్నాడు.

దైవసన్నిధి కూటస్థులు ప్రభువు నడిగి తెలిసికొన్న జవాబు నాకు పంపగా అది ప్రచురించుచున్నాను.

ప్రశ్న:- ప్రభువా! బైబిలు మిషనును దేవదాసయ్య గారికే ఎందుకు బయలు పరచినావు?

జవాబు :- దేవదాసు గారు బైబిలును మొదటి నుండి కడవరకు చక్కగా చదివిన బిడ్డ. బైబిలు మర్మములన్నియు చక్కగా బోధించిన బిడ్డ. పరిశుద్ధాత్మ తండ్రియొక్క వివరములన్నియు బైబిలునుండి తీసి చక్కగా వివరించిన బిడ్డ. బైబిలు ప్రకారము నడచిన బిడ్డ. అనేకులు ఆత్మీయాహారము లేక ఆకలితో నున్నపుడు వారి ఆకలి తీర్చిన బిడ్డ. ఉజ్జీవకూటము లెక్కువగా పెట్టి ఉజ్జీవము కల్గించిన బిడ్డ. అనేక

ప్రత్యక్షతలు కల్గిన బిడ్డ. పరమ పురుష దివ్యలక్షణములు గల బిడ్డ, పరలోకమును, భూలోకమును, పాతాళ లోకమును మానవ శరీరముతో ఉండి చక్కగ చూడగల్గిన బిడ్డ. సన్నిధి అలవాటును చిన్న తనము నుండి కలిగియుండిన బిడ్డ. కోపము లేని బిడ్డ. వినయ విధేయతలు గల్గిన నా బిడ్డ. నేను చెప్పిన పనులు పౌరుషముతో చేయుటకు పరుగులెత్తిన నా బిడ్డ. ఒకరి తప్పిదము లెత్తి దూషించక వారిని మన్ననతో నా తట్టుకు త్రిప్పిన నా బిడ్డ. నా అడుగులలో అడుగు వేయుచు నడచిన నా బిడ్డ. ఎట్టి బాధలో నైనను నా సన్నిధిని ఒక్క దినము కూడ ఆప్సెంటు లేకుండ హాజరైన నా బిడ్డ.

**నేను అనాది కాలమునుండి కనిపెట్టిన నా బిడ్డ.** బైబిలంతటిలో చక్కగా నా దివ్యచిత్తమును నెరవేర్చిన నా బిడ్డ. నలుసంత దోషము లేకుండా నా రక్తములో కడుగుకొనిన నాబిడ్డ. చురుకుదనము, తెలివి తేటలు గల బిడ్డ. జ్ఞాన నేత్రములు గల బిడ్డ. ఓర్పుగల బిడ్డ. సహనముగల బిడ్డ. ఆయన మాట ప్రకారము నడుచుచు, ఆయన చెప్పినట్లు చేయుచు, బైబిలు మిషనులోనికి వచ్చిన బిడ్డలందరిని క్రమముగా నడిపించిన కమేండరు నా బిడ్డ. ప్రపంచములో ప్రజల కందరకు సంపూర్ణ సువార్త నందించుచున్న నా బిడ్డ. ప్రతి దేశములోని ప్రతియొక్కరిని గురించి ప్రార్థించుచున్న నా బిడ్డ. ముడత గాని, మచ్చగాని లేకుండ, మహిమ లోకమునకు మాదిరిగా నడుచుచున్న నా బిడ్డ. పరలోకము చేరుటకు పరుగు లెత్తుచున్న నా బిడ్డ. పదిమందిలో పరువు ప్రతిష్ఠలుగల బిడ్డ. నా వరములన్నియు కష్టపడి సంపాదించిన నా బిడ్డ. నాకు ప్రశ్నలు వేసి నాయొద్ద నేర్చుకొనిన నా బిడ్డ. నాకు సలహాలిచ్చిన నా బిడ్డ. సన్నిధికూటములు స్థాపించిన బిడ్డ. అందుచేతనే బైబిలు మిషనును ఆయనకు బైలుపరచినాను.

ప్రియమైన బిడ్డలారా! పరలోక ద్వారములు తెరువబడియున్నవి. కృపాద్వారము తెరువబడియున్నది. కృపాద్వారము తెరువబడి యుండగనే, కృపగల ప్రభువు పాదములయొద్దకు రండి. కృపగల చేతులు చాపబడియున్నవి. కృప లోకమంతట ఆవరించి యున్నది. కృపాయుగములోనున్న బిడ్డలారా ! కృపను నిర్లక్ష్యము చేయకండి. కృపను లోకువ చేయకండి. కృపానిధియగు తండ్రి కృపగల కౌగిటిలోనికి అందరిని చేర్చుకొనుటకు ఓర్పుతో కనిపెట్టుచున్నాడు. కృపాసింహాసనములో నుండి అడుగు బైట పెట్టగనే, కృపాద్వారము మూసివేయబడును. కృపాద్వారము మూసివేసిన తరువాత ఎంత ఏడ్చినను లాభము లేదు. కృప ప్రేమను మించినది. అందుచేతనే కృపా సత్యములు నొకదానినొకటి పెట్టుకొనినవని వ్రాయబడి యున్నది. కృపానిధియగు ఆయన కౌగిటిలోనికి రండి.

షరా:- చదువరులారా! నేను దేవునిమీద లేనిపోని ప్రశ్నలు వేయుచు వచ్చితిని. ఆయనయొద్ద తీవ్రమైన వాదము పెట్టుకొంటిని. సైతానును మార్చి నరకమును తీసివేయుమని వాక్య ప్రవచనమునకు విరుద్ధముగ ప్రార్థించితిని. నావలె యిట్టి సబబు లేని ప్రార్థనలు యెవరును చేసియుండరని చెప్పితిని. అయినను విచారపడి నన్ను క్షమించుమనియు, నేను సృష్టియంతటిలో తక్కువైన వాడననియు చెప్పుకొంటిని. బహుశా అందుచేతనే ఆయన నన్ను వినయ స్వభావము గలవాడనని చెప్పుచున్నాడు.

మీరుకూడ అనుదినము దైవసన్నిధిలో ఉండి ఆయనను పూజించినయెడల ఆయన మీకు దర్శనమిచ్చి మాటలాడును. మీ హృదయ స్థితి, మీ మనోదృష్టి ఆయనతట్టు ఉన్న యెడల ఆయన దృష్టి మీ తట్టు ఉండును. దేవుడు మానవులను కలుగజేసెను. మానవులు ఆయనను మాత్రమే పూజింపవలెను. మానవుల ఉపయోగము కొరకు

ఆయన సూర్యచంద్ర నక్షత్రములను, నీళ్ళను, గాలిని, భూమిని, జీవులను, వృక్షాదులను, పర్వతములను కలుగజేసెను. వాటిని కాదు మనము పూజించుట వాటిని కలుగజేసిన దేవునిని పూజింపవలెను. ఆయన మన తండ్రి. అవి మన తండ్రులు కావు. మనము ఆయన యెడల ప్రేమయు, గౌరవమును కలిగియున్న యెడల నా బిడ్డ అని ఆయన పిలుచును. ఆయన యిష్ట ప్రకారము నడువని యెడల నీ వెట్లు ఆయన బిడ్డవనిపించుకొందువు? ఆయనను పూజింపక ఇతరమైన వాటిని పూజించినయెడల మనము ఆయనను తండ్రీ అని పిలువ లేము. నా బిడ్డా! అని ఆయన చేత పిలిపించుకొనలేము.

షరా:– నా పత్రికలలోని దేవుని చిత్తమును నడిపింపును మీకు బైలుపడగల దీవెన కలుగును గాక!

# విజ్ఞప్తి

## "నీతిమంతులు నిత్యము జ్ఞాపకములో నుందురు" కీర్తన 112:6.

ప్రియ విశ్వాసులారా! త్రియేక దేవుని దీవెన మీకు కలుగును గాక! యం. దేవదాసు అయ్యగారు అనేకులకు తెలిసినవారు. వారియొక్క జీవితము పూర్తిగా తెలిసినవారులేరు. గాని వారి విషయములు ఎరిగిన వారు అనేకులు ఉన్నారు. వారి సంగతి ఎరిగినవారు దయచేసి శ్రమఅని తలంచక మాకు ఇక్కడికి వ్రాసి పంపవలెనని కోరుచున్నాము. విద్యలేనివారు కూడ అయ్యగారి విషయములు అనేకులు ఎరిగియున్నారు. అట్టివారుకూడ ఏదో విధముగా మాకు వ్రాసిపంపినయెడల వారికి మా కృతజ్ఞత తెలుపు కొందుము. వారి జీవిత విశేషములను గూర్చి అందరికీ అధికార పూర్వకముగా తెలియజేయుట మంచిది అని తలంచుచున్నాము. ప్రతివారు ఇది తమ స్వంత పనిగా ఎంచి, శ్రద్ధ వహించి ఈ దైవజనుని జీవితమును తెలిసినవారు వ్రాసి పంపవలెనని కోరుచున్నాము. మీరెన్ని విధములుగా ప్రయత్నించ గలరో అన్ని విధములుగా ప్రయత్నించి సంగతులు ప్రోగుచేసి మాకు తెలియజేయండి. వారిని గురించి దినదినము ఆలోచనచేసి మీకు ఎప్పుడు జ్ఞాపకము వచ్చిన అప్పుడే వ్రాసి బైబిలుమిషను ఆఫీసుకు తెలియజేయవలెనని కోరుచున్నాము. మీకు ఆయా సంగతులు జ్ఞప్తికి తెచ్చుటకుగాను ఈ క్రింది విషయములు వ్రాయుచున్నాము: 1. యం. దేవదాసు అయ్యగారి తల్లిదండ్రులనుగూర్చి, వారి నివాసము, సేవ, 2. అయ్యగారి బాల్యము, 3. విద్యాభ్యాసము, 4. ఉపాధ్యాయులుగా– యౌవ్వనములో, ట్రయినింగులో, సండేస్కూలులో, 5. రాజమండ్రి

దేవాలయములో. 6. లూథరుగిరినందు, 7. రాజమండ్రి శానిటోరియము నందు. 8. హాస్టలువార్డనుగా నున్నప్పుడు. 9. బోధకులుగా, 10. కోరుకొండతీర్థము– ఆయా సేవాసమయములో. 11. ఆయా మిషనెరీలతో, బోధకులతో. 12. రాజమండ్రిలోను, తూర్పు గోదావరి జిల్లాలో వారి పని. 13. పశ్చిమగోదావరి జిల్లాలో– ఏలూరు నందు. 14. గుంటూరు జిల్లాలో. 15. బరంపురములో. 16. గుంటూరు పట్టణములో వారి సేవ. 17. లూథరన్ మిషనులో వారి చరిత్ర. 18. బైబిలు మిషను బయలుపరచిన తరువాత పని. 19. కీర్తనలు కట్టుట, పద్యములుచేయుట. 20. అచ్చుపని. 21. ప్రకటన, పరమగీత వివరములు. 22. ఓర్పు, సహింపు. 23. శ్రమ జీవితము. 24. ప్రార్థనాశక్తి. 25. వారి సలహాలు. 26. వారికి కలిగిన దైవనడిపింపు, వరములు. 27. శుభ్రత. 28. వారి రాబడి– సొమ్ము ముటకొనకుండుట– ఇంకను అనేక అంశములు గలవు. అవన్నియు వ్రాసి ఇక్కడికి పంపవలెనని కోరుచున్నాము. కృప మీకు తోడైయుండునుగాక!

"నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును" సామె. 10:7.

**ప్రచురణకర్తలు.**

దైవజనులైన యం. దేవదాసు అయ్యగారి

# జీవిత చరిత్ర


గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు



గుంటూరు - 2024 చందా : 40.00



Bible Mission HQ Guntur

| | | | |
|---|---|---|---|
| ప్రథమ ముద్రణ | 2005 | ప్రతులు | 1000 |
| రెండవ ముద్రణ | 2006 | ప్రతులు | 5000 |
| మూడవ ముద్రణ | 2008 | ప్రతులు | 2000 |
| నాల్గవ ముద్రణ | 2011 | ప్రతులు | 5000 |
| ఐదవ ముద్రణ | 2013 | ప్రతులు | 5000 |
| ఆరవ ముద్రణ | 2015 | ప్రతులు | 5000 |
| ఏడవ ముద్రణ | 2017 | ప్రతులు | 3000 |
| ఎనిమిదవ ముద్రణ | 2018 | ప్రతులు | 5000 |
| తొమ్మిదవ ముద్రణ | 2020 | ప్రతులు | 2000 |
| పదవ ముద్రణ | 2021 | ప్రతులు | 2000 |
| పదకొండవ ముద్రణ | 2022 | ప్రతులు | 2000 |
| పన్నెండవ ముద్రణ | 2023 | ప్రతులు | 3000 |
| పదమూడవ ముద్రణ | 2024 | ప్రతులు | 3000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

Bible Mission HQ Guntur

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | | పేజి నం |
|---|---|---|
| 1. | యం. దేవదాసు అయ్యగారి పరిచయము - | 1 |
| 2. | దైవజనుని బాల్యము - విద్యాభ్యాసము - | 3 |
| 3. | మిషను స్కూలు టీచరు మరియు వార్డెన్- | 6 |
| 4. | లూథరన్‌మిషను సేవకుడు - | 13 |
| 5. | దగ్గుల ఆసుపత్రి పరిచర్య - | 16 |
| 6. | బైబిలు మిషను ప్రత్యక్షత - | 19 |
| 7. | దానవాయిపేట అనుభవములు - | 46 |
| 8. | బేతేలుగృహ అనుభవములు - | 52 |
| 9. | డా॥ ఆట్మనమ్మ గారితో సహవాసము - | 58 |
| 10. | దైవజనుని స్వీయ వృత్తాంతము - | 62 |
| 11. | దైవజనుని ప్రత్యేక వరములు-అనుభవ అంతస్థులు- | 79 |
| 12. | దైవజనుని అనుచరుల అనుభవములు - | 105 |
| 13. | దైవజనుని వృద్ధాప్యము - | 151 |